# సంస్కృతం

## ఎం.ఏ. తెలుగు, రెండవ సంవత్సరం

## సెమిస్టర్-IV, పేపరు-IV

## పాఠ్య రచయితలు


**ఆచార్య పి. వరప్రసాదమూర్తి**

ఎం.ఏ., విద్యావారధి, పిహెచ్.డి.

తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

**డా॥ సిహెచ్. పవన్ కుమార్**

ఎం.ఏ., ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.

అధ్యాపకులు

తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

**ఆచార్య ఆకురాతి పున్నారావు**

ఎం.ఏ., ఎం.ఫిల్, పిహెచ్.డి.

విశ్రాంత ఆచార్యులు

తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

**డా॥ కె. యశ్వంత్ కుమార్ రెడ్డి**

ఎం.ఏ., ఎం.ఏ., టి.పి.టి., పిహెచ్.డి.

అధ్యాపకులు

తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

**డా॥ పిల్లి వాసు**

ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.

అధ్యాపకులు

తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.


## సంపాదకులు


**ఆచార్య ఇరపని మాధవి,**

ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.

తెలుగు & ప్రాచ్యభాషా విభాగం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.


## డైరెక్టర్


**డా॥ నాగరాజు బట్టు,**

**ఎం.హెచ్.ఆర్.ఎం., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.ఏ. (సై.), ఎం.ఏ (సో.), ఎం.ఇడి., ఎం.ఫిల్., పిహెచ్.డి.**


## దూర విద్యా కేంద్రము


ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్-522 510.

ఫోన్ నెం.: 0863-2346208, 0863-2346222, 0863-2346259 (స్టడీ మెటీరియల్)

వెబ్‌సైట్: www.anucde.info ఇ-మెయిల్: anucdedirector@gmail.com

**ఎం.ఏ. తెలుగు - సంస్కృతం**

First Edition: 2023

No. of Copies:

© Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of **M.A. (TELUGU)** Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is mean for limited circulation only.

**Published by:**

**Dr. NAGARAJU BATTU**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

**Printed at:**

## ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే గ్రేడ్ 'A'ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పీజి స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తిస్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యాకేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్సి., పీజీ స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బి.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైనవారు ఇచ్చే సలహాలు, సూచనలు, సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి మున్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వార దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూరవిద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని అకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూరవిద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కోఆర్డినేటర్లకు, అకడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్. పి. రాజశేఖర్**

**ఉపకులపతి**

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.**

# ఎం.ఏ. తెలుగు, రెండవ సంవత్సరం

# సెమిస్టర్-IV, పేపరు-IV

# 404TL21-సంస్కృతం

## సిలబస్

1) కాళిదాసు - రఘువంశం-ద్వితీయసర్గ 75-శ్లోకాలు

2) భాసుడు - ఊరుభంగం నాటకం

3) సంస్కృత సాహిత్య చరిత్ర- వాల్మీకి, వ్యాసుడు, భారవి, దండి

4) సంస్కృత సాహిత్య చరిత్ర-మాఘుడు, శ్రీహర్షుడు, భవభూతి, భాసుడు

5) వ్యాకరణం

   1) శబ్దాలు; రామ, హరి, శమ్భు, పితృ, రమా, గౌరి, వధూ, మాతృ, జ్ఞాన, వారి

   2) ధాతువులు: భూ, జి,నీ, లిఖ్, పఠ్, దృశ్, పా(పిబ)హృ, సిచ్, వర్ణ

      పరస్మైపదరూపాలు: లట్, లఙ్, లోట్, విధిలిఙ్, లృట్

   3) సంధులు: సవర్ణదీర్ఘ, గుణ, వృద్ధి, యణాదేశ, అనునాసిక, జస్త్వ, శ్చుత్వ, విసర్గ

**ఆధార గ్రంథాలు:**

1) రఘువంశం-కాళిదాసు

2) ఊరుభంగం-భాస మహాకవి

3) సంస్కృత సాహిత్య చరిత్ర - డా॥ ముదిగంటి గోపాలరెడ్డి
   డా॥ ముదిగంటి సుజాతారెడ్డి

4) శబ్ద మంజరి

5) రూపచంద్రిక

6) రఘువంశం - తెలుగు వ్యాఖ్య - కేశవపంతుల నరసింహశాస్త్రి

7) భాస నాటక చక్రం - ఆంధ్రానువాదం- గట్టి లక్ష్మీ నరసింహ శాస్త్రి

# సంస్కృతం

## విషయ సూచిక


| సంఖ్య | పాఠం | పుట |
|---|---|---|
| 1. | మహాకవి కాళిదాసు – పరిచయం | 1.1–1.15 |
| 2. | రఘు వంశం – ద్వితీయ సర్గ – కాళిదాసు | 2.1–2.11 |
| 3. | ఊరుభంగం – భాసుడు | 3.1–3.13 |
| 4. | సంస్కృత సాహిత్య చరిత్ర – వాల్మీకి, వ్యాసుడు | 4.1–4.13 |
| 5. | సంస్కృత సాహిత్య చరిత్ర – భారవి, దండి | 5.1–5.12 |
| 6. | సంస్కృత సాహిత్య చరిత్ర – మాఘుడు, శ్రీహర్షుడు | 6.1–6.13 |
| 7. | సంస్కృత సాహిత్య చరిత్ర – భాసుడు, భవభూతి | 7.1–7.20 |
| 8. | వ్యాకరణం – శబ్దాలు | 8.1–8.18 |
| 9. | ధాతువులు | 9.1–9.26 |
| 10. | సంధులు | 10.1–10.30 |

పాఠం - 1

# మహాకవి కాళిదాసు - పరిచయం

విషయ క్రమం:

1.0. ప్రవేశిక

1.1. కవికుల గురువు మహాకవి కాళిదాసు – సామన్య జీవితం పరిచయం

1.2. కాళిదాసు కాలం – పరిశీలన

(అ) గుప్తుల కాలం వాడనే వాదం

(ఆ) క్రీ.పూ. మొదటి శతాబ్దం వాడనే వాదం

(ఇ) క్రీ.పూ. రెండవ శతాబ్దం వాడనే వాదం

1.3. కాళిదాసు – జన్మస్థలం

1.4. కాళిదాసు కృతులు – పరిచయం

1.4.1. ఖండకావ్యాలు

(అ) మేఘ సందేశం

(ఆ) ఋతు సంహారం

1.4.2. మహా కావ్యాలు

(అ) రఘువంశం (ఆ) కుమారసంభవం

1.4.3. రూపకాలు

(అ) మాళవికాగ్నిమిత్రం (ఆ) విక్రమోర్వశీయం (ఇ) అభిజ్ఞాన శాకుంతలం

1.5. అడగదగిన ప్రశ్నలు

1.6. ఆధార గ్రంథాలు

## 1.0. ప్రవేశిక:

మహాకవిగా కవికుల గురువుగా కాళిదాసు పేరును వినని భారతీయుడే ఉండడు అనేమాట అతిశయోక్తికాదు. మహాకవి కాళిదాసు భారతీయ కవుల్లోనే కాక ప్రపంచ కవుల్లోనే అగ్రగణ్యుడు. కాళిదాసు సంస్కృత సాహిత్యంలో వాల్మీకి, వ్యాసుడు, భాసుడు అనే మహాకవుల తర్వాతి కాలానికి చెందిన మహాకవి. కాళిదాసును కవికుల తిలకునిగా సాహిత్యకారులు ఆదరిస్తారు. భారతీయుల ఆత్మను చిత్రించటలో కాళిదాసు తన రచనలలో ప్రతిఫలించేంత గొప్పగా మరే మహాకవి చిత్రించలేరని బలంగా చెప్పవచ్చు. అందుకే కాళిదాసు రచనలు కేవలం భారతీయుల ప్రశంసలను మాత్రమే కాక పాశ్చాత్యుల ప్రశంసలను కూడా అందుకున్నాయి. కాళిదాసు తన రచనలలో భారతదేశపు భౌతిక రూపాన్ని, అంటే పర్వతాలు, నదీ నదాలు అరణ్యాలు, పట్టణాలు, పల్లెలు, ఆశ్రమ ప్రాంతాలు, వృక్షల తాదులను గురించి వాటి రమణీయ సుకుమార సౌందర్య లాలిత్యాలను శోభను కాళిదాసు వర్ణించినంత సమగ్రంగా మరోకవి వర్ణించలేరనే చెప్పాలి. అందుకే మహాకవి కాళిదాసు కవిత్వం సార్వకాలికం, సార్వభౌమికం.

## 1.1. కవికుల గురువు మహాకవి కాళిదాసు సామాన్య జీవిత పరిచయం:

కాళిదాసు కాలనిర్ణయంలో పండితుల్లో అనేక భిన్నాభిప్రాయభేదాలున్నాయి. వాటి ఆధారంగా గమనిస్తే.... మహాకవి కాళిదాసు క్రీ.పూ. 8వ శతాబ్ధం నుండి, క్రీ.శ. 11వ శతాబ్ధం వరకూ అతని జీవిత కాలం కొనసాగినట్లుగా చెప్పవచ్చు. రఘువంశంలోని చివరి రాజైన అగ్నిపర్ణుని మరణానంతరం జన్మించిన అతని కుమారునికి ఈ మహాకవి కాళిదాసు సమకాలీకుడని, అనగా 8వ శతాబ్దానికి చెందినవాడని ప్రసిద్ధిచెందిన ఫ్రెంచి విమర్శకుడు హిపోటయిల్ ఫాష్ (Hipthotyle Fauche) ఊహగానం చేసాడు. లోకంలో భోజరాజు కాళిదాసులకు సంబంధించిన కథలెన్నో ప్రచారంలో ఉన్నాయి. వాటిని బట్టి కాళిదాసు ధారా నగరం రాజైన భోజుని ఆస్థాన కవియే ఈ మహాకవి కాళిదాసు అని, ఈ ధారానగర రాజైన భోజుడు క్రీ.శ. 11వ శతాబ్ధం వాడని కొందరు విమర్శకులు తలంచారు. కానీ ఈ రెండు వాదాలు నిలిచేవి కాదు మహాకవి కాళిదాసు శుంగ వంశరాజైన అగ్నిమిత్రుని నాయకునిగా చేసి మాళవి కాగ్ని మిత్రం అనే నాటకాన్ని రాశాడు. కాబట్టి అగ్నిమిత్రుని సమయం. క్రీ.పూ. 150 ప్రాంతం అందువలన కాళిదాసు తత్పుర్వుడని నిర్ణయించటానికి వీల్లేదు. అదేవిధంగా కాళిదాసు బాణుని (క్రీ.శ. 7వ శతాబ్దం పూర్వార్థం) చేత స్తుతింపబడినాడు మరియు చాళుక్యరాజు రెండవ పులకేశి ఐహొళె శాసనంలో (క్రీ.శ. 634) కాళిదాసు ప్రసక్తివున్నది. కాబట్టి కాళిదాసు ఆ తర్వాతవాడని చెప్పటానికి కూడా వీల్లేదు.

భోజరాజు ఆస్థానంలో వున్నది. కాళిదాస బిరుదాంకితుడైన మరోకవి. అంతేగాని ఈ కవిగాదు. ఈవిధంగా క్రీ.పూ. 150, క్రీ.శ. 634. నడుమ ఎక్కడో కాళిదాసు జీవితకాలాన్ని నిర్ణయించవలసి వుంటుంది. కాళిదాసు కాలాన్ని గురించి మూడు వాదాలు బలంగా ఉన్నవి.

1) కాళిదాసు క్రీ.శ. 6వ శతాబ్ది వాడవటం

2) కాళిదాసు గుప్తులకాలం వాడవటం

3) కాళిదాసు విక్రమ శకారంభంలో అనగా క్రీ.పూ. ప్రథమ శతాబ్ది వాడవటం

కవికాలాన్ని సమగ్రంగా పరిశీలించే ముందు కాళిదాసు. మహాకవి ప్రత్యేకతల్ని, సామాన్య జీవిత విశేషాల్ని పరిశీలిస్తే

సంస్కృత మహా కవులలో ముఖ్యంగా పేర్కొనదగినవారు కాళిదాసు. అశ్వఘోషుడు, భారవి, భట్టి, కుమారదాసు, మాఘుడు, శ్రీ హర్షుడు, వేదాంత దేశికులు, అప్పయ దీక్షితులు.

సంస్కృత మహా కవులలో తరతరాలుగా, కాళిదాసు మహాకవి నిరుపమానుడుగా ప్రసిద్ధి పొందాడు.

**"పురా కవీనాం గణనా ప్రసంగే**
**కనిష్ఠికాధిష్ఠిత కాళిదాసా,**
**అవ్యాపి తత్తుల్యక వీరభావాత్**
**అనామికా సార్థవతీ బభూవ"**

వెనుక సంస్కృతంలో కవులను లెక్కించడానికి పూనుకొని "కాళిదాసు" అని చిటికిన వేలు ముడిచారు. తరువాత ఆయనతో సమానుడైన కవి మరొకరు కనిపించకపోవడం వల్ల ఆ చిటికిన వ్రేలుకి ప్రక్కన ఉన్న ఉంగరం వ్రేలికి "అనామిక" (పేరు లేనిది) అనే వ్యవహారం ఏర్పడింది.

ఈ శ్లోకం కాళిదాసు పట్ల భారతీయ కవితా రసజ్ఞులకు గల విశిష్టాదరాన్ని వ్యక్తం చేస్తుంది.

సంస్కృత కవుల కాలాలు స్పష్టంగా తెలియనందు వల్ల సంస్కృత సాహిత్య చరిత్రమ కాలక్రమాన్ని అనుసరించి కాకుండా, ప్రక్రియా వైవిధ్యాన్ని బట్టి అధ్యయనం చేయడం మంచిది. ఆ దృష్టితో సంస్కృత సాహిత్యంలోని ప్రధాన ప్రక్రియలను ఇలా విభజించుకోవచ్చు.

| | | |
|---|---|---|
| (1) మహాకావ్యాలు | (2) రూపకాలు, | (3) లఘు (ఖండ) కావ్యాలు - సంకలనాలు |
| (4) గద్య కావ్యాలు | (5) చారిత్రక కావ్యాలు | (6) చంపూ కావ్యాలు |
| (7) కథా కావ్యాలు | (8) నీతి కథలు | (9) చిత్ర కావ్యాలు |
| (10) అలంకార శాస్త్ర గ్రంథాలు | (11) నిఘంటువులు. | |

మహాకావ్యం సర్గ బంధంతో కూడి ఒక మహా పురుషుని జీవిత చరిత్రను వివరిస్తూ అర్థ సౌష్టవం కలిగి మంత్రణం, దౌత్యయాద్ధ, నాయకాభ్యుదయాది వర్ణవలతో పంచ సంధి సమన్వితమై ఉండాలని భామహుడు నిర్దేశించాడు. తరువాత దండి, అగ్ని పురాణ కర్త హేమ చంద్రుడు, రుద్రటుడు, విశ్వనాథుడు, విద్యానాథుడు మొదలయిన అలంకారికులు కూడా ఇంచుమించు ఇదే విధముగా మహా కావ్యాన్ని నిర్వచించారు.

కాళిదాను రచించిన కృతులతో రెండు మహాకావ్యాలు: (1) కుమార సంభవం (2) రఘువంశం.

రెండు ఖండ కావ్యాలు: (1) మేఘ సందేశం (2) ఋతు సంహారం.

మూడు నాటకాలు: (1) అభిజ్ఞాన శాకుంతలం (2) మాళవికాగ్ని మిత్రం. (3) విక్రమోర్వశీయమే ఉన్నాయి.

కుమార సంభవ కథ హిమాలయ వర్ణనతో ఆరంభమై పార్వతి జననం, శివపార్వతుల వివాహం, కుమారస్వామి జననం, కుమారస్వామి తారకాసురుని జయించడం మొదలయిన సన్నివేశాలతో మనోహరంగా కూర్చబడింది. కొంతమంది కుమార సంభవం (అష్టమ) 8 వ సర్గ వరకే కాళిదాసు రచన అంటారు.

దీనిలో హిమలయ వర్ణన (1వ సర్గ) వసంత వర్ణన (3వ సర్గ) రతి విలాపం (4వ సర్గ). శివ పార్వతుల సంవాదం (5వ సర్గ) మొదలైన ఘట్టాలు విశేషంగా ప్రజాదరణ పొందాయి.

కాళిదాసు శివభక్తుడైన విష్ణు ద్వేషి కాడు అనడానికి ఆయన రఘువంశం ప్రమాణం. దానిలో ఆయన "రామాభిధానోహరిరిత్యుచ" (రాముడు విష్ణుమూర్తి అవతారమే 13-1) అని ప్రకటించాడు.

దిలీపుని మొదలుకొని అగ్నిపర్ణుని వరకు గల రఘువంశ రాజులందరి వృత్తాంతం ఈ రఘు వంశ కావ్యంలో వర్ణింపబడింది. రఘువంశం 19 సర్గల మహాకావ్యం ఇప్పుడు మల్లినాధసూరి వ్యాఖ్యానంలో 19 సర్గలే మనకు లభిస్తున్నా, అది అసలు 25 సర్గల మహాకావ్యం అనీ, అగ్నిపర్ణుని తరువాత మరి 27 మంది రఘువంశ రాజులు చరిత్ర వర్ణింపబడిన భాగం లుప్తమైందనీ కొందరు విమర్శకులు భావిస్తున్నారు. కాళిదాసును "రఘుకారుడు" అని కూడా వ్యవహరించడం కద్దు "క" "ఇహ రఘు కారేణ రమతా" (రఘుకారుని రచన యందు ఎవడు ఆనందంతో విహరింపడు?) అని ప్రసిద్ధి, మహాకావ్య లక్షణాలన్ని యును రఘువంశంలో కనిపిస్తాయి.

## 1.2. కాళిదాసు కాలం పరిశీలన:

క్రీ.శ. 6వ శతాబ్ధంలో ఉజ్జయిన్ని పరిపాలించిన విక్రమాదిత్య బిరుదాంకితుడైన యశోధర్మ ఆస్థానకవి కాళిదాసు అది మాక్స్‌ముల్లర్ ప్రతిపాదించాడు. యశోధర్మ క్రీ.శ. 544లో శకులను పారద్రోలి విక్రమ శకాన్ని స్థాపించాడని స్తంభించిపోయిన సంస్కృత సాహిత్యం అతని కాలంలో పునర్జీవితమైందని మాక్స్‌ముల్లర్ అభిప్రాయం ఈ వాదాన్ని డా॥ ఫర్గ్గసన్, డా.హార్మలేలు కూడా సమర్థించారు.

కాళిదాసు భారతీయ సంప్రదాయానుసారంగా విక్రమాదిత్యుని ఆస్థాని, ఆవిక్రమాదిత్యుడు విక్రమాదిత్య బిరుదాంకితుడైన యశోధర్మయే అని ఈ విమర్శకుల అభిప్రాయం. విక్రమాదిత్యుడు విక్రమాదిత్య బిరుదాంకితుడైన యశోధర్మ కూడా శకులను పారదోలి నూతన శకాన్ని స్థాపించాడని కాళిదాను అతని ఆస్థాన కవి అని క్రీ.శ. 6వ శ॥ వాడని వారి అభిప్రాయం.

మేఘ సందేశంలో 14వ శ్లోకంలో "దిఙ్నాగ" పదాన్ని కాళిదాసు ప్రయోగించాడు. వ్యాఖ్యత మల్లినాధుడు ఒక ఙ్నాగుడు బౌద్ధ తత్త్వవేత్త అని అతడు కాళిదాసుకు ప్రతిద్వంద్వి అని. అతనికి కాళిదాసుకు వైరమున్నట్లుగాను పేర్కొన్నాడు. దిఙ్నాగుడు క్రీ.శ. 6వ శతాబ్దం వాడు కాబట్టి కాళిదాసు యశోధర్మ అస్థాని అవటం కుదురుతుందని కొందరు విమర్శకులు తలంచారు. దిఙ్నాగుడు వసుబంధు శిష్యుడు. చైనీయుల వ్రాతలను బట్టి ఆచార్య వసుబంధు క్రీ.శ. 400 ప్రాంతం వాడు అని తేలింది. కాబట్టి కాళిదాసు క్రీ.శ. 6వ శతాబ్దం వాడని దీని ఆధారంగా నిర్ణయించటం సాధ్యం కాదు.

కాళిదాసు శకారి విక్రమాదిత్యుని ఆస్థానకవి అని ప్రసిద్ధి. యశోధర్మ శకులను పారదోలినా శకారి అని పేరును పెట్టుకొన్నట్లు ఆపేరుతో ప్రసిద్ధుడైనట్లు లేదు అదీగాక యశోధర్మ ఓడించింది. హుణరాజు మిహిరకులున్ని శకారి విక్రమాదిత్యుడు యశోధర్మ కాదు. అంతేగాక అతడు విక్రమాదిత్యనామంకితుడు కాదు. బిరుదాంకితుడు మాత్రమే. యశోధర్మ ఒక నూతన శకాన్ని స్థాపించినట్లు ఎక్కడా ఆధారాలు లేవు.

ఒకవేళ శకాన్ని స్థాపించినా దాన్ని తనకన్న 600 ఏండ్ల పూర్వం నుంచి ఎందుకు ఆరంభించాడో అని అనుమానం కలుగక మానదు. దీన్నంతం పరిశీలిస్తే కాళిదాసు యశోధర్మ ఆస్థానకవి అని చెప్పటంలో బలమైన ఆధారాలు లేవు.

క్రీశ. 6వ శతాబ్ధంలో వున్న జ్యోతిష శాస్త్రవేత్త వరాహమి హిరుడు వర్షర్తువు ఆషాడమాసంతో ఆరంభమౌతుందని చెప్పాడు. ఆమతాన్ననుసరించి కాళిదాసు మేఘసందేశంలో "ఆ షాడస్య ప్రథమ దివసే "మేఘ మశ్లిష్టసానుం" అని వర్షర్తు ఆరంభాన్ని వర్ణించాడని, వరాహమిహిరుడు బృహత్సంహితలో చెప్పిన జ్యోతిష్య విషయాలను కాళిదాసు రఘువంశంలో గ్రహించి వ్రాసాడని అందుచేత కాళిదాసు క్రీ.శ. 6వ శతాబ్దంలో వరాహమిహిరునికి సమకాలికుడని కొందరు విమర్శకులు స్థాపించటానికి ప్రయత్నించారు. ఆషాడమాసంలో వర్షర్తువు ఆరంభం కావటమనేది వరాహమిహిరునికన్న పూర్వమే ప్రభలితమై వున్నదని కేవలం దీని ఆధారంగా కాళిదాసు క్రీ.శ. 6వ శతాబ్దం వాడని చెప్పటం సమంజసం కాందని పండితులు కొందరు విమర్శించారు.

**అ) గుప్తుల కాలంవాడనే వాదం:**

ఇది చాలామంది విమర్శకులకు ఆమోదయోగ్యమైన వాదం అయినా గుప్త వంశంలో ఏరాజుకు కాళిదాసు సమకాలికుడన్న విషయంలో పండితుల్లో మళ్ళీ అభిప్రాయ భేదాలు చాల్నా వున్నవి. కాళిదాసు సముద్రగుప్తుని కాలంవాడని, రఘువంశంలోని రఘుమహారాజు దిగ్విజయ వర్ణన సముద్రగుప్తుని దిగ్విజయ వర్ణనే అని కొందరు తలంచారు. మరికొందరు రెండవ చంద్రగుప్తుని

ఆస్థానంలో కాళిదాసు వున్నాడని నిర్ణయించారు.

శకారి విక్రమాదిత్యుని ఆస్థానకవి కాళిదాసు అని లోకంలో ప్రచారంలో వున్నదాన్ని బట్టి కాళిదాసు విక్రమాదిత్య బిరుదాంకితుడైన రెండవ చంద్రగుప్తుని ఆస్థానకవి అని వీరి అభిప్రాయం.

క్రీ.శ. 365లో కఠియవాడ్ శకక్షత్రపులను చంద్రగుప్తుడు సమూలంగా నాశనం చేసాడు. కాబట్టి శకారి అన్న బిరుదు ఇతనికే సరిపోతుందని వీరి మతం. రఘువంశంలో చంద్రగుప్తుని కొడుకు చముద్రగుప్తుని జననాన్ని సూచించడాని వీరిమాయ. గుప్తుల కాలం భారతదేశ చరిత్రలో స్వర్ణయుగం అందులో రెండవ చంద్రగుప్తుని కాలం రాజకీయంగా, సాంఘికంగా సుస్థిర సంపన్నమైంది. కాబట్టి కాళిదాసు వంటి కవి ఆకాలంలోనే జీవించి వుంటాడని ఆ విమర్శకుల అభిప్రాయం షేక్స్పియర్ వంటి కవులు బ్రిటీష్ చరిత్రలో స్వర్ణయుగమనబడే ఏలిజబెత్ రాజ్యకాలంలో వున్నారు. దీన్నిబట్టే ఈ విమర్శకులు కాళిదాసు కూడా స్వర్ణయుగమైన చంద్రగుప్తుని రాజ్య కాలంలోనే వున్నాడని చెప్పారేమో. కాళిదాసు రెండవ చంద్రగుప్తుని కాలంవాడన్న వాదాన్ని కేథ్, మిరాశి, భండార్కర్ వంటి ప్రముఖవిమర్శకులు చాలామంది సమర్థించారు.

మరికొందరు కాళిదాసు కుమారగుప్తుని కాలంవాడని, ఇంకా కొందరు స్కందగుప్తుని కాలం వాడని ప్రతిపాదించారు. కాళిదాసు రెండవ చంద్రగుప్తుని ఆస్థానంలో తన రచనా వ్యాసంగాన్ని ఆరంభించి కుమారగుప్త స్కందగుప్తుల కాలం వరకు జీవించి వారి ఆస్థానాలను కూడా అలంకరించాడని అప్పుడు అతని కాలాన్ని క్రీ.శ. 390-460 చెప్పవచ్చునని వింటర్ నిట్స్ అభిప్రాయం.

భారతదేశ చరిత్రలో స్వర్ణయుగంగా పరిగణింపబడే గుప్తులకాలంలో ముఖ్యంగా విక్రమాదిత్య బిరుదాంకితుడైన చంద్రగుప్తుని ఆస్థానంలో కాళిదాసు వున్నాడన్న వాదం చాలామట్టుకు సమర్థనీయంగా వున్నదనిపించినా దీనికి ఆపత్తిని కలిగించే విషయాలెన్నో కల్పిస్తున్నవి. రెండవ చంద్రగుప్తుడు అంతకుముందున్న మాళవశకాన్నే విక్రమశకంగా మార్చాడని వీరు అంటారు.

రెండవ చంద్రగుప్తుని వంటి పరాక్రమవంతుడైన రాజు తన పేరు మీదుగా కొత్త శకాన్ని ఆరంభిస్తాడు కాని మాళవశకాన్ని విక్రమశకంగా మార్చాడని చెప్పటం సమంజసంగా లేదు. అంతేగాక రెండవ చంద్రగుప్తుని కుమారుడు కుమారగుప్తుడు గిర్నార్ శిలాశాసనంలో గుప్త శకాన్నే వాడాడు. అతని తండ్రి ఆరంభించాడనే విక్రమ శకం వున్నట్లయితే అతడుదాన్ని వాడక గుప్తశకాన్ని ఎందుకు వాడుతాడు? అన్న అనుమానం వస్తుంది. శాసనాలల్లో విక్రమశకం తొమ్మిదవ శతాబ్దం నుంచే కన్పిస్తున్నది. కాబట్టి విక్రమ శకాన్ని రెండవ చంద్రగుప్తుడు ఆరంభించలేదనే తేలుతున్నది. ఇంకా రెండవ చంద్రగుప్తునికి విక్రమాదిత్యుడన్నది బిరుదునామమే. అంతకుముందున్న ప్రసిద్ధుడైన విక్రమాదిత్యుడునే రాజు పేరును అతడు బిరుదునామంగా ధరించాడని తెలుస్తున్నది. కాళిదాసు శకారి విక్రమాదిత్యుని ఆస్థానకవి అని ప్రసిద్ధి. రెండవ చంద్రగుప్తునికి శకారి అని బిరుదమున్నట్లు లేదు.

రఘువంశంలో వర్ణింపబడిన రఘుమహారాజు దిగ్విజయవర్ణన సముద్రగుప్తుని దిగ్విజయాలను ఆధారంగా దేశాల క్రమం వర్ణింపబడిందని విమర్శకుల అభిప్రాయం. ఇది కూడా కేవలం ఊహాగానం మాత్రమే. కాళిదాసు పురాణాలల్లోని దేశాల నామక్రమాన్నే తీసుకున్నాడు కాని వేరే కాదు. ఇందుమతీ స్వయంవరం సందర్భంలో కాళిదాసు మగధ రాజుకు ప్రయోగించిన విశేషణాలు రెండవ చంద్రగుప్తునికి సరిపోతాయని కొందరు తలంచారు. కాని ఇది కూడ భ్రమతో కూడిన

ఊహ మాత్రమే రఘుమహారాజు దిగ్విజయ వర్ణనా సందర్భంలో చేయబడిన "హూణ" ప్రసక్తిని బట్టి హూణులు క్రీ.శ. 4వ శతాబ్దంలోనే అంటే గుప్తుల కాలంలోనే భారత దేశపు సరిహద్దుల్లో కన్పించారని కాబట్టి కాళిదాసు నిశ్చయంగా గుప్తులకాలం వాడని కొందరు విమర్శకులు నొక్కి చెప్తున్నారు, ఈ బలమైన వాదం కూడా యుక్తి సంగతంగా లేదు ఎందుకంటే హూణులు భారతదేశపు సరిహద్దుల్లో ఎప్పటినుంచో కన్పిస్తున్నారు. వీరి ప్రసక్తి పారసీల "అవెస్తా" మత గ్రంథంలోను మహాభారతంలోను వున్నది.

లలిత విస్తరమనే బౌద్ధ గ్రంథంలో ప్రాచీన లిపులను గురించి చెప్తున్నప్పుడు హూణులు ప్రసక్తి వచ్చింది. క్రీ.పూ 150 ప్రాంతాలో "యూఏచే" (వీరినే భారతీయులు హూణులని అన్నారా) జాతి ఆక్సస్ నదికి దక్షిణ ప్రాంతంలోనే నివాసమేర్పరించు కొన్నారని చరిత్ర చెప్తున్నది. కాబట్టి హూణులతో క్రీ.శ. 4 వ శతాబ్దంలోనే భారతీయులకు పరిచయం ఏర్పడలేదని, దీని ఆధారంగా చేయబడిన కాళిదాసు కాలనిర్ణయం సరికాదని తేలుతున్నది.

కాళిదాసు ఉజ్జయిని రాజు విక్రమాదిత్యుని ఆస్థానకవి అని ప్రసిద్ధి. కాని గుప్తుల రాజధాని పాటలీపుత్ర నగరం, గుప్తుల కాలంలో ఉజ్జయిని ప్రాంతీయ రాజధానిగా వుండేది. కాని గుప్తులు పాటలీ పుత్రేశ్వరులు, మగధాధీశులుగానే చెప్పుకొన్నారు. ఉజ్జయిని వారికి ప్రధాన నగరం కాదు, అటువంటప్పుడు కాళిదాసు విక్రమాదిత్యుని ఆస్థానకవి అని లోకంలోవున్న కథలను బట్టి పాటలీ పుత్రేశ్వరుడైన రెండవ చంద్రగుప్త విక్రమాదిత్యుని ఆస్థానకవిగా నిర్ణయించటం సమంజసంగా లేదు.

కాళిదాసు రచనల్లో కన్పించే శాంతి సుఖ సంపన్నమయ ప్రజాజీవితం గుప్తరాజులు పరిపాలనా కాలాన్ని సూచిస్తున్నదన్న వాదం కూడ భ్రమ పూర్వకమైంది. గుప్త రాజులకు పూర్వం కూడా ఎన్నో రాజవంశాలు భారతదేశాన్ని పరిపాలించినవి. ఆ వంశరాజులు పరిపాలనలో భారత ప్రజలు సుఖ సంపన్న జీవితాలను గడిపారు. కాబట్టి కాళిదాసు వర్ణనలు గుప్త కాలానికీ సరిపోతున్నవని అతని కాల నిర్ణయాన్ని చేయలేము.

**ఆ) క్రీ.పూ. ప్రథమ శతాబ్దం వాడనే వాదం:**

కాళిదాసు క్రీ.పూ. ప్రథమ శతాబ్ది వాడైన ఉజ్జయిని రాజు మాళవాధిపతి విక్రమాదిత్యుని ఆస్థానకవి అని భారతీయ సంప్రదాయం చెప్తున్నది. ఈ విక్రమాదిత్యుడు శకులను సారదోలి 'శకారి' అన్న బిరుదాన్ని ధరించాడు. క్రీ.పూ. 57 లో తన పేరు మీదుగా విక్రమ సంవత్సరాన్ని స్థాపించాడు. శక విజయోత్సవ సందర్భంలోనే అతడు ఈ శకాన్ని ఆరంభించి వుంటాడు. ఈ విక్రమాదిత్యుడు పరాక్రమి. దానగుణ ప్రసిద్ధుడు. ఇతన్ని గురించి ఎన్నో అద్భుత సాహసగాథలు ప్రచారంలో వున్నవి. అయితే అటువంటి ఆ వ్యక్తి చారిత్రక పురుషుడు కాదని, ఆ రాజు విన్నట్లు, చారిత్ర కాధారాలేవి లేవని, కాబట్టి కాళిదాసు అతని ఆస్థానంలో వున్నాడనటం ఐతిహ్యమే కాని సత్యం కాదని ఆధునిక విమర్శకులు చాలామంది తోసిపుచ్చారు. జ్యోతిర్విధాభరణమనే జ్యోతిష గ్రంథంలో విక్రమాదిత్యుని ఆస్థానంలో నవరత్నాలుండే వారని, వారిలో కాళిదాసు ఒకరని చెప్పబడింది. ఆ గ్రంథం కాళిదాసు రచనగా భావింపబడుతున్నది. కాని ఆ జ్యోతిష గ్రంథం చాలా అర్వాచీనమైంది. దానిలో చెప్పబడిన విక్రమాదిత్యుడు ధారానగర్ రాజు భోజుడని తెలింది. కాబట్టి విక్రమాదిత్యుడు అనేరాజు ఎప్పుడూ లేడని కొందరు విమర్శకుల వాదం. విక్రమాదిత్యునికి సంబంధించిన శాసనాధారాలు గాని, నాణాల ఆధారం గాని ఇంతవరకు దొరకలేదు. నిజమే కాని ఇకముందు దొరకవని నమ్మకమేమున్నది? చారిత్రకాధారాలు లేకున్నా విక్రమాదిత్యుని అస్తిత్వాన్ని గురించి ప్రాచీన సాంహిత్యంలో చాలా ఆధారాలున్నవి.

విక్రమాదిత్యుడు శివుని గుణాలల్లో ఒకడైన మాల్యవంతుడు, మ్లేచ్ఛవినాశార్థం వైదికధర్మ పునరుద్ధరణకు భూమి మీద అవతరించాడు. బౌద్ధ జైనమతాల ప్రభావాన్ని అణచి హిందూ ధర్మస్థాపన చేసాడు. కాబట్టి ఇతన్ని గురించి కథలు గొప్పగా ప్రచారంలో వున్నావేమో అట్లా హిందూ మతోద్ధరణ చేసిన శకారి విక్రమాదిత్యుని ఆస్థానంలోనే కాళిదాసు వుండి ఉంటాడు.

ఈవిధంగా విక్రమాదిత్యుడనే రాజు ఉజ్జయిన్ని పరిపాలించినట్లు ఆధారాలు సాహిత్యంలో లభిస్తున్నవి. అటువంటప్పుడు ప్రాచీన భారతీయ సంప్రదాయానుసారంగా కాళిదాసును ఆ రాజు ఆస్థానకవి అని అంగీకరించటంలో ఏమి ఆసత్తి కన్పించటం లేదు. కాళిదాసు ఉజ్జయిని రాజు విక్రమాదిత్యుని ఆస్థాన కవియే అని చెప్పటానికి కొన్ని సాక్ష్యాధారాలను చూపించవచ్చును.

1. కాళిదాసు ఉజ్జయిన్ని అభిమానంతో విస్తారంగా మేఘ సందేశాదుల్లో వర్ణించాడు. అతనికి ఉజ్జయిని పరిచయం చాలా వున్నది. కాళిదాసుకు విదర్భాది మధ్య భారతదేశంతో విశేష పరిచయమున్నట్లు కన్పిస్తున్నది.
2. విక్రమోర్వశీయ నాటకం పేరుతో "విక్రమ" శబ్దాన్ని తన రాజు పేరమీదగానే చేర్చి వుంటాడని పండితుల అభిప్రాయం. విక్రమోర్వశీయంలో నాయకుడు పురూరవుడు. అప్పుడు ఆ నాటకానికి పురూర వోర్వశీయమని పేరు పెట్టవచ్చును. కాని కాళిదాసు కథతో సంబంధం లేని "విక్రమ" పదాన్ని ఇక్కడ తెచ్చి జోడించాడంటే ఏదో విశేషముండి ఉంటుంది. ఆ విశేషం తన ఆశ్రయదాత రాజు పేరు పెట్టాలనే ఉద్దేశం కావచ్చును.
3. కాళిదాసు విక్రమోర్వశీయం ప్రథమాంకంలో "అనుత్సేకఃఖలు విక్రమాలంకరః" అని "దిష్ట్యామహేంద్రోపకార పర్యాప్తేన విక్రమాదిమ్నా వర్ధతే భమన్" అని విక్రమ శబ్దాన్ని విక్రమాదిత్యున్ని మహేంద్ర శబ్దాన్ని మహేంద్రాదిత్యున్ని సూచిస్తూ ప్రయోగించాడని పండిత విమర్శకుల అభిప్రాయం.
4. కాళిదాసు చిత్రించిన ప్రజాజీవనం మీద బౌద్ధ జైన మతాల ప్రభావం కన్పించటం లేదు. అది శుంగరాజుల కాలంలోను ఆ తర్వాతను పునరుద్ధరింపబడిన హిందూ సమాజ చిత్రణమే అని చెప్పాలి.
5. కాళిదాసు శైలి వాల్మీకాదులకు దగ్గరగా ఉన్నది. గుప్తులకాలం ఆనాటి ముద్రారాక్షసం. దేవీ చంద్రగుప్త వంటి నాటకాల్లో శైలి సమాసయుక్తమై లాలిత్యాన్ని కోల్పోయింది. ముద్రారాక్షసాది నాటకాల్లో నాటక కళ తక్కువగా శ్రవ్య కావ్య ధర్మాలు చాలా ప్రవేశించినవి. అంటే నాటకాల్లో ప్రదర్శన యోగ్యమైన లక్షణాలు సన్నగిల్లుతున్నవని చెప్పవచ్చును. కాళిదాసు నాటకాలు ప్రదర్శనయోగ్యంగా ఉత్తమ నాటకకళతో వున్నవి. కాళిదాసు చిత్రించిన ఆశ్రమ ప్రాంతాది వర్ణనలు గుప్తుల కాలం నాడు కాక అంతకు చాలా ప్రాచీనమని చెప్పవచ్చును. అటువంటప్పుడు ఐతిహ్యం ప్రకారం కాళిదాసు క్రీ.పూ. ప్రథమ శతాబ్దం వాడని విక్రమాదిత్యుని ఆస్థాన కవి అని చెప్పుకోవటం సమంజసం.

### 1.2. (ఇ) క్రీ.పూ. రెండవ శతాబ్దం వాడనే వాదం:

కాళిదాసు క్రీ.పూ. 2వ శతాబ్దంలో శుంగరాజులకు సమకాలికుడని ఒక వాదం ఉన్నది. భీటా అనే ప్రదేశంలో తవ్వకాలల్లో ఒక మట్టిపలకం రథారూఢుడైన రాజు. సారథి, ఇద్దరు కృశకాయులైన మునులు, ఆప్రక్కనే కూర్చున్న స్త్రీ బొమ్మలు కలది దొరికింది. ఆ రాజు దుష్యంతుడని, స్త్రీ శకుంతల అని, మునులు కణ్వాశ్రమంలోని మునులని విజ్ఞులు తలంచారు. ఆ మట్టిఫలకం శుంగుల కాలం నాటిదని చారిత్రకుల అభిప్రాయం. దీన్నిబట్టి కాళిదాసు శుంగులనాటి వాడని స్థిరపడ్తున్నదని కొందరు సాహిత్య విమర్శకులు తలంచారు.

అతడు శుంగరాజు అగ్నిమిత్రుని నాయకునిగా చేసి మాళవికాగ్ని మిత్ర నాటకాన్ని వ్రాసాడు. అగ్నిమిత్రుడు

ఉదయన మహారాజు వలె ప్రసిద్ధ వ్యక్తి కాదు. అయినా అతన్ని నాయకునిగా చేసి కాళిదాసు నాటకం వ్రాసాడంటే తప్పక అతడు అగ్నిమిత్రుని ఆస్థానంలో వుండే వ్రాసాడని అభిప్రాయం కలుగుతున్నది. అంతేగాక అగ్నిమిత్రుని నాటి సూక్ష్మ విషయాలను కవి విడువక వున్నదున్నట్లు చెప్పాడు. ఒకవేళ మరోవిధంగా తెలుసుకుని వ్రాస్తే ఆ అల్ప విషయాలను పాటిస్తూ వ్రాసి వుండేవాడు కాదేమో. ఆ అల్పవిషయాలు కథా దృష్టితో ప్రధానమైనవికావు. కాబట్టి వదిలివేసినా ఫరవాలేదు అట్లు వదిలి వేయక అల్పవిషయాలను సూక్ష్మ దృష్టితో కాళిదాసు చెప్పాడంటే అతడు అగ్నిమిత్రునికి సమకాలికుడన్న వాదం బలపడుతున్నది. ఈ వాదాన్ని ప్రతిపాదించి సమర్ధించిన వారిలో డా॥ కున్హన్ రాజా ఒకడు వారు చూపే సాక్ష్యాధారాలు.

1. మేఘ సందేశంలో కాళిదాసు విదిశా నగరాన్ని రాజధాని నగరంగా వర్ణించాడు. "తేషాం దిక్షుప్రదిత విదిశా లక్షణాం రాజధానిమ్" ఆ గుర్తింపును కాళిదాసు ఉజ్జయినికి కూడా ఇయ్యలేదు. శుంగరాజు అగ్నిమిత్రుని కాలంలోనే విదిశ విదర్భ దేశానికి రాజధానిగా వుండేది. మాళవికాగ్నిమిత్ర నాటకంలో అగ్నిమిత్రుడు విదర్భకు రాజప్రతినిధిగా విదిశలోనే వున్నట్లు వున్నది. చారిత్రకంగా ఇది సత్యమే.
2. ఆ రఘువంశంలో దిలీపుని అశ్వమేధయాగం, రఘు దాని రక్షణకై పోవటం పుష్యమిత్రుని అశ్వమేధయాగం, అశ్వం రక్షణకు అతని మనుమడు వసుమిత్రుడు పోయి యవనులను జయించటాన్ని దృష్టిలో పెట్టుకొని వ్రాసాడని విమర్శకుల అభిప్రాయం వసుమిత్రుని యాగాశ్వ రక్షణను కాళిదాసు మాళవికాగ్ని మిత్రంలో చెప్పాడు కూడా.
3. మగధ పాలకుడైన పుష్యమిత్రుడు "సేనాపతి" అని తనను తాను పేర్కొన్నట్లు మాళవికాగ్ని మిత్రం పంచమంకంలో "స్వస్తి యజ్ఞశరణాత్సేనాపతిః పుష్యమిత్రో విదిశస్థం పుత్రమయుష్మంత మగ్నిమిత్రం స్నేహత్పరిష్వజ్యేదమను దర్శయతి" అన్న మాటల వల్ల తెలుస్తున్నది. అయితే పుష్యమిత్రుడు మౌర్యుల సేనాపతి. చివరి మౌర్యరాజు బృహద్రథుని చంపి మగధాధీశుడైనా కూడా తనను తాను "సేనాపతి" అని పేర్కొనట్లు శాసనాధారం వున్నది. ఇంత సూక్ష్మ విషయాన్ని కాళిదాసు విడువక పేర్కొనటం అతని ప్రత్యక్ష పరిచయాన్ని నిరూపిస్తున్నదని ఈ విమర్శలకువాదం.
4. అంతగా చరిత్ర ప్రసిద్ధం కాని యజ్ఞసేన, మాధవసేనుల దాయాదవైరాన్ని కాళిదాసు మాళవికాగ్ని మిత్రంలో వివరించాడు. విదర్భాధిపత్యానికి వీరిద్దరు పోరాడుతుండగా అగ్నిమిత్రుడు పుష్య మిత్రునికి ప్రతినిధిగా పోయి రాజ్యాన్ని ఇద్దరికి పంచియిచ్చి వారి తగవును తీర్చి రాజకీయ సమస్యను పరిష్కరించాడు. ఇంకా అగ్నిమిత్రుని బావమరిది సరిహద్దు రక్షణ కొరకు నియమింపబడిన వాడు శూద్ర కులజుడని కాళిదాసు చెప్పాడు. ఈ చిన్న విషయాలన్నీ కాళిదాసు చెప్పటం చేత అతడు సుపరిచితమైన సమకాలికేతి వృత్తాన్నే తీసుకున్నాడనటాన్ని బలపరుస్తున్నాయని విమర్శకుల అభిప్రాయం.
5. మాళవికాగ్నిమిత్రం భరత వాక్యంలో కాళిదాసు అగ్నిమిత్రుని రాజ్యపాలనను వర్ణించాడు. అట్లా నాయకుని రాజ్య పాలనను వర్ణించటం మంద్రారాక్షసాది నాటకాలల్లో వున్నది. కాని కాళిదాసు అగ్నిమిత్రుని పాలనను సమకాలికేతి వృత్తంగా వర్ణించాడని అందుచేత ఈ నాటకం అగ్నిమిత్రుని సమయంలోనే కాళిదాసు చేత వ్రాయబడి ప్రదర్శింపబడిందనే కున్హీన్ రాజు అభిప్రాయం.

## 1.3. కాళిదాసు-జన్మస్థలం:

కాళిదాసు కాల నిర్ణయం ఎంత అభిప్రాయభేదంతో కూడుకొన్నదో అతని జన్మస్థల నిర్ణయం కూడ అంత ఆభిప్రాయ

భేదంతో కూడుకున్నదే కాళిపూజ బెంగాల్ ప్రదేశంలో ఎక్కువ ప్రచారంలో వుంది కాబట్టి కాళీభక్తుడైన కాళిదాసు మావాడని బెంగాలీలు వాదించారు. ముర్షీదాబాదు జిల్లాలోని గద్దెశింగార్‌లో కాళిదాసు జన్మించాడని ఏటేటా ఉత్సవాలు కూడా జరుపుతున్నారు.

బెంగాల్‌లో నెలలను శుక్ల కృష్ణపక్షాలుగా విభజించారు. కాళిదాసు "ఆషాడస్య శుక్ల పక్షస్య ప్రథమదివసే" అని అనకుండా "ఆషాఢస్య ప్రథమ దివసే" అని అనటం అతడు బెంగాలీ వాడని నిరుపిస్తున్నదని అంటారు. కాని రెండు వాదాలు బలంగా లేవు. కాళీపూజ ఒకప్పుడు మధ్య భారతంలోను బాగా వ్యాపించి వుండేది. శివునితో పాటు శివరాణి కాళి, దుర్గ, చాముండి కల పేర్లతో పూజలందుకునేది.

ఇక రెండవవాదం "ఆషాఢస్య శుక్లపక్షస్య ప్రథమ దివసే" అని అనలేదు కాబట్టి కాళిదాను బెంగాలీ వాడవటం హస్యాస్పదం. కాళిదాసు రఘువంశంలో వరి ధాన్యాన్ని ఒకచోట ఉపమానంగా చెప్పాడు కాబట్టి వరి విరివిగా పండే బెంగాల్ ప్రాంతం వాడని అంటారు. కాని ఇది కూడ బలమైన వాదం కాదు. కాళిదాసుకు బెంగాల్ పుట్టేనే వరి ధాన్యంతో పరిచయం కలుగుతుందనటం సమంజసంగా లేదు. కాళిదాసు ఎక్కడా వంగదేశాన్ని అభిమానంగా వర్ణించలేదు.

కాళిదాసు రచనల్లో హిమాలయాలు ఉన్నత స్థానాన్ని వహించినవని, అతనికి హిమాలయాలు సుపరిచితాలని కాబట్టి అతడు కాశ్మీరవాసి అని లక్ష్మీధర్ ప్రతిపాదించాడు. కాళిదాసు కాశ్మీరాన్ని ఎక్కడా అభిమానంతో వర్ణించలేదు. కాళిదాసు పేరు కాశ్మీర దేశవాసుల నామంవలె లేదు. కల్హణ, బిల్హణ, రుద్రట, కయ్యటామల పేర్లు కాశ్మీర దేశీయులని కాని కాళిదాసనటం కాదు.

మాళవికాగ్నిమిత్రంలో విదర్భ దేశాన్ని కాళిదాసు నేపథ్యంగా తీసుకొన్నాడని మేఘ సందేశంలోని యక్షుడు ప్రవాసం గడిపేచోటు రామగిరి విదర్భలోనిదని, కాళిదాసు శైలి వైదర్భి అని, అతడు విదర్భ ప్రాంతం వాడని కొందరు విమర్శకులు తలంచారు.

కాళిదాసు హుణరాజు మిహిరకులుని జయించిన యశోధర్మ (క్రీ.శ. 528) ఆస్థానకవి అని అతడు అందుచేత దశపుర లేక విదిశవి వాసి అని మహామహోపాధ్యాయ హరప్రసాదశాస్త్రి ఎస్.ఎమ్. పరాంజ పేరుప్రతిపాదించారు. విదిశు ప్రాంతాన్ని అతడు చాలా విస్తరంగా చిన్న చిన్న నదీ పర్వతాలను కూడ విడువక వర్ణించటమే దీనికి తార్కాణమని వారి వాదం. కాళిదాసు ఆప్రాంతాన్ని సూక్ష్మంగా వర్ణించాడంటే ఆ ప్రాంతాన్ని బాగా తెలిసినవాడని తెలుస్తున్నది.

అలంకానగరానికి యక్షుడు ప్రేమసందేశాన్ని పంపుతూ మేఘంలో "నీవు తొందరలో వున్నా సరే వంకర దారి అయినాసరే ఉజ్జయిన్ని దర్శించమని" చెప్తాడు. ఉజ్జయినిలో ఎత్తైన హర్మ్యాలను పౌరాంగనల కుటిల కటాక్షాలను చూడనివాని జీవితం నిష్ఫలమని కాళిదాసు భావించాడు.

ఉజ్జయిని పరిసర ప్రాంతంలోని ప్రకృత్యాదులతో కూడా కాళిదాసు సుపరిచితుడు. ఉజ్జయిని పేరెత్తగానే అతని హృదయం మెత్తనై ఉరకలు వేసింది. ఉజ్జయిని మీద అతనికున్న అభిమానాన్ని అని చాటుతున్నది. మధ్యభారతంలోని ఉజ్జయిని, విదర్భ, విదిశ, మాళవ ప్రాంతాలు అతినికి సుపరిచితాలని చెప్పవచ్చును. కాబట్టి కాళిదాసు జన్మస్థానం ఈ ప్రాంతాల్లోనే వుండి ఉంటుంది. అతను విదిశ, ఉజ్జయిని నగరాల్లో చాలా కాలం రాజుల ఆదరణలో నివసించి వుంటాడు.

## 1.4. కాళిదాసు కృతులు-పరిచయం:

అనన్యమైన ప్రకృతి పరిశీలను సామర్థ్యం, అనల్పమైన కల్పనా చాతుర్యం అపూర్వమైన శిల్ప నైపుణ్యం, అతి గంభీరమయిన మానవ స్వభావ వివేచనా శక్తిని వినియోగించి, భారత జాతికి తలమాని కాలయిన మహా గ్రంథాలను కాళిదాసు సృష్టించాడు. ఋతు సంహారం, రఘు వంశం, కుమార సంభవం, మేఘ సందేశాలవంటి కావ్యాలను, మాళవికాగ్ని మిత్రం, విక్రమోర్వశీయం అభిజ్ఞాన శాకుంతలం వంటి నాటకాలను రచించాడు.

**1.4.1. ఖండ కావ్యాలు:**

ఖండ కావ్యాలు - 1) మేఘసందేశం 2) ఋతు సంహారం

**అ) మేఘ సందేశం:**

మహాకవి కాళిదాసుకూ, సంస్కృత సాహిత్యానికి దేశ విదేశాలలో సమున్నత స్థాయిని సమకూర్చిన పెట్టిన వ్యంగ్య ప్రధానమైన కావ్యము ఇది. విరహాతురడైన యక్షునిదులో వృత్తి ఈ కావ్యంలో చిత్రితమయింది. ఇందులోని కథ కేవలము కల్పితము, కుబేర సేవకుడైన ఒక యక్షుడు స్వామి ఆగ్రహానికి గురి అయినాడు. కుబేరుడు ఒక ఏడాది పాటు భార్యావియోగాన్ని భరించవలసినదిగా యక్షుణ్ణి శాపిస్తాడు. ఆయక్షుడు ఆషాడ మేఘాన్ని చూస్తాడు.

ఆమేఘ వీక్షణం ఇతనిలోని జ్ఞాపకాలను మేలుకొలుపుతుంది. మధురాతిమధురమైన స్మృతులెన్నో మనస్సులో మెదులుతాయి. ఆ మేఘం ఉత్తర దిశగా ప్రయాణిస్తుంది. అలకా నగరంలో ఉన్న తన ప్రేయసికి ఒక సందేశాన్ని పంపుదామనుకొన్నాడు. ఆజం ధరునికి, ఆ నగరాన్ని చేరుకొనే మార్గ మధ్యంలో కనిపించే విశేషాలను వివరిస్తాడు. యక్షుడు తన ప్రస్తుత స్థితిగతులను, ఆమెకు తెలియజేయవలసిందిగా మేఘాన్ని వేడుకొంటాడు. ఈ కావ్యంలోని కథ అంతా సంక్షిప్తంగా తెలిచేయటం జరిగింది.

మేఘ సందేశం కావ్యంలో “పూర్వ మేఘమనీ, ఉత్తర మేఘమనీ రెండు సర్గలున్నాయి. ఈ రెండు సర్గలలోని శ్లోకాల సంఖ్య 115. సాహిత్య జగత్తులో మేఘసందేశం కావ్యానికి మహోన్నతమైన స్థానముంది. పూర్వ మేఘమును వర్ణనాగీతమనీ ఉత్తర మేఘాన్ని ఉత్కంఠాగీతమని వ్యవహరిస్తూంటారు. పూర్వ మేఘమున్న సర్గలో ఉత్తర భారతంలోని నదీనదాలు, గిరి కందరాలు పల్లెలు, పట్టణాలు, పుణ్య క్షేత్రాలు వర్ణింపబడ్డాయి. ఇతివృత్తానికి తగినట్టుగా “మందాక్రాంతా” వృత్తంలోనే కావ్య రచన కొనసాగింది. ఉత్తర మేఘమున్న రెండవ సర్గలో అలకా నగరం, యక్ష భవనం, మేఘుడు ద్వారా యక్షుడు పంపిన సందేశం వర్ణింపబడ్డాయి, సందేశ (దూత) కావ్యాలన్నింటిలోనూ మేఘ సందేశం మకుటాయమానమైనటువంటిది. కాళిదాసు కావ్యాలన్నింటలోనూ కానవచ్చే వస్తూ విన్యాసం పాత్ర సృష్టి వర్ణనా వైచిత్ర్యం రస ప్రతిపాదనాది విషయాలు ఇతని కళాకౌశలాన్ని తెలియ చేస్తున్నాయి.

**ఆ) ఋతు సంహారం:**

ఋతు సంహార కర్తృత్వ విషయంలో భేదాభిప్రాయాలున్నాయి. ఆరు ఋతువుల సొగసులను చిత్రించే వర్ణనాత్మకమైన కావ్యమిది. సాధారణ క్రమంలోనయితే వసంతర్తు వర్ణనలో ప్రారంభం కావాలి. అలాకాక, ఈ కావ్యం గ్రీష్మ ఋతువర్ణతో ప్రారంభం కావడం ఒక విశేషం వివిధ ఋతువులలోని ప్రకృతి ప్రభావం మానవుల మీద వివిధ జంతువుల వృక్ష విశేషాల మీద ఎటువంటి మార్పులను కల్గిస్తుందో ఈ కావ్యంలో హృదయంగమంగా చిత్రించాడు కవి. ఈ వర్ణనలను అధ్యయనం చేస్తున్నప్పుడు కవి నిశిత పరిశీలన పతితకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వివిధ ఋతువులలోని పరిణామాలను, ఒక ప్రియురాలికి,

ప్రియుడు వివరిస్తున్న తీరులో కావ్య రచన కొనసాగింది. వర్షాకాలన్ని ఒక రాజు గాను, జలధరాలను తద్వాహకములైన ఏనుగులు గాను, వాటి గర్జన ప్రయాణ భేరిగాను చెప్పడం. ఇక్కడ వర్ణనా వైచిత్రి దర్శనం ఋతు సంహారం గ్రీష్మ ఋతువు వర్ణనతో ప్రారంభించి, వసంత ఋతువుతో ముగించడం ప్రళయం నుంచి సృష్టిని చూపిస్తూ కావ్యాన్ని మంగళాంతం చేసాడు అని కొందరి అభిప్రాయం. వసంతంలో ప్రారంభిస్తే శిశిరంతో ముగించాలి. శిశిరం అంటే ఆకురాలు కాలం వలన అమంగళకరం కదా.

### 1.4.2. మహా కావ్యాలు:

**అ) రఘు వంశం:**

రెండు మహాకావ్యాలను కాళిదాసు రచించాడు అని రఘువంశం, కుమార సంభవం అని చెప్పుకొన్నాం. అందులో రఘువంశం గురించి కొంచెం తెలుసుకొందాం. కాళిదాసు నాటకాల్లో శాకుంతలం రత్నమయినట్లే కావ్యాలలో రఘువంశం రత్నమని పండితుల అభిప్రాయం. ఈ కావ్యంలోని కథా వస్తువును రామాయణం నుండి విష్ణు పురాణ, పద్మ పురాణల నుండి గ్రహించాడు కాళిదాసు. రసోచితమైన మార్పుల్ని చేసి, ఉత్తమ కావ్యంగా రూపొందించాడు.

సూర్య వంశ ప్రభువులు చిరకాలంగా అయోధ్యను పరిపాలించాడు. వారిలో దిలీప, రఘు, అజ, దశరథ మహారాజులు చాలా ముఖ్యమైన వారు. వీరి తరువాత పరిపాలించిన వాడు శ్రీరామ చంద్రుడు. ఈయన శ్రీహరి అపరావతారం. ఆ తరువాత ఇరవై నాలుగు మంది రాజులు పరిపాలించారు. ఈ పరంపరలో చివరి వాడు అగ్నివర్ణుడు అతను మరణించిన తరువాత, అగ్నివర్ణుని అర్ధాంగికి పట్టాభిషేకం జరుగుతుంది. అప్పుడామె గర్భవతి. ఈ పట్టాభిషేకోత్సవంతో రఘువంశ కావ్యం ముగుస్తుంది.

రఘువంశంలోని మొత్తం సర్గలు పందొమ్మిది. వీటిల్లో దిలీపు మహారాజు-నందినీధేనువుకు బదులుగా, తన శరీరాన్ని సింహానికి అర్పించడం, రఘు మహారాజు జైత్రయాత్ర. ఇందుమతి స్వయంవరం, అజ విలాపం, సీతా పరిత్యాగం మొదలైన ఘట్టాలు రసరమ్యంగా ఉన్నాయి. ఈ కావ్యాన్ని మూడు భాగాలుగా చేయవచ్చు. మొదటి తొమ్మిది సర్గలలో శ్రీరాముని కన్నా పూర్వులైన వారి చరిత్ర ఉంది. 10వ సర్గ నుండి 15వ సర్గ వరకూ శ్రీరామాయణ కథ ఉంది. మిగిలిన నాలుగు సర్గలలోనూ, శ్రీరాముని అనంతరం రాజ్యాన్ని పాలించిన పాలకుల చరిత్ర వర్ణితమయి ఉంది. రఘు వంశ కావ్యంలో కావ్య నాయకుడెవరన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం చెప్పడం కష్టమే గానీ, శ్రీరాముడనే ప్రత్యుత్తరంతో కొంత వరకూ సమాధాన పడవచ్చు

శ్రీరాముని వంటి పవిత్ర చరిత్రుడూ, వీరనాయకుడూ జన్మించడానికి రఘు మహారాజు వంటి సచ్చరితులతో పవిత్రమైన రఘువంశము తగినది కావడం వలన, రఘు చక్రవర్తికి ప్రాశస్త్యం లభించి కావ్యానికి రఘు వంశం అన్న పేరు స్థిర పడిపోయింది ఈ కావ్యం లోని కథలలో ఐక్యం లేదనీ, రామకథలో రామాయణంలోని రచనా సౌందర్యం కానరాదనీ, కొందరు విమర్శకుల అభిప్రాయం.

**ఆ) కుమార సంభవం:**

ఇది పదిహేడు సర్గల కావ్యం. కుమార సంభవం, రఘువంశం అన్న ఈ రెండు గ్రంథాలను "కావ్యాలు" అనడం కన్నా లఘు పురాణకాలనడం సముచితంగా ఉంటుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. వీటి సౌందర్యం కథా విషయంలో కాకుండా కథా పద్ధతిలో ఉండటం విశేషం. అంటే విషయానికి కాకుండా రీతికి ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇచ్చినట్లన్నమాట. ఈ కుమార సంభవంలోని కథా వస్తువు. శివపురాణం నుండే స్కాంద పురాణాం నుండీ కాళిదాసు గ్రహించి ఉండాలి.

పార్వతీ దేవి జననం, తారకుని దురాగతాలను సంహించలేని దేవతలు తమనుభవిస్తున్న బాధలను పరమేష్టితో మొరపెట్టుకోవడం. ఈయన ఆదేశం మేరకు, శివపార్వతులను సంధించడాని దేవేంద్రుడు, మన్మధుని పంపడం, మారుని దహనం. రతీదేవి విలాపం, పార్వతీదేవి తపశ్చర్య శివుడు ప్రసన్నుడు కావడం, పార్వతీ పరమేశ్వరుల పరిణయం, గిరిజా శంకరాల ప్రణయ లీలలు, కుమార సాహసం వర్ణింపబడ్డాయి. ఈ కావ్యాలలో వీర రసం కన్నా శృంగార రసమే మిన్నగా ఉన్నట్లు విమర్శకుల అభిప్రాయం. పూర్వార్థంలో గోచరించే కావ్య సౌందర్యం. ఉత్తరార్ధంలో లేనందువల్ల ఈ తరువాతి భాగాన్ని కాళిదాను కాక ఇంకెవరైనా రచించి ఉండవచ్చునని, కొందరు అభిప్రాయపడ్డారు. జగత్పతరులైన పరమేశ్వరుని ప్రణయ క్రీడను వర్ణించిన కాళిదాసును, మమ్మటుడు మొదలైన వారు తీవ్రంగా ఆక్షేపించారు. ప్రకృతి వర్ణనం వ్యంగ్య ప్రధానమైన శృంగార రస పోషణ కుమార సంభవంలో హృదయంగమంగా ప్రకటితమయాయి.

### 1.4.3. రూపకాలు:

#### అ) మాళవిగ్ని మిత్రం:

కాళిదాసు రచించిన మొట్టమొదటి నాటకం శుంగ వంశానికి చెందిన అగ్నిమిత్రుని కథ. ఈ నాటకం లోని ప్రధాన ఇతివృత్తం 'మాళవిక' అనే స్త్రీని అగ్నిమిత్రుడు ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడు. శుంగ వంశపు రాజులు బ్రాహ్మణులు.

మౌర్యవంశంలోని చివరివాడు బృహద్రథుడు. ఇతనిని వధించి పుష్యమిత్రుడన్న సేనాని మగధ సామ్రాజ్యాన్ని వశ పరుచుకున్నాడు. ఆ పుష్యమిత్రుని కుమారుడే ఈ అగ్నిమిత్రుడు. కాళిదాసు కాలంనాటికి ఈ పుష్యమిత్రుదులు ప్రతిష్ఠ ఏ మాత్రం తరిగిపోలేదు.

ఇది అయిదు అంకాల నాటకం. ప్రధానమైన రసం శృంగారం. ఈ నాటకం ఇతి వృత్తం రాజు అగ్నిమిత్రుడు ఒక స్త్రీని ప్రేమించాడు. ఆ స్త్రీ రాణి ధరణిదేవి దాసి. ఈ విషయం తెలిసిన తరువాత రాణికి కోపం వస్తుంది. తరువాత ఆ స్త్రీ బంధువు కావడం వల్ల కోపం తగ్గిపోతుంది. రాజుకు ఆమెకు వివాహమౌతుంది. సంక్షిప్తంగా ఈ నాటకంలోని కథ ఇదే.

#### ఆ) విక్రమోర్వశీయం:

విక్రమోర్వశీయ నాటకం కాళిదాసుని రెండవ రచన అప్సరాంగన ఉర్వశికి, పురూరవునకు మధ్య నడిచిన ప్రేమ గాథ ఈ కథ. వేదంలోనూ, భాగవతంలోనూ ఉంది. వ్యాసుడికథను పౌరాణికంగా వ్రాసాడు. కాళిదాసు నాటకంగా వ్రాసాడు.

పూరూరవ చక్రవర్తికి విక్రముడనే పేరు. ఈ పేర్లలోని అంతరార్థాన్ని జర్మనీ పండితుడు "మాక్స్‌ముల్లరు" ఈ విధంగా వివరించాడు. ఊర్వశి అంటే ఉదయ కాలపు పొగమంచు, "విక్రముడు" మానవ రూపంలో చిత్రింపబడిన సూర్యుడు ఈ సూర్యుడే ప్రకాశించునపుడు మంచు విడిపోతుంది. ఈ నాటకంలో ఉన్న సౌందర్యమంతా రాజు గారికి పట్టిన పిచ్చిని కాళిదాసు విచిత్రంగా చిత్రించడంలో ఉంది.

#### ఇ) అభిజ్ఞాన శాకుంతలం:

కాళిదాసుని పైరూపకాల కన్నా "అభిజ్ఞాన శాకుంతలం" రమ్యమైన నాటకం. "కావ్యేషు నాటకం రమ్యమ్ తత్ర రమ్యం శకుంతలం" అనే నానుడి ఈ నాటక ప్రాశస్త్యాన్ని చెబుతుంది. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం సౌందర్యాన్ని పాశ్చాత్యులు కూడా కొనియాడారు.

ఈ నాటకం కథా వస్తువు ప్రసిద్ధమైనవి రాజు దుష్యంతుడు వేటకై వెళ్ళి విశ్రమించడానికి కణ్వాశ్రమానికి వెళతాడు.

అక్కడ మొక్కలకు నీరు పోస్తూ ఉన్న శకుంతలను చూసాడు. చూసి ఆమెను ప్రేమించాడు. ఆమె జన్మ వృత్తాంతాన్ని తెలుసుకుంటాడు. గాంధర్వంగా ఆమెను వివాహమాడాడు. కార్యాంతరం వల్ల రాజధానికి వెడుతూ ఒక ఉంగరాన్ని గుర్తుగాయిస్తాడు. దుష్యంతుని విరహం వల్ల భిన్నురాలైన శకుంతల దుర్వాసునికి ఆతిథ్యం ఇవ్వకపోవడం వల్ల దుర్వాసుని శాపగ్రస్తురాలైంది. కణ్వుడు సోమతీర్థం మంచి వచ్చి ఆమెను తగిన సమయంలో భర్త దగ్గరకు పంపుతాడు. రాజు దుర్వాసుడి శాపం వల్ల శకుంతలను చూసినను గుర్తించడు. తిరస్కరిస్తాడు. ఆమె అప్సరసల ప్రభావంతో మారీచుని ఆశ్రమంలో కుమారుని ప్రసవస్తుంది. వాష్యంతుడు తమ శకుంతలకు యిచ్చిన ఉంగరాన్ని చూచి ఆమెను ఎన్నోసార్లు తలచుకుంటూ విరహ వేదనతో బాధపడుతాడు. ఇంతలో దేవకార్యం కోసం ఇంద్రుడు పిలవగా దేవతలకు సహాయం చేసి అమరావతి నుంచి తిరిగి వస్తూ మారీచాశ్రమంలో యున్న సర్వదమనుని శకుంతలను చూసి వారిరువురిని పరిగ్రహిస్తాడు.

ఇంత చిన్నకథను తీసుకొని కాళిదాసు నాటక విన్యాసాలతో, కథా మలపులతో సుందరంగా నాలుగు శ్లోకాలు భారతీయ సంస్కృతిని తెలుపుతాయి. కూతురు అత్తవారింటికి వెళుతున్నప్పుడు కన్న తండ్రి దుఃఖ భారం ఎలా ఉంటుదో ఈ శ్లోకంలో వర్ణిస్తాడు కాళిదాసు.

1) **యాస్యత్యన్య శకుంత లేతి హృదయం సంస్పృష్ట ముత్కంతయా**
**కంఠ స్తంభిత బాష్పవృత్తి కలుషశ్చింతా జడం దర్శనమ్**
**నైక్లబ్యం మదు తావ దీదృశ మహోస్నేహో దరణ్యౌకసః**
**పీడ్యంతే గృహిణః కథలను తనయా విశ్లేష దుఃఖైర్నవై".**

శకుంతల అత్తవారింటికి వెడుతున్నపుడు కణ్వుడు అనుకొనే మాటయిది. నేడు శకుంతల వెడుతోందనే మాట హృదయాన్ని తాకుతోంది. డగ్గుత్తికతో హృదయం శోక పూరిత మవుతుంది. వియోగ దుఃఖంలో చింతతో చూపు కనుపించుట లేదు. అరణ్యంలో చిన్నప్పటి నుంచే ఉన్న నాకే శకుంతలను పెంచడం చేత ఇంత దుఃఖంగా యుంటేనిజంగా కనిపించిన కన్నతల్లిదండ్రులు కన్యను అత్తవారింటికి పంపుతూ ఎంత దుఃఖిస్తారో కదా!

2) **"పాతుంన ప్రథమం వ్యవస్యతి జలంయుష్మాస్వ పీతేషుయా**
**నాదత్తే ప్రియమండనాపి భవతుం స్నేహేన యాపల్లవమ్**
**ఆద్యేవః కుసుమ ప్రసూతి సమయేయస్యా భవత్యుత్సవః**
**సేయం యాతిశకుంతలా పతి గృహం సర్వైరనుజ్ఞాయతామ్।"**

వన దేవతలనుద్దేశించి కణ్వుడు ఇలా అంటున్నాడు.

ఓ వృక్షములారా! మీకు నీరు పోయకుండా జలాన్ని కూడా ముట్టేది కాదు శకుంతల. కురుల నలంకరించుట ఇష్టమయినప్పటికీ ఒక్క చిగురుటాకును కూడా కోయలేదు. మీ మొదటి పూవు పరిమళించిన వెంటనే ఆమె పండుగ చేసికొనెడిది. ఆ ఈ శకుంతల నేడు అత్తవారింటికి అందరూ అనుమతించెదరు గాక.

3) **"శుశ్రూషస్వ గురూన్, కురు ప్రియసఖీ వృత్తం సపత్నీజనే**
**భర్తుర్విప్రకృతాపి రోషణతయా మాస్మ ప్రతాపం గమః**
**భూ యిష్టం భవ దక్షిణా పరిజనే భాగ్యేష్వనుత్సేకినీ**
**యాన్త్యేవం గృహిణీ పదం యువతయేంవాదూః కుల స్వాధయః"**

అత్తవారింటికి వెళ్లే కూతురికి తండ్రి ఉపదేశించిన మాటలివి.

పెద్దవారిని సేవించుము. సవతులతో సఖ్యముగా నుండుము. భర్త కోపించిననూ తిరిగి మాటలాడకుము. పరిజనుల యందు మృదువుగా వ్యవహరించుము భాగ్యములు కలిగినపుడు గర్వించకు, ఇలా ప్రవర్తించిన స్త్రీ లే గృహిణి అనిపించుకుంటారు. అట్లు కాని వారు కులమునకు మనోవ్యథను కలిగించేవారు 'తలనొప్పి వంటివారు)

4. **"అస్మాన్ సాధా విచింత్యసంయమ ధనానుచ్చైః కులంచాత్మనః**

**త్వవ్యాస్యాః కథను ప్యబాంధవ కృతాంస్నేహప్రవృత్తించతామేః**

**సామాన్య ప్రతిపత్తి పూర్వకమియం దారేషు దృశ్యాత్వయు**

**భాగ్యాయత్తమతః పరం నఖలు తద్వాచ్యం వధూబంధాభిః"**

అభిజ్ఞాన శాకుంతలంలో ఇది కణ్వ సందేశం. దుష్యంతునికి పంపిన సందేశం.

సంయమధనులమైన బాగుగా విచారించి ఈ శకుంతలను సాధారణ గౌరవంతో ఆదరించుము. నీకుల మర్యాదలననుసరించి మర్యాదగా చూసుకో. మీ ఇరువురి మధ్య స్వయంగానే ప్రేమను సద్భావించి ఇతర భార్యల కంటే మిక్కిలి గౌరవముగా చూసుకో ఇక పై అంతయూ భాగ్యాధీనము. వధూ బంధువులు ఇకపై ఏమియూ చెప్పకూడదు.

ఈ నాలుగు శ్లోకాలు కణ్వుని చేత చెప్పిస్తాడు కాళిదాసు. ఇవి భారతీయ సంస్కృతి శాశ్వత విలువల్ని చిరస్థాయిగా నిరూపించే అమూల్యమయిన శ్లోకాలు ఇవన్నీ చతుర్థాంకంలోనే యున్నాయి. అందుకే

**"తత్రాపిచ చతుర్థోంకః, తత్రశ్లోక చతుష్టయమ్"** అంటారు.

ఇలా శాకుంతలంలో ఉత్తమ నాటక రచనకు ఆపేక్షితములయిన కథోప కథను చరిత్ర చిత్రణం, ప్రకృతి వర్ణనం రసపుష్టి బాగుగా కలిగి యుండటం చేతనే ఈ నాటకం అందరికీ ప్రశంసా పాత్రమయింది. జర్మన్ దేశీయ పండితుడు గౌడే మహాశయుడు రాసిన శాకుంతల ప్రశంసా వాక్యాలు మహా మహోపాధ్యాయ బలదదేవోపాధ్యాయుడు ఇలా సంస్కృతంలో అనువదించాడు.

**వాసంతం కుసుమం ఫలించయుగపద్గ్రీష్మస్య సర్వంచయత్**

**యచ్చన్యన్మన సో రసాయన మతః సంతర్పణం మోహనమ్**

**ఏకీ భూతమ భూత పూర్వమథవా స్వర్లోక భూలోకయో**

**రైశ్వర్యం యది వాంఛసిప్రియ (సఖే సుహృత్) శాకుంతలం సేవ్యతామ్**

మిత్రమా! వసంత ఋతువులో ఉన్న పూలు వాసన, గ్రీష్మంలో ఉండే పండ్ల రుచి మొదలైన మనస్సుకు రసభరితమయిన ఇంకా ఏదైన వస్తువుల ఆహ్లాదాన్ని మైమరుపుని కల్గిస్తుందో అవన్నీ ఒకేసారి స్వర్గలోక భూలోకముల యొక్క ఐశ్వర్యాన్ని కోరుకొన్నచో శాకుంతలాన్ని సమగ్రంగా చదువు.

నాటక రచనలో కాళిదాసు సాధించిన పరిణితికి ముందు నాటకాలు ప్రత్యక్ష సాక్ష్యాలు, మాళవికాగ్ని మిత్రం నాటకం కంటే విక్రమోర్వశీయంలోను. ఆ నాటకం కన్నా శాకుంతలంలోనూ కాళిదాసు రచనా ప్రతిభ అధికాధికంగా

ద్యోతకమవుతూ వచ్చింది. శాకుంతలం నాటకంలో ఈ ప్రతిభా ప్రభలు పరమోన్నత స్థాయినందుకున్నాయి. ఈ మూడు నాటకాలను, నిశితంగా అధ్యయనం చేసినపుడు కాళిదాసుని మనః పరిపాకం తాలూకు క్రమ పరిణామం స్పష్టంగా తెలియవస్తుంది. ఇతడు ప్రధానంగా శృంగార రచయిత.

## 1.5. అడగదగిన ప్రశ్నలు:

1) మహాకవి కాళిదాసు జీవిత విశేషాలను గురించి సమగ్రంగా వివరించండి?

2) మహాకవి కాళిదాసు జీవిత విశేషాలను వివరిస్తూ కాల నిర్ణయాన్ని గురించి చర్చించండి?

## 1.6. ఆధార గ్రంథాలు:

1) సంస్కృత సాహిత్య చరిత్ర – డా॥ ముదిగంటి గోపాల్‌రెడ్డి, డా॥ ముదిగంటి సుజాతారెడ్డి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 1997, హైదరాబాద్ – 500004.

**– డా॥ పిల్లి వాసు**

పాఠం - 2

# మహాకవి కాళిదాసు - రఘువంశం (ద్వితీయ సర్గ)

విషయ క్రమం:

2.1. కవి పరిచయం

2.2. కాళిదాసు కవితాశైలీ వైశిష్ట్యము

2.3. రఘువంశం - పూర్వ కథా సంగ్రహము

2.4. రఘువంశం - పాఠ్యభాగ వివరణం - కథా సారాంశం

2.5. (అ) దిలీపుని చిత్తవృత్తి పరీక్ష

(ఆ) సింహ దిలీపుల సంభాషణ

(ఇ) దిలీపుని యభీష్ట సిద్ధి

2.6. అడగదగిన ప్రశ్నలు

2.7. ఆధార గ్రంథాలు

## 2.0. కవి పరిచయం:

"వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే జగతః
పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ".

| | |
|---|---|
| వాగర్థావివ | = వాక్కు, అర్థమువలె, |
| సంపృక్తౌ | = కూడియున్న వారును, |
| జగతః | = ఈ జగత్తునకు, |
| పితరౌ | = తల్లిదండ్రులను అయిన, |
| పార్వతీ పరమేశ్వరౌ | = పార్వతీ పరమేశ్వరలను, |
| వాగర్థ | = వాక్కుల, అర్థముల, |
| ప్రతిపత్తయే | = సంప్రాప్తి కొఱకు, |
| వందే | = నమస్కరిస్తున్నాను. |

కాళిదాసు సంస్కృత సాహిత్యంలో వాల్మీకి, వ్యాసుడు, భాసుడు అను మహాకవుల తర్వాతి కాలానికి చెందిన మహాకవి, ఇతనిని కవికుల గురువని, కవికుల తిలకుడని, సాహిత్యకారులు ఆదరించెదరు. ఈయన (1) రఘు వంశమ్ (2) కుమార సంభవమ్ అను రెండు మహాకావ్యములను (1) ఋతు సంహారః (2) మేఘ సందేశమ్ అను లఘు కావ్యములను (1) మాలవికాగ్ని మిత్రమ్ (2) విక్రమోర్వశీయమ్ (3) అభిజ్ఞాన శాకున్తలమ్ అను మూడు రూపకములను రచించెను. సంస్కృత సాహిత్యంలో కాళిదాసు విషయంలో "ఉపమాకాళి దాసస్య" అను ప్రసిద్ధి కలదు. ఈయన కవిత్వము సరసము, సరళము, సుందరము.

మహాకవి కాళిదాసు పరిచయానికి ముందు సంస్కృత సాహిత్యం పోకడను ముందు తెలుసుకోవాలి. సంస్కృత కవుల కాలాలు స్పష్టంగా తెలియనందువల్ల సంస్కృత సాహిత్య చరిత్రను కాలక్రమాన్ని అనుసరించి కాకుండా, ప్రక్రియా వైవిధ్యాన్ని బట్టి అధ్యయనం చేయడం మంచిది. ఆదృష్టితో సంస్కృత సాహిత్యంలోని ప్రధాన ప్రక్రియలను ఇలా విభజించుకోవచ్చు.

(1) మహా కావ్యాలు (2) రూపకాలు, (3) లఘు (ఖండ) కావ్యాలు-సంకలనాలు (4) గద్య కావ్యాలు (5) చారిత్రిక కావ్యాలు, (6) చంపూ కావ్యాలు (7) కథా కావ్యాలు (8) నీతి కథలు (9) చిత్ర కావ్యాలు (10) అలంకార శాస్త్ర గ్రంథాలు (11) నిఘంటువులు.

మహాకావ్యం సర్గ బంధంతో కూడి ఒక మహా పురుషుని జీవిత చరిత్రను వివరిస్తూ అర్థ సౌష్ఠవం కలిగి మంత్రణల దౌత్యయుద్ధ నాయకాభ్యుదయాది వర్ణనలతో పంచ సంధి సమన్వితమై ఉండాలని భామహుడు నిర్ధేశించాడు. తరువాత దండి, అగ్ని పురాణ కర్త, హేమచంద్రుడు, రుద్రుడు, విశ్వనాథుడు, విద్యానాథుడు, జగన్నాథుడు మొదలయిన అలంకారికులు కూడా ఇంచుమించు ఇదేవిధముగా మహా కావ్యాన్ని నిర్వచించాడు.

కాళిదాసు రచించిన కృతులలో

రెండు మహాకావ్యాలు - (1) కుమారసంభవం, (2) రఘు వంశం

రెండు ఖండ కావ్యాలు - (1) మేఘ సందేశం (2) ఋతు సంహారం

మూడు నాటకాలు - (1) అభిజ్ఞా శాకుంతలం (2) మాళవికాగ్నిమిత్రం (3) విక్రమోర్వశీయమ్ ఉన్నాయి.

కుమార సంభవ కథ హిమాలయ వర్ణనతో ఆరంభమై పార్వతి జననం, శివపార్వతుల వివాహం, కుమార స్వామి జననం, కుమారస్వామి తారకాసురుని జయించడం మొదలయిన సన్నివేశాలతో మనోహరంగా కూర్చబడింది. కొంతమంది కుమార సంభవం (అష్టమ) 8 వ సర్గ వరకే కాళిదాసు రచన అంటారు.

దీనిలో హిమాలయ వర్ణన (1వ సర్గ), వసంత వర్ణన (3వ సర్గ), రతి విలాపం (4వ సర్గ), శివ పార్వతుల సంవాదం (5వ సర్గ) మొదలైన ఘట్టాలు విశేషంగా ప్రజాదరణ పొందాయి.

కాళిదాసు శివభక్తుడైనా విష్ణు ద్వేషి కాదుఅనడానికి ఆయన రఘువంశం ప్రమాణం. దానిలో ఆయన "రామాభిధాలోహరి రిత్యువాచ" (రాముడు విష్ణుమూర్తి అవతారమే-13-1) అని ప్రకటించాడు.

దిలీపుని మొదలుకొని అగ్నిపర్ణుని వరకు గల రఘువంశ రాజులందరి వృత్తాంతం. ఈ రఘువంశ కావ్యంలో వర్ణింపబడింది.

రఘువంశం 19 సర్గల మహాకావ్యం. ఇప్పుడు మల్లినాథ సూరి వ్యాఖ్యానంలో 19 సర్గలే మనకు లభిస్తున్నా అది అసలు 25. సర్గల మహాకావ్యం అనే అగ్నిపర్ణుని తరువాత మరి 27 మంది రఘువంశ రాజుల చరిత్ర వర్ణింపబడిన భాగం లుప్తమైందనీ కొందరు విమర్శకులు భావిస్తున్నారు. కాళిదాసును, "రఘుకారుడు" అని కూడా వ్యవహరించడం కద్దు "క" ఇహ "రఘుకారేణ రమతా" (రఘుకారుని రచనయందు ఎవడు ఆనందంతో విహరింపడు) అని ప్రసిద్ధ మహా కావ్య లక్షణాలు అన్నియును రఘువంశంలో కనిపిస్తాయి.

**కాళిదాసు కవితా శైలీ వైశిష్ట్యము:**

కాళిదాసు శృంగార రసాన్ని పోషించడంలో సర్వసమృద్దాడు. శృంగారంలోను కాళిదాసు విప్రలంభ పరిపోషణం

అనన్యా సాధారణం అను విమర్శకుల అభిప్రాయం ప్రకారం కావ్య కళాపక్షాలైన శబ్దార్ధ గుంఫనం, అలంకారం విన్యాసాలు కంటే చమత్కారాన్ని కల్గించే రసపరిపాకం చొప్పించగల కవియే మహాకవి అవుతాడు. మహాకావ్యంలో కావల్సిన రస పరిపుష్టి కాళిదాసు కావ్యాలలో లభిస్తాయి. కాళిదాసు వస్తు వర్ణనలోనే ఎంతో చమత్కార పూర్ణమయిన హృదయ పక్షాన్ని ప్రకటించగలడు.

మానవ జీవనం యొక్క సర్వాంగ సంపూర్ణమయిన చిత్రం కాళిదాసు రఘువంశంలో చిత్రస్తాడు. ప్రేమాతి శయాన్ని ప్రకృష్టంగా నిరూపించాడనికే కుమార సంభవం వ్రాసాడు.

రఘువంశంలో ద్వితీయ సర్గలో ఆశ్రితులను పరిపాలించడానికి దిలీపుడు తన శరీరాన్ని అర్పించే సంఘటనతో కవి గొప్ప ఆదర్శాన్ని చూపించాడు. రఘువు విజయాత్ర వర్ణనంలో ఆయా దేశాల చిత్రణం మరో వినోదాన్ని కల్గిస్తుంది. ఇందుమతీ స్వయంవర వర్ణనంలో మనోభావ జ్ఞానము యొక్క ప్రకృష్టమైన పరిచయం చేసాడు దశరథునికి సంతానం లేకపోవుట, ముని వృత్తాంతాలతో సంతాన హీనత యొక్క క్లేశాన్ని చూపించాడు. సీతాపరిత్యాగం సందర్భంలో రాముని మాటల్లో కర్తవ్యం ప్రేమలలో ఈ రెండింటిలో కర్తవ్యమే ప్రధానమని నైతిక గొప్పదనాన్ని చూపించాడు. చివరికి అగ్నిపర్ణుని ఘట్టంలో అలికాంతాసక్తి అనిష్టమని చూపించాడు.

రఘువంశంలో అద్వితీయోపమాన విన్యాసం కాళిదాసుకి మంచి కీర్తిని తెచ్చిపెట్టింది. ఇందుమతి స్వయంవర మంటపంలో ఆయా రాజులు దగ్గరకు సమీపించినపుడు ఆమె నడుస్తున్న దీపశిఖలా రాజ మార్గంలో ఉన్న ప్రతిభవన్ని ఎలా ప్రకాశింప చేస్తుందో అలా ప్రకాశింప చేసిందని వర్ణిస్తాడు. అందుకే ఆయనకు దీపశిఖా అని పేరు వచ్చింది.

సంచారిణీ దీప శిఖేవ రాత్రేయంయం వ్యతీయాయ పతింపరా సా నరేంద్ర మార్గాట్ట ఇవ ప్రపేదే వివర్ణ భావం ససభూమిపాలః

ఇలాగే **"అయోఘ నేనాయ ఇవాతితప్తం**

**వైదేహి, బంధోర్హృదయం విద్రదే"**

ఇటువంటి ఉపమానాలు కాళిదాసు ఉపమా విన్యాసాలకి ఉదాహరణాలు, అందుకే కాళిదాసుకి "ఉపమా కాళిదాసస్య" అనే సూక్తి సార్ధకమయింది.

**శబ్ద విన్యాసంలో కూడా కాళిదాసు గొప్పవాడు.**

**ఇత్థం ద్విజేన ద్విజ రాజ కాంతి రావేదితో వేదవిదాం వరేణ్యః**

**ఏనో నిపృత్తేంద్రియ వృత్తి రేనం జగాద భూయో జగదేక నాథః**

**ఇటువంటి పదాల కూర్పు వేరే కవి దగ్గర కనిపించదు.**

కుమార సంభవం ప్రథమసర్గంలో హిమాలయ వర్ణనంలో వాస్తవిక వస్తు విన్యాస సహకృతమయిన కావ్యకళాదెందాన్ని రంజింప చేస్తుంది. తృతీయ సర్గలో శృంగారో ద్వేజకమయిన సామగ్రి సంకలనంలో ముందు వసంత శోభను తరువాత కానన రామణీయకాన్ని అటుపిమ్మట వసంత పుష్పాలను అలంకరించుకున్న పాలిండ్ల భారంతో కొంచెం వంగిన, బాల సూర్యుని రంగు గల వస్త్రాన్ని ధరించి వస్తున్న పర్వత రాజు పుత్రిని చూపించాడు. ఈమెను చూసిన శంకరుడు ఎలా ఉన్నాడని వర్ణించే ఈ శ్లోకం శృంగార రసానికి ఎంతో పరిపోషకం.

**హరస్తు కించిత్పరి లుప్త ధైర్యః చంద్రో దయారంభ ఇవాంబురాశౌ**

**ఉమాదుఖే బింబ ఫలాధరోష్ఠే వ్యాపారయాయాస విరోచనాని**

**చంద్రోదయారంభంలో సముద్రుడు వలే చలిస్తూ శంకరుడు ధైర్యాన్ని**

**కోల్పోయినవాడై దొండపండు వంటి పెదవులు గల ఉమాముఖముందు చూపులను మరల్చినాడు.**

ఇలాగే శాకుంతలంలో సౌదర్యభావన రససిద్ధికి పరాకాష్ఠగా వర్ణించాడు.

**"అధరః కిసలయరాగః కోమల విటపానుకారిణౌ బాహూ**

**కుసుమ మివలోభనీయం యౌవన మంగేషు సన్నద్ధమ్"**

పెదవులు చిగురుటాకులలా ఎర్రగా ఉన్నాయి. కోమల రెమ్మలతో సమానంగా ఉన్నాయి. బాహువులు పువ్వులా ఆకర్షించదగిన యౌవనం ప్రతి అవయవంలోనూ ప్రవేశించింది అనే భావం గల ఈ శ్లోకం బాహ్య ప్రకృతిలో అంతరిక ప్రకృతి యొక్క సామంజస్యాన్ని తెలియజేస్తుంది. అందుకే రససిద్ధ కవులలో కాళిదాసు అగ్రగణ్యుడు.

శకుంతల ప్రయాణ సమయంలో కణ్వుని పరితాపం సకల జన సంవేద్యం. సఖురాండ్రయిన అనసూయ ప్రియంవదల కంటే నీరు అందరికీ తెలిసిందే. ఈ భావ స్ఫూర్తి చేతనాల్లోనే కాదు అచేతనాల్లో వర్ణించగల కాళిదాసు నేర్పుని ఇక్కడ చుద్దాం.

**ఉద్గీర్ణ దర్భ కబళా మృగీ పరిత్యక్తవర్తనా మయూరీ!**

**ఉపసృత పాండు పత్రా ముంచలత్యశ్రుణీవలతా!**

శకుంతల అత్తవారింటికి బయలుదేరినపుడు ఆశ్రమంలో ఉన్నలేడి సగం కొరికిన దర్భలను నెమరి వేయకుండా అలాగాచూస్తోంది ఆధర్భలు నోటి నుండి జారుతున్నాయి. నృత్యం చేస్తున్న నెమలి నృత్యాన్ని మనేసింది. లతలన్నీ కన్నీరు కార్చుచున్నట్టుగా ఎండుటాకులను రాలుస్తున్నాయి.

కాళిదాసు నాటకీయ పాత్రలు సజీవాలు, ఉపమలు శోభాదాయకాలు. భావాలు హృదయానురాజుకాలు.

మేఘ సందేశంలో కాళిదాసు కవితా శైలి అద్వితీయం. అందుకే వ్యాఖ్యాత్న సార్వభౌముదు వల్లినాథుడు "మాఘే మేఘే గతం వయః అంటాడు. మేఘ సందేశ కవితా వైశిష్ట్యం ఏమిటంటే ఇచ్చుట ప్రకృతి వర్ణనంలో కూడా యక్షుని విరహావస్థ కనిపిస్తూ ఉంటుంది.

**వేణీభూత ప్రతను సలిలా సావతీతస్య సింధుః**

**పాండుచ్ఛాయా తటరుహ తరుభ్రంసి భిర్జీర్ణ పేర్ణః!**

**సౌభాగ్యం తే సుభగ విరహా వస్థయా వ్యంజయన్తీ**

**కార్శ్యం యేన త్యజతి విధినా సత్వయ్యేలోప పాదః॥**

ఇచ్చుట సింధు నది ప్రవాహం విరహిణి జపలా కృశించింది. తీరాల్లో ఉన్న చెట్ల ఎండుటాకులు పడుతుండటం చేత పాలిపోయింది. ఆ నది అలా ఉండటానికి కారణం నీ విరహమే. నీవు భాగ్యవశత్తు వెళ్లావు కాబట్టి ఆ నది కార్శ్యాన్ని (చిక్కిపోవడాన్ని) విడిచి పెడుతుంది.

**"తన్వీశ్యామా, శిఖరిదశనా పక్వబింబాధ రోష్ఠీ"**

అని ఆ యక్షుని ప్రియురాలిని వర్ణిస్తూ కాళిదాసు యౌవన మధ్యస్థురాలైన ఆమె కోమలాంగి అనీ, మల్లిపూవులు వంటి పలు వరుసకలదనీ, బాగుగా ఎండిన దొండపండు వంటి పెదవులు కలదనీ చెప్పి చివరకు ఆమె స్త్రీ జాతికి బ్రహ్మగారి మొదటి సృష్టి అని ముగిస్తాడు.

ఋతు సంహార కావ్యాశైలి కూడా సరసమైనది.

**గృహీత తాంబూల విలేపన స్రజః పుష్పాసవా మోదిత వక్త్రపంకజాః॥**

**ప్రకామ కాలాగురు ధూపవాసితం విశంతి శయ్యు గృహముత్సుకాఃస్త్రీయః॥**

ఉత్కంఠగల స్త్రీలు తాంబూలం, మైపూతలు, పూదండలు పుచ్చుకొని, పుష్పాస వాదులను సేవించుట చేత సుగంధితమైన ముఖ పద్మములు కల వారగుచూ, చక్కటి అగరు ధూపములచే ఘుమఘుమలాడు శయన గృహాలను ప్రవేశించుచున్నారు.

ఎంత గంభీరమైన భావాలను సరళంగా వర్ణించ గల కాళిదాసు కవిత వైదర్భీరతి సమన్వితమైనది.

**గాహంతాం మహిషానిపాన సలిలంశృంగైర్ము హుస్తాడితం**

**ఛాయాబద్ధ కదంబకం మృగకులంలోమంథ మభ్యాస్యతు!**

**విస్రజం క్రియతాం వరహా తతిఖర్ముస్తాక్షతి పల్వలే**

**విశ్రాంతిం లభతామిదం చశిథిల జ్యాబంధ మస్మద్ధనుః॥**

## రఘువంశం - పూర్వకథా సంగ్రహము:

దిలీపుడు దైవస్వత మనువంశమున పుట్టిన గొప్పరాజు. సకల సద్గుణముల కతడాట పట్టు. మగధ వంశమున పుట్టిన సుదక్షిణ యతని పట్టహిషిమ మిగుల దాక్షిణ్యవతి, గుణములచే పతికి సాటియైనది. ఆ దంపతులకు చిరకాలము సంతానము లేకుండుట తీరని లోటాయెను. సంతానము గోరి వారు తమ కుల గురువగు వసిష్ఠుని యాశ్రమమున కేగిరి. వసిష్టునకు తమకు కలిగిన లోటు విన్నవించి పుత్రప్రాప్తి కుపాయ మడిగిరి.

ముని యోగ దృష్టితో రాజునకు బిడ్డలు కలుగకుండుటకు "స్వర్గము నుండి భువికి దిగు సమయమున మార్గమధ్యమున కల్పవృక్షపు నీడలో విశ్రమించియున్న కామధేనువునకు రాజు ఎమరికచే ప్రదక్షిణము చేయకుండుట దానిచే కామధేనువు - 'నా సంతానమును సేవించు వఱకు నీకు సంతతి కలుగదని శపించుట" కారణమని తెలిసికొని రాజు కావిషయమెతింగించి కామధేను సుతయగు నందినిని శ్రద్ధాభక్తులతో సేవింపుమనియు, అది సంతుష్టయగుచో కోరికలనెల్ల యొసంగుననియు దిలీపునకానతిచ్చెను. దిలీపుడట్లేయని శిరసావహించెను.

రాజయినను గోసేవావ్రతధారి యను దృష్టిలో మహర్షి దిలీపునికై ఆశ్రమవాసులకు తగిన సౌకర్యములనే కలిగించెను. రాజటనొక పర్ణశాలలో నియమవతియగు భార్య మాత్రమే తోడుగా, నారాత్రి గడిపి ప్రాతఃకాలమున వసిష్ఠశిష్యుల వేదాధ్యయనము విని దర్భలతో అల్లబడిన పాన్పునుండి నిదుర లేచెను.

## 2.4. రఘువంశం - పాఠ్యభాగ వివరణం - కథా సారాంశం:

రెండు మహాకావ్యాలను కాళిదాసు రచించాడు. అవి రఘువంశం, కుమార సంభవం అని చెప్పుకొన్నాం. అందులో

రఘువంశం గురించి కొంచెం తెలుసుకుందాం. కాళిదాసు నాటకాల్లో శాకుంతలం రత్నమయినట్లే, కావ్యాలలో రఘువంశం రత్నమని పండితుల అభిప్రాయం. ఈ కావ్యంలోని కథా వస్తువును రామాయణం నుండీ, విష్ణు పురాణ, పద్మపురాణాల నుండి గ్రహించాడు కాళిదాసు. రసోచితమైన మార్పుల్ని చేసి, ఉత్తమ కావ్యంగా రూపొందించాడు.

సూర్యవంశ ప్రభువులు చిరకాలంగా అయోధ్యను పరిపాలించారు. వారిలో దిలీప, రఘు, అజ, దశరథ మహారాజులు చాలా ముఖ్యమైన వారు. వీరి తరువాత పరిపాలించినవాడు శ్రీరామచంద్రుడు. ఈయన శ్రీహరి ఐరావతారం, ఆ తరువాత ఇరవై నాలుగు మంది రాజులు పరిపాలించారు. ఈ పరంపరలో చివరివాడు అగ్నివర్ణుడు. అతను మరణించిన తరువాత, అగ్నివర్ణుని అర్ధాంగికి పట్టాభిషేకం జరుగుతుంది. అప్పుడామె గర్భవతి. ఈ పట్టాభిషేకోత్సవంతో రఘువంశ కావ్యం ముగుస్తుంది.

రఘువంశంలోని మొత్తం సర్గలు పందొమ్మిది, వీటిల్లో దిలీప మహారాజు-నందినీధేనువుకు బదులుగా, తన శరీరాన్ని సింహానికి అర్పించడం, రఘు మహారాజు జైత్రయాత్ర, ఇందుమతి స్వయంవరం, అజ విలాపం, సీతాపరిత్యాగం మొదలైన ఘట్టాలు అడవిదున్నలు మాటిమాటికి కొమ్ములతో కుమ్మిన చెరువులలో మునుగు గాక, చెట్ల నీడను మృగ సముదాయం సామూహికంగా కూర్చుని నెమరువేసుకొనుగాక, వరాహ సమూహాలు బురదలలో ఉన్న తుంగ ముస్తులను (తుంగ గడ్డి విత్తులను) ఇష్టానుసారంగా పాడుచేయుగాక ఈ వారిని సడలించిన మాధనుస్సు కూడా విశ్రాంతిని పొందుగాక.

ఇక్కడ నాలుగు వాక్యాల సమన్వయం చాలా తేలికగా తెలుస్తూ ఉంటుంది. రామయణం వాల్మీకి ఎంత మృదుమధురంగా తేటతెల్లంగా వ్రాసాడో వ్యాసుని కవిత ఎంత తేలికగా (కొన్ని కొన్ని చోట్ల) ఉంటుందో అలాగే కాళిదాసు కవితాశైలి కూడా ఉంటుంది. సమగ్ర గుణ గుంఫితమైన వైదర్భీ కవిత ఈ కావ్యాల్లో ప్రస్ఫుటంగా కనబడుతుంది కనుకనే అభిజ్ఞులంటారు.

**"వాల్మీకీ రజని ప్రకాశితతమా వ్యాసేన లీలావతీ**
**వైదర్భీ కవితా స్వయం వృతవతీ శ్రీకాళిదాసం వరమ్॥"**

అని వాల్మీకి నుంచి బయలుదేరిన వైదర్భీ కవిత వ్యాసుని దగ్గర విలాసాలను నేర్చుకొని కాళిదాసు అనే వరుని స్వయంగా వరించినదట.

కుమార సంభవం పంచమ సర్గలో పార్వతీదేవి తపస్సు తపో విధానము, శంకరుడు బ్రహ్మచారి వేషంలో వచ్చి పార్వతిని పరీక్షించడం, పరీక్షలో పార్వతి నిశ్చయం తెలుసుకోవడం, పరమేశ్వరుడు ప్రత్యక్షం అవడం. గౌరీ శివ సమాగమం ప్రధానాంశాలు. ఈ సర్గలో 86 శ్లోకాలున్నాయి. మొదటి శ్లోకం నుంచి 84వ శ్లోకం వరకూ వంశస్థ వృత్తంలో వ్రాయబడ్డాయి. 85, 86, ఈ రెండు శ్లోకాల్లో ఛందస్సు వసంత తిలక రసరమ్యంగా ఉన్నాయి. ఈ కావ్యాన్ని మూడు విభాగాలుగా చేయవచ్చు. మొదటి తొమ్మిది సర్గలలో శ్రీరాముని కన్నా పూర్వులైన వారి చరిత్ర ఉంది. 10వ సర్గ నుండి 15వ సర్గ వరకూ శ్రీరామాయణ కథ ఉంది. మిగిలిన నాలుగు సర్గలలోనూ, శ్రీరాముని అనంతరం రాజ్యాన్ని పాలించిన పాలకుల చరిత్ర వర్ణితమయి ఉంది. రఘు వంశ కావ్యాలలో, కావ్య నాయకుడెవరన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం చెప్పడం కష్టమే గానీ, శ్రీరాముడనే ప్రత్యుత్తరంలో కొంతవరకు సమాధానపడవచ్చు.

శ్రీరాముని వంటి పవిత్ర చరిత్రుడూ, వీరనాయకుడూ జన్మించడానికి రఘు మహారాజు వంటి సచ్చరితులతో పవిత్రమైన రఘువంశమే తగినది కావడం వలన, రఘు చక్రవర్తికి ప్రాశస్త్యం లభించి కావ్యానికి రఘువంశం అన్న పేరు స్థిరపడిపోయింది.

ఈ కావ్యంలోని కథలలో ఐక్యం లేదనీ, రామకథలో రామాయణంలోని రచనా సౌందర్యం కానరాదనీ, కొందరు విమర్శకుల అభిప్రాయం.

"ధర్మనిష్ఠా" అను ప్రస్తుత పాఠ్యభాగము రఘువంశ మహాకావ్యమునందు రెండవ సర్గనుండి గ్రహింపబడినది. ఈ పాఠము నందు సూర్యవంశ రాజులలో ఒక్కడైన దిలీప మహారాజు వసిష్ట మహర్షి యొక్క హోమధేనువు అయిన నందినీ ధేనువును రక్షించిన విధమును మహాకవి చక్కగా వర్ణించెను. కుల గురువు అయిన వసిష్ఠుని యొక్క ఆదేశమును పాలించుట, కర్తవ్య నిష్ఠ, సకల ప్రాణులపై దయాభావము మొదలగు దిలీపుని గుణములు సంభాషణ శైలితో బాగుగా వర్ణించబడినవి.

నందినీ ధేనువు సేవలో వారికి ఇరువది ఒక్క దినములు గడచి పోయినవి. ఆ తర్వాతి కథాంశమే ప్రస్తుత పాఠ్యభాగము, నందినీ ధేనువు సేవకై వశిష్ట మహర్షి ఆశ్రమానికి వచ్చిన రాజదంపతులు ధేనువును సేవించుట.

**2.5. రఘువంశం-ప్రాతః**

**ద్వితీయ స్వర్గ కథ:**

ప్రాతఃకాలముననే దిలీపుడు నిదుర మేల్కొనెను. సుదక్షిణయు గోవును చక్కగా గంధ మాల్యములచే పూజించెను. దూడకు పాలు కుడిపి కట్టివేయగా నా గోవును దిలీపుడారణ్యమున కేగుటకై విడచెను.

పవిత్రశీలయగు సుదక్షిణ, యాగోవు పాదస్పర్శచే పవిత్రమైన మార్గమును ధర్మశాస్త్రము వేద వాక్యమును వోలే వివరించెను. దిలీపుడు దయామయుడగుటచే సుదక్షిణను వెనుకకు పంపి తా నా గోవును కాపాడుచు ముందుకు సాగెను.

నియమవంతుడు కాన తానే స్వయముగ గోసేవయొనర్చు తలంపుతో తక్కిన సేవకులను గూడ రావలదని వారించెను మనువంశ్యులు తమ పరాక్రమము చేత రక్షింపబడువారు కాని యితరులపై నాధారపడరు కదా! కాన సేవకుల వల్ల తన రక్షణము నాతడు కోరడాయెను రుచి కల తృణగ్రాసములచే, శరీరమును గోకుటలచే ,ఈగలు తోలుటచే, స్వేచ్ఛగా తిరుగాడ జేయుటలచే నారాజు గోసేవానిమగ్నుడాయెను.

రాజలాంఛనములగు ఛత్రచామరాదు లగపడకున్నను. తేజోవిశేషముచే నాతడు రాజ్యలక్ష్మిని ధరించియున్నటులే యుండెను. తీగలతో కౌశములను పైకి కట్టి ధనువు నెక్కుపట్టియున్న నాతడు హోమధేనువు రక్షణమను నెపముతో నడవియందలి క్రూరమృగముల నదుపులో నుంచుచున్నటులుండెను.

ప్రక్కల పరిజనులు లేకున్నను ఆరాజ శ్రేష్ఠునకు పార్శ్వము లందున్న వృక్షములు పక్షుల కలకలారావములనే ఆలోక శబ్దము పలుకుచున్నదో యన్నట్లుండెను, వాయు మిత్రుడగు అగ్ని హోత్రునివలె తేజరిల్లుచు సమీపముననే తిరుగుచున్న నా దిలీపునిపై పౌరకన్య లాచారలాజలను చల్లినట్లు బాలలతలు పూలను చల్లినవి.

ఆయన మిగుల వయామయుడని యెఱిగిన మూడేళ్ళు ఆయన సుందర దేహమునే తిలకించుచు తమకు వెడల్పయిన కన్నాలు కలిగినందులకు తగిన ఫల మనుభవించినవి. వెదురు గొట్టములలో వాయువు ప్రవేశించి వేణు వాద్యమగు చుండగా వనదేవతలు పొదరిండ్లలో నిలచి తన యశస్సునే గానము చేయుచుండ దిలీపు డాకర్ణించెను.

చెట్టు యొక్క కదలుచున్న పూల వాసనలు నింపుకొనిన వాయువు ఎండలేక వాడియున్న నాదిలీపుని, సెలయేళ్ళు నీటి తుంపరలతో కలసి సేవించుచు సేద దీర్చెను. ఆయన ఆయరణ్యమున ప్రవేశించినతోడనే వానలేకయే కార్చిర్చు చల్లారెను. ఫలపుష్పముల సమృద్ధి కలిగెను. పెద్ద జంతువు చిన్న జంతువును వేదించుట మానెను.

తన సంచారములనే దిగంతములను పవిత్ర మొనరించి సాయంసమయమునకు పల్లపరాగతామ్రయగు నందినియు, సూర్యకాంతియు తమ నెలవుల కొనసాగినవి. దేవతలు, పితరుల, అభ్యాగతుల యజ్ఞాది కార్యముకుపయోగించు నందిని ననుసరించి యాదిలీపుడను బయలు దేరెను.

సజ్జన సమ్మతుడగు నాతనితో గూడిన నందిని అనుష్ఠానముతో కూడిన శ్రద్ధలోని మిగుల బ్రకాశించేను. మార్గమున దిలీపుడు చిన్న నీటి మడుగుల నుండి పైకి వచ్చిన పందుల గుంపులను, తమనెలవుల కేగుచున్న నెమళ్ళను, లేళ్ళతో కూడిన పచ్చిక బీళ్ళను చీకటి దట్టమగు చుండుటచే క్రమముగా నల్లబడుచున్న వనభూములను చూచుచు నేగెను. పొదుగు బరువుచే నందిని, శరీరగురుత్వము వలన రాజును తమ సుందర మందగమనములచే తపోవనమునకు వచ్చు మార్గము నలంకరించిరి.

అంతువఅకు భర్త రాకకై యెదురు చూచిన సుదక్షిణ నందిని ననుసరించుచు నడవినుండి మరలి వచ్చిన దిలీపుని యుడవసించినటులున్న నేత్రములతో చూచెను. తానే దిలీపుడనుసరించిన ధేనువున కెమరేగెను. అపుడు వారిరువురి నడుమనున్న నందిని పగలు – రాత్రుల నడుమనున్న సంధ్యవోలె ప్రకాశించెను . అక్షత పాత్ర చేత నిడికొని యా సుదక్షిన బహుక్షీరములు గల నందినీ ధేనువునకు ప్రదక్షిణ మొనర్చి యంజిలి ఘటించి తన సంతానప్రాప్తి రూపమగు అభీష్ట సిద్ధికి ద్వారాము వలెనున్న నాగోవు కొమ్ముల నడిమి ప్రదేశమును పూజించెను.

దూడను చూడవలెనని ఉత్కంఠ కలిగియు తమ సేవను నిశ్చలముగా నిల్చి గ్రహించినదని యా దంపతులు మిగుల నానందించిరి, భక్తులయెడ నాధేనువు వంటి వారల ప్రసన్నతాచిహ్నములు చేరువలోనున్న ఫలమును సూచించును కదా!

తన భుజబలముచే శత్రు వినాశ మొనర్చిన దిలీపుడు పత్నీద్వితీయుడై వసిష్ఠ మహర్షి పాదములపై ప్రణమిల్లి పాలు పిదికిన పిమ్మట యాధేనువునే తిరిగి సేవింపసాగెను. ఆ గోరక్షణలో నప్రమత్తుడగు దిలీపుడు భార్యతో గూడి. ఆధేనువు సమీపమున నాహారము, దీపముల నుంచి ఆవు దగ్గరలో పరుండి అది నిదురింపగా తాను నిదురించెను అని మేల్కొనిన తోడనే తానును మేల్కాంచెను.

ఇట్లు కీర్తిశాలి దీనజనరక్షకుడు నగు నాదిలీపుడు సంతానముఁగోరి పట్టమహిషితో గేసేవావ్రతము ననుష్టించుచుండగా దిరువది యొక్క దినములు గడచెను.

**2.5. (అ) దిలీపుని చిత్తవృత్తి పరీక్ష:**

ఇరువది రెండవనాడు నందిని తన యనుచరుడగు రాజు మరోవృత్తిని తెలియ గోరినదై  గంగా ప్రవాహము పదు ప్రాంతమునకు సమీపమున దట్టముగా పచ్చిక పెరిగిన హిమవత్పర్వత గుహలో ప్రవేశించెను.

క్రూరమృగము లెవ్వియు నా ధేనువును వెనకరాలే వను భావముతో నాహిమాద్రి సౌందర్యము నవలోకించుచున్న దిలీపుడు అకస్మాత్తుగా ఆధేనువుపై దుమికి లాగుచున్న సింహమును గమనింపలేదు.

ఆధేనువు దీనముగ నాక్రమింపగా గుహలోని ప్రతిశబ్దముచే మిగుల పెద్దదై యాధ్వని దిలీపుని దృష్టిని ప్రకృతి సౌందర్య దర్శనము నుండి మరల్చినది. వెనువెంటనే వింటిని చేత దాల్చిన దిలీపునకు ధాతుమయమగుటచే నెఱ్ఱనైన కొండచరియపై పూచిన లోద్దుగ చెట్టువలె ఎఱ్ఱని గోవుపై నున్నయా సింహమగపడెను తోడనే సింహగామియు ఆర్తజన రక్షా పరాయణుడను, శత్రు కంట కోమ్మలన మొనరించిన వాడు నగు నాదిలీప మహారాజు ఆదృశ్యము తన కవమానకరముగ భావించి, సింహము జంపుట కమ్ముల పొది నుండి బాణమును పైకి తీయబోయెను.

అతడా విధముగ నమ్ముల పొదిలోని బాణపు విడిపై పెట్టిన కుడిచేయి దానికే యంటి పెట్టుకొని చిత్రములో గీయబడినది వోలె నిశ్చేష్టమై నిలిచెను.

చెయి కదల కుండుటచే దిలీపుని కోపము మిన్నంటియు మంత్రములు, ఔషధులచే నరికట్టబడిన శక్తిగల సర్పమువోలె తన ముందున్న దోషిని శిక్షింపలేని తన తేజస్సులచే తనలోనే దహింపబడెను గోవును పట్టిన యా సింహము సాధుపక్షపాతి, మనువంశమునకు టెక్కెము వంటివాడు, సింహబలుడు, తన యాయవస్థ కాశ్చర్యపడుచున్న వాడగు దిలీపుని మానవ భాషతో మిగుల నాశ్చర్య పరచుచు నిటుల పలికెను.

ఓరాజా! నీవు శ్రమ పడకుము, నీయస్త్రము వేసి నను నాపై పనిచేయదు. పెనుగాలి చెట్లను పెకలింప వచ్చును కాని కొండను కదలించునా! నాపేరు కుంభోదరుడు నేను శివకింకరుఁడను నికుంభతుల్యుడను. మాస్వామి శంకరుఁడు తాను వృషభము నధిరోహించుటకు తన పాదము నాపై మోపుటచే నా వృష్ఠము పవిత్రమైనది.

అదే ఎదుటనున్న దేవదారు వృక్షము జూడుము. దానిని శివుడు తన బిడ్డను జేసికొనినాడు. పార్వతి స్వయముగ బంగారు కడవలను స్తనములనుండి వచ్చిన పయస్సులతో దానిని బెంచినది ఒకనాడు. చెక్కిలి దురదగల యొక యడవి యేనుగు యీ చెట్టుకు రాచుకొనగా దాని చర్మము రేగగొట్టబడెను. దానిని చూచి యా తల్లి రాక్షసుల బాణములచే రాయపడిన కుమారస్వామిని గూర్చి వగచినట్లు మిగుల దుఃఖించెను.

నాటినుండి శంకరునిచే నీయడవియేనుగులను భయపెట్టు కొఱకు సింహముగా చేయబడి సమీపమున కేతించిన జంతువులాహారముగా పొందునట్లు నియమింపబడితిని శివానుగ్రహముచే యనువైన యీ సమయమున నీవిధమగు భోజనము నాకు కల్పించబడినది. రాహువునకు చంద్ర సంబంధమగు నమృతము వోనె ఆకలిగొన్న నాకీయావు తృప్తి కలిగించును.

నీవింక సిగ్గు విడిపోవచ్చును. నీగురువుడై నీవు చూపిన భక్తి తక్కువ కాదు, రక్షింపదగియు ఆయుధముచే రక్షింప వీలుకాని వస్తువు ఆయుధధారికీర్తిని పోగొట్టదు అని సింహమిటుల పలుకగా విని తానట్లు నిర్వీర్యుడగుటకు పరమేశ్వర శక్తి కారణమని తెలిసి తనకు కలిగిన యవ మానమును వీడెను.

తొలిసారిగా బాణప్రయోగమున విఫలుడయినందున చేష్ఠలుడిగి వజ్రాయుధమును వీపునుంకించుచు శివ వీక్షణముచే కొయ్యబారిన ఇంద్రునివలె నున్న దిలీపుడా సింహమునకిట్లు పలికెను.

**2.5. (ఆ) సింహ-దిలీపుల సంభాషణ:**

ఓ సింహమా ఈవిధముగా నాశక్తి నిరోధింపబడగానే నేని పలికినను పరిహాసాస్పదమే యగును అయినను నీవు సకలజీవుల మనోభిప్రాయములు నెఱిగినవాడ వగుటచే చెప్ప సాహసించుచున్నాను. నీవు నన్ను భక్షించి నీ శరీర పోషణ మొనరించుకొనుము. సాయంకాలమున తల్లికై ఎదురు చూచు లేగ కలయీముని యావును మాత్రము విడిచిపుచ్చుము.

అని యనుగా నాశివానుచరుడు తన దంతకాంతులతో కొండగుహల చీకట్లను పంటాపంచలు చేయుచు కొంచెము చిరునవ్వు నవ్వి యారాజున కిట్లనెను ఓరాజా! ఏకచ్ఛత్రమగు లోకాధి పత్యము నడివయస్సు, సుందరశరీరము ఇన్నింటి నొక స్వల్పమునకై విడువ గోరు నీవు ఆలోచనలేని మూర్ఖుడవు వోలె నాకు కన్పట్టుచున్నావు. నీకు ప్రాణలపై దయగలుగుచో నీయనంతర మీయావు మాత్రమే క్షేమముగా నిలుచును.

అట్లుగాక నీవు జీవించునో ననేకములగు నా పత్రముల నుండి ప్రజలను నీవు తండ్రివోలె రక్షించుదువు ఒకవేళ ఒకే

యావ గల నీ గురువు కోపించునని భయపడు చుంటివేమో, కుండపొదుగల 50 కోట్ల కొలది యవులనిచ్చియాతని కోపము చలార్చవచ్చును కాన శుభపరంపరల నను భవింప యోగ్యమగు నీ శరీరమును రక్షించు కొమ్ము రాచరికమనగా భూమిని తాకుట మాత్రమే భేదముగా కల ఇంద్రాధిపత్యమని యందురు కదా! అని పలికి సింహము విరమింపగా గుహనుండి వచ్చిన ప్రతిధ్వనిచే యా పర్వతము గూడ రాజుపై ప్రీతితో సింహము పలికిన పలుకలే పలికినటులుండెను.

శివాను చరుని వాక్కులను విని యారాజు సింహమాక్రమించుటచే భీతిల్లి ఆవు బెదురు చూపులు చూచుచుండగా నాతనితో నిట్లనెను. క్షత్రియుడన నాశమునుండి రక్షించువాడని కదా ప్రసిద్ధము.

ఆపని చేయలేని వానికి రాజ్యముతో కాని నిందా మలినములగు ప్రాణములతో గానిపనియేమి? పాడియావుల నిన్ని యిచ్చినను గురువు నెట్టు శాంతింపజేయసాధ్యము? ఈయావు కామధేనువుతో సమానమగు మహత్త్వము కలది యని తెలియదు. శివశక్తిచే నీవు దీనిపై బడగలిగితివి కాని నీశక్తిచే గాదు. కావున ఈ యావును నా శరీరమును సమర్పించుట ద్వారా విడిపించుట నాకు న్యాయము. ఇట్లు చేయునో నీ యాలియు తీరును.

ముని కావ్యములకు విఘ్నమును కలుగదు, నీవును ఒక అయ్యకు సేవకుడవే దేవదారు రక్షణమున నీకెంత శ్రద్ధలేదా? రక్షింపవలసిన దానిని రక్షింపక యజమాని యెదుట నిలువశక్యము కాదు. నేను చంపదగిన వాడనని నీవు భావించునో నాకీర్తి శరీరము పై దయజూపుము. ఎప్పటికైనను నశింపవలసిన ఈ భౌతిక కాయమందు నావంటి వారికి మక్కువ ఎక్కడిది? మాటలాడు కొనుట మైత్రికి మూలము. అది మనకిట లభించినది.

కావున నీవు మిత్రుడనగు నాకోరిక మన్నింపకుండుట తగదు అనగా అట్లేయని ఆవును సింహము విడువగనే దిలీపుని చేయి నిర్బంధము నుండి విడువబడగా నారాజాయుధములనెల్ల విడచి తన శరీరమును మాంసపు ముద్దను వలె సింహమున కర్పించెను. సింహము పైబడు ననుకొనుచు తలవంచిన రాజుపై విద్యాధరులు పుష్పవృష్టి కురిపించిరి.

ఇంతలో నాయనా! లెమ్మను అమృతోపమమగు మాట వినరాగా రాజు తలయెత్తి చూచెను. ఆవుపాలు కార్చుచు కన్పించెను. కాని సింహము కానరాలేదు, ఆశ్చర్యపడు దిలీపునితో నాయా దిట్లనెను. నాయనా! నేను మాయ కల్పించి నిన్ను పరీక్షించితివి. వసిష్ఠ మహర్షి మహిమచే యముడుకూడ నన్నేమియు చేయజాలడు. క్రూర జంతువుల మాట వేరేల? గురువుపై నీభక్తికి, నాపై దయకు నేనెంతయు ప్రసన్నురాలనైతిని, వరము కోరుకొమ్ము, నేను కేవలము పాలిచ్చుదాననే కాదు. ప్రసన్నురాల నగుచో కోరిన కోరికల దీర్చుదానవని తెలిసికొమ్ము.

**2.5. (ఇ) దిలీపుని యభీష్టసిద్ధి:**

ఆ మాటలు వినిన దిలీపుడు చేతులు జోడించి, వంశకర్తయు, అపార కీర్తిశాలియునగు తనయుని సుదక్షిణా దేవియు దనుగ్రహింపు మని యావును ప్రార్థించెను. సంతానము గోరుచున్న రాజున కట్లేయని వాగ్దానమిచ్చి ఆనందిని నాయనా! నాపాలనొక వొప్పులో నింపి త్రావుమని యతని నాజ్ఞాపించెను అమ్మా! దూప త్రాగగా, హోమాది కృత్యములు తీరగా మిగిలిన నీపాలను గురువు నను్జ్ఞ వడిసి భూమియొక్క ఆరవపాలును వోలె ననుభవింప గోరుచున్నానని యా దిలీపుడు విన్నవించగా ఆవు మిక్కిలి సంతసించి అతనితో గూడి యా హిమవత్పర్వత గుహనిండి ఆయాసము లేకయే యాశ్రమున కరుగుదెంచెను.

రాజు ప్రసన్నముఖుడై సంతోషచిహ్నములచే నూహింపబడిన ధేనువు యొక్క అనుగ్రహము గురువున కరిగించి పిదప భార్యకు తెలియజెప్పెను. గురువు అనుమతి వడిసి దూడ త్రాగగా, హోమము కాగా మిగిలిన నందినీ క్షీరమును మిగుల

ప్రీతిలో త్రాగెను. మరునాడుదయము వ్రతసమాప్తి కాగా ప్రయాణ కాలోచితమైన శుభాశీస్సుల నిచ్చియా వసిష్ఠ డా రాజ దంపతులను రాజధానికి బయలుదేర దీసెను. హవిస్సుచే ప్రజ్వరిల్లుచున్న అగ్నికి వసిష్ఠునికి యరుంధతికి, దూడతో గూడిన నందినికి ప్రదక్షిణ పూర్వకముగా ప్రణమిల్లి దిలీపుడు మంగళప్రాప్తిచే పెరిగిన ప్రభావము కలవాడై బయలుదేరెను.

వీనుల కింపగు ధ్వనిగల రథమెక్కి, భార్యతో గూడి, కుదుపులు లేక సుఖమును కలిగించు మార్గమందు పరిపూర్ణమగు కోరికతో కదలివెళ్ళెను. చిరకాలము దూరమందుడుటచే చూడనుత్కంఠితులైన ప్రజలు సంతానర్ధమగు వ్రతముచే చిక్కిన వాభ్యుదయము పొందిన మహారాజును, కృష్ణ పక్షమున కప్పట్టక క్రొత్తగా నుదయించిన చంద్రునివోలె చూచిరి.

అట్లా దిలీప మహారాజు ప్రజలను సంతోషపెట్టుచు తన నగరమును ప్రవేశించి ఆదిశేషునితో సమానమగు బలముకు తన భూజములపై తిరిగి భూభారము దాల్చెను తరువాత ఆకాశమ అత్రి నేత్రము నుండి పుట్టిన చంద్రుని ధరించినటులు, ఆకాశగంగం అగ్నిచే నుంచబడిన శివతేజము ధరించినట్లు దిలీప పట్టమహిషి, యగు దునక్షిణానేవి లోక పాలుర తేజస్సులచే ప్రతిష్ఠమగు గర్భమును ధరించెను.

## 2.6. అడగదగిన ప్రశ్నలు:

1) మహాకవి కాళిదాసు కవితా వైశిష్ట్యాన్ని రఘువంశ పాఠ్యభాగం ఆధారంగా వర్ణించండి?

2) కాళిదాసు విరచిత రఘువంశకావ్యంలోని ద్వితీయ సర్గ కథా సారాంశాన్ని వివరించండి?

3) సుదేష్ణా దేవి - దిలీపుల వృత్తాంతాన్ని రఘువంశ కావ్యం - ద్వితీయ సర్గమాధారంగా విపులీకరించండి?

## 2.7. ఆధార గ్రంథాలు:

1) సంస్కృత సాహిత్య చరిత్ర - డా॥ ముదిగంటి గోపాల్ రెడ్డి, డా॥ ముదిగంటి సుజాతా రెడ్డి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 1997, హైదరాబాదు-500004.

2) రఘువంశం - ద్వితీయ సర్గ - జయలక్ష్మీ పబ్లికేషన్స్, హైదరాబాదు.

**- డా॥ పిల్లి వాసు**

## పాఠం - 3

# ఊరుభంగం

## - భాసుడు

విషయ క్రమం:


3.0. ఉద్దేశ్యం

3.1. రూపక పరిచయం

3.2. రూపకోత్పత్తి

3.3. రూపక ప్రాచీనత

3.4. రూపక భేదాలు

3.5. భాస మహాకవి పరిచయం

3.6. భాస మహాకవి కాలము

3.7. భాస మహాకవి రూపక విభజన

3.8. భాసుని నాటక కళ

3.9. భాసుని కవితారీతులు

3.10. భాసుని రసపోషణ

3.11. అనంతర కవులపై భాసమహాకవి ప్రభావం

3.12. ఊరు భంగ నాటక కథా సంగ్రహం

3.13. ఆధార గ్రంథాలు

3.14. రాదగిన ప్రశ్నలు


### 3.0. ఉద్దేశ్యం:

సంస్కృత వాఙ్మయంలోని ప్రాచీన కవులలో ఒకరైన భాసమహాకవిని తెలిపి వారి రచనలను, రచనల ద్వారా ఆనాటి సంస్కృతి-సంప్రదాయాలను, ఆచార వ్యవహారములను విద్యార్థులకు తెలియజేసి విజ్ఞానవంతులుగా చేయడమే ప్రధాన ఉద్ధేశ్యము.

### 3.1. రూపక పరిచయం:

సంస్కృత వాఙ్మయంలో కావ్య సాహిత్యాన్ని ఆలంకారికులు రెండు విధాలుగా చెప్పెను. అవి దృశ్య, శ్రవ్యకావ్యాలు. "ద్రష్టుం యోగ్యం" దృశ్యమని, శ్రోతుం యోగ్యమ్ శ్రవ్యమని వ్యవహరించెను. దర్శన, శ్రవణ గుణాల చేత రూపకాలు పండిత పామరులను సమానంగా ఆకర్షించి ఆనంద ప్రదాయకమైనవే కాక విజ్ఞాన దాయకమైనవి. సంస్కృత సాహిత్యంలో అభినయ ప్రధానమైన దృశ కావ్యాన్ని రూపకమంటారు.

**"అవస్థాను కృతిర్నాట్యం రూపదృశ్య తమోచ్యతే।**
**రూపకం తత్సమారోపాత్ దశాధైవ రసాశ్రయమ్॥"**

అని ఆలంకారికుడు ధనంజయుని కృతయైన 'దశ రూపక' లక్షణ గ్రంథములో పేర్కొనెను.

## 3.2 రూపకోత్పత్తి:

సంస్కృత వాఙ్మయంలో రూపక సాహిత్యం వేద కాలంలోనే ఆవిర్భవించిందని, అతి ప్రాచీనమైనదనే చెప్పవచ్చును. ఋగ్వేదంలోని ఇంద్ర-మరుత్, విశ్వామిత్ర-నది, పురూరవ-ఊర్వశి, యమ-యమీ, సరమా-పణ్యా సంవాదాలల్లో రూపక బీజాలున్నవి అని భారతీయ విమర్శకుల మరియు అలంకారికుల అభిప్రాయము. నిర్దుష్టమైన నాట్య లక్షణాలను సమగ్రముగా వివరించే అతి ప్రాచీన లక్షణ గ్రంథం నాట్య శాస్త్రం మాత్రమే. నాట్య శాస్త్రాన్ని భరతుడు రచించెను. తన నాట్య శాస్త్రంలో నాట్యోత్పత్తిని గూర్చి వివరించాడు. ఋగ్వేదం నుండి పాఠ్యాన్ని, యజుర్వేదం నుంచి అభినయాన్ని, సామవేదం నుంచి గానాన్ని, అథర్వణ వేదం నుంచి రసాన్ని తీసుకొని పంచమ వేదంగా నాట్య వేదాన్ని సృష్టించాడు.

ఈ నాటకోత్పత్తి కథను బట్టి నాట్యం లేక అభినయం మొదటిసారిగా తన శిక్షితులైన పుత్రుల ద్వారా నాట్యాన్ని ప్రదర్శింప చేసాడు. వేద పఠనాధికారం లేని జనులు నాటక దర్శనం ద్వారా ధర్మజ్ఞానాలను సంపాదించేవారు.

**"దుఃఖార్తానాం శ్రమర్తానాం శోకార్తానాం తపస్వినామ్**

**విశ్రాంతి జననం కాలే నాట్యమేతత్ మయాకృతమ్"**

అని తన నాట్య శాస్త్రములో నాట్యం దుఃఖార్తులకు, శ్రమార్తులకు, తపస్వి జనులకు విశ్రాంతి కలిగించి, శాంతిని కలిగిస్తుందని చెప్పెను.

## 3.3. రూపక ప్రాచీనత:

వేదాలల్లోనే రూపక కళ ఆరంభమైన రామాయణ, మహాభారత కాలంలో వికసించించినది అని చెప్పవచ్చును. "నా రాజకే జనపదే ప్రహృష్ట నటనర్తకాః" చిన్న వాల్మీకి మాటలకు బట్టి ఆ కాలంలో నటులకు, నర్తకులకు ఉన్నత స్థానాన్ని చెప్పబడెను. తరువాత పాణిని అష్టాధ్యాయిలో "పారాశర్యశిలాలిఖ్యాం భిక్షు నటసూత్రయోః" అని నట సూత్రాలను పేర్కొన్నాడు. కావున భరతుడు తన నాట్యశాస్త్రంలో తనకన్న పూర్వులైన నాట్య శాస్త్రకారులను పేర్కొని వున్నాడు. ఈ విధంగా నాటక కళ స్వతంత్రంగా వైదిక కాలంలోనే పుట్టి క్రమక్రమంగా వికసించి భరతుని నాటికి సంపూర్ణ రూపు రేఖలతో స్థిరపడి క్రీ.పూ. ప్రథమ శతాబ్ది నాటికి భాససౌమిల్ల కాళిదాసుల్లో ఉన్నత శిఖరాలను అందుకొన్నది.

భాస, కాళిదాస, అశ్వఘోష, భవభూతి, శ్రీహర్షాది మహాకవుల ప్రఖ్యాత సంస్కృత రూపక రచన వినోదంతో పాటు విజ్ఞానాన్ని కూడా అందించాయి అనటంలో ఎటువంటి సందేహము లేదు.

**"కావ్యేషు నాటకం రమ్యం"**

**"సందర్భేషు దశరూపకం శ్రేయః"**

**"నాటకాన్తంహి సాహిత్యం"**

అని సకల జన మనోరంజకంగా జన జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి.

## 3.4. రూపకం - భేదాలు:

'రూపక' పదానికి సమానార్థకంగా 'డ్రామా' ప్రయోగించబడుతున్నది. డ్రామా పదానికి సమానార్థకంగా నాటక

పదమే వాడబడుతున్నది. ఇపుడు నాటకమన్న పదమే ఎక్కువ ప్రచారంలో ఉన్నది. అందుకే రూపక, నాటక పదాలు పర్యాయ పదాలుగా వాడబడినవి. రస, వస్తు నాయకాది భేదాలను బట్టి ప్రాచీన కాలంలో రూపకాలు అనేక విధలుగా చెప్పబడెను. రూపక సాహిత్యమంతా రూపక, ఉపరూపకాలని రెండు విధాలుగా విభజింపబడినది. అందులో రూపకాలు పది రకాలుగా వున్నవి. ధనుంజయ అలాంకారికుడు "దశ రూపకం" లక్షణ గ్రంథములో-

**"నాటకం సప్రకరణం భాణః ప్రహసనం డిమః।**

**వ్యాయోగ సమవకారౌ వీథ్య ఙ్కేహామృగా ఇతి॥"**

అని దశ విధ రూపకములు గూర్చి పేర్కొనేను.

### 3.4.1. నాటకం:

నాటకం రూపకాలన్నిటిలో బృహత్కాయం కలది. నాటకములో కథ (ఇతివృత్తం) ప్రసిద్ధమైవుండాలి. కాని కవి రసానుకూలంగా కథౌచిత్యం కొరకు మార్పులు చేయవచ్చును. నాయకుడు ధీరోదాత్తుడు, క్షత్రియుడు ప్రసిద్ధ రాజవంశయుడై ఉండాలి. అంగిరసం శృంగారం లేక వీరం వుండాలి. దీనిలో 5 నుండి 10 వరకు అంకాలుంటవి. ఒకే సమయంలో నాలుగైదు పాత్రల కన్నా ఎక్కువ వుండరాదు. ప్రతి అంకంలో నాయకుడు లేక నాయిక కనిపించాలి. ప్రతి అంశం ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా నాయకునికి సంబంధించిన ఇతివృత్తాన్ని ప్రదర్శించాలి.

### 3.4.2. ప్రకరణం:

దేనిలో కథ ప్రసిద్ధంకాక కల్పితమై వుండవచ్చు. నాయకుడు ధీర ప్రశాంతుడు, క్షత్రియుడు బ్రహ్మణుడు, వైశ్యుడు గాని వుండవచ్చు. అంగిరసం శృగారం. ఇది నాటకంవలెకాక సామన్య జీవితానికి సంబంధించి నాటిక ఉపరూపక భేదం. దీనిలో 5 నుంచి 10 వరకు అంకాలుంటాయి. నాటికలో వలె ప్రకరణంలో ఇతివృత్తం తేలికగా ఉంటుంది.

### 3.4.3. భాణం:

దేనిలో ఒకే ఒక అంశం వుంటుంది. ఒకే ఒక పాత్ర వుంటుంది. ఆ పాత్ర చతుర వ్యక్తి గాని, పండితుడు గాని, విటుడు గాని అయివుండాలి. అంగిరసం శృంగారం లేక వీరం. ఆకాశ భాషణ సహాయంతో నడుస్తూ వుంటుంది. ఇది ఇప్పుడు ఏకపాత్రాభినయం వంటిది.

### 3.4.4. ప్రహసనం:

దీనిలో ఇతివృత్తం కల్పితము. నాయకుడు బ్రాహ్మణుడు, రాజు, సన్యాసి, విటుడు వీరిలో ఎవరైనా వుండవచ్చు. అంగిరసం హాస్యం. దీనిలో ఒకటి లేదా రెండు అంకాలుంటాయి. నాటక ప్రక్రియ కన్న ప్రకరణ, ప్రహసనాలు ప్రజల నిత్య జీవితానికి దగ్గరగా వున్న ఇతివృత్తంతో కూడి సమకాలిక జీవితాన్ని తెలుసుకోవచ్చును.

### 3.4.5 డిమం:

దీనిలో ఇతవృత్తం ప్రసిద్ధమై వుండాలి. గంధర్వ, యక్ష, రాక్షస, నాగాది జాతులకు భూతప్రేత పిశాచాది పాత్రలుండవచ్చు. దీనిలో 4 అంకాలుండాలి. ఇది నాటకం వలె ఉదాత్త స్వభావం కలిగి వుంటుంది. అంగిరసం శృంగార హాస్యాలు కాక ఏదైనా ఒకటి ప్రధానంగా వుండాలి. దీనిలో ఇంద్రజాలం, మాయ, యుద్ధం దృశ్యాలుంటవి. దీనిలో 16 పాత్రలుండాలి.

**3.4.6. వ్యాయోగం:**

దీనిలో ఒకే ఒక అంకం వుంటుంది. కథ ప్రసిద్ధమై వుండాలి. రస పోషణ డిమం వలె వుంటుంది. ఉద్ధతుడైన వ్యక్తిని ఆశ్రయించిన ఇతివృత్తము కలిగి ఒక్క రోజు జరిగిన సంఘటన మాత్రమే వుంటుంది. దీనిలో స్త్రీ కొరకు లేక ఏ కారణం కొరకైన గాని యుద్ధం వుంటుంది.

**3.4.7. సమవకారం:**

దీనిలో ఇతివృత్తం దేవలతకు, దైత్యులకు సంబంధించి వుంటుంది. అంగిరసం వీరం. దీనిలో 6 అంకాలుంటాయి. 12 నాయక పాత్రలుంటవి. పురాణ ప్రసిద్ధులైన పురుషులుండాలి.

**3.4.8. వీది:**

దీనిలో ఒకే ఒక అంకం వుంటుంది. అంగిరసం శృంగారాది మొదలైన సూచ్యంగా మాత్రమే ఉండాలి. ఒకటి లేక రెండు పాత్రలుంటవి.

**3.4.9. అంకం:**

దీనిలో ఇతివృత్తం ప్రసిద్ధమై వుండాలి. కథలో కవి మార్పు చేయవచ్చు. అంగిరసం కరుణ. ఒకే ఒక అంకం వుంటుంది. దీనిలో స్త్రీ రోదన ప్రధానంగా వుంటుంది.

**3.4.10. ఈహామృగం:**

దీనిలో ఇతివృత్తం కొంత ప్రసిద్ధమై, కొంత కల్పితమై వుంటుంది. నాయక ప్రతినాయకులు పురాణ ప్రసిద్ధులై వుంటారు. వారు నరులు, దేవతలు కావచ్చును. దీనిలో 4 అంకాలు వుంటాయి. అనురాగం లేని స్త్రీని ప్రతినాయకుడు ఎత్తుకొనిపోతే నాయకుడు అడగిస్తాడు కాని వదించకూడదు. నాయికను పొందాలని ప్రతి నాయకుడు మృగం వలే ప్రవర్తిస్తాడు. కనక ఈ రూపకానికి ఈహామృగమని పేరు.

ఈ ప్రసిద్ధమైన దశవిధ రూపక భేదాలు కాక 18 రకాలైన ఉపరూపక భేదాలు కూడా వున్నవి. వాటిల్లో నాటిక, సట్టకం, త్రోటకం, ప్రేక్షణకం, ప్రకరణిక ప్రసిద్ధమైనవి.

ఈవిధంగా రూపక, ఉపరూపక భేదాలను సూక్ష్మాతి సూక్ష్మ భేదాలతో ప్రాచీన కాలంలో బాగా ప్రచలితమై వుండేవని చెప్పవచ్చును. భరతుడు, ధనుంజయ వంటి ఆలంకారికులు దశవిధ రూపకాలను ఈవిధంగా విభజించవచ్చును.

1) ఒక్క అంకం కలవి – భాణం మొదలైనవి, ఇవి ఏక ప్రాతాభినయం వంటివి

2) ఒక్క అంకం కలవి – ఒకటి లేక రెండు పాత్రలు కలవి – వీథి మొదలగునవి.

3) ఒక్క అంకం కలవి – అనేక పాత్రలు కలవి – వ్యాయోగం, ప్రహసనం, అంకం వంటివి.

4) 3 లేక 4 అంకాలు కలవి – అనేక పాత్రలు కలవి – సమవకారం, డిమం, ఈహామృగం మొదలగునవి.

5) 5 నుండి 10 అంకాలు కలవి – అనేక పాత్రలు కలవి – నాటకం, ప్రకరణం మొదలగునవి.

అంకాల సంఖ్య, పాత్రల సంఖ్యను బట్టి విభజించినట్లయితే సంస్కృత నాటక క్రమ వికాసం స్పష్టంగా అవగతమౌతుంది.

## 3.5. భాస మహాకవి పరిచయం:

సంస్కృత రూపకారులలో మొట్టమొదటిగా చెప్పుకోదగిన వారు భాస మహాకవి. క్రీ.పూ. మూడవ శతాబ్దానికే భాసుని రూపకాలు చరిత్రలో ప్రఖ్యాతి గాంచినవి. మహాకవి కాళిదాసు "ప్రధితయసాయ్ భాససౌమిల్ల కవి పుత్రాదీనామ్ ప్రబంధాన్" అని మాళవికాగ్ని మిత్ర నాటకంలో స్మరించిన దానిని బట్టి భాసుడు ఆ కాలానికే ప్రసిద్ధ నాటక కర్తగా పేరు సంపాదించడని తెలుస్తున్నది.

సంస్కృత రూపక వాఙ్మయములో భాసుని రూపకాలు ఎంత ప్రాచీనమైనవో అంత ఆలస్యంగా వెలుగులోనికి వచ్చాయి. కేరళ రాష్ట్రానికి చెందిన మహా మహోపాధ్యాయ బిరుదాంకితులైన టి. గణపతిశాస్త్రి గారికి క్రీ.శ. 1909లో భాసుని నాటకాల హస్త లిఖిత ప్రతులు లభించాయి. అప్పటివరకు భాసుడు నామమాత్రంగానే పరిచితుడైన నాటకకారుడు. అపుడు గణపతిశాస్త్రికి దొరికిన 13 భాసుని నాటకాలను "త్రయోదశ త్రివేంద్ర నాటకాని" అనే శీర్షికతో త్రివేంద్రం నుండి ప్రచురించారు. అవి:

1. ప్రతిమా నాటకం - 7 అంకాలు
2. అభిషేక నాటకం - 9 అంకాలు
3. బాల చరితం - 5 అంకాలు
4. పంచరాత్రం - 3 అంకాలు
5. మధ్యమ వ్యాయోగం - 1 అంకం
6. దూత ఘటోత్కచం - 1 అంకం
7. దూత వాక్యం - 1 అంకం
8. కర్ణ భారం - 1 అంకం
9. ఊరు భంగం - 1 అంకం
10. ప్రతిజ్ఞా యౌగంధరాయణం - 4 అంకాలు
11. స్వప్న వాసవదత్తం - 6 అంకాలు
12. అవి మారకం - 6 అంకాలు
13. చారుదత్తం - 4 అంకాలు

**భాస మహాకవి రచించిన రూపకాలు 24 అని మరొక ప్రతీతి-**

**భాషాసు రమ్యా గైర్వాణీ, తస్యాం కావ్యం మనోహరమ్**
**తత్రాపి రూపకం రమ్యం, తత్ర భానకవేః కృతిః**
**ధావకాపరనామాయం భాసో భాసయతే జగత్**
**తత్త్వైరివాది పురుషశ్చతుర్వింశతి రూపకెః**

మరొక సంప్రదాయన్ననుసరించి 30 వరకు రూపకాలు వ్రాసాడు అని ప్రసిద్ధి. కాని ఇపుడు మనకు 13 నాటకాలు దొరుకుతున్నవి.

భాస మహాకవి స్వతంత్ర సహసిద్ధ ప్రజ్ఞాశాలి. ఇతని రూపక రచన విధానం అమోఘం. భాసుని రూపకాలన్నీ రంగస్థల ప్రదర్శన యోగ్యాలు. భాసుని కాలం నాటికే సంస్కృత నాటక రంగం ఎంతగానో అభివృద్ధి చెందినది అనటానికి అతని నాటకాలే నిదర్శనాలు.

## 3.6. భాస మహాకవి కాలము:

భాస మహాకవి కాలాన్ని నిర్ధారించడం కష్టమనే చెప్పాలి కాని వివిధ విమర్శకులు, అలంకారికుల వచనాలే మనకు ఆధారాలు.

1) మహాకవి కాళిదాసు భాసున్ని మాళవికాగ్ని మిత్ర నాటకంలో....

**"ప్రథితయశసాం భాస-సౌమిల్ల-కవిపుత్రాదీనాం ప్రబంధాన్ అతిక్రమ్య**

**వర్తమానకవేః కాళిదాసస్య క్రియయాం కథం పరిషదోఽ స్యాః బహుమానః॥**

అని ఆదరభావంతో కీర్తించారు.

2) సూత్రధారుని చేత ఆరంభింపబడిన భూమికాయుక్తమైన పతాకా శోభితమైన

నాటకాల వల్ల భాసుడు గొప్ప యశస్సును పొందాడని బాణుడు హర్షచరితంలో...

**"సూత్రధార కృతారంభైర్నాటకై ర్బహు భూమికైః**

**సపతాకైర్యశోలేభే భాసోదేవకులైరివ"**

అని సాదారంగా భాసుని కొనియాడాడు.

3) దండి "అవంతి సుందరీకథలో...

**"సువిభక్త ముఖాద్యంకై ర్వ్యక్త లక్షణ వృత్తిభిః**

**పరితోఽపి స్థితో భాసః శరీరైరివ నాటకైః"**

అని భాస మహాకవి నాటక శరీరంతో అమరుడైనాడని వర్ణించాడు.

4) ప్రాకృత కవి వాక్పతి రాజు భాసున్ని .......

**"భాసమ్మి జలణమిత్తే కంతొ దేవే అజస్సరహు ఆదే**

**సో బంధదే ఆ వందమ్మి హరియందే ఆ ఆణం దో"**

అని ఎంతో రమ్మణీయంగా పేర్కొన్నాడు.

5) జయదేవుడు **"భాసోహాసః కవి కులగురు: కాళిదాసో విలాసః"** అని

కాళిదాసు కవితా కామిని విలాసంగా చెప్పి భాసున్ని కవితా కామిని హాసంగా వర్ణించాడు.

6) రాజశేకరుడు సూక్తి ముక్తావళిలో..

**"భాస నాటక చక్రేఽపిచ్ఛేకైః క్షిప్తే పరీక్షితుమ్**

**స్వప్న వాసవదత్తస్య దాహకోఽభూన్న పావకః"**

అని స్వప్న వాసవదత్త అగ్ని పరీక్షను తట్టుకొని నిలవటాన్ని ఎంతో అత్యద్భుతంగా వర్ణించెను.

7) భరతముని నాట్య శాస్త్రంలో నిర్దేశించిన నియమ నిబంధనలకు విరుద్ధంగా భాసుని రూపకాలలో మనకు కనిపిస్తున్నది. నాట్య శాస్త్ర నియమానుసారం నాటక ప్రస్తావనలో కవి పేరు ఉండాలి. కాని ప్రస్తావనలో భాసుడు తన పేరు చెప్పలేదు. నాటకారంభం "స్థాపనా" అని చెప్పబడెను. నాందీ పాఠం అయిన వెంటనే సూత్రదార ప్రవేశం నాటక లక్షణ విరుద్ధం. మృత్యువు, యుద్ధం, నిద్ర నాటకంలో కనిపించవు కానీ బాసుని స్వప్న దాసవదత్తలో నిద్ర, మధ్యమ వ్యాయోగంలో యుద్ధం కనబడును. కాబట్టి భరతముని కంటే భాస మహాకవి ప్రాచీనుడని తెలుస్తుంది.

8) భాసుని భాషలో అపాణినీయ ప్రయోగాలు కనిపిస్తున్నవి. కనుక పాణిని మహర్షికంటే భాసుడు ప్రాచీనుడని అభిప్రాయపడవచ్చు.

9) రస పరిపోషణ దృష్ట్యా భాషా సారళ్యం దృష్ట్యా కూడా భాస మహాకవి వ్యాస-వాల్మీకీ మహర్షుల సమకాలికుడని కొంతమంది విమర్శకుల అభిప్రాయం.

10) పాశ్చాత్య విమర్శకులు, పండితుల అభిప్రాయము 'మత్తవిలాసం' అనే నాటకాన్ని భాసుడు రచించాడని క్రీ.శ. ఏడవ శతాబ్ధమని "ప్రొఫెసర్ వర్నటా" ఊహించారు. తరువాత "స్టెనకోనో" "వింటర్‌నిటేజ్" అభిప్రాయము ప్రాకృత భాషా ప్రయోగాలను చేసారు కనుక కాళిదాస, అశ్వఘోషాది కవుల ప్రాచీనుడని చెప్పారు. ఆ సమయం క్రీ.శ. రెండవ, నాల్గవ శతాబ్దాల మధ్య కాలం కావచ్చని చెప్పెను.

పైన చెప్పబడిన అభిప్రాయలతో భాస మహాకవి సమయం ఇదమిత్థమని ఎవరు స్పష్టంగా చెప్పలేదు. కావున సంస్కృత కవుల కాల నిర్ణయం ఖచ్చితంగా చెప్పటం అసాధ్యమే అని చెప్పాలి.

## 3.7. మహాకవి రూపక విభజన:

భాస మహాకవి రచించిన పదమూడు రూపకాలను భాస నాటక చక్రంగా పేర్కొని ఇతివృత్తం ఆధారంగా ఐదు విధాలుగా విభజించవచ్చును.

**(ఏ) శ్రీమద్రామాయణ కథాశిత్రమైనవి - రెండు**

1. ప్రతిమా నాటకం
2. అభిషేక నాటకం

**(బి) శ్రీ మన్మహాభారత కథాశితమైనవి - ఆరు**

1. పంచరాత్రం
2. మధ్యమ వ్యాయోగం
3. దూత ఘటోత్కచం
4. కర్ణభారం
5. ఊరుభంగం
6. దూతవాక్యం

**(సి) శ్రీమద్భాగవత కథాశ్రితమైనవి – ఒకటి**

1. బాల చరితం

**(డి) బృహత్కథాశ్రితమైనవి – మూడు**

1. ప్రతిజ్ఞ యౌగంధరాయణం
2. స్వప్న వాసవదత్తం
3. అవిమారకం

**(ఇ) కాల్పనికం – ఒకటి**

1. చారుదత్తం

## రూపకాలు పరిచయం:

**1. ప్రతిమా నాటకం:**

ఈ నాటకంలో 7 అంకాలున్నవి. భాసునికి విశేష ఖ్యాతి తెచ్చిపెట్టిన రూపకం ప్రతిమా నాటకం. దీనిలో ఇతివృత్తం వాల్మీకి రామాయణం నుండి గ్రహించెను. దశరథుని మరణం మొదలుకొని రాముని పట్టాభిషేకం వరకు రామాయణ కథ వున్నది. భరతుడు "తన మేనమామ దేశమైన కేకయ రాజ్యంలో ఉంటాడు. దశరథునికి అనారోగ్యంగా ఉందని తెలుసుకొని అయోధ్యకు ప్రయాణమయ్యాడు. అయోధ్య నగర సరిహద్దులలోకి రాగానే ప్రతిమా గుహములోనికి ప్రవేశిస్తాడు. అక్కడ దివంగతులయిన పూర్వజుల విగ్రహాలను చూస్తాడు. ఆ విగ్రహాలలో తన తండ్రి దశరథుని విగ్రహం చూచి విషయాన్ని తెలుసుకొని తండ్రి విగ్రహం ముందే కుప్పకూలిపోతాడు. అందువల్లనే ఈనాటకానికి ప్రతిమా నాటకం అని పేరు పెట్టడం జరిగింది. తండ్రికి ఉత్తర క్రియలు చేసి అడవికి వెళ్లి రాజ్యాన్ని గ్రహించమని రాముడిని కోరగా శ్రీరాముడు వచ్చుటకు నిరాకరించగా తన పాదుకులను తీసుకువచ్చి వాటికే అభిషేకం చేస్తాడు భరతుడు.

**2. అభిషేక నాటకం:** ఈ నాటకంలో 9 అంకాలున్నవి. రామాయణ కథాశ్రితమే దీనిలో కిష్కింధకాండలోని వాలి వధ వృత్తాంతం నుండి సుందరకాండ, యుద్ధకాండలోని పట్టాభిషేక వృత్తాంతం వరకు ఉన్న కథను గ్రహించాడు భాసుడు. దీనితో భాసుడు రామన్ని నారాయణా వతారునిగా చిత్రించాడు.

**3. పంచరాత్రం:**

ఈ నాటకంలో 3 అంకాలున్నవి. దీనిలోని కథ మహాభారత కథాధారితమైన చాలమట్టుకు కవి కల్పిత వృత్తాంతమే. దుర్యోధనుడు యజ్ఞం చేసి గురువైన ద్రోణాచార్యున్ని దక్షిణ కోరమనగా పాండవులకు అర్ధరాజ్యమియ్యమని కోరుతాడు. కాని అజ్ఞాతవాసంలో వున్న పాండవులను ఐదు రాత్రుల్లో తెలిస్తేనే ఇస్తానని అంటాడు అందుకే దీనికి పంచరాత్రం అని పేరు వచ్చింది. కురుక్షేత్ర యుద్ధం జరగకుండానే పాండవులకు అర్థ రాజ్యమిచ్చినట్లుగా కవి కల్పన మహాభారత కథను సూక్ష్మతరం చేసింది.

**4. మధ్యమ వ్యాయోగం:**

ఇది ఏకాంకిక, పాండవ వనవాసం నాటివృత్తాంతం కాని ఇతివృత్తం కవి కల్పితం. ఒక బ్రాహ్మణుడు సపరివారంగా తీర్థయాత్రలకు బయలుదేరుతాడు. మార్గ మధ్యంలో అరణ్యంలో వెళ్ళుతుండగా అదే అరణ్యంలో నివసిస్తూ ఉన్న హిడింబి తన

వ్రత నియమానుసారము ఒక మనుష్యుని తీసుకొని రమ్మని ఘటోత్కచుణ్ణి పంపుతుంది. ఘటోత్కచుడు ఆ బ్రాహ్మణుడు అడగించగా అతను తన మధ్యముడిని పంపుతాడు. ఆ బ్రాహ్మణ మధ్యముడు దప్పిక కొరకు సరోవరంకి వెళ్ళతాడు. సమయం మించిపోవటంతో ఘటోత్కచుడు "మధ్యమా! అని బిగ్గరగా పిలవగా అటు ప్రక్కనే ఉన్నటువంటి కుంతీ మధ్యముడు భీముడు అక్కడికి చేరుకుంటాడు. విషయాన్ని తెలుసుకొని భీమసేనుడు ఘటోత్కచునితో యుద్ధం చేస్తాడు. తన పరాక్రమాన్ని చూచి సంధి చేసుకుని బ్రాహ్మణ కుమారుని స్థానంలో భీమసేనుడు హిడింబి నివాసానికి చేరుకుంటాడు. తండ్రీ కొడుకుల పరస్పరం పరిచితులయ్యారు. కాబట్టి దానికి 'మధ్యమ వ్యాయోగం' అని పేరు సార్థకమయింది.

**5. దూత ఘటోత్కచం:**

ఇది ఏకాంకిక. భారత యుద్ధంలో అభిమన్యుని మరణానంతరం ఘటోత్కచుడు దుర్యోధనుని దగ్గరికి శ్రీ కృష్ణుని ఆదేశంతో రాయబారిగా వెళతాడు. దుర్యోధనుడు అతన్ని అవమానిస్తాడు. అప్పుడు ఘటోత్కచుడు అర్జునని చేతిలో కౌరవుల వినాశం జరుగుతుందని భవిష్యవాణి చెప్తాడు. ఇది కవి కల్పితమే.

**6. కర్ణ భారం:**

ఇది ఏకాంకిక. బ్రాహ్మణ వేషధారియై వచ్చిన ఇంద్రునికి కర్ణుడు తన సహజ కవచ కుండలాలను ఇచ్చే వృత్తాంతం దీనిలో వున్నది. దీనిలో కర్ణుని దానవీరశూరత చిత్రించబడినది.

**7. ఊరు భంగం:**

ఇది ఏకాంకిక. దుర్యోధనుడు భీమునితో గదాయుద్ధం చేసి తోడలు విరిగి పడిపోవటం, అతని మరణం ఈ ఏకాంకికలో వున్నది. ఇందులో దుర్యోధన పాత్ర చిత్రణలో భాస మహాకవి అపూర్వ ప్రతిభను చూపాడు.

**8. దూతవాక్యం:**

ఇది ఏకాంకిక. దీనిలో శ్రీకృష్ణుడు పాండవుల దూతయై కౌరవుల దగ్గరికి పోవుట, శ్రీకృష్ణుని విశ్వరూప సందర్శనం చెప్పబడినది.

**9. బాల చరితం:**

ఈ నాటకంలో 5 అంకాలున్నవి. శ్రీకృష్ణుని జననం, బాల్య క్రీడలు, యుద్ధం చెప్పబడినది. భాసుడు శ్రీకృష్ణుని నారాయణావతారంగా పరమాత్మ స్వరూపునిగా చిత్రించాడు.

**10. ప్రతిజ్ఞ యౌగంధరాయణం:**

ఈ నాటకంలో 4 అంకాలున్నవి. దీనిలో ఉదయన రాజు మంత్రి యౌగంధరాయణుడు నాయకుడు. ఉజ్జయిని రాజు ప్రద్యోతుడు మోసంతో కౌశింబి రాజు ఉదయనున్ని బంధించగా అనతి మంత్రి యౌగంధరాయణుడు విడిపిస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. ఉదయనుడు బంధితుడై కారాగారంలో ప్రదోత్యుని కూతురు వాసవదత్తకు వీణను నేర్పుతాడు. వారివురు పరస్పరం ప్రేమించుకుంటారు. వాసవదత్తను విడిచిపెట్టి కారాగార విముక్తుడు కవాటానికి ఉదయనుడు అంగీకరించడు. అప్పుడు యౌగంధరాయణుడు ఉదయనునితో పాటు వాసవదత్తను అతని వీణ ఘోషవతిని ఏనుగు నలగిరిని విడిపిస్తానని మరొకసారి ప్రతిజ్ఞ చేస్తాడు. ఇందుకే ఈ నాటకం ప్రతిజ్ఞా మౌగంధరాయణం అని పిలవబడింది.

**11. స్వప్న వాసవదత్తం:**

ఈ నాటకంలో 6 అంకాలున్నవి. మగధ రాజకుమారి పద్మావతిని ఉదయనుడు వివహమాడితే రాజ్యక్షేమంగా ఉంటుందని జ్యోతిషులు చెప్తారు. కాని మరోక వివాహానికి ఉదయనుడు ఒప్పుకోడు అని తెలిసి మంత్రి యౌగంధరాయణుడు వాసవదత్త సహాయంతో ఉదయనుడు వేటకు వెళ్ళినపుడు గ్రామదాహంలో వాసవదత్త చనిపోయిందని చెప్పి తన చెల్లెలు లని పద్మావతి పరిచయం చేసి వివాహం జరిపిస్తాడు. ఒకరోజు ఉదయనుడు నిద్రిస్తుండగా వాసవదత్త వచ్చి పద్మావతిగా అతని పక్కన పడుకొంటుంది. అపుడు ఆమె గూర్చి కలగంటూ కలవరిస్తాడు. తర్వాత మగధరాజు సహాయంతో ఉదయనుడు రాజ్యాన్ని సంపాదిస్తాడు. అపుడు వాసవదత్త జీవించివున్నదని తెలుస్తుంది.

**12. అవిమారకం:**

ఈ నాటకంలో 6 అంకాలున్నవి. దీనిలో నాయకుని పేరు అవిమారకుడు. ఋషి శాపం చేత క్షత్రియత్వం కోల్పోతాడు. తన మేనమామ కుంతిభోజిని కూతురు కురంగిని ప్రేమించి రహస్యంగా ఆమె అంతఃపురం చేరుకుంటాడు. ఒక సంవత్సర కాలం తరువాత బయట పడుతుంది. అపుడు కురంగి కార్చిచ్చు పడి ఆత్మహత్య చేసుకోపోగా విద్యాధరుడు ప్రత్యక్షమై అంగుళీయకాన్ని ప్రసాదించగా దాని సాయంతో అవిమారకుడు కురంగిని ప్రాణాలతో రక్షిస్తాడు. ఇంతలో శాపం అవధి గడిచిపోతుంది, నారధుడు వచ్చి అవిమారకున్ని కుంతిభోజునికి పరిచయం చేస్తాడు.

**13. చారుదత్తం:**

ఈ నాటకంలో 4 అంకాలున్నవి. వేశ్య వసంతసేన, దరిద్ర బ్రాహ్మణుడు చారుదత్తుని ప్రేమిస్తుంది. వసంతసేన తన గల మూటను చారుదత్తుని ఇంట్లో పెట్టిపోతుంది. శక్విలకుడు కన్నం వేసి ఆ నగలను దొంగిలించి అనగలను వసంతసేనకే ఇచ్చి ఆమె దగ్గర దాసిగా వున్న తన ప్రియురాలిని విడిపించుకొంటాడు. ఇక్కడనే నాటక కథ అసంపూర్ణంగా ముగుస్తున్నది.

## 3.8. భాసుని నాటక కళ:

భాసుడు ప్రతిభాశాలి అయిన నాటకకారుడు అనుభవజ్ఞుడు. భాసుని నాటక దశ శాస్త్రీయ లక్షణాలను దృష్టిలో పెట్టుకోవాలి అని కాకుండా కథ, సన్నివేశాలు, పాత్రలను అవసరాన్ని బట్టి నేర్పుతో మలచుకొని చాలా చమత్కారంగా, సహజంగా చిత్రించాడు. అవన్నీ కూడా అతని ప్రతిభా పాఠవాలే కానీ పూర్వ రచనల అనుకరణలుకావు. అందుకే అతని నాటకాలు ఇతర నాటకాల కన్నా భిన్నంగా, విలక్షణంగా కనిపిస్తూ, శైలి, చందస్సులు కవితా ప్రతిభలు కూడా నాటకాలను రసవంతం చేసినాయి.

రామాయణ, మహాభారతాతిరిక్తంగా భాసుడు ప్రతిమానాటకం, అభిషేక నాటకాలు కథాకల్పనలు, సన్నివేశాలు సృష్టి, పాత్రల చిత్రణ అద్భుతంగా వున్నవి. అలాగే స్వప్నవాసవదత్త. ప్రతిజ్ఞా యౌగంధరాయణ నాటకాలల్లో సంఘటనల కూర్పు, సంభాషణ నిర్వహణ కవిత్వ ప్రౌడిమ చాటుతున్నవి. ఇంకా దూతవాక్యం, మధ్యమ వ్యాయోగం, దూత ఘటోత్కచం కర్ణ భారం, ఊరు భంగం ఏకాంకిక రచనలను, భాసునంత సమర్ధవంతంగా తరువాత కవులెవ్వరూ వ్రాయలేదు. భాసుని ఏకాంకికలు చిన్నవైనా చక్కని ఇతివృత్తంతో, పాత్ర చిత్రణతో సంఘటనా మహత్వంతో వన్నవి. ఈ రూపకాలన్నీ అభినయ యోగ్యలే. భాసుని నాటకాలు ఏ వృత్తాంతం అయిన కథలను తన అభిరుచికి అనుగుణంగా స్వతంత్రించి మార్చుకొన్నాడు. అందువల్లనే స్వతంత్రమైన భాసుని కల్పనలు ఎబ్బెట్టుగా కాక సామాజికులకు కుతూహలం కలిగించేవిగా ఉండిపోయినవి.

## 3.9. భాసుని కవితారీతులు:

భాసుడు నాటక కళా నిర్వహణంలోనే కాక కవిత్వ రచనలో సిద్ధహస్తుడు. భాసుని కవిత్వం సలక్షణమైనది. అవి కవిత్వావేశంలో దీర్ఘంగా కాక సన్నివేశానికి అనుకూలమైన రీతిలో వున్నవి. భాసుని భాష సూక్తులతో, లోకోక్తులతో నిండి ఉంటుంది. భాసుని ఉపమానాలు చాలామట్టుకు ప్రకృతి వస్తువులే -

**"సూర్య ఇవగతో రామః సూర్యం దివస ఇవ లక్ష్మణోఽ ను గతః**

**సూర్య దివసావసానే ఛాయేవ న దృశ్యతే సీతా"**

సరళ సుంబోధకమైన శైలిలో భాసుడు చక్కగా రచించాడు. అదేవిధంగా భాసుడి సంభాషణ శైలి సహజ మనోహరంగా ఉంటుంది. అందుకే రూపకాలను అంత ప్రసిద్ధి వచ్చింది. భాస మహాకవి లోకోక్తులను, సామెతలను ఛందోబద్ధంగా మలచటంలో నిపుణుడు "చక్రారి పంక్తి రివ గచ్ఛతి భాగ్య పంక్తిః" లాంటివి వీటికి ఉదాహరణ.

భాసుని కవిత్వం చదవగానే భావాలు హృదయంలో సూటిగా ప్రవేశించి అనుభూతులను ప్రేరేపించును. భాసుడు అనుభవజ్ఞుడైన బహుముఖ ప్రజ్ఞాశాలి.

## 3.10. భాసుని రస పోషణ:

భాస మహాకవి రూపకాల్లో నవ రసాలు అభివ్యక్తమవుతాయి. నాటకాల్లో ప్రధానమైన వీర శృంగార రసాలు ప్రస్ఫుటంగా పరిపుష్టం చేశాయి. ప్రతిమా నాటకంలో శోకం పరాకాష్టకు చేరుకుంటుంది.

రాజా-కౌసల్యే! సారవతీ ఖల్వసి త్వయాహి ఖలు రామో గర్భేధృతః

**"అహం హి దుఃఖమత్యన్తమసహ్యం జ్వలనోపమమ్!**

**నైవసోదుంన సంహర్తుం శక్నోమి ముషితేంద్రియః!**

**రామం ప్రతిమతా బుద్ధి రద్యాపి న నివర్తతే"!!**

మొదలగు వాక్యాలు దశరథుని శోకాన్ని కళ్ళకు కట్టినట్లుగా వర్ణించాడు భాసుడు.

స్వప్న వాసవదత్తం, చారుదత్తం, అవిమారకం నాటకాల్లో శృంగార రసం పరిపుష్టిని సంతరించుకొన్నది. ప్రతిజ్ఞా యౌగంధరాయణం, అభిషేక నాటకం, మధ్యమ వ్యాయోగం, ఊరుభంగం రూపకాల్లో వీర రసం ప్రధానంగా వర్ణించెను. మిగిలిన రూపకాల్లో వీర, శృంగార రసాలను నామమాత్రంగానే చూపించిన బాల చరితంలో మాత్రం అద్భుత రసం ప్రధానంగా అభివ్యక్తికరించెను. మిగిలిన రసాల్లో హాస్య రసం కూడా సున్నితంగా పోషించెను. కనుక భాసుడు రససిద్ధ కవివరెణ్యుడు.

## 3.11. అనంతర కవులపై భాస మహాకవి ప్రభావం:

భాస మహాకవి భావాలనే తదనంతర కవులు అభ్యంతరంగా ఉపయోగించుకొన్నారు. తమ కృతులలో...

**"సర్వ శోభనీయం సురూపం నామ"** - ప్రతిమా నాటకం

మహాకవి కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలో

**"కిమివ హి మధురాణాం మండనం నాకృతేనామ్?"** అని వర్ణించాడు.

**"హృదయనేహ తత్రాంగైర్ద్విదా భూతేవగచ్ఛతి।**

**యథానభసి తోయే చ చంద్రలేఖా ద్విధా స్థితా॥"** - బాల చరితం

**"గచ్ఛతి పురశ్శరీరం ధావతి పశ్చాద సంస్థితం చేతః**
**చీనాంశుకుమివ కేతోః, ప్రతివాతం నీయమానస్య॥"** – అభిజ్ఞాన శాకుంతలం
**"చక్రారి పంక్తిరివ గచ్ఛతి భాగ్యపంక్తి"** (స్వప్న వాసవదత్తం) అని భాసుడు విధివిలాసాన్ని వర్ణిస్తే...
**"నీచైర్గచ్ఛత్యు పరిచదశా చక్రనేమి క్రమేణ"** అని కాళిదాసు మేఘ సందేశంలో ఉల్లేఖించాడు.

**"కాష్ఠా దగ్నిర్జాయతే మథ్యమానాత్**
**భూమిస్తోయం ఖన్యమానా దదాతి!**
**సోత్సాహానం నాస్త్య సాధ్యం నరాణాం**
**మార్గారబ్ధాః సర్వయత్నాః ఫలంతి॥"**

అని భాసుడు స్వప్న వాసవ దత్తంలో వర్ణిస్తే ...

**"కాష్టం హి మథ్నన్ లభతే హుతా**
**భూమింఖగన్ నిందతి చాప్ తోయం।**
**నిర్భంధినః కించన నాస్త్య సాధ్యం**
**న్యాయెన యుక్తం చకృతంచ సర్వమ్!!"**

అని బుద్ధ చరితంలో అశ్వఘోషుడు వర్ణించెను.
ఈ విధంగా అనంతర కవులపై భాసుని ప్రభావం అధికంగానే ఉన్నదని చెప్పవచ్చు.

## 3.12 ఊరు భంగ నాటక కథా సంగ్రహం:

ఊరు భంగ నాటకం ఏకాంకిక. శ్రీమన్మహభారతం నుండి ఇతివృత్తం గ్రహించడం జరిగింది. మాయాద్యూత (జూదం) క్రీడలో పాండవులు ఓడిపోగా ద్రౌపదిని కౌరవులు పరాభవిస్తారు. ఆ సమయంలో భీముడు భీషణ ప్రతిజ్ఞ చేస్తాడు. ప్రేయసి పరాభవంతో సంతప్తుడైన భీమసేన తన ప్రతిజ్ఞను యుద్ధ సమయంలో నిలబెట్టుకోవటానికి దుర్యోధనుని తొడలు విరిచి చంపిన ఘట్టం ఇక్కడ వర్ణింపబడినది. దుర్యోధన – భీమసేన మధ్య జరిగిన గదా యుద్ధం ఇక్కడ వర్ణించబడినది.

### ఊరుభంగ నాటకంలో పాత్రలు:

**పురుష పాత్రలు:**

| | |
|---|---|
| భటః | – సైనికుడు |
| బలదేవః | – దుర్యోధనస్య గదాయుద్ధే గురుః |
| దుర్యోధనః | – కురురాజః |
| ధృతరాష్ట్రః | – వృద్ధో దుర్యోధనస్య పితా |
| దుర్జయః | – దుర్యోధనస్య పుత్రః |
| అశ్వత్థామా | – ద్రోణపుత్రః |

**స్త్రీ పాత్రలు:**

గాంధారీ - కురు రాజస్య మాతా

దేవ్యౌః - కురు రాజస్య మహిష్యౌ

**కథా సారాంశము:**

కురుక్షేత్ర యుద్ధములో చివరిగా కురురాజైనటువంటి దుర్యోధనుడు, పాండవ మధ్యముడైనటువంటి భీముడు గదాయుద్ధము చేయచుందురు. ఆ ఘోర యుద్ధములో భీముని గదాఘాతముచే దుర్యోధనుడు తోడలు విరిగి పడిపోవును. ఆ విషయము తెలిసి రణ భూమిలో మరణమునకు సిద్ధంగా ఉన్న దుర్యోధనుడిని చూచుటకు మొదటిగా వీరి గురువైన బలరాముడు వచ్చి, నీకు ఇంతటి దుస్థితిని కలిగించిన వారిని ప్రతికారము చేసెదెను అని పలుకగా అపుడు దుర్యోధనుడు పశ్చాతాపముతో నేను చేసిన దుష్కృత్యమాలకు తగిన ఫలము లభించవలసినది అని పల్కెను. భీమసేనుని తప్పు ఏమి లేదు అని చెప్పుచూ వంచన చేసినది కృష్ణడే పాండవులను ఏమియు చేయవలదు అని చెప్పెను.

అంతలో నచ్చటికి గాంధారీ దృతరాష్ట్రులు, దుర్యోధనుడు కుమారుడైన దుర్జయుడు, ఇద్దరు రాణులు వస్తారు. వారు రాజెక్కడ అని వెతుకుచుండగా బాలుడైనటువంటి దుర్జనుడు చూచి ఎంతో ప్రేమతో తొడలపై కూర్చుండబోవ్వగా తొడలు లేక భాదపడుచుండగా ఇంటికి రమ్మని వేడుకొన్నగా నేను నీతో వచ్చెదను అని ముద్దుమాటలకు ప్రత్యుత్తరము ఇవ్వలేకపోవును.

అంతట అశ్వత్థామ వచ్చి తాను పాండవులను నిద్రావస్థలోనే చంపెదనని ప్రతిజ్ఞ పూనితిని అని పలుకగా అందులకు దుర్యోధనుడు సమ్మతించడు నీవు చేయవలసిన కర్తవ్యము ఉన్నది నీవు దుర్జయుని రాజ్యాభిషేకము చేయవలసినది అని ఆజ్ఞాపించి స్వర్గస్తుడయ్యెను.

ఇందు భాసునిచే దుర్యోధనుని మనః పరిపాకము విచిత్రముగాను దుర్జయుని ముద్దు పల్కులు వినముచ్చటగా వర్ణించెను.

## 3.13. అధార గ్రంథాలు:

1) సంస్కృత సాహిత్య చరిత్ర - ముదిగంటి గోపాలరెడ్డి

2) ఊరు భఙ్గం - భాస మహాకవి

## 3.14. రాదగిన ప్రశ్నలు:

1) సంస్కృత రూపక సాహిత్యంలో భాస నాటక చక్ర వైశిష్ట్యాన్ని వివరించండి?

2) ఊరు భంగం పాఠ్యభాగ నామైచిత్యాన్ని సోదాహరణంగా వర్ణించండి?

**- డా॥ కె. యశ్వంత్ కుమార్ రెడ్డి**

పాఠం - 4

# సంస్కృత సాహిత్య చరిత్ర - వాల్మీకి, వ్యాసుడు

విషయ క్రమం:


4.0. లక్ష్యం

4.1. సంస్కృత సాహిత్య ఔన్నత్యం

4.2. సంస్కృత సాహిత్య విభాగం

4.2.1. వేదవాఙ్మయం

4.2.2. స్మృతి వాఙ్మయం

4.2.3. లౌకిక వాఙ్మయం

4.3. వాల్మీకి మహర్షి జీవనవృత్తం

4.3.1. ఋక్షుడు వాల్మీకి మహర్షిగా మారుట

4.4. రామాయణ రచనకు పూర్వ నేపథ్యం

4.5. ఆది కవి – ఆది శ్లోకం

4.6. వాల్మీకి మహర్షి రచనాశైలి

4.7. వ్యాస పరంపర

4.8. కృష్ణద్వైపాయన వ్యాసుని జీవన వృత్తం

4.9. వ్యాస మహర్షి సాహితీ వ్యాసంగం

4.9.1. చతుర్వేదములు

4.9.2. బ్రహ్మసూత్రములు

4.9.3. అష్టాదశపురాణములు

4.9.4. మహాభారతము

4.9.5. స్తోత్రసాహిత్యం

4.10. ఉప సంహారం

4.11. ఆధార గ్రంథాలు

4.12. రాదగిన ప్రశ్నలు


## 4.0. లక్ష్యం:

భారతీయ సంస్కృతి యొక్క వైశిష్ట్యమును గూర్చి మరియు సంస్కృత లౌకిక సాహిత్యానికి మూలకారకులైన వాల్మీకి, వ్యాస మహర్షులను గూర్చి సవివరంగా తెలుపటం, సమున్నత విలువలను బోధించే వాల్మీకి – వ్యాస మహర్షుల ఆదర్శ జీవన

చరితలను అధ్యయనం చేయించటం ద్వారా విద్యార్థులకు విజ్ఞానంతో బాటు, ప్రాచీన భారతీయుల ఔన్నత్యాన్ని తెలిపి వారిని పరిపూర్ణ పౌరులుగా తీర్చిదిద్దటం ఈ పాఠ్యాంశ ప్రధాన లక్ష్యం.

## 4.1. సంస్కృత సాహిత్య ఔన్నత్యం:

ఒక దేశం యొక్క సంస్కృతి సౌభాగ్యాలు దాని సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. దేశ సంస్కృతి ఆ సాహిత్యానికి జీవకళను ప్రసాదిస్తుంది. దేశ సంస్కృతి యొక ఉత్థాన పతాలను పరివర్తన పరివర్ధనాలను ఆ దేశ సాహిత్యంలో చూడవచ్చు. సమస్త భారతదేశం యొక్క సంస్కృతి సంస్కృత సాహిత్యంలో ప్రతిబింబిస్తుంది. భారతజాతి గుణశీలాన్ని తీర్చిదిద్దటంలో సంస్కృత సాహిత్యం చూపినంత ప్రభావం మరే ఇతర సాహిత్యం చూపలేదనటంలో అతిశయోక్తి లేదు. అందుకే ఈ భాషా-సాహిత్యాన్ని భారత హృదయానికి దర్పణంగా పండితులు అభిప్రాయపడుతున్నారు.

తపస్సు, త్యాగం, ఉదారత, ఆశావాదం, మానవత, సర్వసమానత్వం వీటన్నిటిని భారతీయులకు బోధించేది సంస్కృత సాహిత్యమే. ప్రజలకు బోధించడమే వేద పురాణ కావ్య నాటకాదుల ప్రయోజనం. ధర్మానికి సత్యానికి విజయం కలుగుతుందని, దానశీలత అన్ని ధర్మాలకన్న మిన్నయని సంస్కృత సాహిత్యం చెప్తున్నది. ఆదర్శ జీవితాన్ని, ఆదర్శ శీతాన్ని, ఆశావాదాన్ని చిత్రించటమే సంస్కృత సాహిత్య ప్రధాన లక్షణం. అందుచేతనే సుఖాంతమైన కథలు మనకు సంస్కృత సాహిత్యంలో కన్పిస్తున్నాయి. ధర్మాధర్మానికి, సత్యాసత్యాలకు, దేవత్వ-రాక్షసత్వాలకు నడుమ సంఘర్షణను సృష్టించి చివరకు ధర్మం, సత్యం, దేవత్వం జయమును పొందినట్లు చూపటమే సంస్కృత సాహిత్యం యొక్క పరమార్థం.

## 4.2. సంస్కృత సాహిత్య విభాగం:

సంస్కృత సాహిత్య చరిత్ర చాలా విశాలమైంది. విశాలమైన సంస్కృత సాహిత్యాన్నంతా ప్రధానంగా మూడు యుగాలుగా విభజించవచ్చు. అవి:

1) వేద వాఙ్మయం

2) స్మృతి వాఙ్మయం

3) లౌకిక వాఙ్మయం

### 4.2.1. వేదవాఙ్మయం:

వేద, బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషద్గ్రంథాలన్ని వేదవాఙ్మయ మనబడుతుంది.

### 4.2.2. స్మృతి వాఙ్మయం:

పురాణ, సూత్ర, ధర్మశాస్త్ర, వేదాంగాలు స్మృతి వాఙ్మయమనబడుతుంది.

### 4.2.3. లౌకిక వాఙ్మయం:

మహాభారత, రామాయణ గ్రంథాలు, కాళిదాసాది కవుల సమస్త కావ్యనాటకాదులు లౌకిక వాఙ్మయము అనబడుతుంది. ఇలాంటి సంస్కృత సాహిత్యం ధర్మ ప్రధానమైందని దానిలో ఐతిహాసిక కథనాలకు స్థానం లేదని కొందరి అభిప్రాయం. ఈ విధంగా అభిప్రాయపడేవారు ప్రాచీన భారతీయుల ఐతిహాసిక దృష్టికోణాన్ని పూర్తిగా అర్థం చేసుకొనలేదనే చెప్పాలి. ఆదర్శయుతమైన, మానవోపయోగమైన సంఘటనలను, ఆయా యుగాలలోని ధర్మరూపాన్ని చెప్పటమే భారతీయుల ఐతిహాసిక

దృక్పథం. ఋగ్వేదంలోనే ఇతిహాసాల రచన వున్నది. "ఇతిహాస మాచక్షతే" అని, "ఇతి ఐతిహాసికాః" అన్న యాస్కుని మాటలు వేదాలలోను ఇతిహాసం కలదని బలపరుస్తున్నాయి. ఇతిహాసం తెలియనివానికి వేదం భయపడుతుందని అన్నదాన్ని బట్టి వేదార్థజ్ఞానానికి ఇతిహాసాధ్యయనం అత్యావశ్యకమని తెలుస్తున్నది.

ఇతిహాస పురాణం పంచమవేదమని ఛాందోగ్యోపనిషత్తులో చెప్పబడింది.

**"ఋగ్వేదం భగవోధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణమితిహాసపురాణం పంచమం వేదానం వేదమ్"**

పురాణాలు ప్రధానంగా ఇతిహాస గ్రంథాలే అని వాటి పంచలక్షణాలే చెప్తున్నాయి.

**"పురాణ ప్రవిభేద ఏవ ఇతిహాసః"**

అని రాజశేఖరుడు ఆ విషయాన్ని తన కావ్యమీమంసలో పేర్కొటూ, ఇతిహాసం-పరక్రియా, పురాకల్పమని రెండు విధలనీ, ఒక్కడే నాయకుడుగా కలిగినది పరక్రియ ఇతిహాసమనీ అందుకు రామాయణము ఉదాహరణని, ఎక్కువ మంది నాయకులుగా కలిగినది పురాకల్ప ఇతిహాసమనీ అందుకు మహాభారతం ఉదాహరణని స్పష్టంగా తెలియజేశాడు.

**"పరక్రియా పురాకల్ప ఇతిహాస గతిర్ద్విధా।**
**స్యాదేక నాయకా పూర్వా ద్వితీయా బహునాయకా"**

సంస్కృత వివిధ సాహిత్యం ప్రక్రియలలో ఒకటైనది, గొప్పదైనది ఐన ఇతిహాస ప్రక్రియలో తొలి సంస్కృత ఇతిహాస కావ్యంగా ఖ్యాతి గడించిన శ్రీమద్రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి ఔన్నత్యాన్ని గూర్చి తెలుసుకుందాం.

## 4.3. వాల్మీకి మహర్షి జీవన వృత్తం:

వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించారనటంలో ఎలాంటి సందేహం లేదు. ఐతే ఎవరీ వాల్మీకి? అతని జన్మవృత్తాంత మేమిటన్న సందేహం మనకు కలగటం సహజం.

స్కాంద పురాణంలో ఉమాసంహితలో రామాయణ మాహాత్మ్యంలో బ్రహ్మ స్వయంగా, వాల్మీకికి చెప్పినదాన్ని బట్టి అతని పూర్వజన్మవృత్తాంతం ఇలా తెలుస్తుంది.

వరుణుడు అనే మహర్షికి పుత్రుడు హరితుడు. నెమలితో ఆడుకోవడం అతనికి చాలా ఇష్టం. ఒకసారి సనత్కుమారుల వారిని శాస్త్ర చర్చకై వరుణుడు తన యింటికి పిలుస్తాడు. శాస్త్ర చర్చ సాగుతుంటే, హరితుడు పెంపుడు నెమలితో అల్లరి ప్రారంభిస్తాడు. తండ్రి ఒకసారి, అటుపైన సనత్కుమారుల వారు ఒకసారి 'అలా నెమలితో ఆడుతూ చర్చకి ఇబ్బంది కల్గించవద్దు.' అని హరితుణ్ణి మందలించారు. అయినా హరితుడు బాల్యం కారణంగా అల్లరి చేస్తూనే ఉన్నాడు. ఇలా రెండుమార్లు వారించినా ప్రయోజనం లేకపోవటంతో 'కిరాత ధర్మంతో ప్రవర్తిస్తున్నావు కాబట్టి, భృగువంశంలో ప్రచేతునియింట కిరాత ధర్మంతో పుట్టు' అని సనత్కుమారులవారు శపించారు. శాపప్రభావం వలన ఋక్షుడనే పేరుతో భృగువంశంలో ప్రచేతసుని పదవ కుమారునిగా జన్మిస్తాడు.

**"ఋక్ష్యో భూద్భార్గవ స్తస్మాత్ వాల్మీకిర్యోభి ధీయతే"**

అని విష్ణుపురాణం ఋక్షుడే వాల్మీకి అయినట్లు పేర్కొంది.

**"ప్రచేత సోऽహం దశమః పుత్రో రాఘవ నందన"**

అని రామాయణంలోని ఉత్తరకాండలో తాను ప్రచేతుని పదవ కుమారుడను కాబట్టి ప్రాచేతసుడను అని స్వయంగా వాల్మీకి చెప్పుకున్నాడు.

ఇక భృగువంశంలో పుట్టడంచేత భార్గవుడనీ, (భార్గవేణ మహాత్మనా! – తపస్వినా) అని రామాయణం చెబుతుంది. ప్రచేతునికి 'వాల్మీకి మహర్షి' అని పేరు కూడా ఉంది. వల్మీకుని కుమారుడు గనుక వాల్మీకుడు (వల్మీక స్యాసత్యం పుమాన్) అనే పేర్లు కూడా కన్పిస్తాయి.

**4.3.1. ఋక్షుడు వాల్మీకి మహర్షిగా మారుట:**

భృగువంశమున జన్మించినప్పటికినీ రజస్తమోగుణ ప్రేరేపితుడైన ఋక్షుడు హింసాప్రవృత్తితో చరించేవాడు. ఆటవిక వృత్తిలో రమించేవాడు. కుటుంబ పోషణకై పరులను హింసించటానికీ వెనుకాడేవాడు కాదు. ఇలా కిరాతధర్మంతో ఉన్న ఋక్షుణ్ణి అనుగ్రహించి, శ్రీమద్రామాయణ కర్తగా చేయవలసిన కాలం సమీపిస్తుందని గమనించిన సప్తమహర్షులు ఋక్షుడు నివసించే త్రోవ వైపునకు వెళ్ళారు. సప్తమహర్షులనీ చెట్టుకు కట్టేస్తే, నారదుడు, ఋక్షుణ్ణి – నీ పాపంలో ఫలం, భార్యా పుత్రులకి ఉందా? లేదా? తెలిసికొనిరా!' అని పంపుతాడు.

జన్మసంస్కారమూ, జీవితంలో రాబోయే కాలంలో మార్పు ఉండటం వలన, వెళ్ళి తెలిసికొని వచ్చి, కనువిప్పు కలిగినవాడై, కట్లువిప్పి, సాష్టాంగ పడతాడు ఋక్షుడు. తన పుణ్యంలో భాగం భార్యాపుత్రులకుంది గానీ పాపంలో మాత్రం కాదని తెలిసి, జీవితాన్ని తరించే మార్గం తెల్పమని ప్రార్థించాడు. అనుగ్రహించిన నారదుడు అతనికి రామనామాన్ని వ్యత్యస్తంగా (ముందుది వెనుకకు, వెనుకది ముందుకు) 'మరా' అని' ఉపదేశించాడు. దాన్నే 12 లక్షల మార్లు అక్కడే కూర్చుని ఋక్షుడు జపించాడు. దేహస్మృతి కూడా దూరమైంది. అతని చుట్టూ పుట్టలు పెరిగాయి. ఋక్షుని పూర్తిగా కప్పేశాయి. అయినా అతడు చలించలేదు. తీవ్రమైన తపస్సులో నిమగ్నమయ్యాడు.

నారదుడు తిరిగివచ్చాడు. పుట్టలు పెరిగిన ఋక్షుణ్ణి చూచి, వల్మీకం (పుట్ట) నుండి వచ్చినవాడివి కాబట్టి 'వాల్మీకి' వి ఔతవనీ ఈ పేరు చిరస్థాయి ఔతుందనీ తెల్పాడు.

**'వల్మీక ప్రభవో యస్మాత్ తస్మాద్వాల్మీకి రిత్యసౌ'**

ఇలా నారద మహర్షి అనుగ్రహంతో వాల్మీకి తన ఆశ్రమమున రామ మంత్రమును శిష్యులతో గూడి జపిస్తుండేవాడు.

**4.4. రామాయణ రచనకు పూర్వ నేపథ్యం:**

భగవదాజ్ఞానుసారం ఒకనాడు నారదుడు వాల్మీకి ఆశ్రమానికి వస్తాడు.

**"తపస్స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరమ్!**
**నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్ముని పుంగవమ్॥"**

ఎప్పుడూ తపస్సు, వేదపఠనమూ అనే రెంటినీ చేస్తుండేవాడూ, మహాపండితుడూ అయిన నారద మహర్షికి, తపోధనుడైన వాల్మీకి మహర్షి నమస్కరించి –

"ఓ మహర్షీ! సర్వ సద్గుణ సంపన్నుడైనవాడు ప్రస్తుతం ఈ ప్రపంచంలో ఎవ్వడున్నాడు? సుగుణ సంపదతో పాటు పరాక్రమవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యవాక్యములు కలవాడు, దృఢవ్రతుడు, సదాచారవంతుడు, సర్వభూత హితుడు విద్వాంసుడు, సమర్థుడు, సదాప్రియదర్శనుడు, ఆత్మవంతుడు, జితక్రోధుడు, ప్రకాశరూపుడు, అసూయలేనివాడు అగు

పురుషుడు ఎక్కడున్నాడు? ఎవడు యుద్ధమున కోపించినచో దేవతలు కూడా భీతిచెందుదురో అట్టివారిని గూర్చి నేను వినగోరుచున్నాను. మహర్షీ! అట్టివానిని గూర్చి నీకు తప్పక తెలిసి ఉంటుంది. అతణ్ణి గురించి వినాలని నేను కుతూహలపడుచున్నాను" అని వాల్మీకి నారద మహర్షిని ప్రార్థించాడు.

నారదుడు వాల్మీకి యొక్క 16 గుణములకు సంబంధించిన ప్రశ్నలను విని, ఓ మునీ! ఇన్ని గుణాలున్నవాడు భూలోకంలో ఉండడం అసంభవం. అయినా ఇక్ష్వాకువంశంలో పుట్టి 'రాముడు' అని ప్రసిద్ధికెక్కిన వాడు ఒకడున్నాడు అని మొదలుపెట్టి, మొత్తం రామకథంతా సంక్షిప్తంగా చెప్పేశాడు.

### 4.5. ఆదికవి – ఆదిశ్లోకం:

అనంతరం నారద మహర్షి ఆకాశమార్గమున దేవలోకమునకు వెళ్ళాడు. మహర్షి బోధించిన రమ్యమైన రామకథను మననం చేసుకుంటూ పులకాంకితుడైనాడు వాల్మీకి.

ఆ స్థితిలోనే తన శిష్యుడైన భరద్వాజునితో కలసి స్నానము ఆచరించుటకు తమసానదికి బయలు దేరాడు. తమసా నదీ తీరాన బురదలేని రేవును చూచి – 'భరద్వాజా! ఈ రేవును చూడు. బురదలేదు. మనోహరంగా మహాత్ముని మనస్సువలె ఉంది' అని పలికి 'నాయనా! భరద్వాజా! ఆ జల పాత్రను క్రింది పెట్టి, నాకు వస్త్రమును ఇమ్ము, పవిత్రమైన ఈ తమసా తీర్థములో స్నానం చేస్తాను' అన్నాడు వాల్మీకి మహర్షి. నార వస్త్రమును తీసికొని తమసానదీ తీరము నందలి విశాలమైన వన ప్రదేశమును దర్శిస్తూ సంచరిస్తున్న వాల్మీకి మహర్షి దృష్టిని దారిప్రక్కన ఒక చెట్టుపై క్రీడించుకున్న క్రౌంచ పక్షుల జంట ఆకర్షించింది.

కామమోహితమైన ఉన్న క్రౌంచ పక్షుల జంటలో మగపక్షిని బోయవాడు బాణంతో కొట్టాడు. అది విలవిల తన్నుకుంటూ, క్రిందపడి రక్తసిక్తమైన దేహంతో మరిణించింది. అది చూచి ఆడపక్షి మగపక్షి చుట్టూ తిరుగుతూ విలపించసాగింది.

ఆ సన్నివేశము ధర్మాత్ముడైన వాల్మీకి హృదయాన్ని ద్రవింప చేసింది. దయామయుడైన వాల్మీకి మనసు శోకసముద్రంలా తయారైంది. మహర్షి నిషాదుని (బోయవాని) వైపు తిరిగి –

**"మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీ స్సమాః**
**యత్ క్రౌంచ మిథునాదేక మవధీః కామమోహితమ్॥"**

"ఓరీ బోయవాడా! నీవు క్రౌంచపక్షుల జంటనుండి కామమోహితమైయున్న ఒక పక్షిని కొట్టి చంపావు. కనుక నీవు ఎక్కువ కాలము జీవించ కుందువు గాక!" అని శపించాడు.

క్రౌంచ పక్షిని జూచి, జాలిపడి మహర్షి ఆవేదనతో పలికిన పలుకులు ఛందో బద్ధమైన శ్లోక రూపాన్ని పొందడం వాల్మీకికే ఆశ్చర్యాన్ని కలిగించింది. అనంతరం చతుర్ముఖ బ్రహ్మ వాల్మీకి మహర్షి ఆశ్రమానికి వచ్చి –'మహర్షీ! నీవు పలికింది శ్లోకమే. నా సంకల్పం వల్లనే ఆ శ్లోకము నీనుండి పుట్టింది. శ్రీరాముని సంపూర్ణ చరితమును నీవు కావ్యరూపమున రచించు. నీ నుండి వెలువడే ఏమాట కూడా అసత్యం కాదు. ఈ ప్రపంచమున గిరులు, నదులు ఉన్నంతవరకు నీవు రచించే రామకథ కూడా ఉంటుంది" అని పలికి అంతర్ధానయ్యెను.

**"యావత్ స్థాస్యన్తి గిరయః సరితశ్చ మహీతలే**
**తావ ద్రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి"**

పిమ్మట బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారము రామకథకు సంబంధించిన అన్ని విషయాలను దర్శించి, వేదసార సంగ్రహ రూపమైన రామకథను కరుణరస ప్రధానముగా, 24,000 శ్లోకాలు, 500 సర్గలు, 7 కాండలతో సర్వజన హృదయ మనోహర కావ్యంగా రచించి సంస్కృత సాహిత్యంలో ఆదికవిగా అవతరించి, ఆదికావ్యంగా శ్రీమద్రామాయణాన్ని రచించాడు.

## 4.6. వాల్మీకి మహర్షి రచనా శైలి:

వాల్మీకి శైలి ప్రసాదగుణ భరితమైంది. లలిత సరళ పదాల కూర్పు ఇతని ప్రత్యేకత. కవిత్వమంతా ధారాశుద్ధితో మాధుర్య భరితమై పాఠకులను అలరిస్తున్నది. సందర్భానుకూలంగా వాల్మీకి ఉపమ, ఉత్ప్రేక్ష, రూపకార్యలంకారాలను ప్రయోగించాడు. అక్కడక్కడ శబ్దాలంకారాలు కూడా మనకు కనిపిస్తాయి. వస్తు వర్ణనలలో వాల్మీకిది అందెవేసిన చేయి. కవితాగుణాన్ని విడువక, పుర, ఉద్యాన, పర్వత, అరణ్య, ఋతు, చంద్రోదయ, ఆశ్రమ, యుద్ధాది వర్ణనలను అత్యంత రమణీయంగా వర్ణించి, ముందుతరాల మహాకావ్యాలకు అవసరమైన, ఆదర్శమైన వర్ణ్య వస్తువులను అందించిన మహాకవి వాల్మీకి. సహజ రమణీయ వర్ణనతో, రసప్లావితమైన కవిత్వంతో రమ్యమైన రామాయణ కథను మనకందించాడు ఈ 'ఆదికవి'.

భారతీయుల నిస్స్వార్థమైన, కాంక్షారహితమైన మానవ ప్రేమ, అతిథి ప్రేమలను హృద్యంగా చిత్రించి, జాతి హృదయాన్ని బంధించి కావ్యరూపంలో పెట్టిన ఘనుడు. భాస, కాళిదాసు, భవభూతి వంటి ఎందరో కవిపుంగవులకు ఆదర్శ ప్రాయుడై, జాతి యొక్క నాడిని తెలుసుకొని స్పందింపజేసే జాతీయ కవివరేణ్యుడు వాల్మీకి.

**"వాల్మీకేర్ముని సింహస్య కవితా వనచారిణః।**
**శృణ్వన్ రామకథా నాదం కోనయాతి పరాంగతిమ్॥"**

## 4.7. వ్యాస పరంపర:

చతుర్వేదములను విభజించినది, అష్టాదశ పురాణములను విరచించినది వ్యాసభగవానుడేనన్నది లోక ప్రసిద్ధము. అసలు 'వ్యాసుడు' అన్నది కేవలం ఒక వ్యక్తి పేరు కాదని, అది ఒక ఉన్నత పదవియని పండితుల అభిప్రాయం.

'వ్యస్యతీతి వేదః'- ఎవరు వేదములను, పురాణములను విభజించినాడో అతడే వేదవ్యాసుడు.

ఎప్పుడు ధర్మానికి హాని కలుగుతుందో అప్పుడు మానవకళ్యాణం కొరకు విష్ణుభగవానుడు వ్యాసరూపంలో ప్రతి ద్వాపరయుగమనందు అవతరిస్తాడన్నది శిష్టజనుల విశ్వాసం. విష్ణుపురాణమునందు ఇదే విషయము ఈ విధంగా చెప్పబడింది.

**"ద్వాపరే ద్వాపరే విష్ణుర్వ్యాసరూపో మహామునే!**
**వేదమేకం సుబహుధా కురుతే జగతో హితః॥**
**వీర్యం తేజో బలం చాల్పం మనుష్యాణామవేక్ష్యచ।**
**హితాయ సర్వభూతానాం వేద భేదాన్కరోతి సః॥"**

దేవీ భాగవతంలో కూడా అట్లా చెప్పబడింది -

**"ద్వాపరే ద్వాపరే విష్ణుర్వ్యాసరూపేణ సర్వదా।**
**వేదమేకం తు బహుధా కురుతే హితకామ్యయా॥**
**అల్పాయుషోఽల్ప బుద్ధీంశ్చ విప్రాన్ జ్ఞాత్వా కలావథ।**
**పురాణ సంహితం పుణ్యాం కురుతేఽసౌ యుగే యుగే॥"**

ఇప్పటివరకు ప్రతిద్వాపరయుగమునంను 28 మంది వ్యాసులు అవతరించారని విష్ణుపురాణం పేర్కొంటుంది. వారు క్రమముగా -

| | |
|---|---|
| 1) స్వయంభువ (బ్రహ్మ) | 2) ప్రజాపతిః |
| 3) ఉశ్నః (శుక్రాచార్యః) | 4) బృహస్పతిః |
| 5) సవితా | 6) మృత్యుః (యమః) |
| 7) ఇంద్రః | 8) వశిష్టః |
| 9) సారస్వతః | 10) త్రిధామా |
| 11) త్రిశిఖః | 12) భరద్వాజః |
| 13) అంతరిక్షః | 14) వర్ణీ |
| 15) త్రయ్యారుణః | 16) ధనంజయః |
| 17) ఋతుంజయః | 18) జయస్మృతః |
| 19) భరద్వాజః | 20) గౌతమః |
| 21) హర్యాత్మా | 22) వాజశ్రవసః |
| 23) సోమశుష్మాయణతృణబిందుః | 24) భార్గవఋక్షః (వాల్మీకిః) |
| 25) శక్తిః | 26) పరాశరః |
| 27) జాతుకర్ణః | 28) కృష్ణద్వైపాయనః |

రాబోయే ద్వాపరయుగములో ద్రోణపుత్రుడు అశ్వత్థామ వ్యాసరూపంలో అవతరిస్తాడని విష్ణుపురాణంలో ఇలా చెప్పబడింది.

**"భవిష్య ద్వాపరే చాపి ద్రౌణిర్వ్యాసో భవిష్యతి।"**

పై విషయాలను పరిశీలించినపుడు వ్యాసుడనేవాడు ఒకడు కాదనీ, అనేకమంది కలరని తెలుస్తుంది. వ్యాసత్వం అనునది ఒక ఆచార్య పీఠమనియూ ఒక్కొక్క ద్వాపరయుగమున ఒక్కొక్క తపస్సంపన్నుడగు మహనీయుడు, వ్యాసుడై ఆ పీఠమధిరోహించి, మరల మరల అష్టాదశ పురాణములను రచించుననియూ, ఆ మహనీయుని రచనలు యుగాంతము వరకూ సార్వజనీనములనియూ తెలియుచున్నది.

## 4.8. కృష్ణద్వైపాయన వ్యాసుని జీవన వృత్తం:

ప్రస్తుతం జరుగుతున్న వైవస్వత మన్వంతరంలో ఇప్పటివరకు ఇరవై ఎనిమిది ద్వాపర యుగాలు గడిచిపోయాయి. ఆయా యుగాలలో అవతారం దాల్చిన వ్యాసులను వ్యాసపరంపరతో తెలుపటం జరిగింది. దీనిని బట్టి వైవస్వత మన్వంతరంలో ఏర్పడిన ద్వాపరయుగానికి వ్యాసునిగా కృష్ణద్వైపాయనుడు అవతరించాడని మనకు తెలుస్తున్నది.

సాక్షాత్తు భగవాన్ నారాయణుడే సత్యవతీ సుతుడూ, కృష్ణద్వైపాయన వ్యాసునిగా జన్మించాడని భారతీయుల విశ్వాసం. ఉత్తర భారతదేశములోని యమునానదీ తీరంలోని ఒక చిన్న ద్వీపములో దాశరాజు కుమార్తె అయిన సత్యవతి అను కన్యకకు,

పరాశరుడును ఒకానొక మహాఋషివలన సద్యోగర్భంలో పుట్టినవాడు ఇతడు.

దాశరాజు కుమార్తె అయిన ఈ సత్యవతికి 'మత్స్యగంధి' అనేది పూర్వనామము. పరాశరుడు ఆమె మత్స్యవాసనను పోగొట్టి సువాసన కలదానిగా చేశాడు. అప్పుడు ఆమెకు యోజనగంధి అని పేరు కలిగింది. ఆమెను తర్వాత కురురాజు శంతనుడు వివాహమడాడు. అప్పుడు ఆమె పేరు సత్యవతి అయింది.

వ్యాసుడు సత్యవతీ - పరాశరులకు ద్వీపంలో జన్మించటం వలన 'ద్వైపాయనుడనియూ, శరీరపురంగు నల్లన యగుటచే 'కృష్ణుడూ' అనియూ, ఈ రెండు పేర్లూ కలిపి కృష్ణద్వైపాయనుడనియూ అతనికి పేర్లు ఏర్పడినవి. వేదవిభజనం చేయటంచేత ఇతనికి "వేదవ్యాసుడు" అను పేరు సుప్రసిద్ధమైనది. వేదవ్యాసుని పారివారిక పరంపర మహాభారతంలోని శాంతి పర్వమునందు, విష్ణు సహస్ర నామములందు ఇలా చెప్పబడింది.

**"వసిష్ఠస్య సుతః శక్తిః శక్తేః పుత్రః పరాశరః।**
**పరాశరస్య దాయాదః కృష్ణద్వైపాయనో మునిః॥"**

**"వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్।**
**పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్"॥**

వశిష్ఠ మహర్షికి పుత్రుడు శక్తి. శక్తికి పుత్రుడు పరాశరుడు. పరాశరునికి కుమారుడు కృష్ణద్వైపాయనుడు అగువ్యాసుడు. శుకునికి తండ్రి. ఇది కృష్ణద్వైపాయకుని వంశక్రమం.

బ్రహ్మ
↓
వశిష్ఠుడు
↓
శక్తి
↓
పరాశరుడు
↓
కృష్ణద్వైపాయనుడు
↓
శుకమహర్షి

పుట్టుకతోనే పండితుడు. మహాభారత ఇతిహాస కావ్యంలోని సంఘటనలను ప్రత్యక్షంగా చూచినవాడు వ్యాసుడు. మహాభారతంలో పలుసందర్భాలలో అతడు మనకు కనిపిస్తాడు. పాండవులు అరణ్యవాసం చేస్తున్నప్పుడు వ్యాసుడు వారి దగ్గరికి పోయి ఉపదేశం చేసి వారిని ఓదారుస్తాడు. పాశుపత ప్రాప్తికై ఉపాయాన్ని చెప్తాడు. దుర్యోధనునికి యుద్ధం చేయవద్దని నచ్చచెప్తాడు. కురుక్షేత్ర యుద్ధ సమయంలోను, వ్యాసుడు చాలాసార్లు కనిపిస్తాడు. యుద్ధానంతరం ధర్మరాజుకు

మనశ్శాంతి కలిగించి అతన్ని శరీరత్యాగప్రయత్నం నుంచి మరలించి, రాజోచిత కర్తవ్య పాలనను బోధిస్తాడు. వ్యాసుని తపః ప్రభావం చేత కురుక్షేత్ర యుద్ధంలో మరణించిన కౌరవ పాండవ వీరులు గంగాజలాలల్లో కనిపిస్తారు. ఇలా కురువంశ క్షేమానికై అహరహం శ్రమించి వారందరినీ సరియైన మార్గంలో నడిపించడానికి ప్రయత్నించిన మార్గదర్శిగా వేదవ్యాస మహర్షి కనిపిస్తాడు.

## 4.9. వ్యాస మహర్షి సాహితీ వ్యాసంగం:

కృష్ణద్వైపాయన వ్యాసుని పేరున జరిగిన సాహితీ వ్యాసంగము వ్యవహార దృష్ట్యా ఐదంశములుగా విభజించవచ్చును.

1) వేద విద్యను వివిధ శాఖలుగా విడదీసి అందించుట (చతుర్వేదములు)

2) వేద ప్రతిపాదితమైన పరాతత్త్వమును 'బ్రహ్మ సూత్రములు' గా సూత్రీకరించుట

3) వేదోపబృంహణముగా అష్టాదశ పురాణములను రచించుట

4) ఇట్టి సర్వవైదిక విజ్ఞానమునూ, మానవ జీవనమునకు అన్వయించి, సామాన్యజనులకవగాహన చేయుటకై పంచమ వేదమనబడిన 'మహాభారతము' అను ఇతిహాసమును 18 పర్వములుగా విభజించి రచించుట.

5) పామరుడైననూ నిత్యము పఠించుకొను రీతిగా విశ్వవిజ్ఞానమునంతనూ విష్ణు, దుర్గా, శివ సహస్ర స్తోత్రములలో నిబంధించుట అనునవి వ్యాస సాహితీ వ్యాసంగమున పంచాంగములుగా పేర్కొనవచ్చును.

### 4.9.1. చతుర్వేదములు:

వైదిక ఋషులు తాము దర్శించిన విజ్ఞానమును వివిధ సంహితలుగా కూర్చి, గురుశిష్యపరంపరలో అధ్యయనాధ్యాపనాలలో, ముందుతరాల వారికి అందిస్తూ వచ్చారు. కృష్ణద్వైపాయన వ్యాసుని కాలంనాటికి, యిట్టి వైదిక విజ్ఞానము అనంతంగా పెరిగి, గజిబిజిగా చిక్కులు పడియున్నది. దానినంతటినీ పరిశీలించిన వ్యాసుడు విషయ, వినియోగ, ప్రాధాన్యతలను బట్టి వర్గీకరించాడు. ప్రార్థనా రూపమునన్నున్న మంత్రములను ' ఋక్కులు' గానూ, యజ్ఞయాగాది క్రతువులలో వినియోగ విధులకు ఉపయుక్తముగా 'యజస్సు' లు గనూ, స్వర ప్రాధాన్యమును బట్టి 'సామములు' గనూ, ఐహిక జీవనమునకు అవసరమైన, విశేష విద్యలను అందించు మంత్రములను 'అథర్వణములు' గనూ విడదీసి – అట్టి ఒక్కొక్క సంహితనూ ఒక్కొక్క ఋషి పరంపరకు అప్పగించాడు.

ఋగ్వేదశాఖను 'పైలుడు', యజుర్వేద శాఖను 'వైశాంపాయనుడు, సామవేదశాఖను 'జైమిని', అథర్వవేద శాఖను 'సుమంతుడు' వ్యాస మహర్షి నుంచి గ్రహించి ప్రచారం చేశారు. ఆవిషయమే పద్మపురాణాలు ఇలా చెప్పబడింది.

**"పారాశర్యో మహాయోగీ, కృష్ణద్వైపాయనో హరిః**
**ఆరాధ్య దేవమీశానం దృష్ట్వా సాంబం త్రిలోచనం॥**
**తత్ప్రసాదాద సౌవ్యాసం వేదానామకరోత్ప్రభుః॥**
**అథశిష్యాన్ప్రజ గ్రాహ చతురోవేద పారగాన్॥**
**ఋగ్వేదస్య చ తం 'పైలం' జగ్రాహ సరహాద్యుతిః॥**
**యజుర్వేద ప్రవక్తారం "వైశంపాయన" మేవచ॥**

**'జైమిని' సామవేదస్య శ్రావకం సో అన్వపద్యత।**

**తథైవాథర్వవేదస్య 'సుమన్తుం' ఋషిసత్తమమ్॥"**

ఈ విధంగా సనాతన వేదవిజ్ఞానాన్ని తరతరాలకూ అందచేసే, శాశ్వత వ్యవస్థను వ్యాసుడు ఏర్పాటు చేశాడు. తత్ఫలితముగానే, తదనంతర మనషులు వేద విద్యలాధారముగా, విశ్వవిఖ్యాతిగాంచిన వివిధశాస్త్రములకు కళలకు, భౌతిక విద్యలకు కూడా శ్రీకారము చుట్టి భారతీయ సాహిత్యమును విస్తరింపచేశారు.

**4.9.2. బ్రహ్మసూత్రములు:**

వేదము సర్వవిజ్ఞానమునకు నిలయమే. కానీ మనిషికి కలిగెడి ప్రాథమికమైన జిజ్ఞాసకు అనగా ఈ సృష్టి రహస్యమేమిటి? దీనికి మూలకారణం ఏంటి? ఎచటినుండి ఇదియంతయూ వచ్చుచున్నది? ఎచటకు పోవుచున్నది ప్రశ్నలకు సమాధానము వేదవ్యాసుడు రచించిన 'బ్రహ్మ సూత్రము' లలో లభించుచున్నది.

ఈ బ్రహ్మ సూత్రములలో నాలుగు అధ్యాయాలున్నాయి.

**మొదటిది సమన్వయాధ్యాయము:**

సృష్టికి మూలకారణమైన బ్రహ్మపదార్థం గురించి తన కాలము వరకూ వినవచ్చిన భావాలనన్నింటనీ వ్యాసుడు సమన్వయము చేయుట ఇందు జరిగినది.

**రెండవది అవిరోధార్యాయము:**

తనకు పూర్వమున్న ఋషులు దర్శించిన విజ్ఞాన విశేషములో పరస్పర విరోధము లేదని, వారిని ఒక క్రమమున తీర్చిదిద్ది విషయ ప్రతిపాదనమును వ్యాసుడు ఈ అధ్యాయమును ప్రతిపాదించెను.

**మూడవది సాధనాధ్యాయము:**

దీనిలో వివిధ మానవ ప్రవృత్తుల విశ్లేషణము జరిపి ఆత్మజ్ఞానమే మానవ పరమావధియని వ్యాసునిచే సూచింపబడింది.

**నాలుగవది ఫలాధ్యాయము:**

ఇందు మానవ జీవన సాధనా గమ్యమైన ఆనంద స్వరూపమెట్టిది? అట్టి శాశ్వతానందము ఎట్లు కలుగును? వంటి విషయములను వ్యాసుడు పొందుపరిచాడు.

ఈ విధంగా సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపము అనంతము, అవ్యయము, నిత్యశుద్ధము, అద్వితీయము అనియూ, ఈ చరాచర విశ్వమంతయూ పరమాత్మనుండియే విస్తరించినదనియూ, అనంతమైన కాలములో, ఆ పరమాత్మయే మాయావరణమున సృష్టి, స్థితి, లయాత్మకమైన విశ్వముగా పరిణమించుచున్నాడనియూ, పరమాత్మయొక్క ఇట్టి ప్రవృత్తి నివృత్తులు, అతని లీలావిలాసములనియూ, భౌతికమైన ఈ దృశ్యమాన జగత్తు అంతయూ మిథ్య అనియూ, పరమాత్మ యొక్క నిత్యత్వము మాత్రమే సత్యమనియూ వ్యాసుడు ప్రశ్న-సమాధానముల రూపంలో ఈ బ్రహ్మసూత్రాలో ప్రతిపాదించాడు. ఈ విధమైన రచనా పథకము శాస్త్ర విద్యా వివేచనా మార్గమునకు వ్యాసుడు పెట్టిన ఒక ఒరవడిగా సార్వకాలికతను సంతరించుకొనినది.

**4.9.3. అష్టాదశ పురాణములు:**

సృష్టికి మూలమైన బ్రహ్మపదార్థాన్ని వివరించిన తర్వాత దానిని నుండి ఈ విశ్వమంతా ఎలా వచ్చింది? అనే జ్ఞానమును సామాన్యులకు సైతం అందించేందుకు వ్యాసుడెంచుకున్న సాహిత్య ప్రక్రియ పురాణం. 'పురాణం పంచలక్షణం'

అని దాని నిర్వచనం. అనగా సర్గము (సృష్టి కథ), ప్రతిసర్గము (ప్రళయ వృత్తాంతం), వంశము (రాజుల, మహర్షుల వంశావళి), మన్వంతరం (ప్రతి మనువు యొక్క కాలగణన), వంశానుచరితం (విశిష్టమైన వంశములందు జన్మించిన ప్రభువుల యొక్క వంశ చరితలు) ఈ పురాణమునందుండవలెను. ఇటువంటి 18 పురాణములు వ్యాసునిచే రచింపబడినవని దేవీభాగవతం ఇలా చెబుతుంది.

**"మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయమ్।**

**అనాపలింగ కూస్కాని పురాణాని పృథక్ - పృథక్॥"**

| | | | | |
|---|---|---|---|---|
| 'మ' ద్వయమ్ | - 1) మత్స్య, | 2) మార్కండేయ పురాణములు | | |
| 'భ' ద్వయమ్ | - 3) భవిష్య, | 4) భాగవతపురాణములు | | |
| 'బ్ర' త్రయమ్ | - 5) బ్రహ్మాండ, | 6) బ్రహ్మ, | 7) బ్రహ్మవైవర్త పురాణములు | |
| 'వ' చతుష్టయమ్ | - 8) విష్ణు, | 9) వాయు, | 10) వరాహ, | 11) వామన పురాణములు |
| 'అ' | - 12) అగ్ని పురాణము | | | |
| 'నా' | - 13) నారద పురాణము | | | |
| 'ప' | - 14) పద్మ పురాణము | | | |
| 'లిం' | - 15) లింగ పురాణము, | | | |
| 'గ' | - 16) గరుడ పురాణము | | | |
| 'కూ' | - (17) కూర్మపురాణము | | | |
| 'స్కా' | - 18) స్కాంద పురాణము. | | | |

'ఒకే పరాతత్వం ఈ విశ్వరూపంగా ఎలా ఆవిష్కృతమైనది?' అన్న అంశాన్ని కథల, కథలుగా వివరించే ప్రయత్నం ఈ అష్టాదశ పురాణాల్లో వున్నది. వీనిలో మానవుని పాత్ర ప్రధానం కాదు. సర్గ, ప్రతిసర్గలు, మన్వంతరముల కథ, భౌగోళికాంశముల, చారిత్ర విషయముల నిరూపణమే ప్రధానము. ఈ విషయాలన్నింటినీ సామాన్యునకు తేలికగా అర్థమయ్యేలా అష్టాదశ పురాణాలలో మానవ పాత్రలను ప్రతీకలుగా వేదవ్యాసహర్షి మలిచాడు.

### 4.9.4. మహాభారతము:

వ్యాస సాహిత్యమున నాల్గవ భాగముగా పరిశీలింపదగినది పంచమవేదమనబడిన మహాభారతము. దీనికి ఇతిహాసమని పేరు. ఇతిహాసమనగా 'ఇట్లు జరిగనదని' ఒక యదార్థ విషయమును గూర్చి చెప్పు కథ. ఈ భూమిపై ఒకనాడు జరిగిన కుర పాండవ వంశ చరితమిది. రాజ్యము కొరకై దాయాదులు జరిపిన దారుణ యుద్ధం. దానియందు సమకాలీన సమాజమంతయు భాగస్వామియై, రాజులు తలకొక పక్షానచేరి, ఒకరినొకరు చంపుకొనిన విషాధగాథ.

"ధర్మయేవహతోహంతి, ధర్మో రక్షతి రక్షితః" అని ధర్మాచరణము యొక్క అవసరమునూ, తద్భ్రంశమున వచ్చు యిబ్బందినీ సూచించూ వ్యాస మహర్షి ఈ భారతమును రచించినట్లు మనకు అవగతమవుతుంది. చివరకు మంచియే జయించింది. ధర్మము స్థాపింపబడింది. "యతో ధర్మః తతో జయః" ఎచట ధర్మమున్నదో అచట జయమున్నదని నిరూపించు

సంఘటన ఇది. దానిలో తానొక పాత్రధారియైన వాడుగా వేదవ్యాసుడు ఈ గాథను 'జయ' మను పేరున తొలుత రచించినట్లు దానిలోని మంగళాచరణ శ్లోకమే చెప్తున్నది.

**"నారాయణం నమస్కృత్యనరంచైవ నరోత్తమమ్।**

**దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్॥"**

వేదవ్యాసప్రోక్తమైన జయేతిహాస కావ్యం మహాభారతం యొక్క మూలరూపంగా భావింపవచ్చు. దీన్ని వ్యాసుడు తన నలుగురు శిష్యులైన పైల, సుమంత, జైమిని, వైశంపాయనులకు మరియు తన కుమారుడు శుకుని చెప్పాడు. వారు తర్వాత దాన్ని నలుమూలల వ్యాపింపచేశారు. అర్జునిని ప్రపౌత్రుడు జనమేజయుడు సర్పయాగం చేశాడు. ఆ యాగానికి వేదవ్యాసుడు కూడా వచ్చాడు. అప్పుడు జనమేయజయుడు కౌరవ – పాండవుల కథను వినిపించమని వేదవ్యాసుణ్ణి కోరగా, 'వైశంపాయన! కౌర పాండవుల కథను నా ద్వారా నీవు విని వున్నావు కదా. ఇప్పుడు దాన్ని జనమేజమునికి వినిపించు" అని వ్యాసుడు వైశంపాయనిని ఆదేశించగా, వైశంపాయనుడు ఆ కథను వినిపించేటప్పుడు జనమేజయునికి కొన్ని సందేమాలు కలిగాయి. వైశంపాయనుడు ఆ సందేహ నివృత్తి చేసిన భాగాలు కూడ ఆ కావ్యంలో చేరాయి. అంటే వైశంపాయుకుని చేత చెప్పబడిన కథ జయేతిహాసానికి రెండవరూపమైన భారతంగా పరిణమించింది. 8,800 శ్లోకాలున్న జయేతిహాసం, 24,000 శ్లోకాలకు పెరిగి భారతమైనది.

జనమేజయుని సర్పయాగ సమాప్తి తర్వాత కొంతకాలానికి నైమిశారణ్యంలో 12 సంవత్సరాల వరకు సాగే యజ్ఞమొకటి ఆరంభమైంది. ఆ యజ్ఞానికి అనేక మహర్షులు విచ్చేయగా, వారిలో రోమహర్షుణుని కొడుకు సౌతి కూడవున్నాడు. ఈ సౌతి జనమేజయుని సర్పయాగ సందర్భంలో వైశంపాయనుడు చెప్పిన భారత కథను విని వున్నాడు. శౌనకమహర్షి ప్రార్థనను అంగీకరించి దాన్ని సౌతి మహర్షులకు వినిపించాడు. ఆ సందర్భంలో శ్రోతలకు కలిగిన అనుమానాలను తీర్చడానికై తాను అనేక వివరణలకు ఉపాఖ్యానాలకు చేర్చాడు. ఇలా విస్తరించిన భారతం శాంత రసాన్ని ప్రధానరసంగా కలిగి, 18 పర్వాలతో, లక్షకు పైగా శ్లోకాలతో 'మహాభారతం' గా అవతరించింది. కృష్ణద్వైపాయనుడని పేరుగల వేదవ్యాసుని'చే వ్రాయబడడం వలన 'కార్ష్ణవేద' మనికూడా విఖ్యాతిగాంచింది. సమస్త వేదోపనిషత్తుల జ్ఞానరహస్యాలను, సమస్త శాస్త్ర సారాన్ని తనలో ఇముడ్చుకుని పంచమ వేదంగా భాసిల్లుతుంది.

## 4.9.5. స్తోత్ర సాహిత్యం:

వేదాలలో వివిధ సూక్తముల ద్వారా నిర్గుణుడు, నిరాకారుడైన పరబ్రహ్మను కొలిచే విధానాన్ని మరింతగా సరళతరం చేసి, విద్యాజ్ఞానము లేని పామరులు సైతం తేలికగా తరించగలిగే విధముగా ఆ పరాత్పరునికి ఒక ఆకారమును కల్పించి, దైవాన్ని ప్రసన్నం చేసుకొనుటకు అతిసులువగు మార్గమైన స్తోత్ర సాహిత్యాన్ని సృష్టించి, వివిధ దేవతామూర్తుల సహస్రనామములను రచించి మానవుడు జీవనసాగరంనుండి సులువుగా తరించుటకు, భక్తి, వైరాగ్య, సమున్నత భావాలు సమాజంలో పెంపొందుటకు, వేదవిజ్ఞానధార కొనసాగుటకు వ్యాసుడు ఎనలేని కృషిచేసినాడు. భారతీయ వాఙ్మయానికి అపర బ్రహ్మగా నిలిచాడు.

**"అచతుర్వదనో బ్రహ్మ ద్విబాహురప హరిః।**

**అఫాలలోచనః శంభుర్భగావాన్ బాదరయాణః॥"**

## 4.10. ఉపసంహారం:

ఇలా భారతీయ సాహిత్య సంపదకు, సంస్కృతభాషాప్రాభవానికి, మానవీయవిలువలకు తమజీవితం ద్వారా, రచనలద్వారా ఇతోధికంగా కృషిసల్పిన వాల్మీకి-వ్యాస మహర్షులు సదా మనకు ప్రాతః స్మరణీయులు. వారి రచనల ద్వారా ఆదర్శ విలువలను పెంపొందించుకొని, ప్రస్తుతం మనం ఉన్నస్థితినుండి మరింత ఉన్నతస్థితికి ఎదిగి మన భారతీయ సంప్రదాయ-సాహిత్య ప్రాభవాన్ని నిలబెడదాం.

## 4.11. ఆధార గ్రంథాలు:


1) సంస్కృత సాహిత్య చరిత్ర - డా॥ ముదిగంటి గోపాలరెడ్డి "వేదాలంకార్" & డా॥ ముదిగంటి సుజాతరెడ్డి

2) చైతన్య రామాయణము - స్వామి సుందరచైతన్యా నంద

3) సంస్కృత సాహిత్యేతిహాసః - ఆచార్య లోకమణి దాహాలః

4) వ్యాస సాహితీ సంహిత - యువ భారతి సంస్థ


## 4.12. రాదగిన ప్రశ్నలు:

1) సంస్కృత సాహిత్యంలో 'ఆదికవి' వాల్మీకి మహర్షి జీవనవృత్తాంతాన్ని వివరించండి?

2) సంస్కృత సాహిత్యంలో 'వేదవ్యాస మహర్షి' యొక్క ప్రాశస్త్యాన్ని మీ పాఠ్యాంశం ఆధారంగా విశదీకరించండి?

**- డా॥ సిహెచ్. పవన్ కుమార్**

పాఠం - 5

# సంస్కృత సాహిత్య చరిత్ర - భారవి, దండి

విషయ క్రమం:


5.0. ఉద్దేశ్యం

5.1. మహాకావ్య సంప్రదాయం

5.2. మహాకావ్య లక్షణాలు

5.3. భారవి మహాకవి జీవిత- కాల విశేషములు

5.4. కిరాతార్జునీయ మహాకావ్య ఇతివృత్తం

5.5. కిరాతార్జునీయ మహాకావ్య వైశిష్ట్యమ్

5.5.1. భారవి వర్ణనా ప్రతిభ

5.5.2. పాత్రచిత్రణ మరియు రసపోషణ

5.5.3. భారవి కవితాశైలి

5.5.4. అలంకార పోషణ

5.5.5. భారవి అర్థ గౌరవం

5.5.6. ఆతపత్ర భారవి

5.6. గద్యకావ్యరచనా పరంపర

5.7. గద్యకావ్య భేదము

5.7.1. ఆఖ్యాయిక లక్షణము

5.7.2. కథ లక్షణము

5.8. దండికాలం

5.9. దండి రచనలు

5.9.1. అవంతి సుందరి కథ

5.9.2. కావ్యాదర్శం

5.9.3. దశకుమార చరిత్ర ఇతివృత్తం

5.9.4. దండి కవిత్వశైలి

5.10. ఆధార గ్రంథాలు

5.11. రాదగిన ప్రశ్నలు


## 5.0. ఉద్దేశ్యం:

సంస్కృత సాహిత్యంలోని మహాకావ్య లక్షణాలను, భార మహాకవి జీవితకాల విశేషములను, కిరాతార్జునీయ మహాకావ్య

ఇతివృత్తము- వైశిష్ట్యమును, గద్యకావ్య రచనాపరంపరను, దండి మహాకవి జీవిత విశేషములను, అతడి రచనలను గూర్చి సవివరంగా విద్యార్థులకు తెలియజేయటమే ఈ పాఠ్యాంశ ప్రధానోద్దేశ్యం.

## 5.1. మహాకావ్య సంప్రదాయం:

"మహత్ కావ్యమ్" మహాకావ్యమౌతుంది. మహాకావ్యమంటే గొప్ప లేక పెద్దకావ్యము అని అర్థం. ఈ కావ్యశైలి వేద బ్రాహ్మణాది సాహిత్యంలో కన్పిస్తుంది. తర్వాత వాల్మీకి రచనాశైలిలో మహకావ్య సంప్రదాయం ఒక స్వరూపాన్ని ఏర్పరుచుకొంది. వ్యాసుని రచనలలో కూడా ఈ సంప్రదాయం కొంతవరకు కనిపిస్తుంది. అలా ఒక స్వరూపాన్ని ఏర్పరచుకొని ఆరంభమైన ఈ మహకావ్య ప్రక్రియ కాళిదాసు-భారవి-మాఘుడు-శ్రీ హర్షుడు-అశ్వఘోషుడు వంటి మహాకవులచే నగిషీలు చెక్కబడి సాహిత్య ప్రక్రియలో ఒక ప్రవాహంలా విస్తరించింది.

## 5.2. మహాకావ్య లక్షణాలు:

మనకు ప్రస్తుతం లభిస్తున్న సంస్కృత కావ్యశాస్త్రాలలో భామహుని కావ్యాలంకారంలో మొదటిసారిగా మహాకావ్య లక్షణాలు చెప్పబడ్డాయి. మహకావ్యం సర్గబంధంతో కూడి, మహాపురుషుని చరిత్ర నిబద్ధమై, అర్థసౌష్టవంతో కూడి, మంత్రణ, దౌత్య, యుద్ధ, నాయకాభ్యుదయాది వర్ణనలను కలిగి, ముఖ-ప్రతిముఖ-గర్భ-నిర్వహణ-అవమర్శ అనే పంచసంధులతో సమన్వితమై ఉండాలని భామహుడు లక్షణాలను నిర్దేశించాడు. భామహుని తర్వాత మహాకావ్య వర్ణ్య వస్తువుల సంఖ్య పెరిగింది.

విశ్వనాథుడు తన సాహిత్యదర్పణ గ్రంథంలో మహాకావ్యలక్షణాలని ఈ విధంగా చెప్పాడు.

**"సర్గబంధో మహాకావ్యం తత్రైకో నాయకః సురః**
**సద్వంశః క్షత్రియో వాపి ధీరోదాత్త గుణాన్వితః**
**ఏకవంశభవ భూపాః కులజా బహవోఽపి వా**
**శృంగార వీరశాంతానా మేకోంగీ రస ఇష్యతే**
**అంగాని సర్వేఽపి రసాః సర్వే నాటక సంధయః**
**ఇతిహాసోద్భవం వృత్తమన్యద్వా స జ్జనాశ్రయమ్**
**చత్వారస్తస్య వర్గాః స్యుస్తేష్వేకం చ ఫలంభవేత్**
**ఆదౌనమస్క్రియా శీర్వా వస్తు నిర్దేశ ఏవ వా**
**క్వచిన్నిందా ఖలాదీనాం సతాంచ గుణకీర్తనమ్**
**ఏక వృత్తమయైః పద్యైరవ సానేఽన్య వృత్తకైః**
**నాతి స్వల్పా నాతి దీర్ఘాః సర్గా అష్టాధికా మతా**
**నానా వృత్తమయః క్వాపి సర్గః కశ్చన దృశ్యతే**
**సర్గాంతే భావి సర్గస్య కథాయాః సూచనం భవేత్**
**సంధ్యా సూర్యేందు రజనీ ప్రదోష ధ్వాంతవాసరాః**

ప్రాతర్మధ్యాహ్న మృగయశైలర్తు వనసాగరాః

సంభోగ విప్రలంభౌచ ముని స్వర్గ పురాధ్వరాః

రణ ప్రయాణోపయమ మంత్ర పుత్రోదయాదయః

వర్ణనీయా యథాయోగం సాంగోపాంగా అమీ ఇహ"

మహాకావ్యం సర్గలుగా విభజింపబడాలనీ, అందు నాయకుడు ఒక్కడే అయినచో అతడు దేవతా పురుషుడుగానీ, ఉన్నతవంశజుడైన క్షత్రియుడు కానీ అయివుండి ధీరోదాత్త గుణాన్వితుడు కావాలనీ, బహునాయకులు కావ్యమునందున్నచో వారందరూ ఒకే వంశానికి చెందిన ఉన్నత క్షత్రియ వంశజులై ఉండాలనీ, శృంగారం కానీ, వీరం కానీ, శాంతంకానీ ప్రధాన రసంగా పోషింపబడాలనీ, అంగరసములగా మిగిలిన అన్ని రసములు పోషింపబడాలనీ, నాటకమున పోషింపబడు పంచసంధులతో సమన్వయమై ఉండాలని, ఇతివృత్తం ఇతిహాసమునకు చెందినదైననూ లేదా సత్పురుషుల చరిత్రకు సంబంధించినదైననూ ఆయివుండాలని, చతుర్విధ పురుషార్థాలలో ఒక్కదాని ఫలాన్నైనా ప్రబోధించగలగాలనీ, ఆశీః-నమస్క్రియా-వస్తునిర్దేశమను మూడింటిలో ఏదో ఒక పద్ధతిలో మహాకావ్యారంభం జరగాలనీ, దుష్టులను నిందించాలనీ, సత్పురుషుల గుణములను కీర్తించాలనీ, సర్గలో అంతటా ఒకే విధమైన ఛందస్సును ప్రయోగించి, సర్గ చివర విభిన్నమైన ఛందస్సులను ప్రయోగించాలనీ, మరీ స్వల్పములుగాక, మరీ దీర్ఘములు గాక మహాకావ్యంలో ఎనిమిది సర్గలకు తగ్గకుండా ఉండాలనీ, సర్గలో ఒకే ఛందస్సుగాక విభిన్నమైన ఛందస్సులను కూడా ప్రయోగించవచ్చునీ, ప్రతిసర్గ చివర రాబోయే సర్గలోని విషయ సూచన చేయాలని, సర్గలోని వర్ణవిషయానుసారంగా సర్గలకు నామకరణం చేయవచ్చుననీ, సూర్య - చంద్రోదయ అస్తమయ, మృగయా (వేట), పర్వత, ఋతు, ఉద్యాన, సముద్ర, సంయోగ-వియోగ శృంగారాదికములు, పుర, వన, మున్యాశ్రమ, స్వర్గలోక యుద్ధము, యుద్ధ ప్రయాణము, దౌత్యము, రాజతంత్ర సమాలోచనము, కుమార జననాది విషయములను న్యూనాధికముగా మహాకావ్యములందు వర్ణించవలెనని మహాకావ్య లక్షణములు చెప్పబడినవి.

ఈ వర్ణనీయ విషయములన్నింటినీ సముచితరీతిలో సంస్కృత మహాకావ్యములైన రఘువంశ - కుమారసంభవ - కిరాతార్జునీయ - శిశుపాలవధ - నైషధీయ - బుద్ధచరితం వంటి మహాకావ్యాల పోషించి సంస్కృత సాహిత్య జగత్తులో మహాకవులుగా వినతికెక్కారు కాళిదాసు-భారవి-మాఘ-శ్రీహర్ష-అశ్వఘోషులు. ఈ మహాకవులలో తనదైన శైలితో సంస్కృత సాహిత్య జగత్తున ప్రత్యేకతను చాటుకున్నాడు మహాకవి భారవి.

## 5.3. భారవి మహాకవి జీవిత-కాల విశేషములు:

భారవి సంస్కృత మహాకవులలో ఒకడు. అలంకారశైలికి ఒకవిధంగా అతడే గురవని చెప్పవచ్చు. శక్తిమంతమైన పదప్రయోగం, భావప్రకటనలు భారవితోనే ఆరంభమయ్యాయి. తర్వాత శ్రీహర్షాది కవులు ఆ మార్గాన్ననుసరించారు.

**భారవి కాలం:**

క్రీ.శ. 634 రెండవపులకేశి నాటిదైన ఐహోళె శాసనంలో కాళిదాసుతోపాటు భారవి ప్రసక్తి వున్నది. దానిచేత భారవి క్రీ.శ. 634 ముందువాడని ఖచ్చితంగా చెప్పవచ్చు. అవంతిసుందరి కథానుసారంగా భారవి విష్ణువర్ధనుని ఆస్థానంలో ఉండెడివాడు. ఈ కథానుసారం భారవి పేరు దామోదరుడు. భారవికి కంచితో, పల్లవరాజులతో సంబంధమున్నట్లు చెప్పబడుతున్నది. పల్లవరాజు సింహవిష్ణువు (క్రీ.శ. 575-600) ఆస్థానంలో భారవి చాలా కాలం వున్నాడని కొందరు విమర్శకుల అభిప్రాయం.

భారవికి చాలామంది పుత్రులున్నారని వారిలో మనోరథుడొకడని, మనోరథుని నాల్గవ కుమారుడైన వీరదత్తుని కుమారుడు దండి అని అవంతిసుందరి కథ చెప్తున్నది. కానీ దామోదరుడు-భారవి ఒక్కరే అనటానికిగానే, దండి భారవి మునిమనుమడు అనటానికిగాని నమ్మదగిన ఇతర ఆధారాలు ఏవీ లేవు.

క్రీ.శ. 634 నాటి ఐహోళె శాసనంలో భారవి కాళిదాసుతో సమానంగా స్తుతింపబడటంచేత దక్షిణ దేశంలోనే అతని కీర్తి వ్యాపించిందని, చాళుక్యులతో అతనికి సంబంధమున్నదని, ఒకవేళ కుబ్జవిష్ణువర్ధనునికి సన్నిహితుడై బాదామిలో వుండి, కుబ్జవిష్ణువర్ధనుడు వేంగికి రాజ ప్రతినిధిగా వచ్చినపుడు అతనితోపాటు వేంగికి వచ్చాడేమో అని మాత్రం ఊహించవచ్చు. కుబ్జవిష్ణువర్ధనుని కాలం క్రీ.శ. 615 ప్రాంతం. కాబట్టి భారవి ఆంధ్రదేశంలోని వేంగిని పాలించిన తూర్పుచాళుక్యవంశ ప్రతిష్ఠాపకుడైన విష్ణువర్ధనుని ఆస్థానకవిగా క్రీ.శ. 6వ శతాబ్దపు ఉత్తరార్థంలో నివసించినట్లుగా, ఆంధ్రదేశవాసిగా చెప్పవచ్చు.

## 5.4. కిరాతార్జునీయ మహాకావ్య ఇతివృత్తం:

కిరాతార్జునీయం భారవి ఏకైక రచనగా కన్పిస్తుంది. అదియే అతని ప్రతిభకు నిదర్శనమై యశస్సౌధానికి మూలస్తంభంగా వున్నది. ఈ కావ్యంలో ఇతివృత్తం మహాభారతం నుండి గ్రహింపబడింది. జూదంలో ఓడిపోయి యుధిష్ఠిరుడు సోదర సమేతుడై ద్వైతవనంలో వుంటుంటాడు. దుర్యోధనుని రాజ్యపరిపాలన విధానాన్ని తెలుసుకునేందుకు ఒక వనేచరుణ్ణి గూఢచారిగా పంపిస్తాడు. ఆ వనచరుడు తిరిగి వచ్చి సువ్యవస్థితమైన దుర్యోధనుని రాజ్యపాలనను గురించి చెప్తాడు. ఇది సంక్షిప్తంగా మొదటి సర్గలోని ఇతివృత్తం.

తర్వాత రెండు సర్గలలో యుధిష్ఠిర, భీమ, ద్రౌపదుల సంభాషణలు ఉన్నాయి. భీముడు, ద్రౌపది ఇద్దరు యుధిష్ఠిరుణ్ణి యుద్ధానికి ప్రోత్సహిస్తారు. కాని యుధిష్ఠిరుడు ప్రతిజ్ఞా పాలనను విడిచి దుర్యోదనునితో యుద్ధం చేయటానికి నిరాకరిస్తాడు. ఇంతలో వేదవ్యాసుడు అక్కడికి వచ్చి అర్జునుణ్ణి ఇంద్రకీల పర్వతం మీద ఇంద్రుణ్ణి గూర్చి తపస్సుచేయనుని సలహాఇస్తాడు అర్జునుడు ప్రయాణమై ఇంద్రకీలానికి వెళ్ళి తపస్సు చేస్తాడు. దేవతా స్త్రీలు అర్జునుని తపోభంగం చేయటానికి ప్రయత్నించి విఫలురౌతారు. అక్కడ దేవతా స్త్రీల, జలకేళి, వనవిహార, సంభోగశృంగారాదారులను భారవి రమణీయంగా వర్ణించాడు. ఇంద్రుడు స్వయంగా వచ్చి అర్జునుణ్ణి స్థిరచిత్తతతో శివుణ్ణి గూర్చి తపస్సు చేయమని ఆదేశిస్తాడు. అర్జునుడు ఇంకా స్థిరచిత్తుడై తపస్సు చేస్తాడు.

అర్జునుణ్ణి పరీక్షించటానికి శివుడు కిరాతవేషంలో వచ్చి మాయాసూకరాన్ని అర్జునుని మీదికి పంపుతాడు. అర్జునుడు తనను రక్షించుకునేటందుకు ఆ వరాహాన్ని బాణం వేసి చంపుతాడు. అదే సమయంలో కిరాతుడు బాణం వేసి దాన్ని కూలుస్తాడు. ఆ సూకరం నాదంటె నాదని ఇద్దరి మధ్య పోట్లాట జరుగుతుంది. చివరకు అర్జునుడు బాహు యుద్ధానికి తలపడతాడు. అర్జునుని సాహస పరాక్రమాలకు సంతోషించి శివుడు పాశుపతాస్త్రాన్ని అతనికి ప్రసాదిస్తాడు.

కావ్యంలో తీసికొన్న కథ చిన్నదే ఐననూ, ఆ చిన్న కథను అనేక వర్ణనలతో కలిపి 18 సర్గల మహాకావ్యంగా రచించాడు. మహాకవి భారవి.

## 5.5. కిరాతార్జునీయమహాకావ్య వైశిష్ట్యమ్:

కిరాతార్జునీయం ప్రతి సర్గ చివరిశ్లోకంలో భారవి 'లక్ష్మి' అన్న శబ్దాన్ని ప్రయోగించాడు. అందుకే దీన్ని "లక్ష్మ్యంత కావ్యము" అని అంటారు. భారవిని అనుకరిస్తూ మాఘ, శ్రీహర్ష కవులు తమ కావ్యంలో ప్రతిసర్గ చివరిశ్లోకంలో శ్రీ, ఆనంద

శబ్దాలను ప్రయోగించారు. మాఘుని శిశుపాలవధను "శ్రీయంత" కావ్యమని, శ్రీ హర్షుని నైషధాన్ని "ఆనందాంత" కావ్యమని అంటారు.

**5.5.1. భారవి వర్ణనా ప్రతిభ:**

కాళిదాసాదుల్లోని పురశైల ఋతు వర్ణనాదులే కాక భారవి జలకేళి, వనవిహార, మధుపాన, ప్రయాణ వర్ణనలను అధికంగా వర్ణ్య వస్తువులుగా గ్రహించాడు. వర్ణనలకు ప్రాధాన్యమిచ్చిన కవులలో భారవియే ప్రథముడు. హిమాలయ, ఋతు, వన, ప్రయాణ, సూర్యోదయాస్తమయ, చంద్రోదయాస్తమయాది వర్ణనలను భారవి ప్రౌఢమైన భాషలో, ఉక్తి చమత్కారంతో దీర్ఘంగా రచించాడు. ముఖ్యంగా చతుర్థ సర్గ మొదలుకొని దశమ సర్గ వరకు వర్ణనలే ఎక్కువగా ఉన్నాయి. చతుర్థ సర్గలోని శరదృతు వర్ణన సహజంగా హృదయ రంజకంగా వుంటుంది. దండి-విశ్వనాథ-రుద్రటాదులు ఈ కిరాతుర్జునీయ వర్ణనలను దృష్టిలో పెట్టుకొనే మహాకావ్య లక్షణాలను నిర్దేశించారని చెప్పవచ్చు.

**5.5.2. పాత్రచిత్రణ మరియు రసపోషణ:**

పాత్రల చిత్రణను భారవి ఒక చిత్రకారునివలె స్పష్టమైన రేఖలతో చిత్రిస్తాడు. ఈతని పాత్రలన్నింటిలో ఆత్మగౌరవం కనిపిస్తుంది. ప్రథమసర్గలోని వనేచరుని మాటలు, తర్వాత సర్గలలోని భీమ, ద్రౌపది, యుధిష్ఠిరుల సంభాషణల్లో శక్తిమంతమైన శబ్ద సంయోజనంతో, అర్థ గౌరవంతో కూడిన పాత్రోచితమైన భాష ప్రయోగింపబడింది.

అతడు చిత్రించిన ద్రౌపది, మహాభారతంలోని ద్రౌపదికి భిన్నంగా వుంటుంది. భారవి ద్రౌపది పతిభక్తి కలది. అదే సమయంలో ధర్మరాజును యుద్ధానికి ప్రోత్సహించిన వీరవనిత. భీముడు కూడా ఒక విభిన్నమైన వ్యక్తిత్వంతో కనిపిస్తాడు. భారవి భీముడు గొప్ప రాజనీతిజ్ఞానం గలవాడు. భారవిచే చిత్రించబడిన భీమ, ద్రౌపది, ధర్మరాజుల వ్యక్తిత్వాలను తెలుగు సాహిత్యంలోని కవిత్రయంలో ఒకడు, ఉభయ కవిమిత్రుడైన తిక్కన అనుసరించి మహాభారత రచన చేసాడంటే భారవి పాత్రచిత్రణా ప్రభావం తిక్కనమీద ఎంత ఎక్కువగా వున్నదో మనకు తెలుస్తుంది.

భారవి శృంగార రసపోషణ కన్న వీరరసాన్ని పోషించటంలో గొప్ప నేర్పును చూపాడు. వీరరసం అతని అభిమాన రసం. ఈ కావ్యంలో వీరరసమే ప్రధానరసం. అందుచేతనే భారవి గంభీర స్వభావం కలవాడని పండితులు అభిప్రాయపడ్డారు. ఈ కావ్యంలో నాయికకు ప్రముఖ స్థానం లేదు. ప్రతినాయకుడు కూడ దీనిలో అధర్మానికి ప్రతీక అయిన దుష్టపాత్రకాదు. నాయకుడు అయిన అర్జునుడు ధీరోదాత్తుడు. ఇటువంటి ఇతివృత్తాన్ని తీసికొని ఈ మహాకావ్యాన్ని మిక్కిలి రసోచితంగా రచించాడు భారవి.

**5.5.3. భారవి కవితాశైలి:**

> **"నారికేల ఫల సన్నిభమ్ వచో భారవేః సపది తద్విభజ్యతే।**
>
> **స్వాదయంతు రసగర్భ నిర్భరం సారమస్య రసికాయథేప్సితమ్॥"**

భారవి కవిత్వం నారికేళ్ళ పాకంతో నడిచింది. నారికేళాన్ని (కొబ్బరి కాయని) పగులగొడ్తే రుచికరమైన రసం లభించినట్లుగా భారవి రస గర్భ నిర్భరమైన కఠినవచనాలను విడగొట్టినట్లయితే పాఠకులకు అంతా రసమయమై గోచరిస్తుంది అని మల్లినాథుడు భారవి కవిత్వాన్ని ప్రశంసించాడు. భారవిది ప్రౌఢ గంభీరమైన కవిత్వం. భారవికి భాషమీద మంచి పట్టువున్నది. కాబట్టి అతని కవిత్వంలో భాష, శబ్దముల రెండింటి మధ్య సంబంధం చక్కగా కుదిరింది.

భారవి అలంకారశైలిని ప్రయోగించటమేగాక పదిహేనవ సర్గలో చిత్ర కవిత్వ రచనా ప్రతిభను కూడా ప్రదర్శించాడు. సర్వతోభద్ర, యమక, విలోమాది చిత్రకావ్య శైలులను ప్రయోగించాడు. ఏకాక్షర శ్లోకాన్ని రచించాడు, గోమూత్రికాది బంధాలకు ప్రయోగించాడు.

కిరాతార్జునీయంలో భారవి అనేకవిధాలైన ఛందస్సులను ప్రయోగించినా అతనికి ఇష్టమైన ఛందస్సు మాత్రం వంశస్థ అని చెప్పవచ్చు, సువృత్త తిలకంలో క్షేమేంద్రుడు వంశస్థ ఛందస్సు యొక్క విచిత్రత భారవి ప్రతిభను ఇనుమడింప జేసిందని అంటాడు.

**"వృత్తచ్ఛత్రస్య సా కాపి వంశస్థస్య విచిత్రతా।**
**ప్రతిభా భారవేర్యేన సచ్ఛాయేనాధికీ కృతా॥"**

శక్తిమంతమైన శబ్దాలను ప్రయోగించటంలో భారవి మహాకవికి ప్రథమ స్థానమియ్యవచ్చును.

**5.5.4. అలంకార పోషణ:**

అలంకార ప్రియుడైన భారవి ఉపమ, ఉత్ప్రేక్ష, శ్లేషాదులను ప్రయోగించాడు. అయినా అతనికి అర్థాంతర-న్యాసాలంకారమన్న అధికమైన ఇష్టం కలదు.

ఒక విషయాన్ని చెప్పి సామాన్య విషయం చేత, సామాన్య విషయాన్ని చెప్పి విశేషవిషయంచేత సమర్థించటమే అర్థాంతరన్యాసాలంకార లక్షణము.

**"సామాన్యం వా విశేషో వా తదన్యేన సమర్థ్యతే।**
**యత్తు స్యోర్థాంతరన్యాసః సాధర్మ్యేణేతరేణ వా॥"**

అని అర్థాంతరన్యాస అలంకార లక్షణము చెప్పబడింది.

**"క్రియాసుయుక్తైర్నృప! చారచక్షషో నవంచనీయాః ప్రభవోను జీవిభిః।**
**అతోర్హసి క్షంతు మసాధు సాధువా హితం మనోహారిచ దుర్లభం వచః॥"**

"ఓ మహారాజా! నేను మంచి చెడు ఏది మాట్లాడినా నన్ను మీరు క్షమించాలి. ఎందుకంటే లోకంలో హితకరమైనవి, మనోహరమైనవి అయిన మాటలు దుర్లభమైనవి".

ఇలాంటి అర్థాంతరన్యాసాలను కోకొల్లలుగా కిరాతార్జునీయ కావ్యంలో భారవి రచించాడు. కిరాతార్జునీయం మొత్తం 1030 శ్లోకాలలో సుమారుగా 115 శ్లోకాలలలో మనకు ఈ అర్థాంతరన్యాసాలంకారం కన్పిస్తుంది.

**5.5.5. భారవి అర్థగౌరవం:**

భారవి కవిత్వం అర్థ గౌరవానికి ప్రసిద్ధి చెందింది. తక్కువ శబ్దాలలో ఎక్కువ అర్థాన్ని చెప్పటమే అర్థగౌరవం. దీన్నే ఆంగ్ల భాషలో 'Brevity' అంటారు. చెప్పిన కొద్ది శబ్దాలలోనే అపారమైన అర్థాన్ని ఇమడ్చగల శక్తి భారవికున్నది. ఐతే ఈ అర్థ గౌరవంచేత భారవి కవిత్వంలో శబ్దసౌందర్యంలో ఎలాంటి లోపం రాలేదు. అతని ప్రతి శ్లోకంలో శబ్దసౌందర్యం మరింత పెరిగింది. ఓజో భరితమైన శబ్దబంధ ప్రయోగము భారవి ప్రత్యేకత.

**"స్తువంతి గుర్వీమభిధేయ సంపదం విశుద్ధి ముక్తేరపరే విపశ్చితః।**
**ఇతి స్థితాయాం ప్రతిపూరుషం రుచౌ సుదుర్లభాః సర్వమనోరమాగిరః॥"**

కొందరు అర్థ సంపత్తిని ప్రశంసిస్తారు. మరికొందరు శబ్ద సంయోగాన్ని ఇష్టపడతారు. ఈ విధంగా మనుష్యులు భిన్న రుచులు కలవారు. అందరి మనస్సులను ఆకర్షించే కవిత్వాన్ని వ్రాయటం సులభం కాదు" అని చెప్పిన భారవి తన కవిత్వంలో అర్థ గౌరవాన్ని, శబ్ద సౌందర్యాన్ని రెండింటిని సమానంగా సాధించి అందరిని మెప్పించాడు. భారవి కవిత్వం ఓజః పూర్ణమైనా అర్థ సంక్లిష్టత లేకుండా ప్రసాద గుణ భరితమై ప్రకాశిస్తుంది.

### 5.5.6. ఆతపత్ర భారవి:

**"ఉత్ఫుల్ల స్థలనళినీ వనాదముష్మాదుద్ధూతః సరసిజ సంభవః పరాగః।**
**వాత్యాభిర్వియతి వివర్తితః సమంతాదాధత్తే కనకమయాతపత్ర లక్ష్మీమ్॥"**

స్థలనళినుల నుంచి లేచిన పరాగం గాలిచేత లేవగొట్టబడి ఆకాశంలో మండలాకారంగా వ్యాపించింది. అది సువర్ణ సూత్ర నిర్మితమైన "ఆతపత్రం (గొడుగు) యొక్క శోభను అనుకరిస్తున్నది" అని శ్లోక భావం. ఈ శ్లోకంలోని భావన సుందరంగా వుండి భారవికి "ఆత పత్ర భారతి" అనే కీర్తిని తెచ్చిపెట్టింది.

ఇలాంటి మహాకావ్యాన్ని రచించిన భారవి ఎంతో ప్రశంసనీయుడు. ఈ కావ్య సౌందర్యాన్ని విప్పి చెప్పాలనే కుతూహలంతో చాలా మంది వ్యాఖ్యానాలు వ్రాశారు. మల్లినాథుని వ్యాఖ్యానంతో కలిపి కిరాతార్జునీయానికి 36 ప్రసిద్ధ వ్యాఖ్యానాలుండటం ఈ కావ్యం యొక్క గొప్పతనాన్ని; లోకప్రియతను చాటుతున్నాయి.

సామాన్య పాఠకులకు, పండితులకు కూడా హృదయాహ్లాదాన్ని కలిగించేటువంటి శబ్ద సౌందర్యంతో, అర్థ గౌరవంతో, వర్ణనా చమత్కృతులతో, రసవ్యం జకతతో, పాత్ర చిత్రణకౌశలంతో ఈ కిరాతార్జునీయ మహాకావ్యం అనర్ఘరత్నంగా భాసిల్లుతూ, సహృదయరసికజనులచేత ఆదరింపబడుతూ "ప్రకృతి మధరా భారవి గిరః" అని గౌరవింపబడుతున్నది.

## 5.6. గద్యకావ్య రచనా పరంపర:

"అపాదః పద సంతానో గద్యమ్–" పాదాత్మకం కాని పదముల కూర్పు గద్యమనబడుతుందని దండ్యాదులు గద్యాన్ని నిర్వచించారు. సంస్కృత గద్యకావ్యరచనకు బీజాలు వైదిక గాథలల్లోనే కనిపిస్తున్నాయి. తర్వాత కథ, ఆఖ్యాయిగాది గద్యకావ్య రచనలు వికసించినవని చెప్పాలి. ప్రస్తుతం గద్యకావ్యశైలి మనకు మొట్టమొదట శిలాశాసనాలల్లోనే కనిపిస్తున్నది. క్రీ.శ. 150 ప్రాంతందైన గిర్నార్ శిలాశాసనం రుద్రదాముడు వేయించింది. సరళమైన అలంకారశైలితో ఇది వున్నది. ప్రౌఢమైన గద్యకావ్య శైలికి ఇది ప్రారంభ రూపమని చెప్పవచ్చు.

దాదాపు ఇదే కాలముదైన నాసిక్ శిలాశాసనం ప్రాకృత భాషలో ఉన్నా అది సంస్కృతానువాద రూపమని పండితుల అభిప్రాయం. దీర్ఘసమాసాలు, అనుప్రాస ఉపది అలంకారాలతో కూడిన ఈ శాసనశైలిని ఆ కాలంలో వికసించి ప్రచారంలోవున్న సంస్కృత గద్యకావ్యాల అలంకృత శైలికి ప్రతిబింబంగా తీసుకోవచ్చు. ఆ తర్వాత క్రీ.శ. 350 నాటిదైన హరిషేణ కవికృత 'ప్రయోగ ప్రశస్తి' గద్యపద్యాత్మకమైంది. దీనిలోని గద్యం వైదర్భరీతిలో నడిచింది. ఆ తర్వాత క్రీ.శ. 4, 5 శతాబ్దాలలో వేయబడిన శిలాశాసనాలల్లోని సంస్కృత గద్యం అలంకార బాహుళ్యం కలిగి దీర్ఘ సమాసయుక్తమై ఓ జోగుణభరితంగా నడిచింది. క్రమక్రమంగా సంస్కృత గద్యం క్లిష్ట రూపాన్ని ధరిస్తూ వచ్చింది. అనంతరకాలంలో ఇదియే శిష్టరుపంగా మారింది.

లభిస్తున్న గద్యకావ్యాలల్లో సుబంధు వాసవదత్త మొదటిది. సుబంధునాటికి గద్యశైలి ప్రత్యక్షర శ్లేషమయంగా మారి అతిప్రౌఢమై చమత్కారార్థపూర్ణమై పండితుల మన్ననలను పొందసాగింది "ఓజః సమాస భూయస్త్వమేతద్ గద్యస్య జీవితమ్"

అని ఆలంకారికుల మతాన్ననుసరించి పద్యానికి ఛందస్సువలె గద్యానికి సమాసత అనునది ప్రాణభూతమైంది.

## 5.7. గద్యకావ్య భేదం:

అగ్నిపురాణకారుడు గద్యకావ్య భేదాలను ఐదింటిని పేర్కొన్నాడు. కథ, ఆఖ్యాయిక, పరికథ, ఖండకథ, కథానిక. కాని వీటిల్లో ప్రధానమైనది, ప్రత్యేక ప్రక్రియలుగా వికసించి రూపొందినవి రెండే. అవి: కథ మరియు ఆఖ్యాయిక.

"అపాదః పదస్థంతానో గద్యమాఖ్యాయికా కథా ఇతి తస్య ప్రభేదౌద్వౌ"-

అని భామహ దండివంటి లాక్షణికులచే అంగీకరించబడిన గద్యకావ్య భేదాలు కూడా రెండే. అవి :

1) ఆఖ్యాయిక, 2) కథ.

### 5.7.1. ఆఖ్యాయిక లక్షణము:

**"సంస్కృతానాకుల శ్రవ్యశబ్దార్థ పద వృత్తినా**
**గద్యేన యుక్తోదాత్తార్థా సోచ్ఛ్వాసాఖ్యాయికా మతా**
**వృత్తమాఖ్యాయతే తస్యాం నాయకేన స్వచేష్టితమ్**
**వక్త్రంచాపర వక్త్రంచ కాలే భావ్యర్థ శంసి చ**
**కవేరభిప్రాయు కృతైః కథనైః కైశ్చిదంకితా**
**కన్యాహరణ సంగ్రామ విప్రలంభోదయాన్వితా"**

"సంస్కృత భాషలో గద్యంలో కూర్చబడి ఉదాత్తవిషయంతో అనగా మహానుభావుల యథార్థజీవనవృత్తాంతంతో కూడింది ఆఖ్యాయిక. ఆఖ్యాయిక వినసొంపైన శబ్దార్థాలతో కూడి వుండాలి. దానిలో ఉచ్ఛ్వాస విభజన వుండాలి. నాయకుడు స్వయంగా తన వృత్తాంతాన్ని తానే చెప్పుకోవాలి. మధ్య మధ్యలో రాబోయే సంఘటనలను సూచించే వక్త్ర, అపరవక్త్ర అనే ఛందస్సులుండాలి. కన్యాహరణం, స్త్రీ కొరకు యుద్ధం, విప్రలంభం నాయకుని విజయం-వీటితో కూడిన ఇతివృత్తం ఆఖ్యాయికలో వుండాలి" అని భామహుని అభిప్రాయం. ఆఖ్యాయికకు ఉదాహరణగ్రంథం-'హర్ష చరిత్ర'.

### 5.7.2. కథ లక్షణం:

**"న వక్త్ర పరవక్త్రాభానం యుక్తానోచ్ఛ్వాస వత్యపి**
**సంస్కృతా సంస్కృతా చేష్టా కథ్యా ఽపభ్రంశ భాక్తథా**
**అన్యైః స్వచరితం తస్యాం నాయకేన తు నోచ్యతే**
**స్వగుణావిష్కృతిం కుర్యాదభిజాతః కథం జనః"**

"కథలో వక్త్ర అపరవక్త్ర ఛందస్సులుగాని, ఉచ్ఛ్వాస విభజనగాని వుండదు. నాయకుడు తన వృత్తాంతాన్ని తాను చెప్పుకోడు. కథ సంస్కృతంలోగాని, ప్రాకృత, అపభ్రంశాదుల్లోగాని వుండవచ్చును"-అని భామహుని మతము. బాణుని కాదంబరిని కథా కావ్యమునకు ఉదాహరణగా పేర్కొనవచ్చు.

సంస్కృత కవులు అఖ్యాయికలో రాజుల, చారిత్రక పురుషుల చరిత్రలు తీసికొని రచించటం వలన ఈ ఆఖ్యాయిక ప్రక్రియ గద్యకావ్యప్రక్రియగాగాక చారిత్రకకావ్యముగా పేరును పొందెను.

కల్పిత ఇతివృత్తాన్ని ప్రధానంగా కలిగిన కథా ప్రక్రియ మాత్రం శైలిలోనూ, అలంకార చమత్కృతులలోనూ, భావవైచిత్రులలోనూ, ప్రకృత్యాది వర్ణనలలోనూ పద్య మహాకావ్యాలతో పోటీపడుతున్నది. కాబట్టి గద్య కథా ప్రక్రియను 'గద్య మహాకావ్యం' అని అనటం ఎంతో సమంజసంగా వుంటుంది.

ఈ గద్యకావ్య ప్రక్రియను మహోన్నతంగా తీర్చిదిద్దిన గద్యకావ్య మహాకవులలో సుబంధుడు, బాణుడు, దండి ముందువరుసలో నిలుస్తారు. వారిలో తన రచనా వైదుష్యంతో, సంస్కృత గద్యకావ్య పరంపరలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకున్నాడు దండి మహాకవి.

## 5.8. దండి కాలం:

చారిత్రక సత్యాన్ని పరిశీలిస్తే దండి బాణునికన్న మరీ పూర్వుడేమి కాక దాదాపుగా సమకాలికుడే గాని, సుబంధుకన్న పూర్వుడుమాత్రం కాదు. వేబర్, మాక్స్‌ముల్లర్, మాక్‌డోనెల్, యాకోబి వంటి పాశ్చాత్య విమర్శకులు ఇంకా ప్రాచ్యవిమర్శకులు దండి బాణునికన్న పూర్వుడనే వాదాన్ని అంగీకరించారు. అవంతిసుందరికథానుసారంగా దండి భారవికి మునిమునుమడు. వీరిది అసలు గుజరాత్‌ప్రాంతమని వేంగీపాలకుడైన కుబ్జవిష్ణువర్ధనునితో భారవి ఆంధ్రదేశం వచ్చాడని ఒక ఐతిహ్యం వున్నది. ఒకసారి భారవి రాజుతో అరణ్యానికి వేటకుపోయి అక్కడ అమితమైన ఆకలి బాధకు తట్టుకొనలేక మాంసం తిన్నాడట! ఆ పనిచేసినందుకు సిగ్గుపడిన భారవి రాజధానికి తిరిగిపోకుండ అరణ్యంలో తిరుగసాగాడు. అక్కడ అతనికి నిర్వాసితుడైన గాంగ వంశరాజు దుర్వినీతునితో స్నేహమేర్పడింది. ఆ రాజు ప్రేరణతో భారవి కాంచీనగర రాజు పల్లవ సింహవిష్ణువును ఆశ్రయించాడట. భారవి అసలు పేరు దామోదరుడు. అతనికి మనోరథుడనే కుమారుడున్నాడు. మనోరథుని నాల్గవ కుమారుడు వీరదత్తుడు. అతని భార్య గౌరి, వారి కుమారుడే దండి. దండి చిన్నతనంలోనే తన తల్లిదండ్రులను కోల్పోయాడు. చాళుక్య రాజు రెండవపులకేశి కాంచీనగరం మీదికి దండెత్తిరాగా (క్రీ.శ.635) ఆ అల్లర్లలో దండి కంచిని విడిచిపెట్టి చాలాకాలం వరకు దేశాంతరాలల్లో తిరిగాడట. మొదటి నరసింహవర్మ కాంచి సింహాసనాన్ని అధిష్టించిన తర్వాత దండి కంచికి తిరిగి వచ్చి అక్కడ స్థిర నివాసము ఏర్పరచుకొన్నాడట.

ఈ వృత్తాంతాన్ని బట్టి దండి జీవితకాలాన్ని కొంతవరకు నిశ్చయించవచ్చు. క్రీ.శ. 634 నాటికే భారవి ప్రసిద్ధుడైన కాళిదాసాదుల కోవలోకి చెందినట్లుగా ఐహోళె శాసనాన్ని బట్టి తెలుస్తుంది. అంటే అప్పటికి భారవి జీవించి వంద సంవత్సరాలైనా అయివుంటుంది. అంటే భారవి కాలాన్ని దాదాపుగా క్రీ.శ. 550 ప్రాంతమని చెప్పవచ్చును. భారవి దండికి మధ్య రెండుతరాలు గడిచాయి. తరానికి 25 సంవత్సరాలు తీసుకుంటే 50 సంవత్సరాలు కలుపుకొని దండి క్రీ.శ. 600 ప్రాంతం నాటికి జన్మించి వుంటాడని చెప్పవచ్చును. పై వృత్తాంతాన్నంతా ఒక ఐతిహ్యంగా (కథని) మాత్రమే భావించి తోసిపుచ్చినట్లయితే దండి కాలాన్ని నిర్ణయించటానికి మరొక ఆధారమున్నది. రెండవ పులకేశి కోడలు విజ్జ లేక విజయ ఒక కవయిత్రి. ఆమె దండి కావ్యాదర్శంలోని మంగళాచరణ శ్లోకాన్ని ఉద్ధరించింది. విజయ రెండవపులకేశి యొక్క కొడుకు చంద్రాదిత్యుని భార్య. చంద్రాదిత్యుని కాలం క్రీ.శ. 642 ప్రాంతం. అంటే క్రీ.శ. 642 నాటికి దండి కావ్యాదర్శాన్ని రచించాడని విజయ ఉద్ధరణను బట్టి తెలుస్తుంది. క్రీ.శ. 642 నాటికే దండి గ్రంథకర్త అయినాడంటె అప్పటికి అతని వయస్సు 30, 40 సంవత్సరాలైనా వుండాలి. దీన్ని బట్టి కూడ దండి జననం క్రీ.శ. 600 ప్రాంతమని నిర్ణయించవచ్చును. పై విషయాలన్నింటిని పరిశీలించినపుడు బాణకవి క్రీ.శ. 7వ శతాబ్దానికి ఉత్తరార్థం వాడైతే, బాణునికి ఈషత్ పూర్వుడైన దండి మహాకవి క్రీ.శ. 7 వ శతాబ్దానికి పూర్వార్థం వాడని మనకు అవగతమవుతుంది.

## 5.9. దండి రచనలు:

"త్రయోగ్నయస్త్రయో వేదాస్త్రయో దేవాస్త్రయో గుణాః॥

త్రయో దండి ప్రబంధాశ్చ త్రిషు లోకేషు విశ్రుతాః॥"

"గార్హపత్య, ఆహవనీయ-దక్షిణాగ్నులని శ్రౌత అగ్నులు మూడు, ఋక్-యజుస్-సామములని వేదములు మూడు, పృథివీ-ద్యు-అంతరిక్ష స్థానములని దేవ వర్గములు మూడు, సత్త్వ-రజః-తమో గుణములని గుణములు మూడు లోకంలో ఎలా ప్రసిద్ధమో, అట్లా దండిచే వ్రాయబడిన రచనలు మూడని లోక ప్రసిద్ధము" అని రాజశేఖరుడు శారఙ్గధర పద్ధతిలో అన్నట్లుగా చెప్పబడింది.

'దండి' కి ఆ పేరు 'బ్రహ్మాండచ్ఛత్ర దండః " అనే దశకుమార చరిత్ర ప్రార్థనాశ్లోకంలో అనేక పర్యాయాలు 'దండ' శబ్దాన్ని ప్రయోగిస్తూ త్రివిక్రముని పాదదండాన్ని వివిధ దండాలతో పోల్చడం వల్ల వచ్చి ఉంటుందని కూడా పండితుల అభిప్రాయం.

దండి మూడు గ్రంథాలలో కావ్యాదర్శం, దశకుమారచరిత్రలనే రెండు గ్రంథాలు ప్రసిద్ధమై ఇప్పుడు లభిస్తున్నాయి. దండి మూడవకృతి విషయంలో మాత్రం పండితల్లో భేదాభిప్రాయాలున్నాయి.

మృచ్ఛకటికం, ఛందోవిచితి, కళాపరిచ్ఛేదం, మల్లికామారుతం అనే గ్రంథాలల్లో ఒకటని పండితులు నిర్ణయించటానికి ప్రయత్నించారు. కానీ వారి అభిప్రాయాలేవీ సమంజసంగా లేవు. ప్రస్తుతం లభించిన 'అవంతి సుందరి కథ' దండి మూడవ కృతి అని ఇప్పుడు చాలామంది విమర్శకులు స్థిరాభిప్రాయానికి వచ్చారు.

### 5.9.1. అవంతి సుందరి కథ:

ఈ కృతి అసంపూర్ణంగా లభించింది. లభించిన కథలో ఎనిమిది పరిచ్ఛేదాలున్నాయి. కావ్యారంభంలో దండి జీవిత చరిత్ర నిబద్ధమైంది. ఆ తర్వాత కథ ఆరంభమైంది. దీనిలోని కథ దశకుమార చరిత్రకు భూమిక రూపంగా కన్పిస్తున్నది. అంటే అవంతి సుందరి కథను దశ కుమార చరిత్రకు పూర్వపీఠిక అనవచ్చును. మానసారుని కుమార్తె అయిన "అవంతి సుందరి" కి, రాజహంసుని కుమారుడైన రాజవాహనునికి మధ్య ప్రణయం, అనంతరం వారిరువురి వివాహము అను అంశములు ప్రధానముగా, మనోహరముగా ఈ గ్రంథమునందు వర్ణింపబడినాయి. కావ్యాదర్శంలో 'అవంతి సుందరి కథ' యొక్క ప్రసక్తి వుండటంచేత ఇదే దండి ప్రథమ కృతి అని భావింపవచ్చును.

### 5.9.2. కావ్యాదర్శం:

దండి అలంకార శాస్త్ర గ్రంథం పేరు కావ్యాదర్శం. కావ్యాదర్శానికి అలంకార శాస్త్ర గ్రంథాలలో విశేష స్థానమున్నది. కావ్యాదర్శంలో మూడు పరిచ్ఛేదలున్నాయి. ప్రథమ పరిచ్ఛేదంలో కావ్యపరిభాష, కావ్యభేదాలు, మహాకావ్య లక్షణాలు, గద్య కావ్య భేదాలు, గద్య కావ్య లక్షణాలు వివరింపబడ్డాయి.

ద్వితీయ పరిచ్ఛేదంలో 35 అర్థాలంకారాలు సోదాహరణంగా వివరింపబడ్డాయి. తృతీయ పరిచ్ఛేదంలో యమక భేదాలు, చిత్రబంధాలు వివరింపబడ్డాయి. తర్వాత విస్తారంగా దోషనిరూపణ జరిగింది. కావ్యాదర్శంలో మొత్తం 360 శ్లోకాలున్నాయి. దండి దోషనిరూపణను విస్తరంగా చేసి కవిత్వంలో గుణాల ప్రాధాన్యాన్ని, అలంకార వివేచనకు కూడా చాలా వివరంగా వివరించాడు. అందువల్లనే దండి గుణాలంకారవాదిగా సుప్రసిద్ధుడయ్యాడు.

**5.9.3. దశకుమార చరిత్ర ఇతివృత్తం:**

దశకుమార చరిత్రలోని కథలు సాహస ప్రధానమైనవి, రంజింపజేసేవి. సరళ శైలిలో దండి వీటిని రచించాడు. చమత్కార కథాకథనాన్ని ప్రదర్శించాడు. గద్య కావ్యాలలో ఒక విశిష్టస్థానాన్ని ఈ కావ్యానికి సంపాదించి పెట్టాడు.

దశకుమార చరిత్రలో దశకుమారులు అంటే పదిమంది యువకుల ప్రేమ, సాహసగాథలున్నాయి. మగధరాజైన రాజహంసుణ్ణి మానసారుడనే రాజు ఓడిస్తాడు. రాజహంసుడు పారిపోయి వింధ్య ప్రాంతారణ్యంలో నివసించసాగాడు. అక్కడ అతనికి రాజవాహనుడనే కుమారుడు జన్మిస్తాడు. ఆ రాజు యొక్క తొమ్మిదిమంది సహచరులకు తొమ్మిదిమంది కుమారులు జన్మిస్తారు. ఈ సహచరుల్లో కొందరు రాజులు కొందరు మంత్రులు వున్నారు. ఆ పదిమంది కుమారులు పెరిగి పెద్దవారవుతారు. యువకులైన పిదప వారు సంపాదన కొరకు దేశాటనానికి బయలు దేరుతారు. ఎవరి తోవన వారుపోయి కొన్ని సంవత్సరాల గడువు తర్వాత ఒక్కచోట కలుసుకొని తమ తమ పర్యటన వృత్తాంతాలను, తాముచేసిన ప్రేమ శృంగార సాహస కృత్యాలను గూర్చి ముచ్చటించుకుంటారు.

తర్వాత వీరందరి సహాయంతో రాజహంసుడు మానసారుని మీదికి దండెత్తిపోయి, అతన్ని ఓడించి మగధరాజ్యాన్ని తిరిగి సంపాదించుకొంటాడు. దశకుమారులలో అపహారవర్మ కథ దీర్ఘంగాను, నానావిధ సంఘటనలతో కూడి రమ్యంగా వున్నది. ఈ వృత్తాంతంలోని వేశ్య 'కామమంజరి ' వృత్తాంతం పాఠకులను ఆకట్టుకొంటుంది. దశకుమారులు తమ వివిధ కళానైపుణ్యంతో తమ తండ్రులు పోగొట్టుకొన్న రాజ, మంత్రిపదవులను తిరిగి సంపాదించుకొంటారు. ఈ కావ్యంలో కవి సందర్భోచితంగా జూదం, దొంగతనం, హత్యలు, హింస, మోసం, పరకాయ ప్రవేశం, వేశ్యలు, వారిమాయలు, స్త్రీ అపహరణం, స్త్రీ పురుషుల అక్రమ సంబంధాలను వర్ణించాడు. వీటితోపాటు కవి సందర్భానుకూలంగా ఆనాటి సాంఘిక జీవనాన్ని సంపూర్ణంగా కన్నులకు కట్టేటట్లుగా వర్ణించాడు. సమకాలిక సాంఘిక జీవనాన్ని చిత్రించే వారి సంఖ్యలో వున్న సంస్కృత కావ్యాలలో ఇది ప్రముఖమైంది. బహుముఖపైన ప్రజా జీవితాన్ని కవి ఈ కావ్యంలో ప్రతిబింబింపజేశాడు. ఈ దశకుమారుల కథలు, వారి సాహస శృంగార ప్రసంగాలతో, విచిత్ర సంఘటనలతో చకచక సాగిపోతాయి. అంతటా సహజ స్వాభావికతే కన్పిస్తుంది. ప్రతి కథలోను శృంగారం ప్రధాన రసంగా అద్భుతాది ఇతర రసాలు అంగరూపంగాను పోషింపబడ్డాయి, కావ్యంలో అనేక చోట్ల కవి తన రాజనీతిజ్ఞతను, వ్యవహార జ్ఞానాన్ని, వివిధ కళా పరిచయాన్ని ప్రకటించాడు. ఉత్తమ గద్యకావ్యంగా తీర్చిదిద్దాడు.

**5.9.4. దండి కవిత్వ శైలి:**

సుబంధు, బాణులవలె దండి తన కావ్యాన్ని కఠినశైలిచేత, పాండిత్యప్రకర్షచేతను క్లిష్టం చేయలేదు. అతని శైలి సర్వజనామోదకరంగా, సరళ సుందర మార్గంలో నడిచింది. సర్వజనరంజకమైన కథాశైలిలో దండి తన కథలను కూర్చాడు. కావ్యాదర్శాన్ని బట్టి దండికి వైదర్భి అన్న ఇష్టమైన రీతి అని తెలుస్తుంది. ఆ వైదర్భీరీతిలోనే దండి దశకుమార చరిత్రను వ్రాశాడు. సుబంధు బాణుల కావ్యాలల్లో కనిపించే దీర్ఘ సమాసాలు కాని, దీర్ఘవాక్యాలు కాని దండి కావ్యంలో లేవు. ప్రసాద అర్థవ్యక్తి గుణాలతో కూడింది దండిశైలి. ఆ ప్రసిద్ధ పదరచనగాని, శ్లేషభరిత వక్రోక్తులుగాని అతని కవిత్వంలో లేవు.

దండి కవిత్వం పరిమిత అలంకార శోభితమై, ఆమూలాగ్రం కోమల పదావళితో కూడి లలితమధురంగా వున్నది. "దండినః పద లాలిత్యం" అన్న ఉక్తికి సాక్షీభూతమై నిలుస్తున్నది. కథాకథనంలోనూ ఇతడు ఉద్దండుడు. కావ్యంలో ఆద్యంతం ఒక్కటే కథ లేకున్నా, దశకుమారుల వివిధచరిత్రలున్నా కథకు సూత్రం తెగకుండా, కథా కథనం కుంటుపడకుండ కావ్యాన్ని

అద్భుతంగా రచించాడు.

గొప్ప లాక్షణికుడుగానే గాక కవులలోనూ దండికి గొప్ప పేరువున్నది. దండిని వ్యాసవాల్మీకి కవుల సరసన చేర్చిన అభిమానులు కూడవున్నారు.

**"జాతే జగతి వాల్మీకౌ కవి రిత్యభిధా భవత్।**

**కవీ ఇతి తతోవ్యాసే కవయస్త్వయి దండిని॥"**

"వాల్మీకి జననానంతరం ఏకవచనాంత కవిశబ్దం పుట్టింది. వ్యాసుని తర్వాత ద్వివచనాంత ప్రయోగం ఏర్పడింది. దండి జననాంతరం బహువచనాంత రూపం ఏర్పడింది". ఈ విధంగా దండికి వాల్మీకి వ్యాసుల తర్వాత స్థానాన్నియ్యగా మరికొందరు "కవిర్దండీ! కవిర్దండీ! కవిర్దండీ! న సంశయః" అని దండిని ఏకైక కవి శబ్దవాచ్యునిగా ప్రశంసించారు.

## 5.10. ఆధార గ్రంథాలు:

1) సంస్కృత సాహిత్య చరిత్ర – డా॥ ముదిగంటి గోపాలరెడ్డి "వేదాలంకార్"

డా॥ ముదిగంటి సుజాతరెడ్డి

2) సంస్కృత సాహిత్యేతిహాసః – ఆచార్య లోకమణి దాహాలః

## 5.11. రాదగిన ప్రశ్నలు:

1) సంస్కృత సాహిత్యంలో భారవి మహాకవి యొక్క గొప్పదనాన్ని మీ పాఠ్యభాగం ఆధారంగా వివరించండి?

2) సంస్కృత గద్యకవులలో దండి మహాకవి రచనా వైశిష్ట్యాన్ని విశదీకరించండి?

**– డా॥ సిహెచ్. పవన్ కుమార్**

## పాఠం - 6

# సంస్కృత సాహిత్య చరిత్ర - మాఘుడు, శ్రీహర్షుడు

విషయ క్రమం:


6.0. ఉద్దేశ్యం

6.1. మాఘమహాకవి జీవితకాల విశేషాలు

6.2. శిశుపాలవధ కావ్యేతివృత్తం

6.3. మాఘుడు భారవియొక్క కిరాతార్జునీయ కథాసంవిధానాన్ని అనుసరించుట.

6.3.1. కిరాతార్జునీయ-శిశుపాలవధల కథాసంవిధాన సామ్యం

6.4. మాఘుని కవితా వైశిష్ట్యం

6.5. శివ పాలవధ కావ్యంలోని వర్ణనలు

6.6. శ్రీహర్ష మహాకవి జీవితకాల విశేషాలు

6.7. శ్రీహర్షుని రచనలు

6.7.1. రాజస్తుతి పరమైనవి

6.7.2. వర్ణనారూపమైన లఘుకావ్యము

6.7.3. మహాకావ్యము

6.7.4. వేదాంతవాద గ్రంథములు

6.8. నైషధీయచరితం కావ్యేతివృత్తం

6.9. శ్రీహర్షుని కవితాపాండిత్యవైభవం

6.9.1. కవితా సౌందర్యము

అ) రసశోభలు

ఆ) అలంకార సౌందర్యము

6.9.2. వర్ణనా చమత్కృతులు

6.10. ఆధార గ్రంథాలు

6.11. రాదగిన ప్రశ్నలు


### 6.0. ఉద్దేశ్యం:

సంస్కృత సాహిత్యంలో పేరెన్నికగన్న కాళిదాసు, భారవి మహాకవుల తర్వాత అంతటి ఘనకీర్తిగల వారైన మాఘ - మహాకవి మరియు శ్రీహర్ష మహాకవియొక్క జీవిత కాల విషయ విశేషాలను, వారివురి రచనలైన 'శిశుపాలవధ' మరియు 'నైషధచరితం' మహాకావ్యాల వైశిష్ట్యాన్ని, వారిరువురి కవిత్వ మాధుర్యాన్ని కావ్యవర్ణనా నైపుణ్యాన్ని గూర్చి సవివరంగా విద్యార్థులకు తెలుపటమే ఈ పాఠ్య ముఖ్యోద్దేశ్యం.

## 6.1. మాఘమహాకవి జీవితకాల విశేషాలు:

మాఘమహాకవి తండ్రి పేరు దత్తకుడు. తాతపేరు సుప్రభదేవుడు. సుప్రభదేవుడు వర్మలాతుడన్న రాజు దగ్గర మంత్రిగా వుండేవాడు (క్రీ.శ. 625 ప్రాంతం). దీనిననుసరించి మాఘుడు క్రీ.శ. 650వ ప్రాంతంవాడని చెప్పవచ్చు. ఆనందవర్ధనుడు ధ్వన్యాలోకంలో మాఘుని శ్లోకాలను ఉదహరించాడు. కాబట్టి నిశ్చయంగా మాఘుడు క్రీ.శ. 9వ శతాబ్దానికి పూర్వుడే అవుతాడు. వసంతగఢ్‌లో లభించిన శిలాశాసనం ఆధారంగా కీల్‌హోర్న్ నిర్ణయించిన సుప్రభదేవుని కాలనిర్ణయాన్ననుసరించి సుప్రభదేవుని మనుమడైన మాఘుని జీవితకాలాన్ని క్రీ.శ. 650 – 700 ప్రాంతమని చెప్పడం సముచితం. ఉత్తరభారతాన ఘూర్జర దేశానికి చెందిన మాఘుడు గొప్ప దాతృత్వగుణం కలవాడని, తన దానగుణం చేత సంపదనంతా పోగొట్టుకొని దారిద్ర్యాన్ని అనుభవించాడని కూడా లోక ప్రసిద్ధి కలదు.

## 6.2. శిశుపాలవధ కావ్యేతివృత్తం:

శిశుపాలవధ మాఘుని మహాకావ్యం. ఇందు 20 సర్గలున్నాయి. దీనిలో శ్రీ కృష్ణుడు శిశుపాలుణ్ణి వధించే వృత్తాంతమున్నది. దీనికి మూలం మహాభారతం, మహా భాగవతంలోను లభిస్తుంది, యుధిష్ఠిరుని రాజసూయ యాగానికి వచ్చిన శిశుపాలుడు ఆహ్వానిత అతిథులందరిముందు శ్రీకృష్ణుని నిందించి చివరకు కృష్ణుని చేతనే చంపబడ్డాడు. ఈ కథను కవి మాఘుడు తన స్వీయ పాండిత్య ప్రతిభతో విస్తరింపజేసి మహాకావ్యంగా రచించాడు.

## 6.3. మాఘుడు భారవి యొక్క కిరాతార్జునీయ కథా సంవిధానాన్ని అనుసరించుట:

భారవి రచించిన దీర్ఘమైన రాజనీతిని ప్రకటించే సంభాషణలను, రమ్యమైన ప్రకృతివర్ణనలను, అలంకార భావ కల్పనలను ఛందో ప్రయోగాలను అనుకరిస్తూ, కొన్ని సందర్భాలలో భారవినే మించవలెననే తపనతో మాఘుడు శిశు – పాలవధ కావ్యాన్ని రచించాడు. భారవి శైవుడు కాబట్టి శివసంబంధమైన మహాభారతాంర్గత కథను ఎన్నుకొన్నాడు. మాఘుడు వైష్ణవుడు కాబట్టి విష్ణుకథను ఎన్నుకొన్నాడు. ఇద్దరికీ మహాభారతమే మూలగ్రంథం. ఐతే వీరిరువురూ సమకాలికులు కారు. అట్లే భారవి దాక్షిణాత్యుడైతే, దండి ఉత్తరభారతవాసి. కేవలం భారవి కావ్యవైభవం చేత ఆకర్షితుడై అటువంటి కావ్యాన్నో, లేక దాన్ని మించిన కావ్యాన్నో వ్రాయాలనే ఏకైక స్పర్ధతోనోమాఘుడు ఈ కావ్యాన్ని వ్రాసినట్లనిపిస్తుంది. 'స్పర్ధయా వర్ధతే విద్యా' అన్నట్లుగా ఈ ఆరోగ్యకర విద్యాస్పర్ధ వలన ఒక మహాకావ్యం మాత్రం సంస్కృతసాహిత్యానికి దక్కంది.

### 6.3.1. కిరాతార్జునీయ–శిశుపాలవధల కథాసంవిధాన సామ్యం:

**కిరాతార్జునీయ కథాసంవిధానం:**

1) ఇందు వనేచరుడు దుర్యోధనుని రాజ్యపరిపాలనను గురించి ధర్మరాజుకు చెప్తాడు.

2) వ్యాసుడు పాండవులకు మార్గనిర్దేశం చేస్తాడు.

3) పాండవుల, ద్రౌపది మంత్రాంగం, రాజనీతి శాస్త్రపరిచయం ఇందు వర్ణింపబడింది.

4) అర్జునుడు దివ్యాస్త్ర సాధనకై ఇంద్రకీలానికి ప్రయాణం వర్తింపబడింది.

5) ఇందు హిమాలయపర్వతవర్ణన ఉంది.

6) అర్జునుని పరీక్షించుటకు వచ్చిన అప్సరసల జలకేళి, మధుపాన, వనవిహారాది వర్ణనలు, ఈ సందర్భంలోనే ఋతు,

సూర్యాస్తమయ, సంధ్య, చంద్రోదయ, రాత్రి వర్ణనలు ఇందు కలవు.

7) శివుని దూతకు అర్జునునికి మధ్య వివాదం ఇందు వర్ణింపబడినది.

8) చిత్రకావ్యశైలిలో ప్రమథగణం అర్జునుల మధ్య యుద్ధం వర్ణింపబడినది.

9) ఇందు చిత్ర కావ్యశైలిలో శివార్జునుల యుద్ధం వర్ణింపబడినది.

**శిశుపాలవధ కథా సంవిధానం**

1) ఇందు నారదుడు ఇంద్రుని సందేశాన్ని శ్రీకృష్ణునికి వినిపిస్తాడు.

2) నారదుడు శ్రీకృష్ణునికి కర్తవ్యాన్ని ఉపదేశిస్తాడు.

3) శ్రీకృష్ణ, బలరామ, ఉద్ధవుల మంత్రాంగం, రాజనీతిశాస్త్ర పరిచయం ఇందువర్ణింపబడింది.

4) శ్రీకృష్ణుడు ధర్మరాజుచేసే రాజసూయయాగానికి ప్రయాణం వర్ణింపబడింది.

5) ఇందు రైవతక పర్వత వర్ణన వుంది.

6) శ్రీకృష్ణుని సేవా పరివారం యొక్క జలకేళి, మధుపాన, వనవిహారాది వర్ణనలు, ఈ సందర్భంలోనే ఋతు, సూర్యాస్తమయ, సంధ్య, చంద్రోదయ, రాత్రివర్ణనలు ఇందు కలవు.

7) శిశుపాలుని దూతకు సాత్యకికి మధ్య వివాదం ఇందు వర్ణింపబడింది.

8) చిత్రకావ్యశైలిలో శ్రీకృష్ణ - శిశుపాలురుల యొక్క సైన్యమధ్య యుద్ధం వర్ణింపబడింది.

9) ఇందు చిత్రకావ్యశైలిలో శ్రీకృష్ణ - శిశుపాలురుల యుద్ధం వర్ణింపబడింది.

ఈ విధంగా వర్ణనక్రమంతో సహా మాఘుడు భారవి కథాసంవిధానాన్ని అనుసరించి రచించినాడు.

## 6.4. మాఘుని కవితావైశిష్ట్యం:

**"ఉపమా కాళిదాసస్య భారవే రర్థగౌరవమ్!**

**దండినః పదలాలిత్యం మాఘే సంతి త్రయోగుణాః॥"**

కాళిదాసులోని ఉపమల విశిష్టత, భారవిలోని అర్థగౌరవం, దండిలోని పదలాలిత్యం ఈ మూడు గుణాలు మాఘుని కవిత్వంలో చోటు చేసుకున్నాయని ప్రాచీన విమర్శకుల అభిప్రాయం. మాఘుని కవిత్వం భారవి కవిత్వంవలె ఓజోగుణ ప్రధానమైంది. అతడి అలంకారశైలి ప్రౌఢమైంది. భారవితో ఆరంభమైన అలంకారశైలి మాఘునితో మహర్దశకు చేరుకొన్నది. ఇతడు మాలినీవృత్తాన్ని ఎక్కువగా ఆదరించాడు. దీర్ఘ సమాస శైలిలో శక్తిమంతమైన సంభాషణలను ప్రయోగించటం మాఘుని ప్రత్యేకతగా చెప్పవచ్చు. ఇతడి వర్ణనలు సుదీర్ఘంగా, సజీవంగా, రమణీయంగా వుంటాయి. అలంకారాల ప్రయోగం రమ్యంగా ఉంటుంది. "మాఘే మేఘే గతమ్ వయః" అని ప్రముఖవ్యాఖ్యాత అయిన మల్లినాథుడనటం మాఘకవితా వైభవానికి తిరుగులేని నిదర్శనం. రసవంతమైన, పాండిత్యస్ఫోరకమైన వ్యంగ్య-వైభవాలతో కూడిన మాఘ-మేఘ సందేశ కావ్యాల పఠనంలో మునిగి రసాస్వాదనను పొందుతున్న తనకు వయస్సు (కాలం) గడిచిందని, కానీ తనకా విషయమే స్ఫురణకు రాలేదని ఆ ఉక్తి సారాంశం.

"నవసర్గ గతే మాఘే నవశబ్దో న విద్యతే" అని పండిత లోకంలో ఒక ఉక్తి ప్రచారంలో వున్నది. శిశుపాలవధలోని

తొమ్మిది సర్గలను చదివిన తర్వాత ఇక నూతన శబ్దం సంస్కృతంలో వుండదని ప్రసిద్ధి. మాఘుడు అపారమైన శబ్దార్థ జ్ఞానం కలవాడు. ప్రసిద్ధ–అప్రసిద్ధ పదాలను ఎన్నిటినో అతడు ప్రయోగించాడు. కాళిదాసు, భారవి కవులు ప్రయోగించని క్రొత్త పదాలనెన్నిటినో కూడా మాఘుడు ప్రయోగించి శబ్దార్థాలపై తనకున్న సాధికారతను నిరూపించుకున్నాడు. ఉదాహరణకు భూరుహమంటె చెట్టు అని ప్రసిద్ధార్థం. కాని మాఘుడు 'ప్రాణులు' అనే అర్థంలో ఆ శబ్దాన్ని వాడాడు. "నరేంద్ర" అంటే రాజు అని ప్రసిద్ధార్థం, కాని మాఘుడు విషవైద్యుడన్న అర్థంలో వాడాడు. "ద్విజిహ్వ" కు అర్థం పాము అని ప్రసిద్ధమైంది. కానీ మాఘుడు నిందకుడు అను అర్థంలో ఈ శబ్దాన్ని ప్రయోగించాడు. ఈ విధంగా ఎన్నో శబ్దాలను కొత్త అర్థంలో ప్రయోగించాడు. అతడి పదవిన్యాసం, శబ్దమాధుర్యం చెప్పుకోదగ్గవి.

మాఘుని కవిత్వంలో ఎక్కువగా మనకు పదలాలిత్యం కనబడుతుంది. పదసౌకుమార్యం, వర్ణమాధుర్యం, సంగీతాత్మకమైన భాషాప్రయోగం, భావానుగుణమైనభాష, భాషయందు ఆరోహ–అవరోహ క్రమములు ఈ లక్షణాలన్నీ కలిగినది పదలాలిత్యం. పదలాలిత్యగుణములో ఒకటైన సంగీతాత్మకమైన భాషాప్రయోగాన్ని తెలిపే మాఘుని శ్లోకమొకటి ఉదాహరణకు –

**"మధురయా మధు బోధిత మాధవీ మధు సమృద్ధి సమేధిత మేధయా।**
**మధుకరాంగనయా ముహురున్మద ధ్వని భృతా నిభృతాక్షర ముజ్జగే॥"**

మకారావృత్తి, వృత్త్యనుప్రాసలు ఈ శ్లోకాన్ని సంగీతభరితమధురతరం చేశాయి.

**"మాఘేన విఘ్నితోత్సాహా నోత్సహంతే పదక్రమే।**
**స్మరంతో భారవే రేవ కవయః కపయో యథా॥"**

"మాఘమాసపు చలిలో సూర్యుని వేడిమిని సేవించినా, కోతులు చలివలన కాళ్లు వంకరపోయి తిరుగాడలేకపోతాయి. అదేవిధంగా భారవిని అనుసరించి పదరచనను చేసిన మాఘుని చూచి, తాము కూడా మాఘునివలెనే రచన చేయాలని ఎంత అనుకరించినా ఇతర కవులు తమ కవితారచనలో అసమర్థులే అవుతారు". అంటే మాఘుడు భారవని అనుకరించినా అతడు శ్రేష్ఠకవి కాగలిగాడు. మాఘుని వలె ఇతర కవులు భారవి అనుకరించబోయి నవ్వుల పాలవుతారనే పై శ్లోకార్థం మాఘుని కవిత్వ ప్రతిభను, పదవిన్యాస కళను ప్రశంసిస్తూ, అతడు కేవలం భారవిని అనుకరించలేదని స్వీయ పాండిత్య కవితా ప్రతిభను సైతం ప్రదర్శించాడని తెలుపుతుంది.

## 6.5. శిశుపాల వధ కావ్యంలోని వర్ణనలు:

ఈ మహాకావ్యంలో మహాకావ్యోచిత వర్ణనలు అన్నీవున్నాయి. ఇతడు పాండిత్యగరిమ కలవాడు కనుక వర్ణనలల్లో ప్రౌఢభావవైచిత్రితో కూడిన అలంకార చమత్కారాలను ప్రయోగించాడు. రమ్యమైన దీపశిఖను ఉపమానంగా చేసి చెప్పటంచేత 'దీపశిఖ కాళిదాసు' గా, వ్యాపించిన పరాగాన్ని ఆతపత్రంతో పోల్చి అందంగా చెప్పటంచేత 'ఆతపత్ర భారవి' గా సాహిత్య లోకంలో ఖ్యాతిగడించిన కాళిదాసు, భారవుల వలెనే సూర్యచంద్రులను ఘంటలుగా చేసి రమ్యవర్ణన చేయటం చేత మాఘునికి 'ఘంటా మాఘుడనే' కీర్తి లభించింది. ఆ వర్ణనను తెలుపు సుప్రసిద్ధ శ్లోకమిది –

**"ఉదయతి వితతోర్ధ్వ రశ్మిరజ్జౌ**
**అహిమరుచౌ హిమధామ్ని యాతి చాస్తమ్।**
**వహతి గిరిరయం విలంబి ఘంటా**
**ద్వయ పరివారిత వారణేంద్ర లీలామ్॥"**

"పొడవైన ఊర్ధ్వముఖాలైన కిరణాలు అనే తాళ్ళుగల ఉదయించే సూర్యుడు మరియు అస్తమించే చంద్రునిగల (రైవతక) పర్వతం, కిందికి వేలాడే రెండు ఘంటల చేత అలంకరింపబడిన ఒక మత్తగజేంద్రుని వలె విలసిల్లుచున్నది" అని శ్లోకార్థం.

మాఘకావ్యం ఋతు, సూర్యాస్తమయ, సూర్యోదయ, ప్రభాతాది వర్ణనలు దీర్ఘంగానూ, చమత్కార పూర్ణంగానూ వున్నాయి. కాళిదాసు-అశ్వఘోషాదులతో పోటీపడి మాఘుడు పురస్త్రీ వర్ణనలు చేశాడు. మాఘుని ప్రభాత వర్ణన సుప్రసిద్ధమైనది. ఈ వర్ణనలో అనేక అందమైన భావాలున్నాయి

**"ద్రుతతర కరదక్షాః క్షిప్తవైశాఖ శైలే**
**దధతి దధని ధీరా నార వాన్వారిణీవ**
**శశినమివ సురౌఘాః సారముద్ధర్తుమేతే**
**కలశి ముదధి గుర్వీం వల్లవా లోడయంతి"**

"ప్రభాతకాలంలో గోపకులు పెరుగును పెద్దకుండలో వేసి, కవ్వంతో ధ్వని పూర్వకంగా, దేవతలు మందరాచలంతో గంభీరధ్వనియుక్తంగా సముద్రాన్ని చంద్రుని కొరకు మథించినట్లుగా, మథించి వెన్నను తీస్తున్నారు" అని భావం.

ఈ శిశుపాలవధకు ఎనిమిది వ్యాఖ్యానాలున్నాయి. వీటిలో మల్లినాథుని "సర్వంకష" వ్యాఖ్యానం ప్రసిద్ధమైనది. మాఘునిలో అపార శాస్త్ర పాండిత్య జ్ఞానం కన్పిస్తుంది. వేదవేదాంగాలను అభ్యసించిన ఈతడు వ్యాకరణ, రాజనీతి, ధర్మశాస్త్ర, మంత్రతంత్ర శాస్త్రి, ఆస్తిక-నాస్తిక దర్శనశాస్త్ర, పురాణ, ఇతిహాస, ఛంధః, జ్యోతిష, అలంకార, ఆయుర్వేద, సంగీత, సాముద్రిక, అశ్వ, గజ, కామ శాస్త్రములలో నిష్ణాతుడని శిశుపాలవధ పరిశీలన వల్ల తెలుస్తున్నది. భారవిలోని అలంకారశైలిని, కాళిదాసులోని కవితామార్దవం-భావుకత్వాలను, భట్టిలోని వ్యాకరణపాండిత్యాన్ని తన కవిత్వమునందు సహృదయ జనరంజకముగా ప్రదర్శించినాడు కనుకనే ప్రాచీనపండితులు భారవి కవిత్వాన్ని కన్న మాఘుని కవిత్వం శ్రేష్ఠమైందని తలంచినట్లు హరిహరుని సుభాషితావళిలోని శ్లోకాన్ని బట్టి తెలుస్తున్నది.

**"నైతచ్చిత్రమహం మన్యే మాఘమాసాద్య యన్ముహుః।**
**ప్రౌఢతాతి ప్రసిద్ధాపి భారవే రవసీదతి॥"**

"మాఘమాస ప్రవేశంతో సూర్యుని తేజస్సు ఎట్లా సన్నగిల్లుతుందో అదేవిధంగా మాఘుని కవిత్వం ముందు భారవి కవిత్వ గరిమ సన్నగిల్లింది".

ఈ విధంగా మాఘుడు తన శిశుపాలవధ మహాకావ్యంతో సంస్కృత సాహిత్య లోకంలో చిరయశస్సునొందాడు.

## 6.6. శ్రీహర్ష మహాకవి జీవితకాల విశేషాలు:

"నైషధచరితమ్" అన్న మహాకావ్యాన్ని వ్రాసిన మహాకవి శ్రీహర్షుడు. ఈ కవియొక్క తండ్రి శ్రీహీరుడు, తల్లి మామల్లదేవి. ఆ విషయాన్ని కవియే స్వయంగా ఇలా చెప్పుకున్నాడు.

**"శ్రీహర్షం కవిరాజ రాజిమకుటాలంకారహీర స్సుతం।**
**శ్రీహీరస్సుషవే జితేంద్రియచయం మామల్లదేవీ చ యమ్॥"**

"కవిరాజులకు శిరోరత్నము వంటివాడు శ్రీహీరుడు. అతనిని చేపట్టిన ఉత్తమ ఇల్లాలు మామల్లదేవి. వీరి నోములపంట శ్రీహర్షుడు. అతను జితేంద్రియుడు" అని ధైర్యముగా, గొప్ప ఆత్మవిశ్వాసంతో తనను గూర్చి, తన తల్లిదండ్రులను గూర్చి సర్గ సర్గకు చెప్పుకొని హర్షపరవశతను పొందాడు శ్రీహర్షుడు. "కాశ్మీరైర్మహితే చతుర్దశతయీం విద్యాం విదద్భిర్మహా కావ్యే..." అన్న వాక్యమును బట్టి ఇతడు కాశ్మీరదేశీయుడని భావింపవచ్చు. అలాగే ఇతడు కనౌజ్‌రాజు జయచంద్రుని ఆస్థాన కవి అనడంలో ఏమి సందేహం లేదు. ఆ విషయాన్ని శ్రీహర్షుడే కావ్యం చివరిలో–"తాంబూల ద్వయ మాసనం చ లభతే యః కాన్యకుబ్జేశ్వరాత్" అని పేర్కొన్నాడు. జయచంద్రునికాలం క్రీ.శ. 1139 – 1195. కనుక శ్రీ హర్షుని జీవిత కాలం కూడా కూడా ఇదే అని చెప్పవచ్చును.

శ్రీహర్షుని తండ్రి శ్రీహీరుడు. నైయాయికుడైన ఉదయనాచార్యునితో శాస్త్రవాదంలో ఓడిపోయాడట. మరణసమయంలో తండ్రి ఇచ్చిన ఆదేశానుసారంగా హర్షుడు గంగాతీరంలో ఒక సంవత్సరకాలం చింతామణి మంత్రాన్ని జపించగా, అప్పుడతనికి త్రిపురసుందరి ప్రత్యక్షమై అపూర్వ ప్రతిభను ప్రసాదించినదని, ఆ బలముతో శ్రీహర్షుడు ఉదయనాచార్యుని శాస్త్రవాదంలో ఓడించాడని, ఆ సందర్భములోనే కనౌజ్‌ప్రభువు మెప్పు పొందాడని ఒక ఐతిహ్యం.

## 6.7. శ్రీహర్షుని రచనలు:

శ్రీహర్షుని రచనలు ప్రస్తుతం లభించుచున్నవి రెండు. అవి:

1) ఖండనఖండ ఖాద్యము, 2) నైషధీయ చరితము.

ఈ రెండింటిలో కవి పేర్కొన్నరచనలు మరొక ఎనిమిది కలవు. ఇవి ప్రస్తుతం లభించుటలేదు. ఈ ఎనిమిది అలభ్య గ్రంథాలను విషయపరముగా ఇట్లు పేర్కొనవచ్చు.

### 6.7.1. రాజస్తుతి పరమైనవి:

1) విజయ ప్రశస్తి – జయచంద్రుని తండ్రి విజయచంద్రుని ప్రశస్తి దీనిలో వున్నది.

2) గౌడోర్వీశ ప్రశస్తి – గౌడరాజు ప్రశస్తి దీనిలో వున్నది.

3) ఛింది ప్రశస్తి – ఛిందరాజు ప్రశస్తి ఇందులో వున్నది.

4) నవసాహసాంక చరిత – ఇది చంపూకావ్యం. భోజరాజు తండ్రి సింధురాజు ప్రశస్తి దీనిలో వున్నది.

### 6.7.2. వర్ణనా రూపమైన లఘుకావ్యము:

5) అర్ణవ వర్ణనము – సముద్ర వర్ణనతో కూడిన లఘుకావ్యం.

### 6.7.3. మహాకావ్యము:

6) నైషధీయ చరితము – నలదమయంతుల ప్రేమకథా వర్ణనం ఇందులో వున్నది.

### 6.7.4. వేదాంతవాద గ్రంధములు:

7) స్థైర్యవిచారము – దార్శనిక గ్రంథం – దీనిలో క్షణికవాదాన్ని హర్షుడు నిరాకరించాడు.

8) ఖండనఖండఖాద్యమ్ – దీని పేరే విచిత్రము. విషయమూ విచిత్రమే, 'ఖండించుట' – అను 'తీపి వంటకము' అని ఈ పేరునకు అర్థము. ఇది గొప్పదార్శనిక గ్రంథం. దీనిలో తార్కిక పద్ధతిలో వేదాంత సిద్ధాంతాలను ధృవపరచాడు. న్యాయదర్శనాన్ని ఖండించాడు. ఈ జటిల గ్రంథానికి అనేక టీకలున్నాయి.

9) శివశక్తిసిద్ధి - తంత్రశాస్త్ర సంబంధ కృతి ఇది.

10) ఈశ్వరా భింధి - ఇందలి విషయమేమిటో తెలియదు.

## 6.8. నైషధీయచరితం కావ్యేతివృత్తం:

దార్శనిక లోకంలో ఖండనఖండఖాద్యమ్ శ్రీహర్షునికి ఎంత కీర్తిని తెచ్చిపెట్టిందో సాహిత్యలోకంలో నైషధచరితం అతనికంత కీర్తిని తెచ్చిపెట్టంది. ఈ మహాకావ్యంలో 22 సర్గలున్నాయి. దీనిలో నల దమయంతుల ప్రేమకథ వున్నది. ఈ కావ్యంలో క్రమంగా వీరసేన మహారాజు కుమారుడు, నిషధ దేశానికి రాజైన నాయకుడు నలుని వర్ణన, నలుని విహారం, హంసను నలుడు పట్టుకొనటం, దాని అభ్యర్థన మీద విడిచిపెట్టడం, హంస దమయంతి దగ్గరికిపోవటం, దమయంతికి చిక్కటం, ఏకాంతంలో దమయంతికి నలుణ్ణి వర్ణించి చెప్పటం, దమయంతికి నలుని మీద అనురాగం కలగడం, విరహం, భీముడు కూతురు దమయంతి స్వయంవరాన్ని చాటటం, ఇంద్ర-వరుణ-అగ్ని-యములు దమయంతి స్వయంవరానికి బయలుదేరి రావటం, నటునికి తిరస్కరిణీ విద్యనిచ్చి తమ దూతగా దమయంతి దగ్గరకు పంపటం, నలుని దౌత్యం, స్వయంవర వర్ణన, నలుగురు దిక్పాలురు నలుని వేషంలో నలుని పక్కన కూర్చోవటం, స్వయంగా సరస్వతియే స్వయంవర మంటపంలో రాజులను వర్ణించి చెప్పటం, ఐదుగురు నలులను సరస్వతి చమత్కార పూర్ణంగా వర్ణించి చెప్పటం, చివరకు దేవతల అనుగ్రహం చేత దమయంతి నలుని కనుక్కొని వరించటం, నలదమయంతుల వివాహ వర్ణన, విందు వర్ణన, కలియొక్క విజృంభణ, నలదమయంతుల ప్రథమ రాత్రి, వారి విహారాలు వున్నాయి.

నలదమయంతులకథ మహాభారతంలోనే కాక సోమదేవుని కథాసరిత్సాగరంలోను కన్పిస్తున్నది. మహాభారతకథ కన్న కథాసరిత్సాగరకథ కొంత భిన్నంగా వున్నది. శ్రీహర్షుడు మాత్రం తన కథను మహాభారతం నుంచే తీసుకొన్నాడని రెండు కథల పరిశీలనవల్ల మనకు తెలుస్తుంది. మహాభారతకథలో కవి ఎక్కువ మార్పులను చేయలేదు. నలదమయంతుల వివాహం వరకు కథను శ్రీహర్షుడు గ్రహించి శృంగారమయమైన కావ్యంగా రచించాడు. మహాకావ్యోచితం కాని అనేక సంఘటనలతో కూడిన కరుణర సభరితమైన తదుపరి కథను గ్రహింపక శ్రీహర్షుడు ఔచిత్యాన్ని పాటించాడు. ఇందు శృంగార రసాన్ని అంగిరసంగా పోషించాడు. విప్రలంభ సంయోగ శృంగారాలను వర్ణించాడు. కరుణ, భయానక, హాస్యాదులను అంగరసాలుగా పోషించాడు.

## 6.9. శ్రీహర్షుని కవితా-పాండిత్య వైభవం:

శ్రీహర్షుని కవిత్వం సామాన్య సరసహృదయుల కొరకు వ్రాయబడినది కాదు. పాండిత్య ప్రౌఢిమ ప్రతిభా గౌరవంతో కూడిన అతని కవిత్వంతో కూడిన నైషధకావ్యం సరస హృదయులైన పండితుల కొరకు వ్రాయబడింది. అందుకే "నైషధం విద్వదౌషధమ్" అని ప్రసిద్ధినొందినది. అంటే విద్వాంసుల యొక్క గర్వమనే రోగాన్ని పోగొట్టే ఔషధం వంటిది నైషధం అని అర్థం. విద్యాంసుల పాండిత్య ప్రకర్షకు ఇది ఒక గీటురాయి వంటిది.

**"యథా యూనస్తద్వత్ పరమ రమణీయాప రమణీ**
**కుమారాణా మంతః కరణహరణం నైవకురుతే।**
**మదుక్తి శ్చేదంతర్మ దయతి సుధీభూయ సుధియః**
**కిమస్యా నామ స్యాద రసపురషానాదరభరైః॥"**

"ఎట్లా అయితే రమణీయమైన రూపురేఖలు గల యువతి యొక్క సౌందర్యం ఐదు, ఆరు సంవత్సరాల వయస్సున్న బాలుని అంతః కరణాన్ని ఆకర్షించటానికి సమర్థం కాదో అదేవిధంగా రసభావనలేని పురుషులను తన కావ్యం ఆకర్షించదని, సరస హృదయం కలిగిన గొప్పబుద్ధి కలవారినే అది ఆనందింపజేస్తుందని" శ్రీహర్షుడు తన కావ్యకవితా ప్రౌఢిమను గొప్పతనాన్ని గురించి చెప్పుకొన్నాడు. అంతేగాక -

**"గ్రంథ గ్రంథిరిహ క్వచిత్ క్వచిదపి న్యాసి ప్రయత్నాన్మయా**

**ప్రాజ్ఞం మన్యమనా హఠేన పఠితీ మాఽస్మిన్ ఖలః ఖేలతు।**

**శ్రద్ధారాద్ధ గురుశ్లథీ కృత దృఢగ్రంథిః సమాసాదయ-**

**త్వేతత్ కావ్య రసోర్మి మజ్జన సుఖవ్యాసజ్జనం సజ్జనః"॥**

"తన కావ్యములో అక్కడక్కడ 'గ్రంథ గ్రంథిని' (గ్రంథానికి సంబంధించిన 'పీటముడి'ని) బిగించానని, కావాలని పట్టుదలతో ఈ కావ్య నిర్మాణమును ఇట్లా చేసాను అని శ్రీహర్ష కవియే స్వయంగా చెప్పుకొన్నాడు. 'ఎందుకిట్లా చేసావు'- అంటారేమో-స్వయముగా ప్రాజ్ఞుడు కాకుండా, 'నాకన్నీ తెలుసు-నేను గొప్ప మేధావిని' అని అహంకరించేవాడు ఈ కావ్యము వైపు రావటం నాకిష్టంలేదు. దీనివైపు కన్నెత్తి చూస్తే వానికి గర్వభంగం కలగాలి, కలిగి తీరాలి. అందుకనే నేను ఈ గ్రంథ గ్రంథిని పెట్టుచు రచన సాగించాను. సౌజన్యముగల పాఠకుడు సద్గురువులను ఆరాధించి, ఈ రహస్యములను తెలుసుకొని, ఈ ముడులు కాస్తకాస్త విప్పుకొని, అప్పుడీ కావ్యరసతరంగాలలో ఓలలాడే సుఖ పారవశ్యాన్ని పొందుగాక, అనేది నా ఆకాంక్ష" అని కవి అభిప్రాయము. సారాంశమేమనగా మంచి గురువు / మార్గదర్శకుడు లభించిన సహృదయ పాఠకునకు మాత్రమే ఈ కావ్యము రుచి తెలియును.

**6.9.1. కవితా సౌందర్యము:**

ఈ కథను, ఈ కావ్యాన్ని రసాలంకారములతోను, వర్ణనాచమత్కారములతోను శోభాయమానముగా మలిచిన శిల్పి శ్రీహర్షుడు. ఆ శోభాసౌందర్యాలను పరిశీలిద్దాము.

**అ) రసశోభలు:**

రసనిర్వహణలో శ్రీ హర్షునిది అందెవేసిన చేయి. రసరాజమైన శృంగారమును మృదువుగా, మనోహరముగా పరిపుష్టినొందింపగల యీ మహాకవి, అదే రసమును ప్రౌఢముగా, ప్రౌఢతరముగా, ప్రౌఢతమముగా కూడా నిర్వహించి చూపటం విశేషం. ప్రస్తుతము సుకుమార శృంగారరససౌందర్యమును చూద్దాము.

ప్రథమ సర్గలో నలుడు దమయంతీ రూపగుణ సౌందర్యములచే ఆకర్షితుడగును. 'విరహములో' 'అయోగశృంగార' దశ యిది. ఇచట కవిపల్కిన వాక్యము - "అబోధి తజ్జాగరదుఃఖ సాక్షిణీ నిశా చ శయ్యా చ శశాంక కోమలా". ఆ రాజు (నలుడు) భైమి (దమయంతి) విరహంతో నిద్రపట్టక రాత్రిళ్ళు మరీ మరీ బాధపడుతున్నాడు. ఆ బాధను తానుగా అంచనావేయలేనని, ఆ దుఃఖాన్ని ప్రత్యక్షంగా చూసిన సాక్షులు మాత్రమే వివరింపగలుగుతారని కవి భావన. ఆ సాక్షులు ఇద్దరున్నారు. ఒకరు చంద్ర (చంద్రునితో కోమలములైన రాత్రులు, మరొకరు చంద్ర (చంద్రుని వెన్నెలల వలె మెత్తనైన) కోమలమైన అతని శయ్య (పక్క) వీళ్ళే నలవిరహాన్ని అర్థము చేసుకొన్న సహృదయ సాక్షులట. ఈ వాక్యము ఆలోచనామృతము. సహృదయుల భావనామహిమను బట్టి నలుని ధీరోదాత్తత విరహ తీవ్రత ఇందు కనిపించుచుండును. పాఠకుల హృదయాలను

అలరించుచుండును.

స్వయంవరములో కీకటుని (మగాధాధిపతి) శౌర్య పరాక్రమములను సరస్వతీముఖముగా కవి ఇలా వర్ణిస్తున్నాడు.

**"ఏతేనోత్కృత్త కంఠ ప్రతి సుభటనటారబ్ధ నాట్యాద్భుతా నాం**
**కష్టం ద్రష్టైవ నాభూద్భువి సమరసమాలోకిలోకాస్పదేపి।**
**అశ్వైర స్వైర వేగైః కృతఖురఖురలీమంక్షు విక్షుద్యమాన**
**క్ష్మాపృష్ఠోత్థిషదంధంకరణరణ ధురా రేణుధారాంధకారాత్"**

ఆ రాజు శత్రుసైనికులను నరికి పోగులు పెట్టుచున్నాడు. గుఱ్ఱాలపైనున్న యోధులు, గజ యోధులు, కాల్బలములోనివారు, ఎక్కడివారక్కడ నరకబడుతుంటే, తలలు తెగి దూరంగా ఎక్కడో పడుతుంటే, మొండెములలోనుండి నెత్తురు పొంగులు వారుతూ వస్తుంటే, అట్లా చంపబడుతున్న క్షణంలో ఉన్నఆవేశముతో ఆ మొండెములు అట్లాగే వీరావేశముతో చిందులు వేస్తున్నాయి. నాట్యం చేస్తున్నాయి. ఒళ్ళు జలదరించే ఆ అద్భుతమైన భయంకరమైన నాట్యమును చూడటానికి రణరంగములోని రెండు పక్షాల సైనికులలో చాలామంది సిద్ధంగా వున్నారు. పై నుండి చూద్దామని దేవతలు, అప్సరసలు తహతహలాడుతున్నారు. కానీ అదేం దురదృష్టమో ఆ నాట్యాన్ని ఎవరూ చూడలేకపోతున్నారు. గుఱ్ఱాల గిట్టలతో లేచిన మట్టి భూమ్యాకాశాలను కప్పేస్తుంటే, ఆ ధూళితెరల మాటునపడిపోయింది. ఈ భయంకర సన్నివేశమంతా, – అని ఈ శ్లోక భావము. రౌద్ర–బీభత్స–అద్భుతాలను కలిపి ప్రయోగించుటలో కవి ప్రతిభకిది చక్కని సాక్ష్యము.

**అలంకార సౌందర్యము:**

అతిశయోక్తి–ఉత్ప్రేక్షలను సంస్కృతంలో శ్రీహర్షుడు ప్రయోగించినంత రమ్యంగా మరే ఇతర కవి ప్రయోగించ లేదనిపిస్తుంది.

**"వైదర్భి కేళిశైలే మరకతశిఖరాదుత్థితైరంశుదర్భైః**
**బ్రహ్మాండాఘాత భగ్నస్యదజమదతయా హ్రీధృతావాఙ్ముఖత్వైః।**
**కస్యా నోత్తానగాయాః దివి సురసురభేః ఆస్యదేశం గతాగ్రైః**
**యద్గోగ్రాస ప్రదానవ్రత సుకృతమ విశ్రాంత ముజ్జృంభతే స్మ।।"**

ఈ శ్లోకంలో అతిశయోక్త్యలంకారము అద్భుతంగా పోషింపబడింది .

"దమయంతి విహరించే ఉద్యానవనములో చాలా ఎత్తైన క్రీడా పర్వతముంది. ఆ పర్వతముపై శిఖర భూములన్నీ మరకత (పచ్చరాయి) మణులతో నిండి ఉన్నాయి. ఆ మణుల కాంతులు గరిక–దర్భలుగా అలా అలా పైపైకి వెళ్ళిపోతున్నాయి. వెళ్ళగా వెళ్ళగా ఈ బ్రహ్మాండము తాలూకు పై కప్పు కొట్టుకొని, ఇక అంతకంటే పైకి వెళ్ళలేక సిగ్గుపడి, ఆ కిరణాలు తలక్రిందులుగా (వెళ్ళిన తీరుకు తలక్రిందలుగా–అనగా–ఆ గరిక–దర్భల కొసలు భూమివైపుకు తిరిగి ఉన్నాయన్న మాట) తిరిగి వస్తున్నాయి. తిరుగు ప్రయాణములో స్వర్గం దాకా వచ్చాయి. అక్కడ కామధేనువు సంచరిస్తోంది. ఆ కామధేనువు 'ఉత్తానగ' – అన్నమాట, అంటే స్వర్గంలోని కామధేనువు కాళ్ళు మన భూమివైపుకు ఉండవు, స్వర్గానికి పైనున్న లోకాలవైపు ఉంటాయన్న మాట. మూపురము భూమిపై వుండును. కనక ఈ దర్భలు ఆ గోవు నోట్లోకి అలా అలా ప్రవేశిస్తున్నాయి. దీంతో గోమాతకు మేత పెట్టిన పుణ్యము ఆ పర్వతానికి, తద్వారా కుండినపురమునకు ప్రతిరోజు లభిస్తోందిట". నిజానికి – పుణ్యం రావటానికి ఇచట

దర్భలు లేవు, గరికలు లేవు. 'యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే'–అన్న ఆలంకారికరుల వాక్యానికి అర్థంగా నిలుస్తూ, ఇచట కవి భావనాశిల్పము క్రీడాపర్వతశిఖరముతో ప్రారంభమై పైలోకాలన్నీ చుట్టేసి వచ్చింది. ఇంతటి సుదీర్ఘమైన భావనాన్వితములైన అలంకారాలు ఈకావ్యములో కొన్ని వందలు ఉన్నాయి.

దమయంతి ముఖసౌందర్యమును హంస నలునకు వివరిస్తూ –

**"హృత సారమివేందు మండలం**

**దమయంతీ వదనాయ వేధసా।**

**కృతమధ్య బిలం విలోక్యతే**

**ధృత గంభీరఖనీఖనీలిమ॥"**

"వైదర్భీ ముఖములో (దమయంతి ముఖములో) మరెక్కడా కన్పించని కళా విశేషాన్ని, శోభను, లావణ్యాన్ని, అమృతసారాన్ని నింపాలనుకున్నాడు బ్రహ్మ, అనుకొని అటూ ఇటూ చూస్తున్న బ్రహ్మకు చంద్రబింబం కనిపించింది. వెంటనే అతని సమస్య తీరిపోయింది. ఆలోచన స్ఫురించింది. ఆ ఇందు మండలము నుండి ఓ గుప్పెడు లావణ్యమును గుంజుకొచ్చినాడు. ఆ ముద్దనంతటినీ భైమీ ముఖములో సర్దేసినాడు. ఆ ముఖము ఇక దేదీప్యమానము కాక ఏమవుతుంది? కానీ! పాపం చంద్రుడే దెబ్బతిన్నాడు. అతని మధ్య భాగమంతా చిల్లుపడి, డొల్లపడి, శూన్యమైపోయింది. అందుచేతనే ఆ శూన్యములోంచి ఆ చంద్రునకు ఆవలివైపున నీలాకాశం మనకు కనిపిస్తోంది. మనమిదంతా ఆలోచింపక, ఆ 'ఖ–నీలిమ' ను మచ్చ అంటున్నాము". ఇదీ ఈ శ్లోక భావము. చంద్రునిలో మచ్చను 'ఖ–నీలిమ' గా ఊహించుటచే ఉత్ప్రేక్షాలంకార మగును.

చంద్రుని చంద్రునిగా మరచిపోయి, అదొక లావణ్యపు ముద్దగా, వెన్నలాంటి మెత్తని పదార్థ పుంజముగా, అందాల గనిగా, తవ్వుకొని వచ్చేందుకు వీలైన వస్తువుగా ఊహిస్తేగాని హర్షుడు చేసిన మాయ అర్థం కాదు.

## 6.9.2. వర్ణనా చమత్కృతులు:

నైషధీయ చరితము వర్ణనలకు నిలయము. నైషధ కావ్యములో సర్గలకు సర్గలు విస్తృతమైన వర్ణనలు చేశాడు శ్రీహర్షుడు. 19వ సర్గలో ప్రభాతవర్ణనమును ఎంతో అద్భుతంగా వర్ణించాడు –

**"నభసి మహసాం, ధ్వాంత ధ్వాంక్ష ప్రమాపణ పత్త్రిణామ్**

**ఇహ విహరణైః 'శ్యైనం పాతాం' రవేరవధారయన్।**

**శశవిశసన త్రాసాదాశామయా చ్ఛరమాం శశీ**

**తదధి గమనాత్ తారా పారావతై రుదడీయత॥"**

"వేటలలో డేగవేట విలక్షణమైనది. "శ్యైనంపాతా' అని దీనికి పేరు, ఎక్కడో ఎత్తుగా దూరముగా తిరిగే డేగలను కొట్టుటకు 'ఎర' గా, బోయవాడు తన పెంపుడు పిట్టలను మందుగా వదులును, వాటిని పట్టుకొనుటకు డేగలు దగ్గరకు వస్తే, బాణాలతో వేటాడటం జరుగును. ప్రస్తుతము–సూర్యుడనే వేటగాడు చీకటికాకులను డేగ వేటకై వదలినాడట. వేటగాడు అడవిలో ప్రవేశించినాడనగానే పక్షులు, మృగాలు జాగ్రత్తపడతాయి. నక్షత్రాలనే పావురాలు ఇట్లాగే భయపడి దూరముగా ఎక్కడికో ఎగిరిపోతున్నాయి. ఇదే విధముగా చంద్రుడు తన పెంపుడు కుందేలును ఈ వేటగాడేమైనా కొట్టునేమోనని భయపడి,

ఆ వేటగానికి (తూర్పున ఉదయిస్తున్న వానికి) దూరముగా (పశ్చిమానికి) ఆ కుందేలును పొదివి పట్టుకొని పారిపోతున్నాడట".

మరొకచోట చంద్ర-నక్షత్ర వర్ణనను ఎంతో హృద్యంగా ఇలా వర్ణించాడు. కవి -

**"అయమయోగి వధూవధ పాతకైః**

**భ్రమి మవాప్య దివః ఖలు పాత్యతే।**

**శితినిశాదృషది స్ఫుటదుత్పతత్**

**కణగణాధికతార కితాంబరః"**

విరహంలో ఉన్న వైదర్భి చంద్రుని నిందిస్తూ సఖులతో - "ఓ చెలులారా! వియోగ దుఃఖమును అనుభవిస్తున్న స్త్రీలను చంపే పాపాత్ముడు వీడు. వీనిపై నున్న అనేక హత్యాభియోగాలను విచారించి మరణశిక్ష వేశారు. దాని ప్రకారము 'రాత్రి' అనే పదునైన వధ్యశిలపై పైనుండి ఎవరో విసిరికొట్టి, శిక్ష అమలుచేసినారు. హమయ్య! చంద్రుడు చచ్చిపోయేనేమో! తెల్లని కుండ విసిరికొడతే ముక్కలు ముక్కలుగా చెల్లాచెదరు ఐనట్లు, తుంపులు తుంపులైన చంద్రఖండాలే ఆకాశమంతా పరచుకొన్న యీ నక్షత్రాలు కదా!"

పాఠకుల మనస్సులను ఉల్లాసపరిచే వర్ణనలు, సంభాషణ చమత్కరములు చేయటం శ్రీహర్షునికి వెన్నతో పెట్టిన విద్య. ఈ కావ్యములో అలాంటి చమత్కారములు కోకొల్లలు. 'వక్రోక్తి' అలంకారాన్ని చక్కగా ప్రయోగించి ఈ చమత్కారాన్ని సమృద్ధిగా సాధించాడు శ్రీ హర్షుడు.

విరహముతో బాధపడుతున్న నాయికను చెలికత్తెలు ఓదారుస్తున్నారు. అపుడు ఒక ఇష్ట సఖి ఇలా అన్నది.

**"అమృత దీధితి రేష విదర్భ జే!**

**భజసి తాప మముష్య కి మంశుభిః।**

**యది భవంతి మృతాః సఖి! చంద్రికాః,**

**శశ భృతః క్వ తదా పరితప్యతే"!**

"ఓ అమ్మాయి! నీ ఎదురుగా ఆకాశములో కన్పిస్తున్నది అమృత కిరణాలవాడు (అమృతముతో చల్లని కిరణాలు కలవాడు) కదా! మరి అట్లాంటి వానిని చూస్తే నీకీ తాపము (వేడి / బాధ) కలుగుట ఏమిటి? అంటుంది సఖి. దానికి దమయంతి సమాధానమిది. "ఓ పిచ్చి దానా! ఆ చంద్రుడు 'అ-మృత-దీధితి", (చావని కిరణాలు కలవాడు). కనుకనే నాకీ బాధ. వాడే కనుక 'మృత-దీధితి' అయితే (చచ్చిపోయిన కిరణాలవాడైతే = వెన్నెల లేనివాడైతే అని భావం) నాకిక బాధేమున్నది" అనటంలో గొప్ప చమత్కారం అభివ్యక్తమవుతుంది.

అట్లా దేవతలు నలుని తమ దూతగా భీమ తనయవద్దకు పంపుదామనుకొని అతని గుణగణాలను ప్రస్తుతిస్తారు. అతను తమకు సాయము చేయనంటాడేమో అని ముందుకాళ్ళకు బంధం వేస్తూ పలికిన మాటలలో చక్కని చమత్కారం కనిపిస్తుంది.

**"నాక్షరాణి పఠతా కిమపాఠి**

**ప్రస్మృతః కిమథవా పఠితోఽపి।**

**ఇత్థమర్థి జన సంశయ డోలా**

**ఖేలనం ఖలు చకార నకారః"॥**

"ఎవరు వచ్చి ఏది అడిగినా, 'లేదు-కాదు' అనటం నీకు చేతకాదని నీవద్దకు వచ్చే యాచకులు (మావంటివారు) అనుకొంటూ ఉంటారు. 'న' (=లేదు / కాదు) అను అక్షరమును నీవు బాల్యములో అక్షరాభ్యాస వేళలో దిద్దుకోలేదని, ఒకవేళ గురువులు చదివించినా, తరువాతి రోజులలో ఆ అక్షరాన్ని మరిచిపోయావని-నీవు అంతటి దాతవని" దేవతల స్తుతి సారాంశమిది, ఇచడి 'న' అక్షర ప్రయోగంలో కవి చమత్కారం ప్రదర్శించాడు. ఇలాంటి చమత్కారాలు ఈ కావ్యంలో అడుగడున కనిపిస్తుంటాయి.

శ్రీహర్షుడు మహా పండితుడు, మహావైయాకరుణుడు, మహాదార్శనికుడు, అతడు షడ్దర్శనాలను అభ్యసించాడు. అతడు స్వయంగా అద్వైత వేదాంతి. అంతటి మహోన్నత పండితుడు మరియు సకలశాస్త్ర పారంగతుడు గనుకనే తన స్వీయ పాండిత్య ప్రతిభతో ఈ ప్రౌఢ కావ్యాన్ని పండిత జనరంజకంగా రచించాడు. వ్యాఖ్యానం సహాయం లేకుండా నైషధాన్ని సంపూర్ణంగా అర్థంచేసుకోవటం చాలా కష్టం. దీనికి 23 వ్యాఖ్యానాలు వ్రాయబడ్డాయి. వీటిల్లో నారాయణభట్టు వ్రాసిన "నైషధ ప్రకాశం", మల్లినూథుడు వ్రాసిన "జీవాతు" వ్యాఖ్యానాలు సర్వశ్రేష్ఠమైనవి.

**"దిశి దిశి గిరిగ్రావాణః స్వాం వమంతు సరస్వతీం**

**తులయతు మిథస్తామా పాత స్ఫురద్ధ్వనిడంబరామ్।**

**స పరమపరః క్షీరోదన్వాన్ యదీయముదీయతే**

**మథితురమృతం ఖేదచ్ఛేది ప్రమోదన మోదనమ్॥".**

"దేశంలో ప్రతి దిక్కునందు ఎన్నెన్నో పర్వతాలు, కొండలు ఉన్నాయి. వాటిమీద నుండి, వాటి అతి సన్నన్నైన సందుల్లోంచి ఎన్నో నదులు, ఎన్నెన్నో వాగులు, చక్కని నీటితో, గలగల 'ధ్వని' విశేషాలతో ప్రవహిస్తున్నాయి. అట్లే ఎందరో కవులు ఆయా దిక్కుల్లో వివిధ దేశభాగాలలో తమ స్వచ్ఛమైన కవితలను ధ్వని విశేషాలతో వెలువరిస్తున్నారు. కాదనను. ఆ నదులలో నదులకు, ఆ కవులలో కవులకు తులనాత్మక పరిశీలనలు చేసే వారిని చేసుకోమనండి. నాకభ్యంతరం లేదు. కానీ పట్టుదలగా, చివరవరకు మధించే శక్తి కలిగిన వారికి 'మోద ప్రమోద ' సంధాయకమైన అమృతమును, అమృతత్వ రూపమైన బ్రహ్మానందమును, అందించాలంటే ఆ నదులకు గాని, ఆ కవులకు గాని సాధ్యమా? అది పాల సముద్రానికే సాధ్యము. ఈ శ్రీహర్షునికే సాధ్యము అని గ్రహించ కోరెదను" అని నైషధ కావ్యం చివరిలో తన కవిత్వాని గూర్చి, తన పాండిత్యాన్ని గూర్చి సగర్వంగా, గొప్ప ఆత్మవిశ్వాసంతో ప్రకటించుకున్న ఈ మహాకవి మాటలు నిజంగా అక్షర సత్యములేననిపిస్తుంది.

ఇతడి నైషధ కావ్యంతో సంస్కృత మహాకావ్య ప్రక్రియ ఉచ్ఛదశను చేరుకొన్నదనే చెప్పవచ్చు. సంస్కృతమహాకావ్య పరంపరలో భారవి – కిరాతార్జునీయాన్ని, మాఘుని-శిశుపాలవధను, శ్రీ హర్షుని-నైషధ చరితాన్ని కలిపి 'బృహత్రయీ' అని వ్యవహరిస్తారు.

ఐతే ఈ మూడు మహాకావ్యాలలో నైషధమే పరమోత్కృష్టమైనదని, ఈ కావ్యము వెలువడిన తర్వాత, మిగిలిన మహాకావ్యాలన్నీ సూర్యుని ముందు దివిటీలవలె వెలవెలబోయాయని అనేకమంది పండితులు ముక్తకంఠంతో –

**"తావద్ భా భారవేర్భాతి, యావన్మాఘస్యనోదయః।**

**ఉదితే నైషధే కావ్యే 'క్వ మాఘః క్వచ భారవిః॥"**

అంటూ ఈ నైషధ కావ్యవైభవాన్ని శ్లాఘించారు.

## 6.10. ఆధార గ్రంథాలు:

1) సంస్కృత సాహిత్య చరిత్ర - డా॥ ముదిగంటి గోపాలరెడ్డి "వేదాలంకార్"
డా॥ ముదిగంటి సుజాతరెడ్డి.

2) నైషధీయ చరితామృతం - డా॥ ముళ్ళపూడి జయసీతారామశాస్త్రి

3) సంస్కృత నిబంధశతకమ్ - డా॥ కపిల్‌దేవ్ ద్వివేది

## 6.11. రాదగిన ప్రశ్నలు:

1) సంస్కృతము మహాకావ్య పరంపరలో మాఘుని కవితావైభవాన్ని వివరించండి?

2) "నైషధమ్ విద్వదౌషధమ్" - మీ పాఠ్యాంశాధారంగా విశదీకరించండి?

- డా॥ సిహెచ్. పవన్ కుమార్

పాఠం - 7

# సంస్కృత సాహిత్య చరిత్ర-భాసుడు, భవభూతి

విషయ క్రమం:


7.0. ఉద్దేశ్యం

7.1. రూపకోత్పత్తి

7.2. రూపకాల ప్రాచీనత మరియు వికాసం

7 3. దశవిధ రూపక భేదాలు

7.4. భాసుని జీవితకాల విశేషాలు

7.5. భాసుని నాటక కర్తృత్వం

7.6. భాస నాటక చక్రమ్

7.7. భాసుని నాటకకళ-పాత్రచిత్రణ

7.8. భాసుని కవిత్వం

7.9. భవభూతి జీవితకాల విశేషాలు

7.10 భవభూతి నాటక రచనలు

7.11. భవభూతి నాటకకళ

7.12. భవభూతి కవిత్వం - రసాలంకారఛందోవర్ణనా నైపుణ్యం

7.13. ఆధార గ్రంథాలు

7.14. రాదగిన ప్రశ్నలు


## 7.0. ఉద్దేశ్యం:

సంస్కృత సాహిత్యంలో రూపకోత్పత్తి, రూపకాల ప్రాచీనత, రూపకభేదాలు, సంస్కృత రూపకకారులలో సుప్రసిద్ధుడు, ప్రాచీనుడైన భాసమహాకవి యొక్క జీవితకాలవిశేషాలు, భాసుని రచనలు, వాటి పరిచయం, భాసుని నాటకకళ, భాసుని కవితా వైశిష్ట్యం, కాళిదాసాదులమీద భాసుని ప్రభావం అట్లే సంస్కృత సాహిత్యంలో మరొక సుప్రసిద్ధ నాటకకర్త అయిన భవభూతి మహాకవి జీవితకాలవిశేషాలు, అతడి రచనల పరిచయం, భవభూతి కరుణరసప్రీతి, భవభూతి కవితావైదగ్ధ్యం, అతడి నాటకకళ, అతడి పాండిత్యం మొదలైన విషయవిశేషాలను ఈ పాఠ్యాంశంద్వారా విద్యార్థులకు సవివరంగా తెలియజేయటమే ప్రధానోద్దేశ్యం.

## 7.1. రూపకోత్పత్తి:

సంస్కృత సాహిత్య చరిత్రలో రూపక సాహిత్యం ప్రధానాంగరూపమైంది. ప్రపంచ సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే సంస్కృత రూపకాలు ఒక విశిష్ట పరంపర కలిగినటువంటివి. సంస్కృత సాహిత్యంలో లోకప్రియత్వం దృష్టితో చూచినట్లయితే రూపకాలు ప్రథమస్థానాన్ని గ్రహిస్తాయి. దర్శన, శ్రవణ గుణాలచేత రూపకాలు పండిత పామరులను సమానంగా ఆకర్షించి

ఆనందితులను చేయటమేగాక , ఈ గుణాలచేత వాటి ప్రభావం సామాజికుల మీద ఇతర కావ్య ప్రక్రియల ప్రభావం కన్నా అధికంగా వున్నది. సర్వకళల సమాహారం కావటం చేత రూపకాలు కేవలం ఆనంద ప్రదాయకమైనవే కాక విజ్ఞానదాయకమైనవి కూడా. ఇటువంటి విశిష్టమైన రూపక ప్రక్రియ ఎప్పుడు ఎట్లా ఆవిర్భవించి వికసించిందనే విషయంలో ఆధునిక విమర్శకులు చాలా ఊహాగానాలు చేశారు.

భరతుడు తన నాట్యశాస్త్రంలో నాట్యోత్పత్తిని గూర్చి చర్చించాడు. అతడు చెప్పిన నాట్యోత్పత్తి వృత్తాంతమిది – త్రేతాయుగంలో దేవతలు బ్రహ్మ దగ్గరికి పోయి సామాన్యజనులకు ఉపయోగపడే వేదరచన చేయమని ప్రార్థించారు. అప్పుడు బ్రహ్మ

**"జగ్రహ పాఠ్యమృగ్వేదాత్ సామభ్యో గీతమేవ చ।**

**యజుర్వేదాదభినయాన్ రసానాథర్వణాదపి॥"**

ఋగ్వేదం నుంచి పాఠ్యాన్ని, సామవేదం నుంచి గానాన్ని, యజుర్వేదం నుంచి అభినయాన్ని, అధర్వణవేదం నుంచి రసాన్ని తీసికొని పంచమవేదంగా నాట్యవేదాన్ని సృష్టించాడు. బ్రహ్మ ఆజ్ఞమీద విశ్వకర్మ నాట్యగృహాన్ని నిర్మించాడు. నాట్యకళా ప్రచారానికి భరతముని నియమింపబడ్డాడు. ఇంద్రధ్వజోత్సవ సమయంలో మొదటిసారిగా భరతుడు తన సుశిక్షితులైన పుత్రులద్వారా నాట్యాన్ని ప్రదర్శింపజేసాడు. ఈ నాటకోత్పత్తి కథను బట్టి నాట్యం లేక అభినయం సామాన్య ప్రజలకు ధర్మజ్ఞానబోధ చేయటానికి సృష్టింపబడిందని తెలుస్తున్నది. ఇంకా నాట్యం దుఃఖార్తులకు, శ్రమార్తులకు, తపస్వి జనులకు విశ్రాంతి కలిగించి, శాంతిని కలిగిస్తుందని భరతుడు అంటాడు.

**"దుఃఖార్తానాం శ్రమార్తానాం శోకర్తాణం తపస్వినామ్।**

**విశ్రాంతి జననం కాలే నాట్యమేతత్ మయాకృతమ్॥"**

భరతుని ఈ నాట్యోత్పత్తి కథను బట్టి నాటక బీజాలు వేదాలల్లోనే వున్నాయని, వేదకాలంలోనే గానం, సంగీతం వుండేవని సంగీతానికి అనుగుణంగా నాట్యం చేయటం వుండేదని తెలుస్తున్నది.

## 7.2. రూపకాల ప్రాచీనత మరియు వికాసం:

వేదాల తర్వాత బ్రాహ్మణగ్రంథాలల్లో నృత్య, గీత, సంగీత శబ్దాలు చాలాసార్లు ప్రయోగింపబడి కన్పిస్తున్నాయి. సంహిత కాలంలో ఆరంభమైన ఈ రూపకకళ బ్రాహ్మణకాలంలో, ఇంకా బాగా వికసించింది. రామాయణ, మహాభారత కాలంలో రూపకకళ ఇంకా వికసించినట్లు వాటిల్లో దొరికే నాటక సంబంధ పారిభాషిక పదాలే చెప్తున్నాయి. రామాయణంలో నట, నర్తక, కుశీలవ, రంగస్థలాది నాటక పారిభాషికపదాలు కన్పిస్తున్నాయి. రామాయణ కాలంలో అయోధ్యా నగరంలో నాటక మండలాలున్నట్లు తెలుస్తున్నది. అయోధ్యకాండంలో నర్తకుల గోష్ఠిని గురించి ప్రసక్తి వున్నది.

**"నారాజకే జనపదే ప్రహృష్ట నట నర్తకాః"** రాజు లేని జనపదంలో నటులు, నర్తకులు సంతోషంగా వుండరు – అన్న వాల్మీకి మాటలను బట్టి ఆ కాలంలో నటులకు, నర్తకులకు సంఘంలోవున్న ఉన్నత స్థానాన్ని ఊహించవచ్చును. మహాభారతం విరాటపర్వంలో నటి, నర్తక, నాయక, సూత్రధార, నర్తకశాలాది పారిభాషిక పదాలు ప్రయోగింపబడ్డాయి. ఇక హరివంశంలో రామాయణ కథ మీద ఆధారపడిన నాటక ప్రదర్శన ప్రసక్తి కూడా వున్నది. పురుషులే స్త్రీ పాత్రలను ధరించేవారని అటువంటి నటులను "భు కుంశు" లని పిలిచేవారని హరివంశాన్ని బట్టి తెలుస్తుంది.

పాణిని అష్టాధ్యాయిలో "పారాశర్య శిలాలిఖ్యం భిక్షునట సూత్రయోః" అని శిలాలి, భిక్షులు వ్రాసిన నటసూత్రాలను పేర్కొన్నాడు. పాణిని నాటికి (క్రీ.పూ.500) భారతదేశంలో నాట్యనాటక కళలు బాగా వికసించి శాస్త్రబద్ధం కూడా చేయబడినవని నటసూత్రాల ఉనికిని బట్టి తెలుస్తున్నది. క్రీ.పూ. 200 నాటిదైన ఒక నాటకశాల నాగపూర్ సమీపంలోని పర్వతం మీద రాతిలో తొలిచింది దొరికింది. కావ్యనాటకాదుల్లో కూడా మనకు ఈ నాటకశాలల ప్రసక్తి విస్తృతంగా కన్పిస్తున్నది. క్రీస్తుపూర్వం వ్రాయబడిన బౌద్ధగ్రంథాలను బట్టి నాటక ప్రదర్శనకళ బాగావికసించి వ్యాప్తిలో వున్నట్లు తెలుస్తున్నది. మౌర్యుల కాలంలో వ్రాయబడిన అర్థశాస్త్రంలో లలిత కళలు, వాటిని అభ్యసించే వారికి ప్రభుత్వం ఇచ్చే రక్షణలు గురించి చెప్పబడింది. నట, నర్తక, గాయక, వాదక, కుశీలవాదుల సమాజాలుండేవని అర్థశాస్త్రాన్ని బట్టి తెలుస్తున్నది. వీరు తమ విద్యలనే జీవనోపాధిగా బ్రతికేవారు. వీరు తమ ఆదాయంలో కొంతభాగాన్ని ప్రభుత్వానికి పన్నుగా కూడా ఇచ్చేవారు. క్రీ.శ. ప్రథమ శతాబ్దివాడైన వాత్స్యాయనుడు తన కామసూత్ర గ్రంథంలో నాగరికుల మనోరంజనానికై కుశీలవులు నాటకాన్ని ప్రదర్శించటాన్ని పేర్కొన్నాడు. తర్వాత కావ్యనాటకాదుల్లో నాటక సంగీతశాలలు చాలాసార్లు పేర్కొనబడ్డాయి. ఈ ఆధారాలను బట్టి భారతదేశంలో నాటకకళ స్వతంత్రంగా వైదిక కాలంలోనే పుట్టి క్రమక్రమంగా వికసించి భరతుని నాటికి సంపూర్ణ రూపురేఖలతో స్థిరపడి క్రీ.పూ. ప్రథమ శతాబ్ది నాటికి భాస-సౌమిల్ల-కాళిదాసులతో ఉన్నత శిఖరాలను అందుకొన్నది.

## 7.3. దశవిధరూపక భేదాలు:

ఇంగ్లీషులో 'డ్రామా' అనే పదానికి సమానార్థకంగా ప్రయోగించబడేది "రూపక" పదం. నటులు ఆయాపాత్రల రూపాలను ఆరోపించుకొని అభినయిస్తారు కాబట్టి దీనికి రూపకమనే పేరు కలిగింది. నాటకమన్నది ఈ రూపక భేదాలలో ఒకటి, కాని ఇప్పుడు రూపక పదం ఎక్కువ ప్రచారంలో లేదు. డ్రామా పదానికి సమానార్థకంగా నాటకపదమే వాడబడుతున్నది. నాటకమన్నపదమే ఇప్పుడు ఎక్కువ ప్రచారంలో వున్నది. అందుకే అంతటా రూపక, నాటక పదాలు పర్యాయపదాలుగా వాడబడినవి. రస, వస్తు, నాయకాది భేదాలనుబట్టి ప్రాచీనకాలంలో రూపకాలు పదిరకాలుగా చెప్పబడ్డాయి. అవి –

1) **నాటకం:** నాటకమనే రూపక భేదంలో కథ, అంటే ఇతివృత్తం ప్రసిద్ధమైనదై, వుండాలి. నాయకుడు ధీరోదాత్తుడు, క్షత్రియుడు, ప్రసిద్ధ రాజ వంశజుడై వుండాలి. అంగిరసం శృంగారం లేక వీరం అయివుండాలి. దీనిలో 5 నుంచి 10 వరకు అంకాలుంటాయి. ఒకే సమయంలో రంగస్థలం మీద నాలుగైదు పాత్రలకన్న ఎక్కువ వుండరాదు. ప్రతి అంకంలో నాయకుడు లేకపోతే నాయిక కనిపించాలి. ఈ నాటకం దశవిధ రూపకాలల్లో ఎక్కువ ఆదరణను పొందిన ప్రసిద్ధమైన భాగం.

2) **ప్రకరణం:** దీనిలో కథ ప్రసిద్ధమైందిగాక కల్పితమై వుంటుంది. నాయకుడు రాజవంశీయుడు గాని, బ్రాహ్మణుడు గాని, వైశ్యుడు గాని, మంత్రి కుమారుడు గాని వుండవచ్చును. అతడు ధీర ప్రశాంతుడు. నాయిక కులీనురాలు గాని, వేశ్యా స్త్రీగాని లేక ఇద్దరూగాని వుండవచ్చును. ఇందు అంగిరసం (ప్రధానరసం) శృంగారం, నాందీ ప్రస్తావన సంధి సంధ్యాంగాలన్ని నాటకంలోవలెనే వుంటాయి, నాటకంలోవలె దీనిలో కూడా 5 నుండి 10 అంకాలుంటాయి.

3) **భాణం:** దీనిలో ఒకే ఒక అంశం వుంటుంది. ఒకే ఒక పాత్ర వుంటుంది. ఆ పాత్ర చతురవ్యక్తి గాని, పండితుడు గాని, విటుడుగాని అయివుండాలి. అతడు రంగస్థలం మీదికి వచ్చి తాను అనుభవించిన లేదా ఇతరులచేత అనుభూతమైన ధూర్తచరిత్రను వర్ణించి చెప్తాడు. అంగిరసం శృంగారం లేక వీరం. ఆకాశభాషణం సహాయంతో సంభాషణను నడుపుతుంటాడు. ఇది ఆధునిక యుగంలోని ఏకపాత్రాభినయం వంటిది.

**4) ప్రహసనం:** దీనిలో ఒకటి లేదా రెండు అంకాలుంటాయి. హాస్యరసం ప్రధానమైంది. ఇతివృత్తం కల్పితమైంది. నాయకుడు బ్రాహ్మణుడు, సన్యాసి, రాజు, విటుడు – వీరిలో ఎవడైన ఒకడు కావచ్చును. మిగతా పాత్రలన్నీ కూడా విటులు, భిక్షకులు, వేశ్యలు, సేవకులు మొదలైనవారుంటారు.

**5) డిమం:** దీనిలో 4 అంకాలుంటాయి. కథ ప్రసిద్ధమైందిగా వుండాలి. పాత్రలు గంధర్వ, యక్ష, రాక్షస, నాగాది, మర్త్యేతర జాతులకు చెందినవారు, భూత, ప్రేత, పిశాదులుండవచ్చును. దీనిలో 16 పాత్రలుండాలి. వీరు ఉదాత్త స్వభావం కలవారై వుంటారు, దీనిలో ఇంద్రజాలం, మాయ, యుద్ధం, సూర్యచంద్ర గ్రహణాది దృశ్యాలుంటాయి. నాందీ ప్రస్తావనలు నాటకంలో వలె వుంటాయి. 'డిమ' ధాతువుకు సంఘాతమని అర్థం. నాయకుల సంఘాతం జరుగుతుంది కాబట్టి ఈ రూపక ప్రక్రియకు ఈ పేరు వచ్చింది. శృంగార హాస్యాలు కాక మిగతా రసాలల్లో ఏదైనా ఒకటి ప్రధానంగా వుండవచ్చు.

**6) వ్యాయోగం:** దీనిలో ఒకే ఒక అంకముంటుంది. రసపోషణ డిమంలో వలె జరుగుతుంది. కథ ప్రసిద్ధమై వుంటుంది. ఉద్ధతుడైన వ్యక్తిని ఆశ్రయించి ఇతివృత్తముంటుంది. దీనిలో యుద్ధముంటుంది. అది స్త్రీ కొరకుగాని లేక ఏకారణం కొరకైనా గాని కావచ్చును. పురుషపాత్రలు అధికంగా వుంటాయి. ఒక్క రోజు జరిగిన సంఘటన మాత్రమే వుంటుంది.

**7) సమవకారం:** దీనిలో 6 అంకాలుంటాయి. పన్నెండు నాయక పాత్రలుంటాయి. వారు పురాణ ప్రసిద్ధులైన పురుషులై వుంటారు. ప్రస్తావన నాటకంలోవలె వుంటుంది. దీనిలో కథ దేవతలకు, దైత్యులకు సంబంధించిందై వుంటుంది. ప్రధాన రసం వీరం. దేవదానవుల సముద్రమథనం వంటి ఇతివృత్తం దీనికి తగినది.

**8) వీథి:** దీనిలో ఒకే ఒక అంకం వుంటుంది. ఒకటి లేక రెండు పాత్రలుంటాయి. శృంగారాది రసాలు సూచ్యంగా మాత్రమే వుంటాయి.

**9) అంకం:** దీనిలో ఒకే ఒక అంకం వుంటుంది. కథ ప్రసిద్ధమై వుంటుంది. కథలో కవి మార్పు చేయవచ్చును. అంగిరసం కరుణం. దీనికి ఉత్సృష్టాంకమని కూడా పేరు. స్త్రీరోదనం ఇందు ప్రధానంగా వుంటుంది.

**10) ఈహామృగం:** దీనిలో 4 అంకాలుంటాయి. కథ కొంతప్రసిద్ధం, కొంత కల్పితమై వుంటుంది. నాయక ప్రతినాయకులు పురాణ ప్రసిద్ధులై వుంటారు. వారు నరులు, దేవతలు కావచ్చును. ప్రతినాయకుడు తనయందు అనురాగంలేని స్త్రీని ఎత్తుకొని పోదలుస్తాడు. నాయకుడు ప్రతినాయకుని అడ్డగిస్తాడు. కాని వధించకూడదు. అలభ్యమైన నాయికను పొందాలని ప్రతినాయకుడు మృగం వలె కోరుకుంటాడు కనుక ఈ రూపక భేదానికి 'ఈహామృగము' అను పేరు కలిగింది.

ఈ ప్రసిద్ధమైన దశవిధ రూపక భేదాలు కాక 18 రకాలైన ఉపరూపక భేదాలు కూడా వున్నాయి. ఈ విధంగా అనేక రూపక, ఉపరూపక భేదాలను లాక్షణికులు పేర్కొన్నారంటే ఈ రూపకాలు సూక్ష్మాతి సూక్ష్మ భేదాలతో ప్రాచీన కాలంలో బాగా ప్రసిద్ధమై వుండేవని చెప్పవచ్చు. అంకాల సంఖ్య, పాత్రల సంఖ్యను బట్టి, ఈ రూపకాలను విభజించి పరిశీలించినట్లయితే వీటి క్రమవికాసం మనకు స్పష్టంగా అర్థమౌతుంది.

## 7.4. భాసుని జీవితకాల విశేషాలు:

సంస్కృత నాటకకర్తలలో అతి ప్రాచీనుడు, సుప్రసిద్ధుడు భాసమహాకవియని చెప్పవచ్చు. ఐతే భాసుని కాలమిది అని

నిర్ణయించి చెప్పడానికి ఆధారాలేవి లేవు. కాళిదాసు ఇతన్ని తన 'మాళవికాగ్ని మిత్రం' లో "ప్రథితయశసాం భాససౌమిల్ల కవిపుత్రాదీనామ్" అని స్మరించటం చేత ఇతడు కాళిదాసుకు ముందువాడని మాత్రం నిశ్చయంగా చెప్పవచ్చు. విల్‌హెలం –ప్రింట్స్ భాసుని ప్రాకృత భాషను అధ్యయనం చేసి అతడు కాళిదాసుకు ముందువాడని, అశ్వఘోషునికి తర్వాత వాడని నిర్ణయించారు. లిండ్‌వే భాసుని నాటక ధర్మాలను పరిశీలించి అతడు అశ్వఘోషునికి దగ్గరివాడని క్రీ.శ. 2వ శతాబ్దం వాడని నిర్ణయించాడు.

భాసుడు తన ప్రతిమానాటకంలో బృహస్పతికృత అర్థశాస్త్రాన్ని పేర్కొన్నాడు అతనికి కౌటిల్యుని అర్థశాస్త్రంతో పరిచయమున్నట్లులేదు. అంతేగాక కౌటిల్యుని అర్థశాస్త్రంలో ప్రతిజ్ఞయౌగంధరాయణంలోని ఒక శ్లోకం ఉద్ధరింపబడింది. కౌటిల్యుడు క్రీ.పూ. 3వ శతాబ్దంవాడు కాబట్టి భాసుడు క్రీ.పూ. 4, 5 శతాబ్దాలవాడిని నిర్ణయించబడింది.

## 7.5. భాసుని నాటక కర్తృత్వం:

టి.గణపతి శాస్త్రి క్రీ.శ. 1909వ సంవత్సరంలో కేరళలో భాసుని నాటకాల హస్తలిఖిత ప్రతులను కనుక్కునేంతవరకు భాసుడు మనకు నామమాత్రంగానే పరిచుతుడైన నాటకకర్త, కన్యాకుమారికి 20 మైళ్ళ దూరంలోవున్న పద్మనాభపురం సమీపంలోని మణిలిక్కర మఠంలో మహామహోపాధ్యాయ టి. గణపతి శాస్త్రికి భాసుని నాటకాలు పది మళయాళలిపిలో దొరికాయి. ఈ లిఖిత ప్రతులు 300 సంవత్సరాల పాతవట. తర్వాత ఈయనకే త్రివేంద్రం ప్యాలెస్ లైబ్రరీలో మరి రెండు నాటకాలు దొరికాయి . మద్రాస్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీలోను, మళయాళ లిపిలోనే భాసుని అభిషేక, ప్రతిమా, స్వప్నవాసవదత్త లిఖిత ప్రతులు దొరికాయి. 'దేవనాగర లిపిలో ఒక ప్రతి కూడా దొరకలేదు. గణపతిశాస్త్రికి దొరికిన 13 భాసుని నాటకాలను "త్రయోదశ త్రివేంద్రనాటకాని" పేరుతో క్రీ.శ. 1912–13లో త్రివేంద్రం నుంచి ప్రచురించాడు. వెంటనే ఇవి ప్రపంచంలోని సంస్కృతజ్ఞులందరి దృష్టిని ఆకర్షించినవి. అప్పటినుంచి భాసుడు సంస్కృతంలో మొదటి నాటకకారుడుగా కీర్తిని గడించాడు. వామన, అభినవగుప్త, రామచంద్రగుణచంద్రాది ఆలంకారికులు భాసుణ్ణి ఉద్ధరించారు. "సూత్రధారునిచేత ఆరంభింపబడిన భూమికాయుక్తమైన పతాకాశోభితమైన నాటకాలవల్ల భాసుడు గొప్పయశస్సును సంపాదించాడు" ని బాణుడు ప్రశంసించాడు –

**"సూత్రధార కృతారంభై ర్నాటకైర్బహు భూమికైః**
**సపతాకైర్యశో లేభే భాసో దేవకులైరివ"**

దండి తన "అవంతి సుందర కథ" లో భాసుని సులక్షణలక్షితమైన నాటకాలను ఇలా ప్రశంసించాడు –

**"సువిభక్త ముఖాద్యంకై ర్వ్యక్త లక్షణ వృత్తిభిః।**
**పరితోఽపి స్థితో భాసః శరీరైరివ నాటకైః॥"**

జయదేవుడు "భాసోహసః కవికుల గురుః కాళిదాసో విలాసః" అని కాళిదాసును కవితాకామిని విలాసంగా చెప్పి భాసుణ్ణి కవితాకామిని హాసంగా వర్ణించాడు".

టి. గణపతిశాస్త్రిగారి నాటక ప్రచురణతో ప్రాచీన కవిపండితులచేత పొగడ్తలనందుకున్న భాసుని కవిత్వం ఎట్లాంటిదో ఆధునిక పాఠకులకు తెలియవచ్చింది. కానీ గణపతిశాస్త్రి ప్రచురించిన నాటకాలు అన్నీ ఒక్క భాసునివేనా? కాదా? అన్న విషయంలో పలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. కానీ ఈ నాటకాలన్నీ "నాంద్యంతే తతః ప్రవిశతి సూత్రధారః" అని

ఆరంభంకావడం, "ప్రస్తావన' అను పదానికి బదులు 'స్థాపన' అని ప్రయోగింపబడటం, ప్రతినాటకం భరతవాక్యంలో "ఇమామపి మహీం కృత్స్నాం రాజసింహః ప్రశాస్తునః" అనే వాక్యంగాని లేక దానికి సమానార్థక వాక్యంగాని ప్రయోగింపబడటం, అన్నినాటకాలలో సన్నివేశ, భావసామ్యాలుండటం, భాష, శైలి, ఛందస్సులు ఒకే తీరుగ వుండటం అపాణినీయ ప్రయోగాలు, భరతుని నాట్యశాస్త్రి విరుద్ధ ప్రయోగాలు ఈ నాటకాలలో కనబడటం, దుర్యోధన, కర్ణ, కైకేయి, కంస, రావణాది పాత్రలు సానుభూతిపూర్వకంగా చిత్రింపబడటం వంటి పలుకారణాలచేత ఈ పదమూడు నాటకాలు ఒక్క భాసకవియే రచించెనని అంతిమంగా పండితులు నిర్ణయించారు.

## 7.6. భాస నాటకచక్రమ్:

భాసుడు మొత్తం 24 రూపకాలను రచించాడని ప్రసిద్ధి. కాని ఇప్పుడు మనకు 13 నాటకాలు దొరుకుతున్నాయి. రాజశేఖరుడు భాసుని నాటకాలను 'భాసనాటకచక్రంగా' పేర్కొన్నాడు. భాసుని నాటకాలను ఇతివృత్తాన్ని బట్టి ఐదు విధాలుగా విభజించవచ్చును. అవి:

1) రామకథాశ్రితమైనవి - ప్రతిమ, అభిషేక నాటకాలు

2) మహాభారత కథాశ్రితమైనవి - పంచరాత్ర, మధ్యమవ్యాయోగ, దూతఘటోత్కచ, కర్ణభార, దూతవాక్య, ఊరుభంగ నాటకాలు.

3) భాగవత పురాణాశ్రితమైనవి - బాల చరిత్ర నాటకం

4) ఉదయన కథాశ్రితమైనవి - ప్రతిజ్ఞాయౌగంధరాయణం, స్వప్న వాసవదత్త నాటకాలు

5) లోక కథా శ్రితమైనవి - దరిద్ర చారుదత్త, అవిమారక నాటకాలు.

**1) ప్రతిమా నాటకం:**

ఈ నాటకంలో 7 అంకాలున్నాయి. దీనిలో దశరథుని మరణం మొదలుకొని రాముని పట్టాభిషేకం వరకు రామాయణ కథ వున్నది. దశరథుడు చనిపోయిన తర్వాత భరతుడు మాతామహుని గృహంనుంచి వస్తూ అయోధ్యానగర బాహ్యప్రదేశంలో వున్న ప్రతిమా గృహంలో ప్రతిష్ఠింపబడిన తన పూర్వీకులైన సూర్యవంశ రాజుల ప్రతిమలను చూస్తాడు. అక్కడ పూర్వీకుల సరసన దశరథుని ప్రతిమను చూచి భరతుడు తన తండ్రి మరణాన్ని గురించి తెలుసుకుంటాడు. అందుచేతనే ఈ నాటకానికి 'ప్రతిమా' నాటకమని పేరు పెట్టడం జరిగింది. ఈ నాటకంలో వాల్మీకి రామాయణ కథకు భిన్నమైన కల్పనలెన్నో వున్నాయి. ఈ నాటకంలో దశరథుని మరణం నాట్యశాస్త్రంలోని నాటక లక్షణాలకు విరుద్ధంగా రంగస్థలం మీద ప్రదర్శింపబడింది.

**2) అభిషేక నాటకం:**

ఈ నాటకంలో 9 అంకాలున్నాయి. రామాయణంలో కిష్కింధ, సుందర, యుద్ధకాండలలోని ఇతివృత్తం దీనిలో తీసుకోబడింది. దీనిలో సుగ్రీవ, విభీషణ, శ్రీరాముని పట్టాభిషేకాలు మూడు చెప్పబడటంచేత నాటకానికి "అభిషేక" నాటకమని పేరు పెట్టబడింది. దీనిలోను వాల్మీకిరామాయణ అతిరిక్తమైన కల్పనలున్నాయి.

**3) బాలచరిత్ర నాటకం:**

ఈ నాటకంలో 3 అంకాలున్నాయి. శ్రీకృష్ణుని జననం, బాల్యక్రీడలు దీనిలోని ఇతివృత్తం, అందుకే కవి దీనికి బాలచరిత్ర అని పేరు పెట్టాడు. శ్రీకృష్ణుని చరిత్రను ఆధారంగా చేసుకొని వ్రాయబడిన లభిస్తున్నటువంటి నాటకాలల్లో ఇది

అతిప్రాచీనమైంది. భాసుడు శ్రీకృష్ణుని నారాయణావతారంగా పరమాత్మస్వరూపునిగా చిత్రించాడు. భాసుడు దీనిలో కృష్ణభక్తునిగా కన్పిస్తాడు.

**4) పంచరాత్ర నాటకం:**

ఈ నాటకంలో 3 అంకాలున్నాయి. ఇవి దశవిధ రూపకాలల్లో సమవకారభేదానికి చెందింది. దీనిలోని కథ మహాభారతకథాధారితమైనా, చాలావరకు కవికల్పిత వృత్తాంతమే వున్నది. దుర్యోధనుడు యజ్ఞం చేసి గురువైన ద్రోణాచార్యుణ్ణి ఏదైనా కోరుకొమ్మని అడుగుతాడు. పాండవులకు అర్థరాజ్యమియ్యమని ద్రోణుడు కోరుతాడు. శకుని, కర్ణునితో సంప్రదించి దుర్యోధనుడు అందుకు అంగీకరిస్తాడు. కాని అజ్ఞాతవాసంలో వున్న వారి జాడ ఐదు రోజుల్లో తెలిస్తేనే ఇస్తానని అంటాడు. పాండవులజాడ తెలియక ద్రోణుడు విచారిస్తాడు. అదే సమయంలో ఒక వార్తాహరుడు వచ్చి కీచక, ఉపకీచకుల వధను గురించి తెలుపుతాడు. వాళ్ళను చంపినవాడు భీముడే అని భీష్ముడు గుర్తించి దుర్యోధనుని నియమాన్ని ఒప్పుకొమ్మని ద్రోణునితో చెప్తాడు. భీష్ముడు ద్రోణున్ని విరాటరాజు గోవులను పట్టుకునేందుకు ప్రేరేపిస్తాడు. గోవుల కొరకు జరిగిన పోరాటంలో అర్జునుని సహాయంతో ఉత్తరుడు విజయం సాధిస్తాడు. దుర్యోధనుడు ద్రోణునికిచ్చిన మాట ప్రకారం పాండవులకు అర్థరాజ్యమిస్తాడు. ఈ నాటకంలో దుర్యోధన, కర్ణులు మంచివాళ్ళుగా చిత్రింపబడినారు. శకుని ఒక్కడే దుష్టుడు. అభిమన్యుడు కౌరవ పక్షంలో వుండి పాండవులతో పోరాడటం ఇందు విశేషం. కురుక్షేత్ర యుద్ధం జరుగకుండానే పాండవులకు అర్థరాజ్యమిచ్చినట్లుగా కవికల్పన మహాభారతకథను సూక్ష్మతరంచేసింది.

**5) మధ్యమ వ్యాయోగం:**

ఇది ఏకాంకిక. ఇది దశ రూపకాల్లో వ్యాయోగ భేదానికి చెందింది. పాండవవనవాసంనాటి వృత్తాంతం దీనిలో వున్నది. కాని ఇతివృత్తం కవికల్పితం. భీముడు తన పుత్రుడైన ఘటోత్కచుని బారి నుంచి ఒక బ్రాహ్మణ పుత్రుని రక్షిస్తాడు. హిడింబ ఘటోత్కచునికి భీముడు అతని తండ్రి అని చెప్తుంది. అప్పుడు ఘటోత్కచుడు భవిష్యత్తులో బ్రాహ్మణులకు హాని తలపెట్టనని ప్రతిజ్ఞ చేస్తాడు. దీనిలో నాయకుడు కుంతీపుత్రుడు మధ్యముడైన భీముడు. కాబట్టి దీనికి 'మధ్యమ వ్యాయోగమని' కవి నామకరణం చేసాడు.

**6) దూత ఘటోత్కచం:**

ఇది ఏకాంకిక. భారతయుద్ధంలో అభిమన్యుని మరణానంతరం ఘటోత్కచుడు దుర్యోధనుని దగ్గరికి శ్రీకృష్ణుని ఆదేశంతో రాయబారిగా వెడతాడు. దుర్యోధనుడు అతన్ని అవమానిస్తాడు. అప్పుడు ఘటోత్కచుడు అర్జునుని చేతిలో కౌరవుల వినాశం జరుగుతుందని భవిష్యవాణి చెప్తాడు. ఇదీ కల్పితేతివృత్తమే.

**7) దూతవాక్యం:**

ఇది ఏకాంకిక. ఇది వ్యాయోగ భేదానికి చెందింది. దీనిలో శ్రీకృష్ణుడు పాండవుల దూతయై కౌరవుల దగ్గరికి పోయిన వృత్తాంతమున్నది. భారతేతివృత్తమే ఇది. శ్రీకృష్ణుని విశ్వరూప సందర్శనం దీనిలో చెప్పబడింది.

**8) కర్ణభారం:**

ఇది ఏకాంకిక. బ్రాహ్మణ వేషధారియై వచ్చిన ఇంద్రునికి కర్ణుడు తన సహజ కవచకుండలాలను ఇచ్చే వృత్తాంతం దీనిలోవున్నది. దీనిలో కర్ణుని దానవీరశూరత చిత్రింపబడింది.

**9) ఊరుభంగం:**

ఇది ఏకాంకిక, దుర్యోధనుడు భీమునితో గదాయుద్ధం చేసి తొడలు విరిగి పడిపోవటం, అతని మరణం ఈ ఏకాంకిలో వున్నది. ఇందులో దుర్యోధన పాత్ర చిత్రణలో భాసకవి అపూర్వ ప్రతిభను చూపాడు. నాటక ధర్మాలకు విరుద్ధంగా దీనిలో దుర్యోధనుని మరణం రంగస్థలం మీద చూపబడింది. భాసుని ఏకాంకిల్లోకెల్లా ఊరుభంగం నాటక ధర్మాలు, పాత్రచిత్రణ, సంభాషణల దృష్టితో ఉత్తమమైంది.

**10) ప్రతిజ్ఞా యౌగంధరాయణం:**

ఈ నాటకంలో 4 అంకాలున్నాయి. ప్రస్తావనలో ఇది ప్రకరణంగా చెప్పబడింది. దీనిలో ఉదయనరాజు మంత్రి యౌగంధరాయణుడు నాయకుడు. ఉజ్జయిని రాజు ప్రద్యోతుడు మోసంతో కౌశంబిరాజు ఉదయనుణ్ణి బంధించగా అతని మంత్రి యౌగంధరాయణుడు విడిపిస్తానని ప్రతిజ్ఞచేస్తాడు. ఉదయనుడు బంధితుడై కారాగారంలో ప్రద్యోతుని కూతురు వాసవదత్తకు వీణను నేర్పుతాడు. వారిద్దరు పరస్పరం ప్రేమించుకుంటారు. వాసవదత్తను విడిచిపెట్టి తాను కారాగార విముక్తుడు కావటానికి ఉదయనుడు అంగీకరించాడు. అప్పుడు యాగంధరాయణుడు ఉదయనునితో పాటు వాసవదత్తను, అతని వీణ ఘోషవతిని, ఏనుగు నలగిరిని విడిపిస్తానని మరోసారి ప్రతిజ్ఞ చేస్తాడు. ఇందుకే ఈ నాటకం ప్రతిజ్ఞాయౌగంధరాయణం అని పిలువబడింది, చివరికి అతడు సఫలుడౌతాడు. తర్వాత ప్రద్యోతుడు ఉదయన వాసవదత్తల వివాహాన్ని ఆమోదించి అంగీకరించి కారాగారబద్ధుడైన యౌగంధరాయణున్ని వాసవదత్తకు బహుకరిస్తాడు. ఈ నాటకంలో ప్రధానపాత్ర యౌగంధరాయణుడు. అతని బుద్ధి కుశలతతో ఎత్తుకు పైయెత్తులు వేయటం చక్కగా చిత్రింపబడింది. భాసుని గజకల్పన వృత్తాంతం నాటకంలో చాలా చమత్కారమైన అద్భుత కల్పన.

**11) స్వప్నవాసవదత్త:**

ఈ నాటకంలో 6 ఆంకాలున్నాయి. వాసవదత్త ఉదయనుణ్ణి స్వప్నంలో కలుసుకొంటుంది. కాబట్టి ఈ నాటకానికి 'స్వప్నవాసవదత్త' అనే పేరు పెట్టబడింది, మగధరాజకుమారి పద్మావతిని ఉదయనుడు వివాహమాడితే రాజ్యక్షేమం కలుగుతుందని జ్యోతిషులు చెప్తారు. కాని ప్రాణప్రదంగా ప్రేమించే వాసవదత్తవుండగా ఉదయనుడు మరో వివాహం చేసుకోడని తెలిసిన మంత్రి యౌగంధరాయుడు వాసవదత్త సహాయంతో, ఉదయనుడు వేటకు పోయినప్పుడు, గ్రామదాహంలో ఆమె మరణించిందని పుకారు పుట్టిస్తాడు. యౌగంధరాయుడు వాసవదత్తను తన చెల్లెలని చెప్పి పద్మావతి దగ్గర వుంచుతాడు. ఉదయనుడు దుఃఖంతో చివరకు వివాహానికి అంగీకరిస్తాడు. ఉదయన పద్మావతుల వివాహం జరుగుతుంది. అయినా అతడు వాసవదత్తను మరచిపోలేదు. ఒకరోజు సముద్రగృహంలో ఉదయనుడు నిద్రిస్తుండగా వాసవదత్త అక్కడికి వస్తుంది. ఉదయనుణ్ణి పద్మావతిగా తలంచి అతని పక్కనే పడుకొంటుంది. అర్ధజాగ్రదవస్థలో ఉదయనుడు వాసవదత్తను గురించి కలగంటూ కలవరిస్తాడు. వాసవదత్త తన రహస్యం బయటపడుతుందని అక్కడి నుంచి వెళ్ళిపోతుంది. తర్వాత మగధరాజు సహాయంతో ఉదయనుడు రాజ్యాన్ని సంపాదిస్తాడు. అప్పుడు వాసవదత్త జీవించి వున్నదని బయట పడుతుంది. ఈ విధంగా నాటకం సుఖాంతమౌతుంది.

**12) అవిమారకం:**

ఈ నాటకంలో 6 అంకాలున్నాయి. దీనిలో నాయకుని పేరు అవిమారకుడు. అతడు "అవి" అనే పేరు గల రాక్షసుణ్ణి చంపాడు (మారకుడు) కనుక అతనికి ఆ పేరు వచ్చింది. సౌవీర రాజకుమారుడైన అవిమారకుడు ఋషి శాపం చేత క్షత్రియత్వం కోల్పోతాడు. అతడు తన మేనమామ కుంతి భోజుని కుమార్తె 'కురంగి' ని ప్రేమించి రహస్యంగా ఆమె అంతఃపురం

చేరుకుంటాడు. ఒక సంవత్సరం తర్వాత ఈ రహస్యం బయటపడుతుంది. అప్పుడు కురంగి కార్చిచ్చులో పడి ఆత్మహత్య చేసుకోవటానికి ప్రయత్నిస్తుంది. ఆ సమయంలో విద్యాధరుడొకడు ప్రత్యక్షమై అవిమారకునికి ఒక మాయా అంగుళాయకాన్ని ఇస్తాడు. దాని సహాయంతో అవిమారకుడు ఆత్మహత్యా ప్రయత్నంలో వున్న కురంగిని రక్షిస్తాడు. ఇంతలో శాపం అవధి గడిచిపోతుంది. నారదుడు వచ్చి అవిమారకుణ్ణి కుంతిభోజునికి పరిచయం చేస్తాడు. కథ సుఖాంతమవుతుంది.

**13) చారుదత్తం:**

ఈ నాటకంలో 4 అంకాలున్నాయి. దీన్ని అభినవగుప్తుడు దరిద్రచారుదత్తమని పేర్కొన్నాడు. వేశ్య వసంతసేన, దరిద్ర బ్రాహ్మణుడు చారుదత్తుని ప్రేమించే వృత్తాంతం దీనిలో వున్నది. వసంతసేన తన నగల మూటను చారుదత్తుని ఇంట్లో పెట్టిపోతుంది. శర్విలకుడు కన్నం వేసి ఆ నగలను దొంగలించి, ఆ నగలను వసంతసేనకే ఇచ్చి ఆమె దగ్గర దాసిగా వున్న తన ప్రియురాలిని విడిపించుకొంటాడు. ఇక్కడనే నాటక కథ అసంపూర్ణంగా ముగుస్తుంది. బహుశా ఇది భాసకవి చివరి రచన కావటం చేత అసంపూర్ణంగా ఉన్నదని వింటర్‌నిట్స్ అభిప్రాయ పడినాడు.

## 7.7. భాసుని నాటక కళ-పాత్రచిత్రణ:

భాసుడు ప్రతిభాశాలి అయిన నాటకకారుడు. ప్రతినాటకం ఒక ప్రత్యేకతను కలిగివున్నది. కథ, సన్నివేశాలు, పాత్రలను అవసరాన్ని బట్టి అతడు నేర్పుతో మలచుకొని చిత్రించాడు. అవన్నీకూడా అతని ప్రతిభాజనితాలేకాని పూర్వరచనల అనుకరణలు కావు. అందుకే భాసుని నాటకాలు ఇతర నాటకాలకన్నా భిన్నంగా, విలక్షణంగా, మౌలికంగా కన్పిస్తాయి. ఇతడి నాటకాలు కేవలం పఠన యోగ్యంగానే కాక తేలికైన సంభాషణలతో ప్రదర్శనకు కూడ చాలా యోగ్యంగా ఉండటం విశేషం.

భాసుని నాటకాలల్లో 1) దూత వాక్యం 2) మధ్యమ వ్యాయోగం 3) దూత ఘటోత్కచం, 4) కర్ణభారం, 5) ఊరుభంగం అనునవి ఏకాంకికలు. ఈ ఏకాంకిక రచనలను భాసునంత సమర్థంగా తర్వాత కవులెవరూ వ్రాయలేకపోయారు. భాసుని ఏకాంకికలు చిన్నలైనా చక్కని ఇతివృత్తంతో, పాత్రచిత్రణతో, సంఘటనామహత్త్వంతో వున్నాయి. ఈ ఏకాంకికల్లో ఊరుభంగం చక్కని నాటక కళ కలిగినటువంటిది. కథా ఘటన, పాత్రచిత్రణ, విధి విలాసాలు చాలా చక్కగా చిత్రింపబడ్డాయి. ఆ తర్వాత భాసుని బాలచరిత్ర శ్రీ కృష్ణుని జీవితంలోని సంఘటనలతో కూర్చబడిన నాటకం. దీనిలో కథా కథనం లేదు. ఈ సంఘటనల కూర్పులో భాసుడు తన నాటకకళాప్రతిభను చూపాడు. అవిమారకం కొంతవరకు నీరసంగా నడిచినా తర్వాత కల్పిత కథలు, ప్రేమకథలు గల నాటకాలకు ఇది ఆదర్శమైంది. చారుదత్తనాటకం అసంపూర్ణంగా వున్నది కాబట్టి దీని గురించి ఎక్కువగా నిర్ణయించి చెప్పలేము. పంచరాత్రం సమవకార భేదానికి చెందిన నాటకం. దీనిలో భాసుని కథా కల్పనా చాతుర్యాన్ని దర్శింపవచ్చును. మౌలికమైన కథ, సంఘటనల కల్పనాదృష్టితో ఇది ఒక మంచి నాటకము.

అభిషేకం నాటకం కొంతవరకు ప్రౌఢమైన నాటకము. ఇందులో కూడ భాసుని స్వంత కల్పనలను చూడవచ్చును. రామాయణంలోని నీరసమైన కథాభాగాన్ని భాసుడు తన నాటక రచనా చాతుర్యంతో సరసమైన రచనగా తీర్చిదిద్దాడు. వాలి వధను దీనిలో కవి రంగస్థలం మీద చూపాడు. భాసుడు నాటక ధర్మాలకు విరుద్ధంగా ఇలా వధ, మరణాలను రంగస్థలం మీద చాల నైపుణ్యంతో రస పోషకంగా, కథా సంఘటనలకు పోషకంగాను ప్రదర్శింపజేసాడు.

భాసుడు రామాయణ కథనంతా నాటకాలల్లో కూర్చటానికి ప్రయత్నిస్తూ ప్రతిమా, అభిషేక నాటకాలను వ్రాసాడు. ఈ రెండు నాటకాలల్లో ప్రతిమా నాటకం నాటకకళాదృష్టితో వికసితమైన ప్రౌఢనాటకం. దీనిలోనూ భాసుడు తన కల్పనా-చాతుర్యాన్ని చూపుతూ కథా సన్నివేశాలను అద్భుతంగా సృష్టించాడు. పాత్ర చిత్రణ కళాదృష్టితోనూ ఈ నాటకం ఉత్తమమైంది.

భాసుని పరిపక్వమైన నాటకకళాప్రతిభను ఉదయనుని కథనాశ్రయించిన స్వప్నవాసవదత్త, ప్రతిజ్ఞా యౌగాధరాయణ నాటకాలలో చూడవచ్చు. సంఘటనల కూర్పు, పాత్రచిత్రణ, సంభాషణల నిర్వహణ, కవిత్వ ప్రౌఢిమ ఇలా అన్ని విషయాల్లోనూ ఈ నాటకాలు ఎంతో ప్రసిద్ధినొంది, తర్వాత నాటక కారులను ఎంతగానో ఆకర్షించాయి.

ఇతడు తన నాటకాలల్లో విధి విలాసాన్ని చాల చక్కగా చిత్రించాడు. ఊరుభంగంలో తొడలు విరిగి పడివున్న దుర్యోధనుని, అతని కుమారుడు దుర్జయుడు సమీపించి తండ్రిని తొడలమీద కూర్చోబెట్టుకొమ్మని అడగటం, ప్రతిజ్ఞ-యౌగంధరాయణం ద్వితీయాంకంలో ప్రద్యోతుడు రాణి అంగారవతితో వాసవదత్తకు తగిన వరులుగా నానాదేశ రాజకుమారుల వంశగుణ పరిచయాన్ని చేసి వారిలో ఎవరు యోగ్యుడని ప్రశ్నించినప్పుడు కంచుకి ప్రవేశించి వత్సరాజు అని అనడం, తర్వాత వత్సరాజే ఆమెను వివాహమాడటం విధి వైచిత్రిగా కన్పిస్తుంది. ఇటువంటి పతాక సన్నివేశాలు భాసుని నాటకాలల్లో చాలా వున్నాయి.

భాసుని నాటకాలు ఏ వృత్తాంతం మీద ఆధారపడి వున్నా, అతడు తన కథలను తన అభిరుచికి అనుగుణంగా స్వతంత్రించి మార్చుకొన్నాడు. కథానుగుణంగా పాత్రచిత్రణను గావించి సామాన్య పాఠకులకు సైతం కుతూహలం కలిగేలా తీర్చిదిద్దాడు.

## 7.8. భాసుని కవిత్వం:

భాసుడు నాటకకళానిర్వహణంలోనే కాక కవిత్వ రచనలోనూ సిద్ధహస్తుడు. నాటకకారునిగానే గాక అతడు కవిగానూ కీర్తిని సంపాదించాడు. అతడి కవిత్వం సలక్షణమైంది. నాటకాలల్లో సందర్భానుకూలంగా ప్రకృత్యాది వర్ణనలను చేసాడు. ఆ వర్ణనలు దీర్ఘంగా గాక సన్నివేశానికి అనుకూలమైన రీతిలో వున్నాయి. అతడి భావచమత్కారాదులు సరళ సుందరాలు. అక్కడక్కడ సరళమైన ఉపమానాలను చాలా చక్కగా ప్రయోగించాడు.

**"సూర్య ఇవగతో రామః సూర్యం దివస ఇవ లక్ష్మణోऽనుగతః।**

**సూర్య దివసావసానే ఛాయేవ న దృశ్యతే సీతా॥"**

లోకోక్తులను ప్రయోగించి భావవ్యక్తీకరణను మరింత హృదయరంజకం చేశాడు. ఇతడు అనుభవజ్ఞుడైన బహుముఖ ప్రజ్ఞాశాలి. మానవజీవిత సంబంధమైన అనేక విషయాలను అతడు లోతుగా విశ్లేషించి పరిశీలించినవాడు. మానవులందరూ మంచివారుగానే పుడతారని, విధి వక్రించటంచేతనే వారు నానావిధాలుగా ప్రవర్తిస్తారని బలంగా నమ్మడంచేతనే భాసుడు తన నాటకాలలో దుర్యోధన, కర్ణ, కైకేయి మొ॥ పాత్రలను విధిచేతికి చిక్కిన మానవమాత్రులుగాను, సానుభూతికి పాత్రులుగాను చిత్రించాడు. తర్వాత కవులెవ్వరూ ఇటువంటి పాత్రచిత్రణకు పూనుకోలేదు. కనుకనే భాసుని నాటకాలు నేటి ఆధునిక ప్రేక్షకులను సైతం ఆకర్షించేవిధంగా వున్నాయి.

కాళిదాసుకు భాసుడన్న చాలా అభిమానం. ముఖ్యంగా కాళిదాసు భాసుని నాటక సన్నివేశాలను ఎన్నోచోట్ల తన నాటకాలలో అనుసరించాడు. కేవలం కాళిదాసుమీదనేకాక భవభూతి, హర్ష దేవుడు, శూద్రకుడు, విశాఖదత్తుడు వంటి ఎందరో ప్రముఖ సంస్కృతకవులపై తన అపూర్వ నాటక కళాచాతుర్యంతో, కథాకల్పనా నైపుణ్యంతో భాసుడు తన అమిత ప్రభావాన్ని చూపటం అతనిలోని అంతులేని పాండితీప్రతిభకు నిదర్శనం.

## 7.9. భవభూతి జీవితకాలవిశేషాలు:

సంస్కృత సాహిత్యంలో కాళిదాసు ప్రక్కన గౌరవస్థానాన్ని సంపాదించినవాడు భవభూతి. ఇతర కవులకన్న భవభూతి తన పరిచయాన్ని ఎక్కువగానే ఇచ్చుకొన్నాడు. నాటక ప్రస్తావనలను బట్టి అతడు దక్షిణాపథంలో విదర్భ దేశంలోని పద్మపుర నివాసి, కృష్ణయజుర్వేద తైత్తిరీయ శాఖకు చెందినవాడు. కాశ్యప గోత్రీయుడు. ఉదంబర బ్రాహ్మణుడు. తాతపేరు భట్టగోపాలుడు. తండ్రి పేరు నీలకంఠుడు. తల్లి పేరు జాతకర్ణి. భవభూతి పూర్వజుల్లో ఐదవ తరంవాడు 'మహాకవి' అని పేరు కలవాడు, గొప్ప విద్వాంసుడు. వాజపేయ యజ్ఞం చేసిన వాడు. నాటకాలను బట్టి భవభూతి కాళిదాసువలెనే శివాభిమానిగా కన్పిస్తాడు. కాని అతణ్ణి శ్రీరాముని చరిత్ర ఆకర్షించింది. అయినా భవభూతి శుద్ధ పరబ్రహ్మను సేవించిన వైదిక మతానుయాయి అనే చెప్పాలి. భవుభూతి తన గురువు పేరు జ్ఞాననిధి అని పేర్కొన్నాడు. "శ్రీకంఠ పద లాంఛనః భవభూతిర్నామ" అని నాటక ప్రస్తావనలో కవి భవభూతియే స్వయంగా తనను గూర్చి చెప్పుకోవడంతో ఇతడిని శ్రీకంఠుడని పేరు గల భవభూతిగా చెప్పవచ్చును.

భవభూతి కాలాన్ని నిర్ణయించడంలో ఎటువంటి కష్టం లేదు. భవభూతి వాక్పతిరాజుతోపాటు కన్యాకుబ్జాన్నేలిన యశోవర్మ ఆస్థానకవి. ఈ యశోవర్మ కాశ్మీరరాజు లలితాదిత్యుని చేతిలో ఓడిపోయాడని కల్హణుడు రాజతరంగిణిలో తెల్పాడు. రాజతరంగిణి బట్టి, చైనాయాత్రికుల వ్రాతలను బట్టి లలితాదిత్యుని కాలం క్రీ.శ. 724-761 అని తెలుస్తున్నది. యశోవర్మ కొడుకు ఆమరాజు క్రీ.శ.750లో బప్పభట్టి చేత జైనదీక్షను పొందినట్లు జైనుల వ్రాతలవల్ల తెలుస్తున్నది. అంటే క్రీ.శ.754లో బప్పభట్టిని ఆమరాజు 'సూరి' అనే బిరుదాన్నిచ్చి గౌరవించాడు. అంటే క్రీ.శ. 754 నాటికి ఆమరాజు రాజయ్యాడని చెప్పవచ్చును. లలితాదిత్యుడు క్రీ.శ. 736 కన్న మొదలే యశోవర్మను జయించాడని డా॥ స్టైన్ నిర్ణయించాడు. క్రీ.శ. 725లో యశోవర్మ సింహాసమధిష్టించినట్లు, చైనీయులవ్రాతల ఆధారంగా 'మిరాశి' నిర్ణయించి అతని రాజ్యకాలం క్రీ.శ. 725-753 అని అన్నాడు. యశోవర్మ హర్షవర్ధనుని తర్వాత కన్యాకుబ్జ దేశాన్ని పరిపాలించాడు. క్రీ.శ. 735లో వాక్పతిరాజ గౌడవహో కావ్యాన్ని పూర్తిచేసాడు. భవభూతి, వాక్పతి రాజులు యశోవర్మ ఆస్థానకవులని కల్హణుడు పేర్కొన్నాడు. వాక్పతిరాజు భవభూతి కవిత్వాన్ని ప్రశంసించటమే కాక చాలాచోట్ల అనుకరించాడు. దీన్నిబట్టి వాక్పతిరాజుకు భవభూతి సాహిత్య విద్యాగురువు అని కొందరు భావించారు, అలాగే దీన్నిబట్టి వాక్పతిరాజు కన్న భవభూతి వయస్సులో పెద్దవాడని, అప్పటికే కవిగా పేరు ప్రఖ్యాతులను గడించినవాడై వుంటాడని కూడా నిశ్చయించవచ్చును. మొత్తం మీద భవభూతి యశోవర్మకు సమకాలికుడు. దండికి అర్వాచీనుడు. కనుక భవభూతి క్రీ.శ 680 - 750 ప్రాంతం వాడిని పేర్కొనవచ్చును.

## 7.10. భవభూతి నాటక రచనలు:

భవభూతి రచనలుగా మూడు నాటకాలు ప్రసిద్ధమైనవి. అవి:

1) మహావీర చరిత్ర 2) మాలతీ మాధవం 3) ఉత్తరరామచరిత్ర.

ఇతడికి రామాయణ కథ అంటే మహాప్రీతి. తన మూడు నాటకాలల్లో రెండు నాటకాలను రామాయణ కథేతి వృత్తంతోనే రచించాడు. ఈ మూడు నాటకాలు కూడ కాలప్రియనాథోత్సవ సందర్భంలోనే ప్రదర్శింపబడినట్లు వారి ప్రస్తావనలను బట్టి తెలుస్తుంది.

**1) మహావీరచరిత్ర:**

ఈ నాటకంలో 7 అంకాలున్నాయి. భవభూతి పూర్వరామాయణకథను మహావీర చరిత్రగా రచించాడు. ఇందులో

రాముణ్ణి ఒక మానవ మహావీరునిగా చిత్రించాడు. దీనిలో ప్రధానరసం వీరం. వాల్మీకి, కాళిదాసుల రామాయణ కథలకన్న కొంచెం భిన్నంగా మహావీరచరిత్రనాటకకథను నడిపి భవభూతి కొత్తదనాన్ని చూపాడు –

అ) సీత, ఊర్మిళలు వివాహానికి పూర్వమే విశ్వామిత్రుని ఆశ్రమానికి వచ్చి రామలక్ష్మణులను చూస్తారు. సీతారాములకు మొదటి చూపులోనే ప్రేమోదయం కలుగుతుంది. రాముడు విశ్వామిత్రుని ఆశ్రమంలోనే శివధనుస్సును విరుస్తాడు.

ఆ) మాల్యవంతుడు రావుణుని మంత్రి. అతడు రాముణ్ణి అణచివేయాలని ఎత్తుకు పైయెత్తులు వేస్తుంటాడు. అతని ప్రేరణతోనే పరశురాముడు, వాలి రాముని మీదికి వస్తారు. శూర్పణఖ ప్రభావంతో మంధర రాముణ్ణి అడవులకు పంపుతుంది. ఈ నాటకంలో కైకేయిది ఉదాత్తమైన పాత్ర. మొత్తం మీద నాటకీయత కొరకు చేసిన ఈ రెండు మార్పులు కథనంతా మార్చివేశాయి. ఆ కొత్తదనాన్ని మెచ్చుకొనే సహృదయత నాటి సామాజికుల్లో, ఆలంకారికుల్లో లేకపోవడం వలన ఈ నాటకం ప్రజాదరణకు దూరమై విఫలమైంది.

**2) మాలతీమాధవం:**

ఇది ప్రకరణం. అంటే కల్పితేతివృత్తంతో తేలికగా నడిచే రూపకం. మహావీరచరిత్ర వంటి వీరరసప్రధానమైన గంభీరనాటకం అసఫలం కావటంతో సర్వజనాదరణను పొందే శృంగారరసంతో కూడిన అద్భుత సంఘటనలతో నిండిన 'మాలతీమాధవప్రకరణ' రచనకు భవభూతి ప్రయత్నించి వుంటాడు. దీనిలో 10 అంకాలున్నాయి. పద్మావతిపురమంత్రి భూరివసువు భూరివసువు కూతురు మాలతి. మదనోత్సవ సమయంలో ఆమె మాధవుని చూచి ప్రేమిస్తుంది. మాధవుడు కూడా ఆమెను ప్రేమిస్తాడు. ఇద్దరూ కలుసుకోవాలని ప్రయత్నిస్తారు. కామందకి అనే బౌద్ధ సన్యాసిని మాలతీమాధవుల వివాహానికి ప్రయత్నిస్తుంది. ఇంకొకవైపు భూరివసువు మాలతి వివాహాన్ని నందనునితో చేయాలనుకొంటాడు. శివమందిర సమీపంలోని అశోకవనంలో మాలతీ మాధవులు కలుసుకునేటట్లు కామందకి ఏర్పాటు చేస్తుంది. మాధవుడు ముందే వచ్చి దాక్కొంటాడు. ఇంతలో మాలతి సఖితో అక్కడికి వస్తుంది. వాళ్ళిద్దరూ కలుసుకోకముందే బోనులోనుంచి తప్పించుకొని వచ్చిన సింహం అక్కడికి వస్తుంది. దాంతో అందరూ అటు యిటు పరుగెత్తుతారు. అప్పుడు అక్కడికి మకరందుడు వచ్చి దాన్ని చంపి మూర్ఛిల్లుతాడు. మూర్ఛనుంచి తేరుకొని మాలతితో వచ్చిన ఆమెసఖిని మదయంతికనుచూసి ప్రేమిస్తాడు. ఇంతలో అఘోరఘంటుడునే కాపాలికుడు కరాళదేవికి బలిగా మాలతినిఎత్తుకొనిపోతాడు. మాలతి భయంతో అరుస్తుంది. అక్కడే శ్మశానంలో వున్న మాధవుడు వచ్చి అఘోరఘంటుణ్ణి చంపి మాలతిని రక్షిస్తాడు. తన గురువు అఘోరఘంటుణ్ణి చంపాడని కపాలకుండల ప్రతీకారం తీర్చుకోవాలని అనుకుంటుంది.

కామందకి మకరందునికి మాలతివేషం వేయించి భూరివసువు ఇంటికి పంపుతుంది. అక్కడ ఆమెకు నందనునితో వివాహం జరుగుతుంది. నిజమైన మాలతికి మాధవునితో శివమందిరంలో వివాహం జరుగుతుంది. వధువు మాలతిరూపంలో వున్న మకరందుని చేతిలో నందనుడు బాగా తన్నులు తింటాడు. దానితో ఉక్రోషంతో నందనుడు వెళ్ళిపోతాడు. అప్పుడు వదినకు నచ్చచెప్పాలని మకరందిక వస్తుంది. మాలతి వేషంలో వున్నది మకరందుడని తెలిసి సంతోషిస్తుంది. తర్వాత మదయంతికను ఎత్తుకొని పోయాడనే నేరంమీద రాజభటులు మకరందుణ్ణి బంధిస్తారు. తన మిత్రుణ్ణి రక్షించేందుకు మాధవుడు మాలతిని ఉద్యానవనంలో ఒంటరిగా విడిచిపెట్టి వెళతాడు. తగిన అదనుకొరకు వేచివున్న కపాలకుండల వచ్చి మాలతిని ఎత్తుకొని శ్రీ పర్వతం మీదకు తీసుకొనిపోతుంది. మాధవ, మకరందులు రాజభటులతో పోరాడతారు. సాహస పరాక్రమాలకు మెచ్చి రాజు వారిని విడిచివేస్తాడు. తర్వాత కామందకి బుద్ధి నైపుణ్యంతో మాలతిని రక్షిస్తుంది. మాలతీ–మాధవుల,

మదయంతిక-మకరందుల వివాహంతో నాటకం సుఖాంతమవుతుంది.

కథా నిర్మాణంలో, మాధవ మకరందుల కథలను రెండింటిని సమానాంతరంగా నడపటంలోను భవభూతి నైపుణ్యాన్ని చూపాడు. పాత్రచిత్రణ కూడ సజీవంగా వున్నది. మాలతి, మాధవ, మకరంద, కామందకి, మదయంతిక, లవంగిక, సౌదామిన్యాది పాత్రలు వైవిధ్యంతో చిత్రింపబడినవి. బౌద్ధసన్యాసిని కామందకి మాళవికాగ్నిమిత్రంలోని బౌద్ధసన్యాసిని కౌశికిపాత్రను తలపిస్తున్నది. కౌశికి కన్న కామందకి బుద్ధి చాతుర్యం కలది. నాయికా నాయకుల ప్రేమ ఫలించటంలో ఆమె పాత్ర చాలా వున్నది. ప్రకరణమైన దీనిలో విదూషక పాత్రలేదు. శృంగారం అంగిరసం, బీభత్సరౌద్రాదులు అంగరసాలు. మాలతీమాధవ కథాసంవిధానాన్ని అనసరిస్తూ తర్వాత మల్లికామారుతాది ప్రకరణాలు వ్రాయబడ్డాయి.

**3) ఉత్తరరామ చరిత్ర:**

వాల్మీకి ఉత్తర రామాయణ కథను తీసుకొని భవభూతి ఈ నాటకాన్ని రచించాడు. కథాసంవిధానంలో, నాటక శిల్పంలో కవి చూపిన నేర్పు అద్వితీయం. అందుకే "ఉత్తర రామచరితే భవభూతిర్విశిష్యతే" అని పేరును సంపాదించుకున్నాడు. వాల్మీకి కథ సీతమరణంతో విషాదాంతం కాగా భవభూతి సీతారాములను కలిపి సుఖాంతం చేశాడు. నిజమైన స్వచ్ఛమైన ప్రేమ పరాజయం కావడం ఆయనకు నచ్చివుండదు. అందుకే ఆ ప్రేమకు విజయాన్ని కల్పించాడు. ఇది 7 అంకాల నాటకం,

**ప్రథమాంకం:**

రాముని ముగ్గురు తల్లులు అరుంధతితో ఋష్యశృంగానికి ద్వాదశ వర్షయజ్ఞంలో పాల్గొనటానికి వెడతారు. జనకుడు మిథిలకు తిరిగి పోవటంతో పితృ వియోగ దుఃఖంతో వున్న సీతను రాముడు ఊరడిస్తాడు. సీతకు వినోదం కలిగించటానికై లక్ష్మణుడు రాముని గత చరిత్ర చిత్రింపబడిన చిత్రపటాలను చూపిస్తాడు. ఆ చిత్రపటాలను చూసి సీత మళ్ళీ అరణ్య ప్రాంతాన్ని సందర్శించాలని, గంగాస్నానం చేయాలని కోరికను ప్రకటిస్తుంది. గర్భవతి సీత కోరికను నెరవేర్చమని రాముడు లక్ష్మణునికి చెప్తాడు. ఇంతలో దుర్ముఖుడు వచ్చి సీతను గురించిన లోకాపవాదాన్ని చెప్తాడు. రాముడు బాధపడ్తాడు. లక్ష్మణుడు సీతను అరణ్యానికి తీసికొనిపోతాడు.

**ద్వితీయాంకం:**

ఆత్రేయి, వాసంతి మాటల ద్వారా సీత వాల్మీకి ఆశ్రమంలో కుశలవులను కన్నదని, వారికి పుట్టుకతోనే జృంభకాస్త్రం సిద్ధించిందని తెలుస్తుంది. తమసా నదీ తీరంలో క్రౌంచపక్షిని వధించిన వ్యాధునికి వాల్మీకి శాపమిచ్చినట్లు, బ్రహ్మ ప్రత్యక్షమై వాల్మీకిని రామాయణ కావ్యాన్ని రచింపమని ఆదేశించినట్లు, రాముడు సీత స్వర్ణ ప్రతిమను పత్నీరూపంగా గ్రహించి అశ్వమేధ యాగం చేసినట్లు ఆత్రేయి మాటలవల్ల తెలుస్తుంది. రాముడు శంభూకుని వధించి వానికి దివ్యరూపాన్నిచ్చినట్లు కూడా ఇక్కడే చెప్పబడింది.

**తృతీయాంకం:**

మురళ, తమసల సంభాషణను బట్టి లక్ష్మణుడు సీతను వనంలో విడిచిపెట్టి వెళ్ళిన తర్వాత ఆమె దుఃఖవేగంతో గంగానదిలో దుమికిందని, ఆమెకు కవలపిల్లలు పుట్టారని తెలుస్తుంది. గంగాదేవి ఆ బాలురను వాల్మీకి ఆశ్రమానికి తెచ్చి విడిచిపెట్తుంది. లోకంలో ఎవరికీ సీత కనపడదని గంగాదేవి చెప్తుంది. సూర్యార్చన కొరకు పూలు తెంపుతూ సీత రంగస్థలం మీదికి ప్రవేశిస్తుంది. రాముడు కూడ ప్రవేశించి సీత కొరకు విలపిస్తూ మూర్ఛిల్లుతాడు. తమస చెప్పటం వల్ల సీత రాముణ్ణి

స్పృశిస్తుంది. ఆ స్పర్శతో మూర్ఛ నుంచి తేరుకుని రాముడు తిరిగి అయోధ్యకు వెళతాడు.

**చతుర్థాంకం:**

రాముని ముగ్గురు తల్లులు, అరుంధతీ వశిష్టులు, వాల్మీకి ఆశ్రమానికి వస్తారు. అక్కడ వారు కుశలవులను చూచి ఎవరు? అని అడుగుతారు. తాము వాల్మీకి శిష్యులమని ఆ బాలురు చెప్తారు. లక్ష్మణుని కొడుకు చంద్రకేతువు ద్వారా రక్షింపబడే అశ్వమేధాశ్వాన్ని లవుడు అపహరిస్తాడు.

**పంచమాంకం:**

లవుడు చంద్రకేతువు సైనికులను ఓడిస్తాడు. అప్పుడు లవునిచేత ప్రయోగిపబడిన జృంభకాస్త్రం అందరినీ ఆశ్చర్యచకితులను చేస్తుంది.

**షష్టాంకం:**

లవునికి చంద్రకేతువునకు మధ్య ఘోరయుద్ధం జరుగుతుంది. చివరికి రాముడు కూడా వస్తాడు. కుశలవుల పరిచయం అతనికి కలుగుతుంది. ప్రేమతో అతడు వారిని ఆలింగనం చేసుకుంటాడు. వారిలో సీత రూపచిహ్నాలను, రాజ చిహ్నాలను చూసి ఆశ్చర్యపోతాడు. ఇంతలో వశిష్టుడు మొదలైన వారంతా అక్కడికి వస్తారు.

**సప్తమాంకం:**

దీనిలో గర్భాంకమనబడే అవాంతర నాటక కల్పనను కవిచేసాడు. గత సంఘటనలన్నీ ఇందులో చూపబడతాయి. సీతను గురించి తెలుసుకొని అందరూ ఆమెకు నమస్కరిస్తారు సీతా రాముల సంయోగంతో నాటకం సుఖాంతమౌతుంది.

ఈ విధంగా తృతీయాంకంలో సీతారాముల సమావేశ కల్పన, పాతాళ లోకంలో సీత భూదేవి, గంగలతో వుండడం, సీత ఎవరికి కనబడకుండా వుండటం, చివరకు సీతారాముల కలయికతో కథ సుఖాంతమైనట్లు చూపడం వంటి అద్భుత కల్పనలు, సీతారాముల పాత్ర చిత్రణలో ప్రదర్శించిన అద్వితీయ నేర్పు భవభూతిని మహాకవిగా, ఉత్తర రామచరిత నాటకాన్ని మహోన్నతంగా నిలిపాయి. తరువాతి కాలంలో ఎందరో కవులు భవభూతి నుండి ప్రేరేపితులై అనర్ఘరాఘవం, ప్రసన్నరాఘవం, ఉదాత్తరాఘవం, కుందమాల, బాలరామాయణం వంటి ఎన్నో నాటకాలను వ్రాసారు.

అంతేగాక సంస్కృత సాహిత్యంలో 'కరుణరసం' అంగిరసంగా ఒక్క ఉత్తర రామచరిత్ర నాటకంలోనే పోషించబడి కన్పిస్తున్నది. ఆ పోషణ కూడ భవభూతి ఉత్తమంగా నిర్వహించి "కారుణ్యం భవభూతిరేవ తనుతే" అన్న కీర్తిని సాహిత్య లోకంలో పొందాడు. కరుణారసమహత్త్వాన్ని భవభూతియే స్వయంగా తన నాటకంలో ఇలా కీర్తించాడు. –

**'ఏకో రసః కరుణ ఏవ నిమిత్త భేదాత్**

**భిన్నః పృథక్ పృథగి వాశ్రయతే వివర్తాన్**

**ఆవర్త బుద్బుద తరంగమయాన్ వికారాన్**

**అంభో యథా సలిలమేవహి తస్సమగ్రమ్"**

"కరుణ రసమొక్కటే రసం. మిగిలిన రసాలన్నీ దాని యొక్క భేదాలే. ఒక్క రూపం గల జలమే ఆవర్త, బుద్బుద, తరంగ రూపాలను భరిస్తూ తన మూల రూపం చెడకుండా వుంటుందో అదేవిధంగా కరుణ రసం ఇతర విభావాదులవల్ల

అనేక రకాలుగా రూపం ధరిస్తుంది. అయినా మూలరూపాన్ని మాత్రం విడువదు." ఈ శ్లోకాన్ని బట్టి భవభూతికి కరుణ రసమంటే ఎంతటి అభిమానమో మనకు తెలుస్తుంది.

## 7.11. భవభూతి నాటక కళ:

భవభూతి రచనలు మూడూ నాటకాలే. ఇదే అతని నాటకకళా ప్రీతిని తెలియజేస్తున్నది. పూర్వరామాయణ కథను నాటకంగా మలచటానికి భవభూతి మహావీరచరిత్రలో ప్రయత్నించాడు. అయితే విశాలమైన కథకు వస్త్వైక్యం కూర్చటంలో భవభూతి కొంతవరకు సఫలుడైనాడు. పాత్రచిత్రణ చక్కగా జరిగినా, చాలా సంఘటనలు గల పెద్ద కథను తీసుకోవడం వల్ల భవభూతి నాటక కళాదృష్టితో కౌశలాన్ని చూపించలేకపోయినాడనే చెప్పాలి. నాటక సంవిధాన దృష్టితో ఇది శిథిలంగా కన్పిస్తున్నది.

మాలతీమాధవం కథ కల్పితమైంది. కథ కల్పితమైనా ఇతర అనేక కథల ప్రభావం దీనిమీద కల్పిస్తున్నది. మృచ్ఛకటికంవలె తేలికగా మాలతీమాధవం నడువలేదు. మృచ్ఛకటికంలోని హాస్యరస ధోరణి ఇందులో అసలే లేదు. మాలతీ-మాధవం కథ గంభీరంగా, శృంగార బీభత్సరసాదుల సమావేశంతో నడిచింది. కథా సంవిధానంలో పునరుక్తులు బాగా వచ్చాయి. కథ అనావశ్యకంగా పొడిగింపబడి మెల్లగా నడుస్తుంది. మహావీర చరిత్రవలెనే ఇది కూడా రంగస్థలం మీద అంతగా రాణించదగినట్లుగా లేదు.

ఉత్తరరామచరిత్రనాటికి భవభూతి నాటకకళ ఉన్నతశిఖరాలను అందుకొంది. ఈ నాటకం కేవలం పఠనయోగ్యంగానే గాక రంగస్థలంమీద ప్రదర్శించటానికి వీలుగా వున్నది. దీనిలో భవభూతి ఉత్తరరామాయణకథను చాలా నైపుణ్యంతో నాటికేతివృత్తంగా మలిచాడు. నాటకారంభంలో భవభూతి రామునిచేత ఈ విధంగా శపథం చేయించాడు.

**"స్నేహం దయాం తథా సౌఖ్యం యది వా జానకీమపి।**
**ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తి మే వ్యథా॥"**

"ప్రజారంజన కోసం నా మైత్రినీ, దయనూ, సౌఖ్యాన్నీ వీటన్నిటి కంటే మిన్నమైన సీతాదేవిని సైతం విడిచిపెట్టడానికి నేను బాధపడను. జంకను" ఈ శ్లోకంలో నాటకం బీజం కన్పిస్తున్నది. ఈ బీజం నుంచే రాముని చరిత్ర నాటకంలో అంకురించి విస్తరించింది. వాల్మీకి సీతచరిత్రను వ్రాయగా, భవభూతి రాముని చరిత్రను ఈ నాటకంలో వ్రాసాడనిపిస్తుంది. దుఃఖాంతమైన రామాయణ కథను సుఖాంతం చేయడం కూడా నాటక సంప్రదాయానికి అనుగుణంగానే జరిగింది. సుఖాంతం చేయడానికై భవభూతి సృష్టించిన గర్భాంకనాటకం అద్భుతంగా వున్నది. ప్రథమాంకంలో చిత్ర పట దర్శనం ద్వారా పూర్వకథా పరిచయం చేసే కల్పన కూడా నాటక కళాదృష్టితో చాలా విశిష్టంగా వున్నది. ఈ పూర్వ కథా పరిచయం ప్రేక్షకులను భావి కథోన్ముఖులను చేసింది. రాముడు "కిమస్యా న ప్రేయో యది పరమసహ్యాస్తు విరహః" "సీతా వియోగం మిక్కిలి భరింపరానిది" అని అనుకొంటున్నప్పుడే ప్రతీహారి ప్రవేశించి "దేవ! ఉపస్థిత:" (ప్రభూ! వచ్చివున్నాడు) అని అనటం, దుర్ముఖుడు ప్రవేశించి సీతా జనాపవాద విషయం చెప్పడం మొదలైన పతాక సన్నివేశాన్ని భవభూతి చక్కగా రచించాడు. ఇక్కడ "విధిలీల" కన్పిస్తుంది. ఏ విరహమైతే తనకు భరింపశక్యం కానిదని రాముడు అనుకుంటున్నాడో అది దుర్ముఖుని రూపంలో అప్పుడే ప్రవేశించడం విధిలీలమే. విష్కంభమనే అర్థోపక్షేపకాన్ని కవి చాలా నైపుణ్యంతో అంకాల నడుమ ప్రయోగించాడు. ప్రథమ ద్వితీయాంకాల నడుమ 12 సంవత్సరాలు గడిచిపోయాయి. ఆ వ్యవధానాన్ని కవి చాలా చక్కగా చూపాడు.

ధర్మాచరణ, కర్తవ్యనిష్ఠత, త్యాగం, దాంపత్యప్రేమ, గార్హస్థ్యజీవితం-వీటన్నిటి చిత్రణ ఉత్తరరామచరిత్ర నాటకంలో భవ్యంగా జరిగింది.

**"అద్వైతం సుఖ దుఃఖయో రనుగతం సర్వాస్వవస్థాసు యత్**
**విశ్రామో హృదయస్య యత్ర జరసా యస్మిన్న హార్యోరసః।**
**కాలేనావరణాత్యయాత్ పరిణతే యత్స్నేహసారే స్థితం**
**భద్రం ప్రేమ సుమానుషస్య కథమప్యేకం హితత్ప్రాప్యతే॥"**

"నిజమైన ప్రేమ సుఖదుఃఖాలల్లో ఒక్క తీరుగా వుంటుంది. విపత్తిలోగాని, ఆపదలోగాని సమానంగా వుంటుంది. హృదయానికి అనిర్వచనీయ సుఖశాంతిని కలిగిస్తుంది, వృద్ధావస్థ వచ్చినా సరసతకేమి లోటు వుండదు. చాలాకాలం కావటంచేత లజ్జాసంకోచాల ఆవరణ తొలగిపోవటంచేత పరిపక్వమైన స్నేహం మాత్రమే మిగులుతుంది. "భారతీయ సంప్రదాయ గతమైన గృహస్థ జీవితంలోని భార్యాభర్తల ప్రేమను భవభూతి భవ్యంగా చిత్రించాడు. స్నేహమూలమైన పరిపక్వమైన దాంపత్య ప్రేమచిత్రణను మరేకవి ఇంతగా వర్ణించలేకపోయాడు. నిస్స్వార్థమైన స్వచ్ఛమైన ప్రణయమే అతనికి ఆదర్శం. సంతానం దంపతుల స్నేహానురాగాలను దృఢంచేసే ఆనందగ్రంథి అని అతడు అంటాడు -

